
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 348
సోమవారం 10-3-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'



పాత ఒప్పందాల ప్రకారమే!

టారిఫ్‌ల తగ్గింపుపై భారత్..
ట్రంప్ ఒత్తిడేమీ లేదని వెల్లడి
-6లో



నేటి నుంచి పార్లమెంట్

వక్ఫ్ బిల్లును ఆమోదించనున్న కేంద్రం
నిలదీసేందుకు విపక్షాలు రెడీ
-6లో



మనమే చాంపియన్స్

చాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్

ఫైనల్లో 4 వికెట్లతో న్యూజిలాండ్‌పై గెలుపు

టోర్నీని అజేయంగా ముగించిన రోహిత్ బృందం

14లో

విజేత ప్రైజ్ మనీ	రన్నరప్ జట్టుకు
రూ. 19 కోట్ల 52 లక్షలు	రూ. 9 కోట్ల 76 లక్షలు

పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్ టైటిల్‌ను భారత్ చేజిక్కించుకుంది. ఈ మెగా టోర్నీలో ఆఖరిదాకా అజేయంగా నిలిచిన రోహిత్ బృందమే విజేతగా నిలిచింది. 1998లో మొదలైన ఈ టోర్నీ చరిత్రలో భారత్ మూడోసారి టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (83 బంతుల్లో 76: 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అసలైన ఫైనల్ పోరులో జట్టును నడిపించే ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. అనంతరం భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' రోహిత్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ (48), కేఎల్ రాహుల్ (34 నాటౌట్), శుబ్‌మన్ గిల్ (31) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

న్యూస్‌రీల్


అమెరికాలో ఆలయంపై విద్వేష దాడి



హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని దుండగులు రెచ్చిపోతున్నారు. అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రంలో శాన్ బెర్నార్డినో కౌంటీలో ఉన్న చినో హిల్స్‌లోని ప్రఖ్యాత స్వామి నారాయణ్ మందిరంపై శనివారం దాడికి తెగబడ్డారు. ఆలయ గోడలపై భారత వ్యతిరేక రాతలు రాశారు. గ్రాఫిటీ రాతలతో అందవిహీనంగా మార్చే ప్రయత్నం చేశారు.

- వివరాలు 6లో▶

అన్నమయ్య కీర్తనలకు స్వరాలద్దిన గరిమెళ్ల అస్తమయం



ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు, అన్నమయ్య కీర్తనలకు స్వరకల్పన చేసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) ఆదివారం తిరుపతిలోని స్వగృహంలో గుండెపోటుతో మరణించారు. శాస్త్రీయ కర్ణాటక సంగీతంతో పాటు లలిత, జానపద సంగీతంలోనూ ఆయన నిష్ణాతుడు. శాస్త్రీయ సంగీతంతో కోట్లాది మందిని అలరించారు.

- వివరాలు 3లో▶

సమీకృత గురుకులాలకు రూ. 11,000 కోట్లు

ఒకేదఫాలో 55 పాఠశాలల నిర్మాణానికి సర్కార్ గ్రీన్ సిగ్నల్

పరిపాలన అనుమతులు జారీ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు

- రాష్ట్రంలోని 55 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు
- ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు
- అన్ని వర్గాల పిల్లలూ ఒకే గొడుగు కిందకు
- విశాలమైన ఆవరణ.. అంతర్జాతీయ ప్రమాణాలు
- డిజిటల్ విద్య, ల్యాబ్‌లు, యాంఫీథియేటర్ ఉండేలా డిజైన్
- ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు (వైఐఐఆర్ఎస్)...రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రాజెక్టు. అన్ని వర్గాల పిల్లలను ఒకే గొడుగు కిందకు తెచ్చి విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో దీనికి అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగా తొలివిడత ఒకే దఫాలో 55 సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తూ.. మొత్తం 55 పాఠశాలలు నిర్మించేందుకు రూ.11 వేల కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేవిడత ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం ఇదే ప్రథమం. కాగా గురుకులాల నిర్మాణానికి

మిగతా 3వ పేజీలో ▶



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర పౌరుల డేటాబేస్ తయారీ యోచనలో ప్రభుత్వం

ప్రతి కుటుంబానికి చెందిన సమస్త వివరాలు నిక్షిప్తం



కుటుంబ కథా చిత్రం!

జనన, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ లాంటి డాక్యుమెంట్లు డిజిటల్ రూపంలో పెట్టే యోచన

కుటుంబంలోని ఏ సభ్యుడు ఏ ప్రభుత్వ పథకం కింద లబ్ధి పొందుతున్నారనే వివరాలు కూడా..

- ఒక్కో కుటుంబానికి ఒక్కో విశిష్ట గుర్తింపు నంబర్ కేటాయింపు
- పథకాలకు అవసరమైన డాక్యుమెంట్లు పదేపదే ప్రభుత్వానికి సమర్పించే అవసరం లేకుండా వెసులుబాటు
- ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు అర్హత సాధిస్తే ఆటోమేటిక్‌గా సభ్యులకు సమాచారం
- పథకాలు పారదర్శకంగా, లోపాలు లేకుండా అర్హులకు చేరవేయడమే లక్ష్యమన్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: బీసీల కులగణన, ఎస్సీ వర్గీకరణ కార్యక్రమాలను పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని యోచిస్తోంది. సమీకృత రాష్ట్ర పౌరుల డేటాబేస్‌ను తయారు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించిన ఐటీ శాఖ.. ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం రూ.30 కోట్లు అవసరమని, కేంద్రం రూ.25 కోట్లు కేటాయిస్తే, తాము రూ.5 కోట్లు భరిస్తామని తెలిపింది. తదుపరి రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేస్తామని వెల్లడించింది. ప్రభుత్వ

మిగతా 3వ పేజీలో ▶



విజయశాంతి



అద్దంకి దయాకర్



శంకర్‌నాయక్

ఎన్నిక ఏకగ్రీవమే!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్

- సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం.. బీఆర్ఎస్ నుంచి దాసోజు
- ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి అభ్యర్థుల ప్రకటన
- అనూహ్య పరిణామాలేవైనా జరిగితే పోలింగ్‌కు చాన్స్

సాక్షి, హైదరాబాద్

శాసనమండలికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది. అనూహ్య పరిణామాలు జరిగితే తప్ప ఎన్నిక జరిగే ఐదు స్థానాల్లో కాంగ్రెస్ మూడు, సీపీఐ, బీఆర్ఎస్ చెరో స్థానాన్ని దక్కించుకోనున్నాయి. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఆధారంగా అధికార కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాల్లో అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌లను అభ్యర్థులుగా ప్రకటించడంతోపాటు మరో స్థానాన్ని మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరు

మిగతా 2వ పేజీలో ▶



దాసోజు శ్రవణ్



నెల్లికంటి సత్యం

బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

42 శాతం రిజర్వేషన్లను ఆదిలోనే అడ్డుకునే ప్రయత్నాలు

అఖిలభారత పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి



ఎగ్జిబిషన్ మైదానంలో మగ్గంపై చీరను నేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపితే మోదీ మెడపై కత్తి పెట్టినట్లే.. బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది
- మా సర్వే తప్పని ఏవిధంగా చెబుతున్నారో పక్కా ఆధారాలతో రావాలన్నాం.. మా సవాల్ స్వీకరించకుండా బీజేపీ, బీఆర్ఎస్ తప్పించుకుంటున్నాయి

2లో

చేనేత కార్మికుల లక్ష లోపు రుణాలు మాఫీ

2లో

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఒక మృతదేహం లభ్యం

- మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్‌గా ప్రాథమిక నిర్ధారణ
- సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ సంతాపం
- మృతుని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- నేడు మరొకరి ఆనవాళ్లు లభ్యమయ్యే అవకాశం.. రెండు రోజుల్లో మిగతా వారివి కూడా..

5లో



గురుప్రీత్ సింగ్ (ఫైల్)

ఎన్నిక ఏకగ్రీవమే!

▶ మొదటి పేజీ తరువాయి

ఖరారైంది. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యం బరిలో ఉన్నారు.

ఐదుగురు రిటైర్ అవుతుండటంతో..

ప్రస్తుతం శాసనమండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్‌ల పదవీకాలం ఈ నెల 29న ముగుస్తోంది. ఖాళీ అవుతున్న ఈ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నిక కోసం ఈ నెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారంతో ఈ గడువు ముగుస్తోంది. 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణకు గడువు ఉంది. ఎన్నిక అనివార్యమయ్యే పక్షంలో ఈ నెల 20న పోలింగ్ జరుగుతుంది. కానీ ఖాళీ అవుతున్న ఐదు స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు మాత్రమే బరిలోకి దిగుతుండటంతో ఎన్నిక ఏకగ్రీవమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

సన్నాల కోసం చూస్తే.. దొడ్డు బియ్యం కూడా రాలే

పదో తేదీ వచ్చినా పేదలకు అందని రేషన్ బియ్యం

- నెల మొదటి తేదీ నుంచే అందాల్సిన రేషన్
- ఈసారి అలాట్‌మెంట్‌లోనే జాప్యం
- ఒకటో తేదీన అలాట్‌మెంట్ ఇచ్చిన పౌరసరఫరాల సంస్థ
- అవసరమైన బియ్యం 1.51 లక్షల మెట్రిక్ టన్నులు
- రేషన్ దుకాణాలకు వెళ్లిన స్టాక్ 62,346 మెట్రిక్ టన్నులే
- సన్న బియ్యంపై స్పష్టత కరువు.. ఉగాదికి కూడా అనుమానమే

సాక్షి, హైదరాబాద్: ఈ నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం సరఫరా జరుగుతుందని ఆశించిన పేదలకు నిరాశే మిగిలింది. సన్నబియ్యం సంగతి దేవుడెరుగు.. నెలనెలా వచ్చే దొడ్డు బియ్యం కూడా ఇంకా రాకపోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బియ్యం ఎప్పుడిస్తారోనని లబ్ధిదారులు సంచులు పట్టుకొని రేషన్ షాపుల చుట్టూ తిరుగుతున్న దృశ్యాలు వారం రోజులుగా చాలా జిల్లాల్లో కనిపిస్తున్నాయి.

దుకాణాలకు చేరని బియ్యం





ప్రతినెల ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ మొదలై పదో తేదీ నాటికి దాదాపు పూర్తవుతుంది. ఈసారి పదో తేదీ వచ్చినా ఇంకా సుమారు 50 శాతం రేషన్ దుకాణాలకు బియ్యమే చేరలేదు. మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి నెలాఖరులోగానే దుకాణాలకు బియ్యం సరఫరా కావాలి. ఈసారి ఎంఎల్ఎస్ పాయింట్లకే ఒకటో తారీఖు తరువాత అలాట్‌మెంట్ ఇవ్వడంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో రాష్ట్రంలోని 17,335 రేషన్ దుకాణాలకు గాను చాలా దుకాణాలకు కూడా రేషన్ బియ్యం అందలేదు. ఈ నెల కోసం 1.51 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం రావాల్సి ఉండగా, వచ్చింది 62,346 మెట్రిక్ టన్నులే. అంటే 42 శాతమే సరఫరా అయ్యింది.

> వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి పేదలకు సన్న బియ్యంగా సరఫరా చేస్తే.. కొత్త బియ్యం సరిగా ఉడకదు. అందుకని రెండు నెలలు నిల్వ చేసి మార్చి నుంచి పంపిణీ చేస్తాం.
> - గత డిసెంబర్‌లో పౌరసరఫరాల సంస్థ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ వెల్లడి

> మార్చి నెల నుంచి రాష్ట్రంలోని పేదలందరికీ రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తాం.
> - పలు సందర్భాల్లో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ

సన్నబియ్యంపై డైలమా..

మార్చి నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో దొడ్డు బియ్యం బఫర్ స్టాక్‌ను పూర్తిచేసే పనిలో పౌరసరఫరాల సంస్థ అధికారులు ఉన్నారు. వానాకాలం సీఎంఆర్ సన్న వడ్లను రెండు నెలలుగా మిల్లింగ్ చేయించి గోదాములకు పంపుతున్నారు. దీంతో దొడ్డు బియ్యం స్టాక్ లేకుండా పోయింది. అయితే ఈ నెలలో కూడా దొడ్డు బియ్యమే సరఫరా చేయాలని ప్రభుత్వం ఆలస్యంగా నిర్ణయించడంతో.. గత నెల 20వ తేదీ నుంచే ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరాల్సిన దొడ్డు బియ్యం స్టాక్ వెళ్లలేదు. 2వ తేదీ నుంచి బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపినట్లు ఓ అధికారి తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని దుకాణాలకు బియ్యం పంపేందుకు కృషి చేస్తున్నట్లు ఓ జిల్లాకు చెందిన డీఎస్ఓ 'సాక్షి'కి తెలిపారు.

ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ...?

ఈ వానాకాలం సీజన్‌లో 24 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం రాగా, దాన్ని మిల్లింగ్ చేస్తే 16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం వస్తాయని అంచనా. రాష్ట్ర అవసరాలకు ఈ బియ్యం 8 నెలలు సరిపోతాయి. వచ్చే ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అంటే ఏప్రిల్‌లో ఇచ్చే కోటాను లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది.

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం

- పొత్తులో భాగంగా ఒక సీటు కేటాయించిన కాంగ్రెస్
- కృతజ్ఞతలు తెలిపిన కూనంనేని సాంబశివరావు

సాక్షి, హైదరాబాద్: శాసనమండలి ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా నల్లగొండ జిల్లా పార్టీ కార్యదర్శి నెల్లికంటి సత్యం పేరు ఖరారైంది. ఈ మేరకు ఆదివారం రాత్రి జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఎల్లగూడెంకు చెందిన నెల్లికంటి సత్యం యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. 1969 జూన్ 6న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పార్వతమ్మ, పెద్దయ్య, భార్య అన్నపూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివారు.

విస్తృతంగా చర్చించి ఎంపిక..

పొత్తులో భాగంగా సీపీఐకి ఒక ఎమ్మెల్సీ స్థానం కేటాయిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆదివారం సాయంత్రం ప్రకటించింది. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గం హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో సమావేశమై చర్చించింది. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డితోపాటు మరి కొందరు నేతలు ఎమ్మెల్సీ స్థానం కోసం ఆసక్తి చూపినా.. సామాజిక సమీకరణాలు, పార్టీ పట్ల విధేయత, ప్రజా పోరాటాల్లో పాల్గొన్న తీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసినట్టు తెలిసింది. తెలంగాణ శాసనమండలిలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లభించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

కాంగ్రెస్‌కు సీపీఐ ధన్యవాదాలు

స్నేహధర్మాన్ని పాటిస్తూ ఎమ్మెల్సీ స్థానాన్ని సీపీఐకి కేటాయించడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీలు ఎదగకుండా అడ్డుకునే కుట్ర

42 శాతం రిజర్వేషన్లను ఆదిలోనే అడ్డుకునే ప్రయత్నాలు

- అఖిలభారత పద్మశాలి మహాసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపితే మోదీ మెడపై కత్తి పెట్టినట్లే..
- మా కుటుంబ సర్వే తప్పని ఏ విధంగా చెబుతున్నారో ఆధారాలతో రావాలన్నాం
- సవాల్ స్వీకరించకుండా బీజేపీ, బీఆర్ఎస్ తప్పించుకుంటున్నాయని వ్యాఖ్య



పద్మశాలి సంఘం మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న సంఘం నాయకులు. చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలు ఎదగకుండా, వారికి 42 శాతం రిజర్వేషన్లు అందకుండా ఆదిలోనే అడ్డుకునే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని.. దానితో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్లే ఆయా పార్టీల నేతలు లేనిపోని అపోహలు సృష్టించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను బీసీలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సమాచారమంతా అధికారికంగా సేకరించినదే. ఇంటి యజమాని ధ్రువీకరణ కూడా తీసుకున్నాం. ఈ సర్వేలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్టు తేలింది. గతంలో కేసీఆర్ హయాంలో చేసిన సర్వేలో బీసీల జనాభా 51శాతమే లెక్కించారు. ఇప్పుడు 5.33 శాతం పెరిగింది. కేసీఆర్ సర్వేలో అగ్రకులాల జనాభా శాతం 21శాతం ఉన్నట్టు చెబితే.. మా సర్వేలో 15.28 శాతమేనని తేలింది. ప్రతి కోణంలో సర్వే చేసి గణాంకాలను క్రోడీకరించాం.

అసెంబ్లీలో బిల్లు పెడతాం..: బీసీలకు ఇచ్చిన హామీలో భాగంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. త్వరలో అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం. పార్లమెంటులో ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన వెంటనే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి ఇవ్వడమంటే మోదీ మెడ మీద కత్తిపెట్టినట్లే. కచ్చితంగా మన డిమాండ్‌ను ఆమోదించాల్సిందే. బీసీల కోసం ప్రజాప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతారనే భయం ప్రతిపక్ష పార్టీలకు పట్టుకుంది. బీసీలు ఎదిగితే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. అందుకే బీసీ రిజర్వేషన్లను ఆ రెండు పార్టీలు ఆదిలోనే అడ్డుకునే కుట్ర చేస్తున్నాయి. ఈ పరిస్థితులను బీసీలంతా గుర్తించాలి.

నన్ను ఎప్పుడైనా కలవచ్చు..: తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతోనే ముఖ్యమంత్రి అయ్యాను. ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా కర్తవ్యం. అందుకోసం 24గంటలు పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాను. గత ప్రభుత్వంలో సీఎంను కలవాలంటే పెద్ద సాహసంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడైనా నన్ను కలవచ్చు. మీ సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చి.. వాటిని పరిష్కరింపజేసుకునే బాధ్యత మీదే. తెలంగాణ సాధన కోసం పోరాడిన పద్మశాలి ముద్దుబిడ్డ కొండాలక్ష్మణ్ బాపూజీని పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రజాప్రభుత్వం ఏర్పాటు కాగానే.. కేంద్రంతో మాట్లాడి 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేశాం. దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతాం. టైగర్ నరేంద్రకు యూపీఏ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇస్తే... ధృతరాష్ట్రుడి కౌగిలి మాదిరిగా కేసీఆర్ ఆయనను ఖతం చేశారు. కులవృత్తిపై ఆధారపడిన పద్మశాలీలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలను మహిళలు కట్టుకోలేదు. అవి పొలాల దగ్గర కట్టడానికే పనికి వచ్చాయి. అందుకే అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీ ఆపివేశాం. మహిళా సంఘాల్లోని వారికి మంచి చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. రూ.600 కోట్ల విలువైన 1.30 కోట్ల చీరల ఆర్డర్లను నేతన్నలకు ఇస్తున్నాం. తెలంగాణ పద్మశాలీలు ఇతర రాష్ట్రాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రూ.కోటితో షోలాపూర్‌లో పద్మశాలీల ఆత్మగౌరవాన్ని నిలిపేలా మార్కండేయ భవనం నిర్మించేందుకు సహకరిస్తాం..'' అని సీఎం రేవంత్ వెల్లడించారు.

చేనేత కార్మికులకు రుణమాఫీ అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ బడ్జెట్‌లోనే వారి రుణాలను మాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రజల కష్టాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పద్మశాలీలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు వినూత్న పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు.

మగ్గంపై చీర నేసిన సీఎం

సీఎం రేవంత్ తొలుత ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడ సిద్ధం చేసిన చేనేత మగ్గంపై చీర నేశారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ కేడర్ సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధా రాణి, అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ పద్మశాలి సంఘం ప్రతినిధులు అంబటి శ్రీనివాస్, మురళీధర్, గడ్డం జగన్నాథం, కన్నెగట్ల స్వామి, టీపీసీసీ చేనేత విభాగం అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల రూ.లక్ష లోపు రుణాలు మాఫీ

రూ.33 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

- 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చిలోపు రుణాలకు వర్తింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి సంబంధించిన రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసింది. ఇందుకోసం రూ.33 కోట్లను మంజూరు చేస్తూ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు (జీవో నం.56) జారీ చేశారు. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలకు ఈ మాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. కార్మికులను అప్పుల బాధ నుంచి విముక్తి చేయడం, మైక్రో ఫైనాన్స్ కంపెనీలు, వడ్డీ వ్యాపారుల ఒత్తిడిని తప్పించడం దీని ముఖ్య ఉద్దేశమని ఉత్తర్వుల్లో వివరించారు. సీఎం ప్రకటించిన ఈ పథకం రాష్ట్ర చేనేత కార్మికులకు పెద్ద ఊరట అని ప్రభుత్వం పేర్కొంది. పథకానికి సంబంధించిన మరిన్ని మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నారు.

చేనేత రంగాన్ని గాడిలో పెట్టేందుకే: మంత్రి తుమ్మల

గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన చేనేత రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో చేనేత కార్మికులకు లక్ష రూపాయల రుణమాఫీ ఒకటని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతను ఆదుకునే దిశగా పలు చర్యలు చేపట్టామన్నారు. 'తెలంగాణ చేనేత అభయ హస్తం' పథకం అమలుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారని తెలిపారు. చేనేత సహకార సంఘాల నుండి స్టాకులను కొనుగోలు చేసి, సంబంధిత చెల్లింపులను సమయానికి విడుదల చేయడం ద్వారా నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్

- ఎమ్మెల్యే కోటా కింద ఎంపిక.. నేడు నామినేషన్
- బీసీ నేతకు అవకాశం ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: శాసన మండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పేరును బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. దాసోజు శ్రవణ్ నామినేషన్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును ఆదేశించారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేస్తున్నట్టు దాసోజు శ్రవణ్ వెల్లడించారు.

సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత..

తెలంగాణ ఉద్యమకాలం నుంచీ బీఆర్ఎస్‌తో అనుబంధం కలిగిన సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌కు సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత ఎమ్మెల్సీ పదవి దక్కుతోంది. నిజానికి 2023 జూన్‌లోనే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా శ్రవణ్‌ను కేసీఆర్ ఎంపిక చేశారు. కానీ నాటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ దాసోజు అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. దీనిపై హైకోర్టు, సుప్రీం కోర్టులలో న్యాయపోరాటం కూడా జరిగింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గవర్నర్ కోటాలో ఇతరులు నామినేట్ అయ్యారు. బీసీ సామాజికవర్గానికి చెందిన దాసోజు శ్రవణ్‌కు బీఆర్ఎస్‌తో ఉన్న అనుబంధం, గతంలో గవర్నర్ కోటాలో నామినేట్ చేసినా తిరస్కరణకు గురవడాన్ని దృష్టిలో పెట్టుకున్న కేసీఆర్.. ఇప్పుడు ఎమ్మెల్యేల కోటాలో అవకాశం ఇచ్చారు.

ఆర్ఎస్ఎస్ నుంచి బీఆర్ఎస్ దాకా..

యుక్త వయసులోనే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలకు ఆకర్షితులైన దాసోజు శ్రవణ్.. 1988లో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ జనరల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. జలసాధన సమితి వంటి సంస్థలతో కలసి పనిచేశారు. ఆస్కి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా.. పలు మల్టీ నేషనల్ కంపెనీల్లో హెచ్ఆర్ హెడ్‌గా పనిచేశారు. 2009లో ప్రజారాజ్యం తరఫున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. తర్వాతి కాలంలో బీఆర్ఎస్‌లో చేరి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. 2014లో కాంగ్రెస్‌లో చేరిన దాసోజు.. టీపీసీసీ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. 2018లో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. తర్వాత తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు.

రేపు బీఆర్ఎస్ శాసనసభా పక్షం భేటీ

తెలంగాణ భవన్‌కు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 12 నుంచి శాసన సభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష భేటీ జరగనుంది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ భేటీ ప్రారంభమవుతుంది. దీనికి రావాల్సిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇప్పటికే పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా సమాచారం పంపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంతో పాటు, ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై జరిగే ప్రత్యేక చర్చల్లో బీఆర్ఎస్ తరఫున వినిపించాల్సిన వాదనపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తారు. వాయిదా తీర్మానాలు, పార్టీ తరఫున చర్చకు డిమాండ్ చేయాల్సిన అంశాల జాబితా తయారు చేయడంపై పార్టీ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. గవర్నర్ ప్రసంగం, బడ్జెట్ ప్రసంగానికి కేసీఆర్ హాజరయ్యే చాన్స్ ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

విజయశాంతికి ఎమ్మెల్సీ చాన్స్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఎంపిక చేసిన ఏఐసీసీ

- శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్‌లకూ అవకాశం
- ఆదివారం సాయంత్రం ప్రకటించిన కేసీ వేణుగోపాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులను ఏఐసీసీ ఆదివారం సాయంత్రం ప్రకటించింది. రాష్ట్ర నేతల అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలు, పార్టీలో పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ముగ్గురు నేతలు అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్, విజయశాంతిలకు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఎవరూ ఊహించని విధంగా సినీ నటి, మాజీ ఎంపీ విజయశాంతి పేరును ఎంపిక చేయడం మాత్రం టీపీసీసీ వర్గాలను కొంత ఆశ్చర్యానికి గురిచేసింది.

నాలుగు స్థానాలకుగాను..

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై వారం రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు ఏఐసీసీ పెద్దలతో చర్చలు జరిపారు. ఎమ్మెల్యే కోటా కింద కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు దక్కే అవకాశం ఉండగా.. సీపీఐకి ఒక స్థానం కేటాయించడంపై విస్తృతస్థాయిలో చర్చలు జరిగాయి. ఎన్నికల ముందు పొత్తులో భాగంగా తమకు ఇచ్చిన హామీ మేరకు ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్‌ను సీపీఐ జాతీయ కమిటీ బలంగా కోరింది. సీపీఐ జాతీయ నేత డి.రాజా, మరికొందరు నేతలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఈ అంశంపై మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే సీపీఐకి ఒక ఎమ్మెల్సీ స్థానం ఇచ్చేందుకు ఏఐసీసీ, టీపీసీసీ నిర్ణయం తీసుకున్నాయి. మిగతా మూడు స్థానాలకుగాను విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను ఎంపిక చేశారు.

నేడు ఉదయం 11 తర్వాత నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఏఐసీసీ ప్రకటించిన ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటల తర్వాత నామినేషన్లు దాఖలు చేస్తారని సీఎల్పీ వర్గాలు వెల్లడించాయి. నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లతోపాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు సోమవారం అందుబాటులో ఉన్న వారంతా రావాలని సీఎల్పీ నుంచి పార్టీ ఎమ్మెల్యేలకు సమాచారం అందింది.

సామాజిక కోణంలోనే ఎంపిక!

బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం

- మహిళ, సంస్థాగత కోటాలు కూడా పరిగణనలోకి తీసుకుని చాన్స్
- అనూహ్యంగా తెరపైకి వచ్చిన మాజీ ఎంపీ విజయశాంతి
- జానారెడ్డి చొరవతో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శాసనమండలికి..
- మిత్రధర్మం మేరకు ఓ సీటు సీపీఐకి.. ఇద్దరు ఉమ్మడి నల్లగొండ నేతలకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ అధిష్టానం సామాజిక సమీకరణాల తూకం పాటించింది. రెడ్డి, మైనార్టీ కోటాలో కూడా పలు పేర్లను పరిశీలించినప్పటికీ భవిష్యత్తులో చేపట్టాల్సిన మంత్రివర్గ విస్తరణ, పార్టీ కార్యవర్గ కూర్పు, ఇతర నామినేటెడ్ పదవులకు ఎంపికలను పరిగణనలోకి తీసుకుని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఇద్దరు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.

ఢిల్లీలో చక్రం తిప్పిన విజయశాంతి

ఈసారి ఎమ్మెల్సీగా మహిళకు అవకాశమివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఎస్టీ కోటాలో మహిళను ఎంపిక చేయాలని తొలుత భావించింది. కానీ అనూహ్యంగా మహిళా కోటాలో సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతి తెరపైకి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో విజయశాంతి ఎక్కడా రాష్ట్ర రాజకీయ ముఖచిత్రంలో కనిపించకపోవడం గమనార్హం. ఆమె రెండు రోజుల క్రితమే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. మహిళ, బీసీ కోటాలో తనకు చాన్స్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. పార్టీ కూడా ఆమె పట్ల సానుకూలంగా స్పందించడంతో.. పేరు ఖరారైందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాష్ట్ర కేబినెట్‌లో ఈసారి ఎస్టీ (లంబాడా) సామాజిక వర్గానికి అవకాశం కల్పించలేని పరిస్థితులున్న నేపథ్యంలో.. ఆ వర్గానికి ఎమ్మెల్సీగా అవకాశమివ్వాలని ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలు భావించారు. ఈ కోటాలో కొందరి పేర్లు పరిశీలించారు. అయితే మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డి చొరవతో ఆయన సన్నిహితుడు, నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి ఆయన చేస్తున్న సేవలను కూడా అధిష్టానం గుర్తించినట్లయింది. మరోవైపు మొదటి నుంచీ ఊహిస్తున్న విధంగానే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ పేరు కూడా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారైంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సి ఉన్నా.. అప్పటి పరిస్థితుల మేరకు తన స్థానాన్ని త్యాగం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చాక మొదటిసారి జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో ఆయన పేరును పరిశీలించినా చివరి నిమిషంలో ఆగిపోయింది. ఎస్సీ (మాల) సామాజికవర్గానికి చెందిన ఆయనను ఈసారి మండలికి పంపాలని పార్టీ నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన అద్దంకి దయాకర్‌కు అవకాశం కల్పించడం ద్వారా రేవంత్ మాటకు కూడా అధిష్టానం ప్రాధాన్యత ఇచ్చినట్లయింది.

ఓసీ కోటా మినహాయింపు

ఈ దఫా ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఓసీ కోటాను కాంగ్రెస్ అధిష్టానం మినహాయించింది. ఇద్దరు ఓసీ నేతల మధ్య తీవ్ర పోటీ ఏర్పడటంతోనే ఈ నిర్ణయం తీసుకుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఓసీ కోటాలో ఎమ్మెల్సీగా ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు వినిపించింది. ఆయన పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారని, కచ్చితంగా అవకాశం వస్తుందనే ప్రచారం జరిగింది. మరోవైపు శాసనమండలిలో కాంగ్రెస్‌పక్ష నేత టి.జీవన్‌రెడ్డి పదవీకాలం త్వరలో ముగుస్తోంది. ఈ క్రమంలో ఆయనను మళ్లీ మండలికి ఎంపిక చేయాలని రాష్ట్ర కాంగ్రెస్‌లోని ముగ్గురు సీనియర్ మంత్రులు పట్టుబట్టినట్టు తెలిసింది. ఈ ఇద్దరు నేతల మధ్య ఏర్పడిన పోటీ కారణంగానే అధిష్టానం ఈసారి ఓసీ కోటాను మినహాయించిందని, ఇందుకు ప్రతిగా కేబినెట్ విస్తరణలో రెండు బెర్తులు ఓసీలకు ఇస్తుందనే ప్రచారం జరుగుతోంది. జీవన్‌రెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వకపోవడంతో మండలిలో కాంగ్రెస్‌పక్ష నేతగా కొత్త వారిని ఎంపిక చేయాల్సి ఉంది. ఇక బీసీల కోటాలో అనేక పేర్లు వినిపించినప్పటికీ చివరకు సినీనటి విజయశాంతి వైపు అధిష్టానం మొగ్గు చూపడం అనూహ్య పరిణామం. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా ఈసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికే ఎమ్మెల్సీ అవకాశం దక్కేలా తన వంతు ప్రయత్నం చేశారు.

ఎంఐఎంకు స్థానిక సంస్థల కోటా

అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీపీఐతో అధికారికంగా పొత్తు కుదుర్చుకున్న కాంగ్రెస్ పార్టీ.. సీపీఐకి రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా ఇప్పుడు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మరోవైపు తమ సభ్యుడు రియాజుల్ హసన్ ఎమ్మెల్సీగా పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో.. తమకు ఇప్పుడే అవకాశమివ్వాలని ఎంఐఎం నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. కానీ సీపీఐకి ఇవ్వాల్సి వస్తున్నందున ఈసారికి సర్దుకోవాలని.. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో అవకాశం ఇస్తామని కాంగ్రెస్ విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది.



ఏదో ఒక్క నిరుద్యోగులకు మాత్రమే ద్రోహం చేసినట్లు మాట్లాడుతున్నారేంటి సార్!



నేను ఎల్లప్పుడూ మనుషుల ఆలోచనలకు అత్యుత్తమ వివరణ వారి చర్యలు అని భావిస్తాను.
– జాన్ లాకి

సాక్షి
సోమవారం, 10 మార్చి 2025

రాజా... రాజాధిరాజా...

'టిక్... టిక్... టిక్...' సినిమాకు దర్శకత్వం వహిస్తున్న కె.భారతీరాజా తన మిత్రుడు ఇళయరాజాకు పాట సందర్భాన్ని వివరిస్తూ 'పాట మధ్యలో ఒకచోట భయంకరమైన మ్యూజిక్ కావాలి. అక్కడ ప్రేక్షకులు ఉలిక్కిపడే దృశ్యం చూపిస్తాను' అన్నాడట. ఇళయరాజా 'సరే' అని పాట రికార్డు చేశాడు. భారతీరాజా ఆ పాట విని మొదట తనే ఉలిక్కిపడ్డాడు. ఏమంటే భయంకరమైన మ్యూజిక్ కావాలని అతడు కోరిన చోట ఇళయరాజా ఏం చేశాడో తెలుసా? కొన్ని సెకన్ల నిశ్శబ్దం ఉంచాడు. 'నిశ్శబ్దానికి మించిన భయమైన ధ్వని ఏముంది?'. ఆ పాట హిట్ అయ్యింది. శబ్దం, నిశ్శబ్దం తెలిసిన ఈ మహా సంగీతకారుడు గత 50 ఏళ్లుగా కోట్లమందికి తోడుగా ఉన్నాడు. అభిమానులతో సహజీవనం చేస్తున్నాడు. ఆరాధకులతో సహయానం సాగిస్తున్నాడు. మనసుకు వైద్యుడు. కలత వేళ ఏకాంత తీరాలకు మోసే వెదురు తెప్ప.

'ప్రేమ' సినిమా కుర్రకారు ఓపెనింగ్స్‌తో మొదలైంది. హీరో గిటారిస్ట్. క్లయిమాక్స్ జాతీయ స్థాయిలో పాటల పోటీ. హీరో ఎలాంటి పాటతో అదరగొట్టి చిందులు వేస్తాడోనని అందరూ ఎదురు చూస్తే 'ప్రియతమా... నా హృదయమా'... అని ఎంతో నెమ్మదైన మెలడీ వస్తుంది. ఇళయరాజా అలా ఎందుకు చేశాడు? పాట మరోసారి వినండి. పాటకు ముందు మెరుపు వేగంతో గిటార్ మోతతో స్టేజ్ ఊగిపోయేలా ప్రిల్యూడ్ వస్తుంది. హఠాత్తుగా ఆగి స్లోగా పాట మొదలవుతుంది. హీరో పాడాలనుకున్నది ప్రిల్యూడ్‌కు అనువైన పాట. పాడింది ఈ పాట. కారణం? హీరోయిన్ చావు బతుకుల్లో ఉంది. దర్శకుడి కంటే ఇళయరాజాకే కథ బాగా అర్థం అవుతుంది. అందుకే అతడి పాట నిలబడుతుంది.

తెల్లవారే లేచి, కాస్త టీ కొట్టి, హైదరాబాద్ నుంచి చెన్నైకి కారు ప్రయాణం మీద బయలుదేరే కొందరు అమ్మో అంత దూరమా? అనుకోరు. ఇళయరాజా పాటల పెన్ డ్రైవ్ తగిలిస్తే చాలు అనుకుంటారు. ఏ శనివారం సాయంత్రమో పార్టీలో డబ్బు తక్కువై సరంజామా తగ్గినా ఊరుకుంటారు... ఇళయరాజా పాట మాత్రం బ్యాక్‌గ్రౌండ్‌లో ఉండాల్సిందే. ప్రేమ విఫలం... ఇళయరాజా. ప్రేమ జయం... ఇళయరాజా. భావనలొకట్టై సాగిపోయే వేళలో.... పరువమా చిలిపి పరుగు తీయకు....

తమిళనాడు తేని జిల్లాలో మారుమూల కుగ్రామంలో రాజయ్యగా పుట్టి, రాజాగా మారి అప్పటికే మన ఏ.ఎం.రాజా ఇండస్ట్రీలో ఉండటం వల్ల 'ఇళయ' చేర్చుకుని ఇళయరాజాగా 'అన్నాకిళి' (1976)తో ఏ ముహూర్తాన సంగీత దర్శకుడిగా జన్మించాడోగాని ఇంతకాలం తర్వాత, 1,500 సినిమాలకు 8,500 పాటలు చేశాక, 81 ఏళ్లకు చేరుకున్నాక కూడా ఆకర్షణ కోల్పోలేదు. పెరిగే అభిమానుల రాశి తప్ప అతని పాటల సూచి కుదేలైన దాఖలా లేదు. ఇసైజ్ఞాని. మేస్ట్రో. రాజా సార్. ఒకసారి వింటే చర్మానికి అంటుకుపోయే ఒడు కొలాన్ సెంట్. 1980లలో హైస్కూల్లోనో కాలేజీలోనో ఉన్నవారెవరైనా ఇతని మొగలి వనాలలో వ్యసనపరులు. ఆకాశం ఏనాటిదో అనురాగం ఆనాటిది.

రావడం రావడమే కొత్త సౌండ్‌ను ప్రవేశ పెట్టిన ఇళయరాజాకు, కర్ణాటక ధోరణిని వెస్టర్న్‌తో ఫ్యూజన్ చేయాలనుకుంటున్న ఇళయరాజాకు తన పాటలు సగటు శ్రోతలకు నచ్చుతాయా లేదా అనే సందేహం తెగ పీడించింది. ఒకరోజు సాయంత్రం వాకింగ్‌కు ఇంటి నుంచి బయలుదేరితే రేడియోలో 'అన్నాకిళి' (రామచిలుక)లోని 'మావయ్య వస్తాడట' పాట మొదలైందట! అంతే... ఆ ఇంటి ఇల్లాలు గబగబా బయటకు వచ్చి 'ఓ సుబ్బాయక్కా... మంగమ్మత్తా... మావయ్య వస్తాడట పాట వస్తోందే రేడియో పెట్టండి' అని అరిచిందట! ఇళయరాజా నడుస్తున్న పొడవైన వీధి. ఇక చూడండి... ప్రతి గడపా వరుసగా రేడియో ఆన్ చేస్తూ అతని పాటను అతనికే వినిపిస్తూ కచేరీ. వారిచ్చిన నమ్మకం నేటికీ!

'సంగీతం రాదు... ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉన్నాను' అనే ఇళయరాజా ఇంత పేరు, ఖ్యాతి, సంపద తర్వాత కూడా వయసు రీత్యా విరమించుకొని ఉండొచ్చు. గర్వంతో మొద్దుబారి ఉండొచ్చు. అహంతో బంగారు సింహాసనం చేసుకుని విర్రవీగొచ్చు. కాని అతడు అవేం చేయలేదు. భారతీయ సంగీత ప్రతిభను ప్రపంచానికి చాటడానికి వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్‌లో అత్యంత క్లిష్టమైన 'సింఫనీ' రాసి, దానికి 'వేలియంట్' అని నామకరణం చేసి, మార్చి 8న లండన్‌లో 85 మంది సభ్యుల ప్రతిష్ఠాత్మక రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో ప్రదర్శన ఇచ్చాడు. ప్రపంచ దేశాల నుంచి రాజా అభిమానులు ఈ సింఫనీకి హాజరయ్యారు. 45 నిమిషాల నాలుగు అంచెల సింఫనీని విని స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఇలా వెస్టర్న్ క్లాసికల్‌లో సింఫనీ రాసి, లండన్‌లో ప్రదర్శన ఇచ్చిన మొట్టమొదటి భారతీయుడిగా రాజా చరిత్ర సృష్టించాడు. మరల రాజాధిరాజుగా నిలిచాడు. వ్యక్తిగత ప్రవర్తనలో కొందరికి అభ్యంతరాలు ఉండుగాక... కాని ఇళయరాజా ఒకసారి హార్మోనియం పెట్టి ముందు కూచున్నాడంటే దేవుడు– అభిమానులకు! చేసిన పాటల కంటే బ్యాక్‌గ్రౌండ్ స్కోరుకు ఫ్యాన్స్ ఉన్నారంటే ఏమిటి చెప్పడం!

రాజా తరగని స్ఫూర్తి. కొద్దిగా చేసి ఎంతో అనుకునేవారు, కాసింత వయసుకే డీలా పడిపోయేవారు, నాలుగు ముక్కలు చదివి మేధావులుగా చలామణి అయ్యేవారు, అద్దెలొచ్చే నాలుగు ఫ్లాట్లకు ఓనర్లైనంత మాత్రాన ఇతరులను పురుగుల్లా చూసేవారు... రాజా నుంచి నేర్చుకోవాల్సింది ఉన్నట్టే ఉంది. రాజా చెయ్యి వేస్తే... అది రాంగై పోదు లేరా!

సజాతి ధ్రువాల వికర్షణ

కామెంట్



కరణ్ థాపర్

శశి థరూర్‌కీ, కాంగ్రెస్ నాయకత్వానికీ మధ్య తలెత్తినట్లుగా కనిపిస్తున్న విభేదాలను ఆసక్తికరంగా మారుస్తున్నది ఏమిటంటే, ఇరు వర్గాల గురించి ఆ విభేదాలు బయటికి ఏం వెల్లడిస్తున్నాయన్నదే. విభేదాలున్నాయన్న సంగతిని వారు ఒప్పుకొని, అంగీకరించకున్నా... ఒకటైతే వాస్తవం. వారు ఒకరికొకరు పూర్తిగా భిన్నమైనవారు. బహుశా సమస్యకు మూలం, ప్రధానంగా అదే అయి వుండాలి.

శశి థరూర్ పక్కా రాజకీయ నాయకుడు కారు. ముఠాలను, రహస్య మంతనాలను ఆయన నడపరు. బదులుగా, ఆయన తన సొంత ప్రతిభ, నైపుణ్యాల మీద ఆధారపడినవారు. దీనర్థం – ఆయనకు దాపరికాలేం ఉండవని. రాజకీయంగా పైకి రావాలన్న ఆకాంక్ష, గుర్తింపు కోసం ఆరాటం మాత్రమే ఉన్నాయని. అంతేకాదు, తన వైపునకు దృష్టిని మళ్లించుకోవాలని కూడా ఆయన కోరుకుంటారని అర్థమౌతోంది. ముందుకు సాగేందుకు ఆయన విధానం అది. అందులో విజయం సాధించారు కూడా. ట్విట్టర్‌లో ఆయన్ని అనుసరించే అసంఖ్యాక అభిమానులు, ఆయనకు గల 'గుర్తింపు యోగ్యత' ... ఇందుకు సాక్ష్యం.

కాంగ్రెస్ నాయకత్వం, కనీసం ఇందిరాగాంధీ హయాం నుంచి చూసినా కూడా – ముఖస్తుతులు చెల్లించే వారి ద్వారా వర్ధిల్లుతూనే వచ్చింది. వారంతా గాంధీల అనుచరులు. వారి నాయకులు గాంధీలు. వారు తమ రాజకీయ జీవితాన్నంతా గాంధీల సేవకే అంకితం చేసినవారు. రాహుల్ గాంధీని మించి తాము శోభిల్లకూడదనీ, సోనియా గాంధీకి ఎదురు చెప్పకూడదనీ నేర్చుకున్నవారు. ఇక ఇప్పుడైతే ప్రియాంకా గాంధీకి పల్లకి మోయటానికి తయారవుతున్నవారు. అంతేనా, ఈ తరహా కుటుంబ ఆరాధనను నియమబద్ధం చేయటానికి... గాంధీ కుటుంబం లేకుండా కాంగ్రెస్ పార్టీ మనుగడ సాగించలేదని తమను తాము నమ్మించుకుంటున్నవారు ఈ అనుచరులు.

చిన్నపాటి పోలికలు శశి, రాహుల్‌ల మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేయిస్తాయి. శశి తన ప్రతిభ, తెలివితేటలతో కష్టపడి పైకొచ్చినవారు. రాహుల్ బలం ఆయన ఇంటిపేరు. రాహుల్ స్వయంగా సాధించిన రాజకీయ విజయాలు పరిమితమైనవి. లేదా, ఏమంతగా గుర్తింపులో లేనివి. తగని సమయాలలో విహార యాత్రలకు వెళ్లిపోవటం ఆయన అభిరుచి. శశి బలం... దీర్ఘమైన ఆయన ఆంగ్ల పదాడంబరత, ఆహ్లాదకరమైన ఆయన నడవడిక. రాహుల్ స్పష్టంగా మాట్లాడలేని వ్యక్తిగా కనిపిస్తారు. రాహుల్‌కు తనేం చెప్పాలనుకుంటున్నారో దానిని వ్యక్తపరిచే విషయంలో సమస్యలు ఉన్నాయని చాలామంది నమ్ముతారు. శశి రచయిత. ఇరవైకి పైగా పుస్తకాలు రాశారు. ఆకాంక్షలు గల యువతను ఆయన ఆకర్షిస్తారు. రాహుల్ ఎప్పుడూ కూడా పేదలను, ఆర్థికంగా లేదా సామాజికంగా అణచివేతకు గురవుతున్నవారిని ఉద్దేశించి మాట్లాడుతుంటారు. మొత్తానికి, వీళ్లిద్దరూ భిన్న ప్రపంచాలలో ప్రకాశిస్తున్నవారు.



రాహుల్ గాంధీ, శశి థరూర్

మాజీ దౌత్యవేత్తగా శశి తీరు వివేకవంతంగా, వినయపూర్వకంగా, తన ప్రత్యర్థులు సాధించిన విజయాలను సైతం అంగీకరించే విధంగా ఉంటుంది. అందుకే మోదీ అమెరికా పర్యటనను, లేదా కేరళలో సీపీఎం స్టార్టప్‌లను అభివృద్ధి పరచటాన్ని ఆయన ప్రశంసించకుండా ఉండలేకపోయారు. రాహుల్ శైలి ఇందుకు విరుద్ధంగా కఠినంగా, గాయపరిచేలా ఉంటుంది. మాటల బాక్సర్ అతడు. కమిలిపోయేలా గట్టి దెబ్బ కొడతారు.

కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ అతి సునాయాసంగా అత్యున్నత స్థానానికి చేరుకోగలిగారంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. పార్టీలో అతడిది ప్రశ్నించేవారే లేని, సర్వదా ఆమోదం పొందిన ఆరోహణ. ఇందుకు భిన్నమైనది శశి థరూర్ రాజకీయ జీవితం. అది వెలుగులను విరజిమ్మేదేమీ కాదు. ఆయన కొంతకాలం విదేశాంగ, మానవ వనరుల అభివృద్ధి శాఖల సహాయ మంత్రిగా పని చేశారు. 2014 తర్వాత రెండు పార్లమెంటరీ సెలక్ట్ కమిటీలకు చైర్మన్‌గా ఉన్నారు. అంతకుమించి, కాంగ్రెస్‌లో అగ్రశ్రేణి నాయకుడిగా ఎప్పుడూ లేరు. ఆయన తన గతం వల్ల లేదా తన సహాయక రాజకీయేతర క్రియాశీలతల వల్ల మాత్రమే ప్రసిద్ధులు. ఆయన్ని తన భవిష్యత్ నేతగా కాంగ్రెస్ పార్టీ ఒప్పుకోలేకపోతోంది.

ఇవన్నీ కూడా నాలో మూడు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అవి శశి థరూర్‌కు, ఆయన పార్టీ అయిన కాంగ్రెస్‌కు మధ్య ఉన్న వ్యత్యాసాలకు సంబంధించినవని నేను నమ్ముతున్నాను. మొదటిది, గొప్ప గౌరవ మర్యాదలను పొందుతూ, రాహుల్‌కు ప్రత్యర్థులు కావచ్చునని పరిగణన పొందుతున్న ప్రతిభావంతులైన వ్యక్తులతో ఎలా నడుచుకోవాలో కాంగ్రెస్ పార్టీకి తెలియటం లేదన్న విషయాన్ని ఈ విభేదాలు సూచిస్తున్నాయా? బయటి ప్రపంచానికి రాహుల్, శశి ఎలా కనిపిస్తారో ఒక్క క్షణం ఆలోచించండి. రాహుల్‌ను వారసత్వపు అర్హత గల రాజపుత్రుడిగా చూస్తారు. శశిని ప్రతిభకు, పనితీరుకు ప్రతీకగా చూస్తారు. కాంగ్రెస్ తన అధ్యక్ష వంశానికి విధేయతతో... ప్రతిభకు, పని తీరుకు మిగిల్చి ఉంచిన ఆ కాస్త చోటును కూడా పరిమితం చేసేసిందా?

◆ కాంగ్రెస్ పార్టీ ఇందిరాగాంధీ హయాం నుంచి చూసినా కూడా – ముఖస్తుతులు చెల్లించే వారి ద్వారానే వర్ధిల్లుతూ వచ్చింది. వారంతా రాహుల్ గాంధీని మించి తాము శోభిల్లకూడదనీ, సోనియా గాంధీకి ఎదురు చెప్పకూడదనీ నేర్చుకున్నవారు.

◆ రాహుల్ గాంధీ అతి సునాయాసంగా అత్యున్నత స్థానానికి చేరుకోగలిగారంటే అందులో ఆశ్చర్యం లేదు. పార్టీలో అతడిది ప్రశ్నించేవారే లేని ఆరోహణ. ఇందుకు భిన్నమైనది శశి థరూర్ రాజకీయ జీవితం.

రెండవది... పార్లమెంటు లోపల గానీ, పార్లమెంటు బయట గానీ, పార్టీలో శశి థరూర్ పోషించవలసిన పాత్ర చాలా స్వల్పమైనదిగా మాత్రమే ఉంది. ఆయన నేర్పును, నైపుణ్యాలను ఉపయోగించుకునే విషయంలో – అలాంటి అలవాటు లేకపోవటం కారణంగా – కాంగ్రెస్ జాగ్రత్త పడుతూ రావటమే కారణమా? ఒకప్పుడు విశాల గుడారమైన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నెరవేర్చదగిన ఆకాంక్షలను గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోయిందా?

మూడవది, తానెప్పటికీ గెలవలేనని తెలుసు; తన ఆశయం, కనీసం తన ఉద్దేశం ఏమిటని ఆలోచించేవారిని అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని తెలిసినా శశి థరూర్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి పోటీ పడి తప్పు చేశారా? ఆ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధం చేయటానికే ఆయన పోటీలో నిలబడ్డారని నాకు తెలుసు. సాధారణంగానైతే ఆ చొరవను మెచ్చుకోవాలి. కానీ పోటీ లేకుండా అభ్యర్థిని గెలవనిచ్చే కాంగ్రెస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇదంతా జరిగినట్లయిందా?

నాల్గవ ప్రశ్న కూడా ఉంది. సాధారణమైన ప్రశ్న. శశి థరూర్ కనుక కాంగ్రెస్ నుండి విడిపోతే అది ఆ పార్టీకి ఏపాటి ఎదురు దెబ్బ అవుతుంది? ఆయన విషయానికొస్తే కేరళలో ఆయన ఆశలు విఫలం కావచ్చు. ఒకటి మాత్రం చెప్పగలను. ఆయన కాంగ్రెస్‌ను వీడతారో లేదో గానీ, బీజేపీలో చేరతారంటే మాత్రం నేను నమ్మలేను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

దీనిమీదేం మాట్లాడరా?



మంగళ సూత్రాలు, వన్యప్రాణులు, పిల్లల పరీక్షలు, ఆదివారం సినిమాలు, అంతర్జాతీయ కుట్రలు లాంటి ఇంకా ఎన్నో విషయాల మీద ప్రకటనలు చేసే ప్రధానమంత్రి... దేశ వాణిజ్యం, ఆర్థిక ప్రయోజనాల విషయంలో నిజమైన ప్రమాదాలుగా నిలిచే ఒక విదేశీ నాయకుడి రోజువారీ బెదిరింపుల గురించి మాత్రం ఏమీ మాట్లాడటం లేదు.

– సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

ఎందుకు రావట్లేదు?



2024లో విదేశీ యాత్రికులు: ఇండియా– 1.28 కోట్లు. టర్కీ– 6.23 కోట్లు. రష్యా యుద్ధ క్షేత్రానికి టర్కీ దగ్గరగా ఉంది; అక్కడ 5 శాతం జనాభా భారతీయులు; ఇండియా భూభాగంలో పావు శాతం కంటే తక్కువ; 4–5 ప్రదేశాలే బాగా తెలిసినవి. అయినా ఇండియా కంటే అక్కడికి ఐదురెట్లు యాత్రికులు ఎందుకు వెళ్తున్నారు? థాయ్‌లాండ్ కూడా ఇండియా కంటే మూడు రెట్ల యాత్రికులను ఆకర్షిస్తోంది. ఈ సమస్యను మనం పరిష్కరించుకోవాలి.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

ఇక్కడ మొదలెట్టలేమా?



జమ్ము కశ్మీర్‌కు చెందిన ఒక కంపెనీ వియత్నాం నుంచి యాపిల్ జ్యూస్ క్యాన్స్‌ను తెప్పించి ఇండియాలో పంపిణీ చేస్తోంది. మరో వైపు, ప్రాసెసింగ్ పరిశ్రమ లేకపోవడంతో కశ్మీర్‌లో ప్రతి యేటా లక్షల టన్నుల యాపిల్స్ కుళ్లిపోతుంటాయి. సిగ్గుతో నాకు తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదు.

– ఆనంద్ సర్కార్, ఆంత్రప్రెన్యూర్

నేర్చుకోవడమే



ఒక ఉన్నత పాఠశాల విద్యార్థి నన్ను అడిగాడు: ఒక స్టార్టప్‌లో చేరడం మంచిదా, యూనివర్సిటీలో చదవడం మంచిదా? ఒకవేళ అతడు నిజంగా గట్టి ఆశలు ఉన్నవాడైతే యూనివర్సిటీలో మరింత ఎక్కువ నేర్చుకోవచ్చు. ఒక స్టార్టప్‌లో చేసే పని పరిమితులతో కూడి ఉంటుంది.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

హృదయం ముఖ్యం



జీవిత పాఠాలు: మీ మెదడు జ్ఞాన సముద్రం కావొచ్చు, కానీ మీ హృదయం వివేక సముద్రం.

– శేఖర్ కపూర్, దర్శకుడు

చెప్తే చెప్పాలి!




వాళ్లు నీ పుట్టినరోజును గుర్తించుకుంటే, నువ్వు వాళ్ల పుట్టిన రోజును గుర్తుంచుకోవాలి. అదో అభినందనల చక్రం.

– వైదేహీ మూర్తి, కంటెంట్ క్రియేటర్

వైజ్ఞానిక వేగుచుక్కలు - 22

అపరిమిత పరిశోధనా యోధ

భారతీయ మహిళా శాస్త్రవేత్తలు చాలా గుండె దిటువుతో పలురకాల వివక్షల నెదుర్కొంటూ పనిచేశారు. సైటాలజీ, జెనెటిక్స్, ఫైటో బయాలజీ, ఎథ్నో బాటనీ, ఔషధ మొక్కలు, క్రోమోజోముల ప్రవర్తన... ఇలా పలు రకాలుగా కృషి చేసిన జానకి అమ్మాళ్ (1897–1984) చాలా ప్రత్యేకంగా కనబడతారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ బొటానికల్ లేబొరేటరీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రల్ మెడిసిన్, కోయంబత్తూర్ లోని షుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ లాంటి ఎన్నో పరిశోధనా సంస్థలలో గణనీయమైన పరిశోధనలు చేశారు.



జానకి అమ్మాళ్

జానకి అమ్మాళ్‌గా ప్రాచుర్యం పొందిన 'ఎదవలెత్ కక్కాట్ జానకి అమ్మాళ్' 1897 నవంబర్ 4న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ (ఇప్పటి కేరళ) లోని టెల్లిచేరిలో జన్మించారు. 1925లో మిచిగన్ యూనివర్సిటీ నుంచి ఎం.ఎస్సీ డిగ్రీ గడించారు. ఈ డిగ్రీ పొందిన తర్వాత మద్రాసు ఉమన్స్ క్రిస్టియన్ కాలేజీలో ప్రొఫెసర్ ఆఫ్ బాటనీగా చేరారు. మళ్ళీ మిచిగాన్ యూనివర్సిటీకి తొలి ఓరియంటల్ బార్బర్ రీసెర్చి ఫెలోగా వెళ్ళి 1931లో డీఎస్సీ పట్టాను (తొలి భారతీయ మహిళగా కూడా) పొందారు. కోయంబత్తూరులోని షుగర్ కేన్ బ్రీడింగ్ స్టేషన్ (నేటి షుగర్స్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్)లో పూర్తి స్థాయి పరిశోధనలకు దిగారు. ఈ సమయంలోనే జానకీ అమ్మాళ్ జెనెటిస్ట్‌గా కూడా పనిచేసి చెరకు, చెరకు సంబంధమైన గడ్డి రకాల సాయంతో సంకర రకాలు సృష్టించారు. 1939 నుంచి 1950 దాకా జానకీ అమ్మాళ్ ఇంగ్లాండులో అసిస్టెంట్ సైటాలజిస్ట్‌గానూ, సైటాలజిస్ట్‌గానూ పని చేశారు. 1951లో భారత ప్రధాని నెహ్రూ ఆహ్వానం మేరకు తిరిగి వచ్చి బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా వ్యవస్థను ఆ సంస్థ డైరెక్టర్‌గా పునర్వ్యవస్థీకరించారు. రెండేళ్ళ తర్వాత సెంట్రల్ బొటానికల్ లాబొరేటరీలో డైరెక్టర్‌గా చేరి 1959లో పదవీ విరమణ చేసేదాకా పరిశోధన చేశారు. అదే ఏడాది జమ్ములోని రీజినల్ రీసెర్చి లాబొరేటరీలో చేరారు. ఇక్కడ సైటోజెనెటిక్స్ విభాగాన్ని ప్రారంభించారు.

1957లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ'తో గౌరవించింది. తన చివరి రోజు వరకు పరిశోధన చేసిన జానకీ అమ్మాళ్ 86 ఏళ్ల వయసులో 1984 ఫిబ్రవరి 7న తుదిశ్వాస విడిచారు. ఐదున్నర దశాబ్దాల పాటు సాగిన ఆమె పరిశోధన వెనుక – దృఢచిత్తం, పూర్తి స్థాయి భారతీయ అలవాట్లు, గాంధీజీ జీవనశైలి, ప్రచారానికి అర్రులు చాచక పోవడం వంటివి స్పష్టంగా కనబడతాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

అన్ని భాషలు సమానం... హిందీ మరింత సమానం!

అభిప్రాయం



దానీ

దేశంలో ఇప్పుడు హిందీ వివాదం రగులుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్ దక్షిణ భారతదేశంలో హిందీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి నడుం బిగించారు. తమిళనాడులో పెరియార్ ఇవీ రామసామి నాయకర్ కాలం నుండే హిందీ వ్యతిరేకతకు చాలా చరిత్ర వుంది. స్టాలిన్ పిలుపు మీద దక్షిణాదిలోని మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

మనకు జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఇంగ్లీషు, రాష్ట్ర భాష తెలుగు అనే ఒక తప్పుడు అభిప్రాయం సామాన్యుల్లోనేగాక విద్యావంతుల్లోనూ కొనసాగుతోంది. ఏపీ తెలుగు, తెలంగాణ తెలుగు రెండూ వేరే భాషలు, ప్రజలు వేరే జాతులవారు అనే అభిప్రాయాన్ని కొన్నాళ్ళుగా కొందరు కొనసాగిస్తున్నారు. అది ఆ యా సమూహాల ఉనికివాద కోరికలు కావచ్చు. ఇవిగాక ఈ రెండు రాష్ట్రాల్లోనూ చెరో పాతిక భాషలు మాట్లాడే సమూహాలున్నాయి. ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో గోండి, కోయ, కొండ, కువి, కోలామీ, పెన్గొ, మంద, యానాది, లంబాడ, సవర తదితర చిన్న సమూహాలు ఓ పాతిక వరకు ఉంటాయి. అధికార భాషల ప్రాబల్యంలో చిన్న సమూహాలు చితికిపోతాయి; వాళ్ళ భాషలు అంతరించిపోతాయి.

భాష కూడ నిచ్చెనమెట్ల కులవ్యవస్థ లాంటిది. తనకన్నా కింద ఉన్న కుల సమూహాన్ని అణిచివేసే సమూహాన్ని అంతకన్నా పైనున్న కుల సమూహం అణిచివేస్తుంటుంది. చిన్న సమూహాలు తమ మాతృభాషను వదులుకోవాల్సిన పరిస్థితుల్ని సృష్టిస్తారు.

ఒక భాష అంతరించిపోవడం అంటే ఒక జాతి తన సంస్కృతీ సంప్రదాయాలనూ, తను సృష్టించిన కళాసాహిత్యాలనూ కోల్పోవడమే అవుతుంది. అంటే ఆ జాతి ముందు జీవన్మృతిగా మారిపోతుంది. ఆ తరువాత అంతరించిపోతుంది.

బ్రిటిష్ ఇండియా మతప్రాతిపదిక మీద ఇండియా–పాకిస్తాన్‌గా చీలిపోయినట్టు మనకు తెలుసు. అయితే, ఒకేమత సమూహం అయినప్పటికీ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ భాషా ప్రాతిపదిక మీద విడిపోయిందని మనకు గుర్తు ఉండదు. మనుషులకు భాష ప్రాణమంత ముఖ్యమైనది. యూరోప్ దేశాలన్నింటిలోనూ క్రైస్తవ మతసమూహాల ఆధిక్యత ఎక్కువ. అయినప్పటికీ, అవి అన్ని దేశాలుగా విడిపోవడానికి ప్రధాన కారణం భాష. సంస్కృతాన్ని సంఘపరివారం దైవవాణిగా భావిస్తుంది. తాము నిర్మించ తలపెట్టిన 'హిందూరాష్ట్ర'లో సంస్కృతం జాతీయ భాషగా ఉంటుందనేది ఆ సంస్థ అభిప్రాయం. అంతవరకు దేవనాగరి లిపిలోని హిందీని జాతీయ భాషగా కొనసాగించాలని వారి ఆలోచన.



జాతీయ భాష మీద చర్చ రాజ్యాంగ సభలోనే జోరుగా సాగింది. మనకు అందుబాటులో ఉన్న భాషల్లో ఏదో ఒకదాన్ని జాతీయ భాషగా చేస్తే అది మిగిలిన భాషల్ని మింగేస్తుందని చాలా మంది తీవ్ర ఆందోళన, అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూలు 22 భాషలకు గుర్తింపు ఇచ్చినప్పటికీ ఏ భాషకూ జాతీయ హోదా ఇవ్వలేదు. అన్ని భాషలూ సమానమే. మనకు బాగా ప్రాచుర్యంలో ఉన్న భాషలే తెలుసు. బోడో, డోగ్రీ, మైథిలి, సంథాలి తదితర భాషలకు కూడ రాజ్యాంగంలో స్థానం ఉందని మనం తరచూ గుర్తించం. హిందీ జాతీయ భాష కాదు; అది కేంద్ర ప్రభుత్వానికి అధికార భాష మాత్రమే. హిందీ సరసన ఇంగ్లీషును కూడ అనుసంధాన భాషగా గుర్తిస్తున్నారు.

జనాభాను బట్టి లోక్ సభ స్థానాలు నిర్ణయం అవుతాయని మనకు తెలుసు. కేంద్ర ప్రభుత్వ ఆదాయాన్ని రాష్ట్రాలకు పంచే సమయంలోనూ జనాభా, లోక్‌సభ సీట్లు తదితర అంశాలు ప్రాతిపదికగా మారుతాయి. అదీగాక, త్వరలో లోక్‌సభ నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణ జరగబోతోంది. ఉత్తరాది స్థానాలు మరింతగా పెరిగి దక్షిణాది స్థానాలు మరింతగా తగ్గిపోయే అవకాశం ఉన్నట్టు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంచేత ఇది భాషా సమస్య మాత్రమే కాదు; రాజకీయార్థిక సమస్య. ఎవర్ని ఎవరు పాలించాలనే ప్రాణప్రదమైన అంశం ఇందులో ఉంది.

1955లో వచ్చిన భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రతిపాదన... మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల అధికార భాషగా హిందీని పేర్కొంది. ఒక భాషకు అంత విస్తారమైన ప్రాంతాన్ని కేటాయించడం ప్రమాదకరం అని ఆందోళన వ్యక్తం చేసిన వారిలో బీఆర్ అంబేడ్కర్ కూడా ఉన్నారు. ఎందుకయినా మంచిది ఉత్తరప్రదేశ్‌ను నాలుగు భాగాలు చేయాలని ఆయన అప్పుడే సూచించారు. ఇప్పుడు అంబేడ్కర్ భయపడినట్టే జరుగుతోంది. గడిచిన 70 సంవత్సరాల్లో భోజ్‌పురి, మైథిలి, గఢ్వాలి, అవధి, బ్రజ్‌లతో సహా దాదాపు 29 స్థానిక భాషల్ని హిందీ మింగేసింది. అది అక్కడితో ఆగలేదు. ఇప్పుడు ఏకంగా ఇండియాను మింగడానికి సిద్ధం అయింది.

'యానిమల్ ఫార్మ్' వ్యంగ్య నవలలో జార్జ్ ఆర్వెల్ ఒకచోట విరోధాభాసాలంకారం ప్రయోగిస్తాడు. ఫార్మ్‌లో అధికారాన్ని చేజిక్కించుకున్న పందుల సామాజిక వర్గం 'జంతువులన్నీ సమానం; కానీ, పందులు మరింత సమానం' అంటుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అలాంటి విరోధాభాసాలంకారాన్ని తరచూ ప్రయోగిస్తున్నది. రాష్ట్రాలన్నీ సమానం కానీ, హిందీ బెల్టు మరింత సమానం. ఉత్తరాది రాష్ట్రాలు ఇంకా సమానం అంటున్నది. ఇప్పుడు 'భాషలన్నీ సమానం; కానీ, హిందీ మరింత సమానం' అంటూ కొత్త పాట మొదలెట్టింది.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు

బాధ్యత మనదే!

'అవశ్యం అనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్' అని ఆర్యోక్తి. మనుషులు తాము చేసిన పుణ్య కర్మలకు, పాప కార్యాలకు తగిన ఫలాన్ని అనుభవించక తప్పదు. అందుకని ఒకరి సుఖానికి గానీ, దుఃఖానికి గానీ ఇతరులెవరు కారణం కారు. అవి పరుల వల్ల కలుగుతున్నాయను కోవటం తెలివి తక్కువ పని. ఎవరైనా శత్రుత్వంతో 'నా వల్లనే ఎదుటి వ్యక్తి బాధ పడుతున్నాడు. తగిన శాస్తి చేశాను' అని భావించటం కేవలం వారి దురహంకారాన్ని వ్యక్తం చేస్తుంది.

కాబట్టి మానవుడు తన ప్రారబ్ధానుసారం తనకు సుఖం లభించినా, దుఃఖం లభించినా తామరాకు మీద నీటి బొట్టులా చలించకుండా ఎప్పుడూ ప్రసన్నమైన మనసుతో ఉండాలి. భోగములు వచ్చినా, పోయినా వాటికి అధీనులయి ఉండకూడదు. శుభాశుభ కర్మల ఫలం లభించగానే సంతోషాన్నో, బాధనో పొందటం నిరర్థకం. ఈ సుఖ దుఃఖాలు అనేవి నీరు – బురదల్లా ఎప్పుడూ కలిసే ఉంటాయని 'అధ్యాత్మ రామాయణం' చెబుతుంది



అయితే, శుభా శుభ కర్మల ఫలితాన్ని సమచిత్తంతో స్వీకరిస్తూ నిర్లిప్త చిత్తుడై ఉండటం చెప్పినంత సులువు కాదు. అందుకు సాధన కావాలి. మనోబలం కావాలి. భగవంతుని తత్వాన్ని అవగతం చేసుకునే కొద్దీ ఇది సాధ్యమవుతుంది. అందుకే పండితులు, విద్వాంసులు అంతా 'భగవంతుని మాయ' అనే భావనతో ఇష్టమైనదైనా, అయిష్టమైనదైనా ఏది లభించినా ధైర్యం వహించి హర్ష శోకాలను పొందరు. జ్ఞానులు కష్టాలు ప్రాప్తించినప్పుడు వాటి గురించి ఆలోచించకుండా, అనవసరంగా దైవనింద చేయకుండా, కష్ట సమయంలో భగవంతుని సమీపంలో ఎక్కువ సమయం ఉండటం అలవాటు చేసుకుంటే అవి భయాన్ని కలిగించవని చెబుతారు. అనుభవించ వలసినవి అనుభవించక తప్పదని చెబుతారు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ఏకాదశి ఉ.9.56 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పుష్యమి రా.2.25 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.10.20 నుండి 11.56 వరకు, దుర్ముహూర్తం: ప.12.36 నుండి 1.24 వరకు, తదుపరి ప.2.59 నుండి 3.47 వరకు, అమృతఘడియలు: రా.8.05 నుండి 9.41 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 6.04.




ఉత్తమ విదేశీ భాషా చిత్రాలు

ఆస్కార్ అవార్డుల్లో విదేశీ భాషా చిత్రాల విభాగంలో అత్యధిక అవార్డులు పొందిన దేశం ఇటలీ. నిజానికి 2020లో కొరియా చిత్రం పారాసైట్.. ఏకంగా ఉత్తమ చిత్రం అవార్డునే దక్కించుకుని రికార్డు సృష్టించింది. విదేశీ భాషా చిత్రాల విభాగంలో అత్యధిక నామినేషన్లు ఫ్రాన్స్ నుంచి వచ్చాయి. కాగా, మనదేశం నుంచి ఇప్పటివరకు మదర్ ఇండియా, సలాం బాంబే, లగాన్.. ఉత్తమ విదేశీ భాషా చిత్రాల విభాగంలో నామినేట్ అయ్యాయి. కానీ, అవార్డు మాత్రం రాలేదు.

దేశం	నామినేషన్లు	అవార్డులు
ఇటలీ	30	11
ఫ్రాన్స్	39	9
స్పెయిన్	21	4
డెన్మార్క్	15	4
జర్మనీ	23	4
భారత్	3	0

డిస్కంల ప్రోగ్రెస్ సున్నా!



- జాతీయ స్థాయి రేటింగ్, ర్యాంకింగ్స్‌లో అట్టడుగున నిలిచిన రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు
- 2022-23తో పోల్చితే 2023-24లో మరింతగా దిగజారిన పనితీరు
- దేశంలోని 52 డిస్కంలలో టీజీఎన్పీడీసీఎల్‌కు 46, టీజీఎస్పీడీసీఎల్‌కు 49వ ర్యాంకు
- రెండు డిస్కంలకూ 'మైనస్ సీ'గ్రేడ్.. ఆర్థిక సుస్థిరతలో 75కి గాను 0 స్కోర్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు మరింతగా దిగజారాయి. దేశంలోని 52 డిస్కంలు 2023-24లో చూపిన పనితీరును బట్టి కేంద్ర విద్యుత్ శాఖ తాజాగా 13వ వార్షిక సమగ్ర రేటింగ్స్, ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. అందులో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) మొత్తం 100 స్కోర్‌కుగాను 11.4 స్కోరు మాత్రమే సాధించి 49వ స్థానంలో నిలిచింది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎన్పీడీసీఎల్) 16.7 స్కోరు సాధించి 46వ స్థానం దక్కించుకుంది. ఇదే సమయంలో డిస్కంలకు పనితీరు ఆధారంగా కేంద్రం.. ఏ+, ఏ, బీ, బీ-, సీ, సీ-, డీ అనే గ్రేడ్లను కేటాయించగా.. తెలంగాణలోని రెండు డిస్కంలు కూడా 'సీ-'గ్రేడ్‌తో అడుగున నిలిచాయి.

రేటింగ్స్, ర్యాంకింగ్స్ కేటాయింపు ఇలా..

డిస్కంల ఆర్థిక సుస్థిరతకు 75, ఉత్తమ పనితీరుకు 13, ప్రభుత్వ సహకారానికి 12 స్కోరు కలిపి మొత్తం 100 స్కోరును ఈ రేటింగ్స్‌లో కేటాయించారు. వివిధ అంశాల్లో పనితీరు బాగోలేకుంటే నెగెటివ్ స్కోరును ఇచ్చారు. పనితీరు బాగోలేదని ఆడిటర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తే -15, ఆడిట్ చేసిన ఖాతాల లభ్యత లేకుంటే -15, బ్యాంకులకు రుణాలను ఎగవేడితే -15, ఆడిట్ అనర్హతలకు -4, పాలన వైఫల్యాలకు -3, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించడంలో జాప్యానికి -4.5, సబ్సిడీపై టారిఫ్ ఆధారపడితే -1, ఆదాయ లోటుకు -4, నష్టాలకు -5 కలిపి మొత్తం 66.5 నెగెటివ్ మార్కులుంటాయి. ఆయా డిస్కంలకు వచ్చిన వాస్తవ మార్కులను నెగెటివ్ మార్కులతో సర్దుబాటు చేసిన తర్వాత తుది రేటింగ్, ర్యాంకింగ్‌ను కేంద్రం కేటాయించింది.

ఏడాదిలో మరింతగా కిందకు..

గతేడాది కేంద్రం ప్రకటించిన 12వ జాతీయ స్థాయి రేటింగ్స్, ర్యాంకింగ్స్‌తో పోల్చితే తాజా రేటింగ్స్, ర్యాంకింగ్స్‌లో రెండు డిస్కంల ర్యాంకు, గ్రేడ్లు మరింతగా దిగజారాయి. టీజీఎస్పీడీసీఎల్ స్కోరు 19.9 నుంచి 11.4కు, గ్రేడ్ 'సీ'నుంచి 'మైనస్ సీ'కి పడిపోయాయి. టీజీఎన్పీడీసీఎల్ స్కోరు 17.9 నుంచి 16.7కు, గ్రేడ్ 'సీ'నుంచి 'మైనస్ సీ'కి పడిపోయాయి.

ప్రోగ్రెస్ కార్డులో అన్నీ సున్నాలే!

మొత్తం 15 అంశాలకుగాను టీజీఎస్పీడీసీఎల్ 10 అంశాల్లో... టీజీఎన్పీడీసీఎల్ 8 అంశాల్లో సున్నా స్కోర్ సాధించాయి. ఆర్థిక సుస్థిరతలో 75 స్కోరుకుగాను.. టీజీఎస్పీడీసీఎల్‌కు 0, టీజీఎన్పీడీసీఎల్‌కు 3.5 స్కోర్ మాత్రమే రావడం గమనార్హం. ఇక పనితీరులో సమర్థతకు సంబంధించి 13 స్కోరుకుగాను.. రెండు డిస్కంలు కూడా 5.7 సాధించాయి. ప్రభుత్వ సహకారం అంశంలో 12 స్కోరుకుగాను.. టీజీఎస్పీడీసీఎల్ 7.7, టీజీఎన్పీడీసీఎల్ 8.5 స్కోరు సాధించాయి. ఇక టీజీఎస్పీడీసీఎల్ ఆడిట్ అభ్యంతరాలకు గాను మైనస్ 1, టారిఫ్ ప్రతిపాదనల్లో జాప్యానికి మైనస్ 1 కలిపి మొత్తం మైనస్ 2 నెగెటివ్ స్కోరు పొందడంతో సంస్థ తుదిస్కోరు 13.4 నుంచి 11.4కు తగ్గిపోయింది. టీజీఎన్పీడీసీఎల్ టారిఫ్ ప్రతిపాదనల్లో జాప్యానికి గాను మైనస్ 1 స్కోరును పొందడంతో తుది స్కోరు 17.7 నుంచి 16.7కు తగ్గింది. ఇలా డిస్కంల ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిపోవడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

సమర్థత, పనితీరులో దిగజారిన టీజీఎస్పీడీసీఎల్

- సాంకేతిక, వాణిజ్య నష్టాల మొత్తం (ఏటీ అండ్ సీ) 2022-23తో పోల్చి తే 2023-24లో 22.19 శాతం నుంచి 20శాతానికి తగ్గింది.
- బిల్లుల జారీలో సమర్థత 92.83 శాతం నుంచి 90.73శాతానికి పడిపోయింది.
- ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం సైతం యూనిట్ విద్యుత్‌కు రూ.1.19 నుంచి రూ.1.35కి పెరిగింది.
- బిల్లుల వసూళ్లకు పట్టిన సగటు రోజులు 326 నుంచి 397కి పెరిగిపోయాయి.
- బిల్లుల వసూళ్లలో సమర్థత మాత్రం 83.82% నుంచి 88.18శాతానికి పెరిగింది.
- 2023-24లో సంస్థ రూ.45,738 కోట్లను ఖర్చు చేయగా.. రూ.40,699 కోట్ల ఆదాయాన్ని మాత్రమే ఆర్జించింది. రూ.5,039 కోట్ల నష్టాలు వచ్చాయి.
- యూనిట్ విద్యుత్ సరఫరా కోసం సంస్థ చేస్తున్న వ్యయం రూ.7.66 నుంచి రూ.7.47కి తగ్గింది.

నష్టాల బాటలో టీజీఎన్పీడీసీఎల్

- ఏటీఅండ్‌సీ నష్టాలు 17.2 నుంచి 18.84 శాతానికి పెరిగాయి.
- బిల్లుల జారీలో సమర్థత 91.5% నుంచి 91.45శాతానికి తగ్గింది.
- ఆదాయ, వ్యయాల మధ్య వ్యత్యాసం యూనిట్ విద్యుత్‌కు రూ.1.08 నుంచి రూ.1.55కి పెరిగిపోయింది.
- బిల్లుల వసూళ్ల కాలం 138 రోజుల నుంచి 169 రోజులకు పెరిగింది.
- బిల్లుల వసూళ్లలో సమర్థత 90.49 నుంచి 88.75శాతానికి తగ్గింది.
- 2023-24లో సంస్థ రూ.19,933 కోట్లను ఖర్చు చేయగా.. రూ.18,492 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. రూ.1,441 కోట్లను నష్టపోయింది.
- యూనిట్ విద్యుత్ సరఫరా కోసం చేస్తున్న వ్యయం రూ.8.2 నుంచి రూ.8కి తగ్గింది.

మన డిస్కంలు సాధించిన స్కోర్ ఇదీ..
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

ఏపీలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

- బీద రవిచంద్ర, బీటీ నాయుడు, కావలి గ్రీష్మకు అవకాశం

సాక్షి, అమరావతి: ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ తరఫున అభ్యర్థులను ప్రకటించారు. నెల్లూరు జిల్లాకు చెందిన బీద రవిచంద్ర, కర్నూలు జిల్లాకు చెందిన బీటీ నాయుడు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన కావలి గ్రీష్మను టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆదివారం రాత్రి ఖరారు చేశారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో ఒకరైన బీద రవిచంద్ర మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన పేరు ఖరారు చేశారు. లోకేశ్ పాదయాత్రతో పాటు గత ఎన్నికల్లో ఆయన వ్యవహారాల్లో రవిచంద్ర కీలకంగా వ్యవహరించారు. రాయలసీమ ప్రాంతం నుంచి ఒక్కరికైనా అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో సిట్టింగ్ ఎమ్మెల్సీ బీటీ నాయుడుకి అవకాశం ఇచ్చారు. మూడో స్థానాన్ని టీడీపీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మను ఎంపిక చేశారు. ఇద్దరు బీసీలు, ఒక ఎస్సీకి అవకాశం ఇచ్చినట్లు టీడీపీ నేతలు తెలిపారు.

మృతుల కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి: కేటీఆర్

- సీఎం వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వల్లే ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. టన్నెల్ కూలిన ఘటనలో 16 రోజుల తర్వాత గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించిందని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కేటీఆర్ ఒక ప్రకటనలో కోరారు. సీఎం వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని.. మృతుడి కుటుంబానికి ఇరుపక్షాలు రూ.50 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. ప్రణాళిక లేకుండా టన్నెల్ పనులు చేపట్టినందునే ప్రమాదం జరిగిందని, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 203 కిలోమీటర్ల మేర సొరంగాలు తవ్వినా ఈ తరహా ఘటనలు జరగలేదని తెలిపారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సీఎం క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

నారాయణ కళాశాలలో ఫుడ్ పాయిజన్

- వాంతులు, విరోచనాలతో పలువురు విద్యార్థులకు అస్వస్థత

హయత్‌నగర్: నారాయణ కళాశాలలో ఫుడ్ పాయిజన్‌తో పలువురు విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుంట్లూరులోని నారాయణ కళాశాల (బానర ఐఐటీ క్యాంపస్) హాస్టల్‌లో శనివారం రాత్రి విద్యార్థులకు చపాతి, ఆలూకర్రీ వడ్డించారు. అది తిన్న కొద్దిసేపటి నుంచి విద్యార్థులకు కడుపునొప్పితో వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి, డీహైడ్రేషన్‌తో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, అప్రమత్తమైన సిబ్బంది వారికి కొబ్బరి నీళ్లు, ఓఆర్‌ఎస్ తాగించారు. కొంతమందిని చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇంకొందరికి హాస్టల్‌లోనే వైద్య సహాయం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన కళాశాల క్యాంపస్‌కు చేరుకున్నారు. పిల్లలను చూసేందుకు కూడా కళాశాల సిబ్బంది అనుమతి ఇవ్వలేదంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- కోహెడలోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో కూడా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కుంట్లూరు క్యాంపస్ కిచెన్ నుంచే వండిన ఫుడ్‌ను ఇక్కడకు పంపినట్లు తెలిసింది. ఈ ఘటనలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపారు.

న్యాయ సేవలు ప్రజలకు చేరువ కావాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

కొత్తగూడెం టౌన్: న్యాయ సేవలు ప్రజలకు మరింతగా చేరువ కావాలని, అందుకు న్యాయ వ్యవస్థ కీలకపాత్ర పోషించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా కోరారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విచారణ నిమిత్తం కోర్టుకు వచ్చేవారికి మెరుగైన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వ న్యాయ సేవా సంస్థల భాగస్వామ్యం అవసరమన్నారు. న్యాయ సేవలను అందుబాటులోకి తేవడం, లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేశ్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం జిల్లా కోర్టులో వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ నందా సూరేపల్లి. పక్కన జిల్లా జడ్జి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేశ్ విపాటిల్ తదితరులు

కాగా, హైకోర్టు జడ్జి నందా అంతకుముందు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి అమ్మవారిని సైతం న్యాయమూర్తి దర్శించుకున్నారు.

రెండుమూడు రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక




మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, కడియం శ్రీహరి, వేం నరేందర్‌రెడ్డి, రామచంద్రు నాయక్, నాగరాజు తదితరులు

- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను రెండుమూడు రోజుల్లో పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పథకం అమల్లో వేగం మరింత పెరగాల్సి ఉందని, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆయన ఆదివారం రాత్రి తన నివాసంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సమీక్షించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు. ప్రభుత్వ ఆలోచనలు, లక్ష్యాలకు తగినట్టు కలెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ పథకం విషయంలో కలెక్ట ర్లకు ఏవైనా సందేహాలుంటే కాలయా పన చేయకుండా.. నేరుగా తనను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించా రు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయా లను కూడా పరిగణనలోకి తీసుకుని కలెక్టర్లే తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపే దలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కాంట్రా క్టర్లు పూర్తి చేయని పక్షంలో.. లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా చూడాలని ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సాగు, తాగు నీటికి కొరత రానీయకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిపాదిత వరంగల్ విమానాశ్రయానికి, అక్కడి ఔటర్, ఇన్నర్ రింగురోడ్లకు వేగంగా భూసేకరణ జరపాలని మంత్రి ఆదేశించారు.

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ఒక మృతదేహం లభ్యం

- మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్ సింగ్‌గా ప్రాథమిక నిర్ధారణ
- ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ సంతాపం
- మృతుని కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- నేడు మరొకరి ఆనవాళ్లు లభ్యమయ్యే అవకాశం.. రెండు రోజుల్లో మిగతా వారివి కూడా..



కార్మికుడి మృతదేహాన్ని వెలికితీస్తున్న రెస్క్యూ సిబ్బంది

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంలో గల్లంతైన 8 మంది కార్మికులు, ఇంజనీర్లలో ఆదివారం ఒకరి మృతదేహం బయటపడింది. శనివారం అర్ధరాత్రి సహాయ బృందాలు చేపట్టిన తవ్వకాల్లో టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) కేబిన్ పక్కన ఉన్న మెట్ల వద్ద టీబీఎం భాగాల్లో చిక్కుకుపోయిన ఓ కార్మికుడి కుడిచేయి కనిపించింది. కేరళ నుంచి తీసుకొచ్చిన కడావర్ డాగ్స్ గల్లంతైన కార్మికులు ఉండే అవకాశం ఉన్న డీ1, డీ2 అనే రెండు లొకేషన్లను గుర్తించగా ఆయా ప్రదేశాల వద్ద సింగరేణి, ర్యాట్‌హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తవ్వకాలు జరిపారు. డీ2 స్పాట్ వద్ద మొత్తం 9.2 మీటర్ల మేర మట్టి, శిథిలాలు, టీబీఎం భాగాలు కూరుకుపోగా శిథిలాలను తొలగిస్తూ 3 మీటర్ల లోతులో తవ్వగా కార్మికుడి మృతదేహం కనిపించింది. మృతదేహం చెదిరిపోకుండా వెలికితీసేందుకు సహాయ బృందాలకు ఏకంగా 12 గంటల సమయం పట్టింది. ఆదివారం రాత్రి టన్నెల్ నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమికంగా లభించిన ఆనవాళ్లనుబట్టి మృతుడిని రాబిన్స్ కంపెనీలో పనిచేస్తున్న ఎరెక్టర్ ఆపరేటర్, పంజాబ్‌లోని ధరాన్‌కు చెందిన గురుప్రీత్‌సింగ్ (40)గా గుర్తించారు. ఆయన రాబిన్స్ కంపెనీలో మూడేళ్లగా టీబీఎం ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పంజాబ్‌లోని స్వస్థలం ధరాన్‌కు ప్రత్యేక అంబులెన్స్‌లో పంపించారు. గురుప్రీత్‌సింగ్‌కు భార్య రాజ్‌విందర్‌కౌర్ ఉన్నారు. గురుప్రీత్‌సింగ్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మరోవైపు గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైన ప్రదేశానికి సమీపంలోనే మరోచోట సోమవారం మరొకరి ఆచూకీ లభ్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగతా కార్మికుల ఆనవాళ్లు సైతం మరో రెండు రోజుల్లో తెలిసే అవకాశం ఉంది.

రేపు రంగంలోకి రోబోలు..

సొరంగం వద్ద సహాయ చర్యల్లో మంగళవారం రోబోలు రంగంలోకి దిగనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన అన్వి రోబోటిక్స్ నిపుణులు విజయ్, అక్షయ్ నేతృత్వంలో ఈ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగనుంది. ప్రస్తుతం సహాయక చర్యలను కొనసాగిస్తున్న సిబ్బందికి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో వారికి ఎలాంటి ప్రాణహాని జరగకుండా రోబోలను వినియోగించనున్నారు. ఈ ఆపరేషన్‌ను డ్రోన్ ద్వారా పర్యవేక్షించనున్నారు. పెద్ద రాళ్లు, మట్టి శిథిలాలు, బురదను తొలగించేలా మూడు రకాల రోబోలను ఉపయోగించనున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో భారీగా కేసుల పరిష్కారం

- అన్నీ కలిపి1,83,182 కేసులు క్లోజ్
- సైబర్ మోసాల కేసులు 4961
- సైబర్ బాధితులకు రూ.43.31 కోట్లు రీఫండ్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భారీ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయి. క్రిమినల్, సైబర్ మోసాల కేసులు కలిపి మొత్తం 1,83,182 కేసులు పరిష్కార మైనట్లు డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 4961 సైబర్ మోసాల కేసులు కాగా, మిగిలినవి 1,78,221 ఉన్న ట్లు వివరించారు. అత్యధికంగా కేసులు పరిష్కారమైన ఐదు కమిషనరేట్లలో హైదరాబాద్ (32,740 కేసులు), సైబరాబాద్ (22,213 కేసులు), రాచకొండ (16,969 కేసులు), రామగుండం (12,899 కేసులు), సూర్యాపేట (12,087 కేసులు) ఉన్న ట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులకు సైతం జాతీయ లోక్ అదాలత్‌లో భారీ ఊరట లభించింది. సైబర్ మోసాలకు సంబంధించిన 4,961 కేసులలో.. బాధితులకు వారు పోగొట్టుకున్న సొమ్ములో రూ.43.31 కోట్లు రీఫండ్ చేయించినట్లు డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. అత్యధికంగా పరిష్కారమైన సైబర్ కేసుల్లో సైబరాబాద్ (1,331 కేసులు), రాచకొండ (747 కేసులు), హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ (510 కేసులు), టీజీసీఎస్‌బీ (116 కేసులు), నిజామాబాద్ (250) ఉన్నట్టు తెలిపారు. కాగా, దీనికి ముందు 2024 డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,893 మంది సైబర్ బాధితులకు రూ.33.2 కోట్లు రీఫండ్ చేయించగా.. ఈసారి ఆ మొత్తం పెరిగిందని డీజీపీ తెలిపారు.

15న జాతీయ న్యాయ నిపుణుల సదస్సు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ నెల15న జాతీయ న్యాయ నిపుణుల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి హాజరుకానున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, హైకోర్టు మాజీ సీజే జస్టిస్ వి. ఈశ్వరయ్య తదితరులు అతిథులుగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, న్యాయవాదులు, లా కళాశాల ప్రొఫెసర్లు, ఇతరులు కూడా పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23001234 లేదా 9396523411 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఏపీ ఎస్‌ఆర్‌ఎం-కార్నెజీమెలన్ మధ్య అవగాహన

- కృత్రిమ మేధ అభివృద్ధి, విజ్ఞానాత్మక బోధనలో పరస్పర సహకారం



అమరావతి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కార్నెజీ మెలన్ యూనివర్సిటీ (యూఎస్‌ఏ), ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీల మధ్య విజ్ఞానా త్మక విద్యాబోధన, సంయుక్త పరిశోధనలతో కూడిన అవగాహన కుదిరింది. కార్నెజీ మెలన్ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ కంప్యూ టర్ సైన్స్‌కు విశ్వవ్యాప్తంగా కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ పరిశోధనల్లో ఎంతో పేరుంది. ఇటువంటి ప్రతిష్టాత్మక యూనివర్సిటీ సహ కారాన్ని పొందడం అవసరమని భావించిన ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ విద్యాబోధన, పరిశోధన రంగాల్లో సమగ్రమైన అవగాహన కుదుర్చు కుంది. దీనివల్ల కార్నెజీ మెలన్ యూనివర్సిటీ లోని కంప్యూటర్ సైన్స్ ఫ్యాకల్టీ, పరిశోధకుల తో నేరుగా కలిసి పనిచేసే అవకాశం ఎస్‌ఆర్‌ఎంకు లభిస్తుందని ఎస్‌ఆర్‌ఎం ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్ పేర్కొన్నారు. ఈ సహకారం ఎస్‌ఆర్‌ఎంలో అధునాతన ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లను స్థాపించడానికి కూడా మార్గం సుగమం చేస్తుందన్నారు. కార్నెజీ మెలన్ యూనివర్సిటీ సహకారం కృత్రిమ మేధ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో కీలక మైలురాయిగా మారుతుందని వైస్ చాన్స్‌లర్ ఆచార్య మనోజ్‌కుమార్ ఆరోదా పేర్కొన్నారు.

కన్నవారు మందలించారని..

- ఇద్దరు టెన్త్ విద్యార్థుల బలవన్మరణం



విజయేందర్‌రెడ్డి



మమత

వర్గల్(గజ్వేల్)/బొంరాస్‌పేట: వేర్వేరు జిల్లాల్లో ఇద్దరు టెన్త్ విద్యార్థులు.. తల్లి మందలించిందని ఒకరు.. తండ్రి మందలించాడని మరొకరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్తకు చెందిన మర్కంటి గోపాల్‌రెడ్డి, కనకవ్వ దంపతుల కుమారుడు విజయేందర్‌రెడ్డి (16) చౌదరిపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం కనకవ్వ వ్యవసాయ పొలం పనిలో ఉండగా.. కొడుకు విజయేందర్ రెడ్డి అక్కడికి వచ్చాడు. దీంతో పరీక్షల వేళ చదవకుండా ఎందుకు తిరుగుతున్నావని మందలించింది. దీంతో అతను మనస్తాపానికి గురై పొలంలోని పురుగు మందు తాగాడు. తల్లి గమనించి ఇరుగు పొరుగు వారితో కలిసి కొడుకును గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం మహంతీపూర్ గ్రామానికి చెందిన తిరుపతి లాలప్ప, అనిత దంపతులకు మమత (15), కార్తీక్ సంతానం. మమత పదో తరగతి చదువుతోంది. లాలప్ప గొర్రెల పోషణతో జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం మధ్యాహ్నం లాలప్ప.. కాసేపు గొర్రె లు మేపాలని కూతురికి చెప్పగా నిరాకరించింది. దీంతో మమతను తండ్రి మందలించగా, మనస్తాపానికి గురైన ఇంటికి వచ్చి ఉరేసుకుంది. తల్లిదండ్రులు వెంటనే కుమార్తెను తాండూరు ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్ప టికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదివారం మమత అంత్యక్రియలు నిర్వహించారు.

ఉడ్‌తా కేరళ!



మత్తులో తూగుతున్న అందాల రాష్ట్రం ● విపరీతంగా పెరుగుతున్న డ్రగ్స్ వాడకం

పంజాబ్ దాటి దేశంలోనే అగ్ర స్థానానికి ● స్కూలు పిల్లల్లోనూ పెరుగుతున్న వ్యసనం

అందమైన అడవులు, కొండలు, లోయలతో దేవుడు తీరిగ్గా తీర్చిదిద్దినట్టుగా ఉండే కేరళ మాదకద్రవ్యాల మత్తులో కూరుకుపోతోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ భూతం కబళిస్తోంది. చివరికి స్కూలు విద్యార్థులు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్న పరిస్థితి! మాదకద్రవ్యాల వాడకంలో పంజాబ్‌ను కూడా దాటేసి దేశంలో తొలి స్థానంలో నిలిచింది. కేరళలోని కడక్కవూర్‌లో ఓ మహిళ డ్రగ్స్ మత్తులో టీనేజీ వయసున్న కన్న కొడుకుపైనే లైంగిక దాడులకు పాల్పడింది. దాంతో సహించలేక మరో కొడుకు ఆమెను చంపేశాడు! సంచలనం రేపిన ఈ ఘటన రాష్ట్రంలో సింథటిక్ డ్రగ్స్ విజృంభణకు ఉదాహరణ మాత్రమే.

> "అత్యధిక అక్షరాస్యతా రేటు, ఉన్నత విద్యార్హతలున్నా ఉపాధి లేక కేరళలో యువత నైరాశ్యంతో డ్రగ్స్ బారిన పడుతోంది"
>
> - ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) ఆసియా-పసిఫిక్ రీజియన్ మాజీ సలహాదారు జి.ప్రమోద్‌కుమార్

కేరళలో ఏ మూలన చూసినా డ్రగ్స్ ఘాటు గుప్పున కొడుతోందని నార్కోటిక్ గణాంకాలు చెబుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం,1985 కింద ఏకంగా 24,517 కేసులు నమోదయ్యాయి. డ్రగ్స్ అతి వాడకానికి మారుపేరుగా మారిన పంజాబ్‌లో నమోదైంది 9,734 కేసులే! ''సింథటిక్ డ్రగ్స్ రాష్ట్రంలోకి అడుగుపెట్టకుండా కఠిన చట్టాలు చేయాల్సిన సమయమొచ్చింది. స్కూళ్ల ప్రాంగణాల్లోనూ డ్రగ్స్ బయటపడుతున్నాయి'' అని కేరళ హైకోర్టు జస్టిస్ వీజీ అరుణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

330 శాతం అధికం

2021 నుంచి చూస్తే మూడేళ్లలో కేరళలో డ్రగ్స్ కేసులు 330 శాతం పెరిగాయి. నమోదవని ఘటనలు మరెన్నో రెట్లు ఉంటాయని చెబుతున్నారు. రాష్ట్రంలో తరచూ భారీ పరిమాణంలో మత్తుపదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. గతంలో స్థానికంగా దొరికే గంజాయి సేవించేవారు. ఇప్పుడు సింథటిక్ డ్రగ్స్ వైపు మళ్లుతున్నారని స్వయంగా హైకోర్టు న్యాయమూర్తే వాపోయారు. దీనిపై అసెంబ్లీలో రెండుసార్లు చర్చించడమే గాక సమస్య పార్లమెంటులోనూ ప్రస్తావనకు వచ్చింది.

> టీనేజర్లనే డ్రగ్స్ పెడ్లర్లుగా ఈ ముఠాలు వాడుకుంటున్నాయి. పోకిరీలతో పరిచయాలు కాకుండా తల్లిదండ్రులే తమ పిల్లలపై కన్నేసి ఉంచాలి
>
> - రిటైర్డ్ ఎస్పీ కేజీ సిమాన్

ఎన్నెన్ని విషాదాలో...!

డ్రగ్స్‌కు బానిసలైన వారి కుటుంబాల్లో ఆనందం ఆవిరవుతోంది. యువత, ముఖ్యంగా మైనర్లు మత్తులో తూగుతున్నారు..

- కాలికట్ జిల్లాలో మత్తుకు బానిసైన పాతికేళ్ల ఆశిఖ్ తన తల్లినే నరికి చంపాడు. పైగా 'నాకు జన్మనిచ్చినందుకు శిక్షించా' అంటూ డ్రగ్స్ మత్తులో చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్‌గా మారింది.
- త్రిసూర్‌లో మరో పాతికేళ్ల వ్యక్తి తల్లి నాలుక కోసేశాడు. జనవరి 1న త్రిసూర్‌లోనే 14, 16 ఏళ్ల టీనేజర్లు బహిరంగంగా డ్రగ్స్ తీసుకుంటూ హల్‌చల్ చేశారు. వారించిన 30 ఏళ్ల వ్యక్తిని అత్యంత దారుణంగా చంపేశారు.
- తమ అబ్బాయి డ్రగ్స్ వ్యసనాన్ని వదిలించలేకపోతున్నామంటూ పథినంతిట్ట జిల్లాలో ఒక వృద్ధ జంట ఆత్మహత్య చేసుకోవడం అందర్నీ కంటతడి పెట్టించింది.
- డ్రగ్స్ మానేయమన్న అక్క ముఖాన్ని బ్లేడుతో చెక్కేశాడో తమ్ముడు. మరో ప్రబుద్ధుడు మందలించిన తండ్రిపైనే దాడికి దిగాడు. ఇంకొకడు డ్రగ్స్ కొనేందుకు డబ్బివ్వలేదని తల్లినే చితకబాదాడు.
- డ్రగ్స్ తీసుకుంటూ టీచర్లకు పట్టుబడి, విషయం ఇంట్లో చెప్పొద్దని వాళ్లనే బెదిరిస్తున్న విద్యార్థులకు కొదవే లేదు.

> కేరళలో పదేళ్ల విద్యార్థులు కూడా గ్యాంగ్ ఫైట్లకు దిగుతున్నారు. కనీసం 10 నుంచి 15 క్రిమినల్ కేసులున్న విద్యార్థి నాయకులను ఆదర్శంగా తీసుకుంటున్నారు
>
> 
>
> - కేరళ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

క్యాండీలు, ఐస్‌క్రీంల రూపంలో...

సింథటిక్ డ్రగ్స్ వాడేవారిలో సమాజంలోని అన్నివర్గాల వారూ ఉన్నారు. విద్యార్థుల నుంచి వైద్యుల దాకా వాటికి బానిసలవుతున్నారు. ఎవరూ గుర్తు పట్టకుండా చాక్లెట్ల నుంచి ఐస్‌క్రీంల దాకా నానారకాలుగా వీటిని విక్రయిస్తున్నారు. పైగా వీటికి విద్యాసంస్థలే అడ్డాలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దాంతో తల్లిదండ్రులు భయంతో వణికిపోతున్నారు. తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారేమో తేల్చుకోవడానికి టెస్ట్ కిట్లు కొనుగోలు చేస్తున్నారు. దాంతో వాటి అమ్మకాలు విపరీతంగా పెరిగాయి.

సూపర్‌బైక్‌లపై డెలివరీ...

స్మార్ట్ ఫోన్‌లో, వాట్సాప్ గ్రూప్‌లోనూ మెసేజ్ చేస్తే పావు గంటలోపే సూపర్ బైక్‌లపై వచ్చి మరీ డ్రగ్స్ డెలివరీ చేసే స్థాయికి కేరళ ఎదిగిందని అసెంబ్లీలో విపక్ష నేత ఇటీవలే ఎద్దేవా చేశారు. పెడ్లర్లు డ్రగ్స్ సరఫరాకు తప్పుడు/నకిలీ నంబర్ ప్లేట్లున్న సూపర్‌బైక్‌లను వాడుతున్నారు. పోలీసులకు చిక్కకుండా వాటిపై మెరుపు వేగంతో దూసుకెళ్తున్నారు. తోటి పెడ్లర్ల పోటీని తట్టుకునేందుకు, వేగంగా సరకు డెలివరీకి రాత్రిళ్లు ఈ బైక్‌లను వాడుతున్నట్టు ఎక్సయిజ్, పోలీసు విభాగాలు చెబుతున్నాయి. డ్రగ్స్ ముఠాలు 18-24 ఏళ్ల వారినే డెలివరీకి ఎంచుకుంటున్నారు. ఒక ప్యాకెట్‌కు రూ.1,000, రోజంతా డెలివరీ చేస్తే రూ.4,000 ఇస్తున్నారు. ఫ్యామిలీ అని భ్రమింపజేసేలా బైక్ వెనక మహిళను కూర్చోబెట్టుకుంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డార్క్‌వెబ్, క్రిప్టోకరెన్సీలో లావాదేవీలు

డ్రగ్స్‌ను ముఠాలు పోలీసులకు చిక్కకుండా అత్యాధునిక సాంకేతికతను వాడుతున్నాయి. డార్క్‌వెబ్, క్రిప్టోకరెన్సీ, వాట్సాప్ గ్రూప్‌ల్లో లావాదేవీలు సాగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. కేరళలో డ్రగ్ సరఫరా చేసే హాట్‌స్పాట్లు ఏకంగా 1,300కు పైగా ఉన్నట్లు చెబుతున్నారు. కొకైన్, హషిష్, బ్రౌన్ షుగర్, హెరాయిన్ వాడకం ఎక్కువగానే ఉన్నా మిథిలిన్ డైఆక్సీ మిథాఫెటమైన్ (ఎండీఎంఏ) వీటన్నింటినీ మించిపోయింది. దీని వాడకం ఏడాదిలోనే ఏకంగా 65 శాతం పెరిగింది. ఎండీఎంఏ, మెథ్ వేరియంట్ డ్రగ్స్ బెంగళూరు, చెన్నై నుంచి కేరళలోకి వస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. 590 కిలోమీటర్ల సముద్రతీరం కూడా డ్రగ్స్ సరఫరాకు రాచమార్గంగా మారింది. జర్మనీ, ఫ్రాన్స్, థాయిలాండ్ దేశాల నుంచి డార్క్‌వెబ్ ద్వారా క్రిప్టోకరెన్సీని విక్రయించి బదులుగా కొరియర్ల ద్వారా డ్రగ్స్ తెప్పిస్తున్నారు.

నాలుగేళ్లలో 93,599 అరెస్టులు!

కేరళలో 2023లో ఏకంగా 30,697, 2024లో 24,517 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. గత నాలుగేళ్లలో 87,101 కేసులు నమోదయ్యాయి. వీటిలో 93,599 మందిని అరెస్టు చేశారు. అంతకుముందు నాలుగేళ్లలో 37,228 కేసులు నమోదవగా 41,378 మందిని అరెస్టు చేసినట్టు సీఎం విజయన్ అసెంబ్లీలో చెప్పారు. గత జనవరిలో 2,000 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి.

ఇస్రోకు మరో రెండు లాంచ్ ప్యాడ్లు

ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో నిర్మాణం ● వచ్చే రెండేళ్లలో అందుబాటులోకి



న్యూఢిల్లీ: వినూత్నమైన అంతరిక్ష ప్రయోగాల్లో దూసుకెళ్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన శక్తి సామర్థ్యాలను మరింత పెంచుకునే ప్రయత్నాల్లో భాగంగా మరో రెండు నూతన లాంచ్‌ప్యాడ్లను సమకూర్చుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో, తమిళనాడులోని కులశేఖరపట్నంలో వీటిని నిర్మిస్తున్నట్టు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. వీటిని రెండేళ్లలో అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటిద్వారా అత్యాధునిక రాకెట్లను నింగిలోకి పంపనున్నారు. కొత్త లాంచ్‌పాడ్‌లతో ఇస్రో రాకెట్ ప్రయోగ సామర్థ్యం మరింత ఇనుమడించనుందని చైర్మన్ అన్నారు. చంద్రయాన్-4కు సంబంధించి ఆయన కీలక ప్రకటన చేశారు. 2028లో ప్రయోగం చేపట్టనున్నట్లు తెలిపారు. చంద్రయాన్-3 ఉపగ్రహం మొత్తం బరువు 4,000 కిలోలు కాగా చంద్రయాన్-4 9,200 కిలోలుంటుందని వెల్లడించారు. చందమామపైకి చేరుకొని, అక్కడి నమూనాలను సేకరించి విజయవంతంగా రావడం చంద్రయాన్-4 మిషన్ లక్ష్యం. చంద్రుడిపై మన ప్రయోగాల్లో ఇది కీలక మలుపు కానుందని చెబుతున్నారు.

మహిళా సైంటిస్టులకు ప్రాధాన్యం

అంతరిక్ష ప్రయోగాల్లో పురుషులతో సమానంగా మహిళా సైంటిస్టులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు నారాయణన్ పేర్కొన్నారు. చంద్రయాన్, మార్స్ ఆర్బిటార్ మిషన్ ప్రయోగాల్లో మహిళలది కీలక పాత్ర అని ప్రశంసించారు. అమెరికా, భారత్ ఉమ్మడిగా 'నిసార్' శాటిలైట్‌ను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. దాన్ని జీఎస్ఎల్‌వీ మార్క్-2 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు తెలియజేశారు. పర్యావరణ మార్పులపై అధ్యయనానికి ఈ ఉపగ్రహం తోడ్పడుతుందన్నారు. వాతావరణ పరిస్థితులపై అధ్యయనానికి జీ-20 శాటిలైట్ రూపకల్పనలో ఇస్రో నిమగ్నమైంది. ఇందులో 40 శాతం పేలోడ్లు దేశీయంగా అభివృద్ధి చేసినవే కావడం విశేషం. భారత తయారీ రాకెట్లతో ఇప్పటిదాకా 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను ప్రయోగించినట్టు వి.నారాయణన్ వెల్లడించారు. ఇందులో 90 శాతం ప్రయోగాలు గత పదేళ్లలోనే జరిగాయన్నారు.

వైట్‌హౌస్ వద్ద... సాయుధుడి కాల్చివేత

ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ వైట్‌హౌస్ లేరు: అధికారులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ వద్ద ఆదివారం కాల్పుల ఘటన కలకలం రేపింది. జరిగింది. ఓ అనుమానాస్పద వ్యక్తి ఇండియానా ప్రాంతం నుంచి కారులో వాషింగ్టన్‌కు వచ్చాడంటూ అధ్యక్షుడి భద్రతా వ్యవహారాలు చూసుకునే సీక్రెట్ సర్వీస్‌కు పోలీసు విభాగం నుంచి సమాచారం అందింది. దాంతో ఆ పోలికలున్న వ్యక్తి కోసం సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అధ్యక్ష భవనం పరిసరాలన్నీ గాలించారు. చివరికి అతడు ఓ కారులో ఉన్నట్లు గుర్తించారు. దగ్గరకు వెళ్లిన అధికారులను తుపాకీ చూపి బెదిరించాడు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో అతడు గాయపడ్డాడు. ''తర్వాత అతన్ని ఆస్పత్రికి తరలించాం. అతడి పరిస్థితేమిటో తెలియదు'' అని సీక్రెట్ సర్వీస్ పేర్కొంది. ఘటన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్లోరిడాలో ఉన్నట్టు ని వివరించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీస్ విభాగం తెలిపింది.

ఎయిమ్స్‌లో ఉపరాష్ట్రపతి



- ఛాతీ నొప్పికి చికిత్స
- ప్రధాని పరామర్శ

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ (73) ఆదివారం ఛాతీలో నొప్పితో ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. అర్ధరాత్రి దాటాక 2 గంటల సమయంలో ఒంట్లో అసౌకర్యంగా ఉందని చెప్పడంతో హుటాహుటిన ఎయిమ్స్‌లోని క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో చేర్చారు. డాక్టర్ రాజీవ్ నారంగ్ సారథ్యంలోని నిపుణుల బృందం ధన్‌ఖడ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ అనంతరం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా ఎయిమ్స్‌కు వెళ్లి ధన్‌ఖడ్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

చైనా నుంచి మనూస్ ఏఐ

నూతన కృత్రిమ మేధ మోడల్ ఆవిష్కరణ



బీజింగ్: కొన్ని రోజుల క్రితం 'డీప్‌సీక్'కృత్రిమ మేధ(ఏఐ) మోడల్‌ను తీసుకొచ్చి ప్రపంచ టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించిన డ్రాగన్ దేశం చైనా మరో సంచలనానికి తెరతీసింది. 'మనూస్'పేరిట మరో కృత్రిమ మేధ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే వాడుకలో ఉన్న అగ్రశ్రేణి ఏఐ వేదికలకు దీటుగా మనూస్‌ను రూపొందించారు. చైనాకు చెందిన స్టార్టప్ కంపెనీ 'మొనికా'ఈ మనూస్‌ను అభివృద్ధి చేసింది. 'ఆలోచనలు, చర్యలకు మధ్య వారధిగా పని చేస్తుంది. ఇది కేవలం ఆలోచించడమే కాదు, ఫలితాలు సాధించి చూపుతుంది''అని మొనికా కంపెనీ వెల్లడించింది. ఈ నూతన ఏఐ ఏజెంట్ వినియోగదారులకు చక్కటి అనుభూతి ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తెలియజేసింది. కొత్త వెబ్‌సైట్లను రూపొందించడం నుంచి విహార యాత్రలకు ప్లానింగ్ చేయడం దాకా ఎన్నో రకాల పనులను మనూస్ చక్కబెడుతుంది. స్టాక్ మార్కెట్‌ను విశ్లేషించడంలో బహు నేర్పరి. కేవలం ఒక ఆదేశం ఇచ్చేస్తే చాలు మనకు కావాల్సిన పనులు పూర్తిచేస్తుంది. మనూస్ తనంతట తాను ఆలోచించుకోగలదు. ప్లాన్ చేసుకొని దాన్ని అమలు చేయగలదు. స్వయం చాలితం అని చెప్పొచ్చు. మనూస్‌ను ఈ నెల 6వ తేదీన ఆవిష్కరించారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.

ఏమిటీ మనూస్?

ఇదొక జనరల్ ఏఐ ఏజెంట్. వేర్వేరు రంగాలకు సంబంధించి సంక్లిష్టమైన, రియల్-వరల్డ్ పనులు పూర్తిచేయగలదు. సాధారణ ఏఐ చాట్‌బాట్స్ తరహాలో కాకుండా విభిన్నంగా పనిచేస్తుంది. ఇది పూర్తిస్థాయి అటనామిస్ సిస్టమ్. ప్రణాళిక, కార్యాచరణ, ఫలితాలు... అనే శ్రేణిలో పనిచేయగల సామర్థ్యం దీని సొంతం. ఉదాహరణకు గ్లోబల్ వార్మింగ్‌పై ఒక నివేదిక తయారు చేసి ఇవ్వాలని సూచించామనుకోండి. ఆ అంశంపై మనూస్ తనంతట తానే పరిశోధన సాగిస్తుంది. పేపర్‌పై నివేదికను సిద్ధం చేసి మనకు అందజేస్తుంది.

సిరియాలో రెండు రోజుల్లో... వెయ్యి మంది మృతి!

ప్రతీకార హత్యలంటున్న హక్కుల సంఘాలు

బీరుట్: సిరియాలో భద్రతా బలగాలకు, పదవీచ్యుత అధ్యక్షుడు బషర్ అసద్ విధేయులకు మధ్య రెండు రోజులపాటు జరిగిన ఘర్షణల్లో కనీసం వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారు. ''మృతుల్లో 745 మంది పౌరులే. 124 మంది ప్రభుత్వ భద్రతా సిబ్బంది, 148 మంది అసద్ ముఠాల సభ్యులున్నారు'' అని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ తెలిపింది. అసద్ అలావైట్ మైనారిటీ వర్గ నేత. గురువారం భద్రతా బలగాలు ఆ వర్గానికి చెందిన ఓ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించిన క్రమంలో మొదలైన దాడులు దేశమంతా విస్తరించాయి.

గాజాకు కరెంటు కట్

డెయిర్ అల్-బలాహ్(గాజా): గాజాకు ఇప్పటికే మానవతా సాయాన్ని అడ్డుకున్న ఇజ్రాయెల్ తాజాగా కరెంటు సరఫరాను కూడా పూర్తిగా నిలిపేసింది. ఆదివారం ఈ మేరకు ప్రకటించింది. దాంతో రంజాన్ మాసంలో గాజావాసుల ఇక్కట్లు రెట్టింపు కానున్నాయి. అయితే హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశ చర్చలకు మాత్రం తాము సిద్ధమని ఇజ్రాయెల్ ప్రకటించడం విశేషం.

స్వామి నారాయణ్ ఆలయంపై... విద్వేష దాడి

అమెరికాలో ఖలిస్తానీల దుశ్చర్య!

- గోడలపై భారత వ్యతిరేక రాతలు
- తీవ్రంగా ఖండించిన హిందూ సంఘాలు
- ఆలయాన్ని అపవిత్రం చేశారు: బీఏపీఎస్

న్యూయార్క్/న్యూఢిల్లీ: అమెరికాలో హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని దుండగులు రెచ్చిపోతున్నారు. కాలిఫోర్నియా రాష్ట్రంలో శాన్ బెర్నార్డినో కౌంటీలో ఉన్న చినో హిల్స్‌లోని ప్రఖ్యాత స్వామి నారాయణ్ మందిరంపై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి తెగబడ్డారు. ఆలయ గోడలపై భారత వ్యతిరేక రాతలు రాశారు. గ్రాఫిటీ రాతలతో అందవిహీనంగా మార్చే ప్రయత్నం చేశారు. ఇది ఖలిస్తానీల పనేనని భావిస్తున్నారు. చినో హిల్స్ లాస్ ఏంజెలెస్ కౌంటీకి సరిహద్దులోనే ఉంది. ఆలయాన్ని అపవిత్రం చేశారని బోచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఆవేదన వెలిబుచ్చింది. ''ఆలయాలపై విద్వేషాన్ని హిందూ సమాజం గట్టిగా వ్యతిరేకిస్తోంది. ఈ విద్వేషాల వ్యాప్తిని చినో హిల్స్, దక్షిణ కాలిఫోర్నియాలోని హిందువులు కలసికట్టుగా అడ్డుకుంటారు'' అని 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఈ ఘటనపై హిందూ అమెరికన్ ఫౌండేషన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి దుండగులను కఠినంగా శిక్షించాలని ఎఫ్‌బీఐని, దాని డైరెక్టర్ కాశ్ పటేల్‌ను కోరింది. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అమెరికా ప్రభుత్వానికి కోవలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా (కోహ్నా) విజ్ఞప్తి చేసింది. ''అమెరికాలో హిందువులపై ద్వేషభావం లేదని మీడియా, మేధావులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. లాస్ ఏంజెలెస్‌లో ఖలిస్తాన్ రెఫరెండం పేరిట కొందరు డ్రామాలుడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో స్వామి నారాయణ్‌పై ఆలయంపై దాడి ఆశ్చర్యం కలిగించలేదు'' అని పేర్కొంది. కొన్నేళ్లలో అమెరికాలో 10 హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని ఆవేదన వెలిబుచ్చింది. గతేడాది కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో, న్యూయార్క్‌లోని మెల్‌వీల్లేలో ఆలయాలపై దాడులు జరిగాయి. 'హిందూస్ గో బ్యాక్' అంటూ ఆలయాల గోడలపై రాతలు రాశారు.



ఆలయ గోడపై రాసిన విద్వేష రాతలు

భారత్ ఖండన

స్వామి నారాయణ్ ఆలయంపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఆదివారం డిమాండ్ చేశారు. అమెరికాలోని హిందూ దేవాలయాలకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. స్వామి నారాయణ్ ఆలయాన్ని అపవిత్రం చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆలయాలపై అసహనం, విద్వేష చర్యలు అంగీకారయోగ్యం కాదని పేర్కొంది. దుండగులపై అమెరికా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. దాడిని యోగా గురు రాందేవ్ ఖండించారు.

పాత ఒప్పందాల ప్రకారమే!

టారిఫ్‌ల తగ్గింపుపై భారత్ ● ట్రంప్ ఒత్తిడేమీ లేదని వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌ల తగ్గింపు వెనుక ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి లేదని భారత్ స్పష్టం చేసింది. అమెరికాతో ఇప్పటికే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారమే సుంకాలు తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ''ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా సంపన్న దేశాలతో వాణిజ్య బంధాలను బలోపేతం చేసుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగానే అమెరికా ఉత్పత్తులపై సుంకాలను క్రమంగా తగ్గిస్తున్నాం'' అని పేర్కొన్నాయి. భారత్ సహా పలు దేశాల ఉత్పత్తులపై ఏప్రిల్ 2 నుంచి పరస్పర సుంకాలు తప్పవని ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. వ్యవసాయోత్పత్తులు మినహా మిగతా వాటన్నింటిపైనా సుంకాలు రద్దు చేయాలని భారత్‌ను అమెరికా కోరినట్లు తెలుస్తోంది. దీనికి భారత్ అంగీకరించడం లేదని సమాచారం.

వర్క్-లైఫ్ బ్యాలెన్స్ కావాలి

బెంగళూరులో టెకీల నిరసనలు



బెంగళూరు: ఏసీ గదుల్లో చెమటోడ్చే ఐటీ నిపుణులు మండుటెండలో నినాదాలు చేశారు. ఇందుకు కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికైంది. ఐటీ రంగంలో పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య ఆరోగ్యవంతమైన సమతుల్యత కావాలని డిమాండ్ చేస్తూ ఐటీ ఉద్యోగులు ఆదివారం బెంగళూరులోని ఫ్రీడం పార్క్‌లో ఆందోళనకు దిగారు. కర్ణాటక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనెబుల్డ్ సర్వీసెస్ ఎంప్లాయీస్ యూనియన్ (కేటీయూ) పిలుపు మేరకు వారు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. ఐటీ ఉద్యోగులు వారానికి ఇప్పుడు చేస్తున్న పనిగంటలు చాలవని, ఇంకా ఎక్కువ పని చేయాలని ఇన్ఫోసిస్ గౌరవ చైర్మన్ నారాయణమూర్తి, ఎల్ అండ్ టీ చైర్మన్, ఎండీ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు ఇటీవల కలకలం రేపడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వర్క్-లైఫ్ బ్యాలెన్స్ కోసం ఐటీ ఉద్యోగులు నిరసన బాట ప్రాధాన్యం సంతరించుకుంది.

రెండో విడత బడ్జెట్ సమావేశాలు నేటి నుంచే

వక్ఫ్ బిల్లుకు ఆమోదం!

- మణిపూర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న మంత్రి
- కీలకాంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విపక్షాలు రెడీ

సాక్షి, న్యూఢిల్లీ/చెన్నై: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఇవి ఏప్రిల్ 4వ తేదీ దాకా కొనసాగుతాయి. పలు శాఖలకు గ్రాంట్లు, డిమాండ్లకు అమో దం, మణిపూర్ బడ్జెట్ ఆమోదం, అత్యంత కీలకమైన వక్ఫ్ (సవరణ) బిల్లును ఆమోదంపై ఈ సమావేశాల్లో కేంద్రం దృష్టి సారించనుంది. వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ సంఘం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఇప్పటికే నివేదిక అందజేసింది. దాన్ని వీలైనంత త్వరగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం చిత్తశుద్ధితో ఉన్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు పార్లమెంట్ ఆమోదం కోరుతూ కేంద్రం హోం మంత్రి అమిత్ షా తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. మణిపూర్ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెడతారు.

వాడీవేడిగా...

రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడివేడీగా సాగే అవకాశాలున్నాయి. వక్ఫ్ బిల్లుతో పాటు మణిపూర్ హింసాకాండ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, అమెరికా సుంకాల పెంపు తదితరాలపై మోదీ సర్కారును గట్టిగా నిలదీయాలని విపక్షాలు భావిస్తున్నాయి. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తమకు చేటు చేస్తుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తుండటం తెలిసిందే. 1971 నాటి జనాభా లెక్కల ప్రకారమే పునర్విభజన జరగాలని తమిళనాడు సీఎం స్టాలిన్ డిమాండ్ చేస్తున్నారు. దీన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించాలని డీఎంకే ఎంపీలను ఆయన ఆదివారం ఆదేశించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను, తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దడాన్ని పార్లమెంటులో గట్టిగా వ్యతిరేకించాలని నిర్ణయించారు. ఈ మేరకు రెండు తీర్మానాలను ఆమోదించారు. పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ పార్టీల మద్దతు కూడగట్టాలని డీఎంకే నిర్ణయించింది. ఇక నకిలీ ఎలక్టోరల్ ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్)లపై కేంద్రాన్ని నిలదీయాలని టీఎంసీ నిర్ణయించింది. దీనిపై కలిసి రావాలని కాంగ్రెస్, డీఎంకే, శివసేన (ఉద్ధవ్)లను కోరింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇటీవలి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిందని కాంగ్రెస్ కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తుండటం తెలిసిందే. దీనిపై పార్లమెంట్‌లోనూ గళ మెత్తాలని పార్టీ నిర్ణయించింది.

వివాహ విందుల్లో... ప్లాస్టిక్ బాటిళ్లు వాడొద్దు

కేరళ హైకోర్టు ఆదేశాలు

తిరువనంతపురం: వివాహ విందు వేడుకల్లో చిన్న ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వాడరాదంటూ కేరళ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాదు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వస్తువులను వాడరాదని స్పష్టం చేసింది. పునర్వినియోగ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు కఠిన చర్యలు తప్పవని వ్యాఖ్యానించింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలుపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు ఆదేశాలిచ్చింది. కొండ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని ప్రభుత్వం తెలిపింది. 100 మందికి మించి పాల్గొనే కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకానికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ అనుమతులను స్థానిక యంత్రాంగాలే జారీ చేస్తాయని కోర్టుకు వివరించింది.

ఇక సీతమ్మకు ఆలయం

మిథిలాంచల్‌లో నిర్మాణం: అమిత్ షా



అహ్మదాబాద్: అయోధ్యలో భవ్య రామాలయం మాదిరిగానే బిహార్‌లోని మిథిలాంచల్‌లో సీతమ్మకు ఆలయం నిర్మిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఆదివారం ఆయన అహ్మదాబాద్‌లో 'మిథిల మహోత్సవ్'లో ప్రసంగించారు. గుజరాత్‌లో స్థిరపడ్డ మిథిలాంచల్, బిహార్ వాసులు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నారని కొనియాడారు. అనంతరం గుజరాత్ బార్ అసోసియేషన్‌లో 11 వేల మంది లాయర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుతూ ప్రజలకు న్యాయం దక్కేలా కృషి చేయాలని వారికి సూచించారు.


సాక్షి హైదరాబాద్

సోమవారం । 10 । మార్చి । 2025



వినోదం.. వికాసం

అయనకు మూడో కన్ను ఉంది. అదే తన కెమెరా. ఈ కన్నుతో తాను చూసిన అద్భుతాలు, సామాజిక అంతరాలు వంటి విశేషాంశాలన్నిం టినీ కెమెరాలో బంధిస్తాడు. - సిటీప్లస్‌లో



గరిష్టం/కనిష్టం
37.0/20.0

వాతావరణం


నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

తాగి వాహనం నడిపారు.. ఠాణా మెట్లెక్కారు..

పోలీసులకు చిక్కిన 478 మంది మందుబాబులు

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మందుబాబుల నిషా దింపుతున్నారు. వారాంతాల్లో స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ (డీడీ)లు నిర్వహిస్తున్నారు. శనివారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 478 మంది మందుబాబులు పోలీసులకు చిక్కారు. ఇందులో అత్యధికంగా 388 మంది ద్విచక్ర వాహనదారులే. 17 మంది త్రీవీలర్లు, 70 మంది ఫోర్ వీలర్లు కాగా ముగ్గురు భారీ వాహనదారులు ఉన్నారు. అత్యధికంగా మియాపూర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 101 మంది మందుబాబులు చిక్కగా.. చేవెళ్ల ట్రాఫిక్ ఠాణా పరిధిలో 44 మంది, బాలానగర్ పీఎస్ పరిధిలో 36 మంది పట్టుబడ్డారు. 15 మంది నిషాచరుల రక్తంలో మద్యం మోతాదు (బీఏసీ) 300-500 ఎంజీ మధ్యలో నమోదు కావడం గమనార్హం. ఇక 31-40 ఏళ్ల మధ్య వయసున్న 187 మంది మందుబాబులు అత్యధికంగా పట్టుబడ్డారు.

గోదావరి రెండు, మూడో దశలకు జలమండలి టెండర్లు



సాక్షి, సిటీబ్యూరో: మహా నగర తాగునీటి అవసరాల కోసం మరో 20 టీఎంసీల గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండు, మూడో దశ పనులను హైబ్రీడ్ యాన్యూటీ మోడల్ (హ్యామ్)లో ప్యాకేజీ 1, 2 కింద చేపట్టేందుకు జలమండలి టెండర్లను ఆహ్వానించింది. మొత్తం వ్యయంలో ప్రభుత్వ వాటా 40 శాతం, నిర్మాణ సంస్థ వాటా 60 శాతం భరించనున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి శామీర్‌పేట ఘన్‌పూర్ మీదుగా ఉస్మాన్ సాగర్‌కు రెండు వరుసల భారీ పైపులైన్ నిర్మాణం, 3000 ఎంఎం డయాతో 50 కిలోమీటర్లు, 2,200 ఎంఎం డయాతో 58 కిలోమీటర్ల వరకు పైపులైన్ పనులు, ఘన్‌పూర్ వద్ద సుమారు 1170 ఎంఎల్‌డీల నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందని జలమండలి సూచించింది. అదే విధంగా ఘన్‌పూర్ నుంచి ముత్తంగి జంక్షన్ వరకు సుమారు 40 కిలోమీటర్లు 2400 ఎంఎం పైపులైన్, దాని వెంట 3000 ఎంఎం డయా రింగ్ మెయిన్‌ను కలుపుతూ పైపులైన్ నిర్మాణంతో పాటు ఇతర పనులు, ఉస్మాన్ సాగర్‌లో 120 ఎంఎల్‌డీ, హిమాయత్ సాగర్‌లో 70 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టాలని టెండరు నోటిఫికేషన్‌లో జలమండలి స్పష్టం చేసింది.

పనులు ఆలస్యం.. నీటికి అంతరాయం

- ఎన్‌హెచ్‌ఏఐ తీరుపై జలమండలి ఎండీ అసంతృప్తి
- నీటి సరఫరా పునరుద్ధరణకు మరో వారం పట్టే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర పరిధిలోని బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద తాగునీటి పైపులైన్ మరో చోటికి మార్చే పనులు ఆలస్యం కావడంతో పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కొనసాగుతోంది. 30 గంటలైనా పనులు నత్త నడకన సాగుతుండంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) తీరుపై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. 12 గంటల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొని 30 గంటలు గడిచినా పూర్తి చేయకపోవడం వల్ల నీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. బీహెచ్ఈఎల్ జంక్షన్ వద్ద రోడ్డు పనులు జరిపేందుకు జలమండలి పీఎస్సీ పైపులైన్‌ను వేరే చోటికి మార్చాల్సిన అవసరం ఏర్పడింది. ఈ పనుల బాధ్యతను ఎన్‌హెచ్ఏఐ తీసుకుంది. 12 గంటల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొనడంతో శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ ,కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, మూసాపేట, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, దీప్తిశ్రీ నగర్, బీరంగూడ, అమీన్‌పూర్, నిజాంపేట్, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, కొన్ని చోట్ల లో ప్రెషర్‌తో సరఫరా ఉంటుందని జలమండలి ప్రజలను అప్రమత్తం చేసింది. 30 గంటలు గడుస్తున్నా పైపులైన్‌ను మరో చోటికి మార్చే పనిని ఎన్‌హెచ్ఏఐ పూర్తి చేయలేదు. దీంతో నీటి సరఫరాలో అంతరాయం కొనసాగుతోంది. ఈ పరిస్థితిని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదివారం సమీక్షించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐకి సూచించారు. పనుల ఆలస్యం వల్ల నీటి సరఫరా పూర్తిగా పునరుద్ధరించి, సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు మరో వారం రోజులు పట్టవచ్చని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.





కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో వేలాడే స్క్రీన్‌పై క్రికెట్ మ్యాచ్ చూస్తున్న అభిమానులు

నెక్సస్ మాల్‌లో..





జూబ్లీహిల్స్‌లో భారీ తెరపై వీక్షిస్తూ..

ఉత్కంఠ వీక్షణం

ఉత్కంఠ భరితంగా సాగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం సాధించడంతో నగర క్రికెట్ అభిమానులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు నగరంలోని పలు కాలనీలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, మాళ్లలో పై స్క్రీన్, లైవ్ స్ట్రీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని వారు టీవీలకు అతుక్కుపోయారు. చివరికి ఇండియా గెలుపొందడంతో అభిమానులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండా ప్రదర్శనతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

బాబోయ్ బరాత్!

పెళ్లి ఊరేగింపుల్లో పెరుగుతున్న శబ్ద కాలుష్యం

- అర్ధరాత్రులు సైతం చెవులు అదిరేలా సౌండ్
- ఫంక్షన్ హాళ్ల సమీపంలో పరిస్థితి మరీ దారుణం
- పరీక్షల సీజన్ కావడంతో విద్యార్థులకు నరకం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసు గస్తీ బృందాలు
- ఫిర్యాదు చేసినా ఆశించిన స్థాయిలో స్పందన కరువు

> చిలకలగూడకు చెందిన వర్షిణి ఇంటర్మీడియట్ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. చదువుకునే సమయంలో అర్ధరాత్రి దాటేంతవరకు ఆగకుండా మోగుతున్న డప్పుల చప్పుడుకు ఏకాగ్రత కోల్పోయి, అటు చదువుకు ఇటు నిద్రకు దూరమై.. మరుసటి రోజు పరీక్ష సరిగా రాయలేక పోయింది.
>
> రాత్రి 10 గంటల వరకే..
>
> బ్యాండ్ బరాత్‌లు, ర్యాలీలకు రాత్రి 10 గంటల వరకే పోలీసులు అనుమతి ఇస్తున్నా.. అర్ధరాత్రి దాటేవరకు ఇవి సాగుతున్నాయి. చిలకలగూడ ఠాణా పరిధిలో శబ్ద కాలుష్యంపై డయల్ 100కు మూడుసార్లు ఫిర్యాదు చేయగా ఆలస్యంగా స్పందించారు' అని నామాలగుండుకు చెందిన వెంకట రమణ ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి, సిటీబ్యూరో/చిలకలగూడ: ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల కంటే ఎక్కువగా పెళ్లి బరాత్‌ల టెన్షన్ పట్టుకుంది. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా చదువుకునే అవకాశం ఇవ్వకుండా తీవ్ర శబ్ద కాలుష్యం వెలువడుతుంటమే దీనికి కారణం. దీన్ని అడ్డుకోవాల్సిన పోలీసు విభాగం సైతం పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. డయల్-100కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన ఉండట్లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఎవరి బాధ వారిది..

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు నగర వ్యాప్తంగా బరాత్‌ల హడావుడి కనిపిస్తుంటుంది. పెళ్లి అనేది జీవితంలో ఒక్కసారి మాత్రమే జరిగే వేడుకని, అందరికీ మధుర జ్ఞాపకంగా మిగలడం కోసం ఇలా చేసుకుంటామని నిర్వాహకులు చెబుతుంటారు. హంగులు, ఆర్భాటాల మాట అటుంచితే.. ఊరేగింపులోని డీజేలు, ఇతర శబ్దాలతో పాటు బాణాసంచా తదితరాల వల్ల ఎదుటి వారు ఎదుర్కొనే ఇబ్బందులు వారు పట్టించుకోరనేది బాధితుల మాట. రహదారులకు పక్కన, ఫంక్షన్ హాళ్ల చుట్టుపక్కల నివసించే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. సాధారణ సమయల్లో ఈ ఇబ్బందుల్ని భరిస్తున్నా ప్రస్తుతం పరీక్షల సీజన్ కావడంతో పిల్లల ఏకాగ్రత దెబ్బతింటోందని వాపోతున్నారు.

ఆ ప్రాంతాల్లో నిషేధం ఉన్నా..

పెళ్లి బరాత్ అంటేనే నెమ్మదిగా సాగే సమూహం. ఒకప్పుడు బరాత్‌లు కిలోమీటర్ల మేర సాగేవి. అంతర్గత రహదారుల్లోనే కాకుండా ప్రధాన రహదారుల పైనా గంటల పాటు ఈ ఊరేగింపులు నడిచేవి. వీటి కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ జామ్స్ ఏర్పడిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇలాంటి ఇబ్బందుల్ని పరిగణనలోకి తీసుకున్న నగర పోలీసులు కొన్నేళ్ల క్రితం బరాత్‌లను నిషేధించారు. అయినప్పటికీ.. కాలనీలతో పాటు ఫంక్షన్ హాళ్ల సమీపంలో ఇప్పటికీ నడుస్తున్నాయి. నిర్వాహకులను దృష్టిలో పెట్టుకుంటున్న పోలీసులు వీటిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.



నగరంలో ఓ పెళ్లి బరాత్ దృశ్యం (ఫైల్)

నమయపాలన లేకుండా శబ్దాలు..

దీంతో ఇటీవల కాలంలో బరాత్‌ల హంగామా ఎక్కువైంది. నగరంలో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్య మాత్రమే సౌండ్ సిస్టమ్స్ వాడాలనే నిబంధన ఉంది. రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ శబ్ద కాలుష్యానికి కారణమయ్యే ఎలాంటి సౌండ్లు చేయడానికి వీలు లేదు. ప్రాంతాల వారీగా ఎన్ని డెసిబుల్స్ శబ్ద తీవ్రత ఉండాలనేది నిర్ధారించారు. వీటికి సంబంధించి గతంలో ప్రభుత్వం ఉత్తర్వులతో పాటు సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం ఉన్నాయి. ఈ మేరకు నోటిఫికేషన్లు కూడా జారీ అయ్యాయి. అయినప్పటికీ బరాత్‌ల నిర్వాహకులు వీటిని పట్టించుకోవట్లేదు. పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు వీరివల్ల నరకం చవి చూస్తున్నారు.

పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు..

బరాత్‌ల్లో వెలువడుతున్న శబ్దాల కారణంగా విద్యార్థులు చదువుకోలేకపోవడమే కాదు.. చివరికి కంటి నిండా నిద్రకూ దూరమై తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ ప్రభావం ఫైనల్ పరీక్షలపై ఉంటోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత కూడా నడుస్తున్న బరాత్‌లు, డీజేలపై ఫిర్యాదు చేసినా సరైన స్పందన ఉండట్లేదని వాపోతున్నారు. కఠిన చర్యలు లేని కారణంగా గస్తీ బృందాలు వచ్చినప్పుడు ఆపేస్తున్న నిర్వాహకులు వాళ్లు వెళ్లిన తర్వాత మళ్లీ మొదలెడుతున్నారని ఆరోపిస్తున్నారు. స్థానిక పోలీసులు అవసరమైన పట్టించుకోకపోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పరీక్షల సీజన్‌లో శబ్ద కాలుష్యం లేకుండా చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగరంలో శబ్ద పరిమితులు ఇలా...

ప్రాంతం	పగలు	రాత్రి
పారిశ్రామిక	75	70
వాణిజ్య	65	55
నివాస	55	40
నిశ్శబ్ద	50	40

(శబ్ద పరిమితి డెసిబుల్స్‌లో)

ఇదేం సంస్కారం?

ఈఎస్ఐ శ్మశాన వాటికలో 'ప్యాకేజీ' దోపిడీ

- పేద, మధ్యతరగతి వర్గాలకు భారం
- పట్టించుకోని జీహెచ్ఎంసీ యంత్రాంగం
- ఇంటికి, శ్మశాన వాటికకు కిలోమీటరు దూరం కూడా లేకున్నా అంతిమయాత్ర వాహనానికి రూ.4,000 నుంచి రూ.5,000 వరకు వసూలు చేస్తున్నారు. అంతిమయాత్ర వాహనానికి కట్టెలు, డీజిల్ కలుపుకొని రూ.15,000 పైమాటే. దీనికి తోడు పాడె కట్టడం, పూల దండలు, చిన్నకర్మ నిర్వహణకు రూ.25,000 అవుతుందని తెగేసి చెప్పడం షరామామూలే. ఇక ప్యాకేజీలో పెద్దకర్మ కూడా కలుపుకొంటే రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇది కేవలం సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ప్యాకేజీ మాత్రమే. చనిపోయిన వ్యక్తి ఆర్థికంగా ఒక స్థాయిలో ఉంటే ప్యాకేజీ రేట్లు మరింత పెంచుతారు.

సనత్‌నగర్: శ్మశాన వాటికలపై జీహెచ్ఎంసీ అజమాయిషీ ఉండటం లేదా? అంతిమ సంస్కారాల వేళ ఇష్టమొచ్చిన రీతిలో ప్యాకేజీల పేరుతో దోపిడీ జరుగుతోందా? ఈ ప్రశ్నలకు ఈఎస్ఐ శ్మశాన వాటికలో యథేచ్ఛగా కొనసాగుతున్న దోపిడీ దందాను ఉదాహరణగా చెప్పవచ్చు. ఆప్తులు దూరమై దుఃఖంలో మునిగి ఉన్నవారి అసహాయతను ఇక్కడ కొంతమంది 'క్యాష్' చేసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ వ్యవహారంపై పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ఇష్టానుసారంగా వసూళ్లకు ఎగబడుతున్నారు. నిర్దిష్టమైన ధరలు నిర్ణయించినా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇక్కడ సప'రేటు'

ఈఎస్ఐ శ్మశాన వాటికలో దహన సంస్కారాల ప్యాకేజీ చూస్తే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. కాటి కాపరి దగ్గరి నుంచి పంతులు వరకు ప్యాకేజీ మాట్లాడుకోవాల్సిందే. దహన సంస్కారాలకు అవసరమయ్యే సరంజామాను తెచ్చుకుంటే ఒక రేటు.. ఇంటి దగ్గర పాడె కట్టే దగ్గర నుంచి అంతిమయాత్ర వాహనం, దానికి అలంకరణ, పూల దండలు, అందులో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించి దహన సంస్కారాలు పూర్తి చేసే వరకు మరో రేటు. ప్యాకేజీల పేరుతో చనిపోయిన వారి కుటుంబాలపై మరింత ఆర్థిక భారాన్ని మోపుతున్నారు.

సిండికేటుగా ఏర్పడి..

దహన సంస్కారాలతో ముడి పడి ఉన్న ప్రతిఒక్కరూ సిండికేట్‌గా ఏర్పడి ప్యాకేజీలను కొనసాగిస్తున్నారు. వాస్తవానికి నగరంలో దహన సంస్కారాలకు అవసరమయ్యే కట్టెలు, డీజిల్ తదితర అవసరమైన సామగ్రిని తెచ్చుకునేందుకు వీలు కాని వారి పరిస్థితిని అదనుగా చేసుకుని ప్యాకేజీల రూపంలో దండుకుంటున్నారు. తమ మనిషి చనిపోయి బాధలో ఉన్నవారికి మరింత బాధ కలిగించేలా దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్మశాన వాటికలపై జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు ఉన్నాయి. ప్యాకేజీల పేరుతో దోపిడీ చేస్తున్నా అధికారులకు పట్టించుకోకపోవడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.9 వేల కంటే ఎక్కువ తీసుకోవద్దు..

దహన సంస్కారాలకు రూ.9 వేలు నిర్ణయించాం. ఇంతకంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ తీసుకోవద్దు. ఈ ప్రక్రియలో ప్యాకేజీ అనే పదం వినిపించకూడదు. నిర్ణీత దూరం వరకు అంతిమ యాత్ర వాహన సౌకర్యం కూడా ఉంటుంది. పూజా కార్యక్రమాలకు సంబంధించి వేరే మాట్లాడుకోవాల్సి ఉంటుంది. - కొలను బాల్‌రెడ్డి, శ్మశాన వాటిక కమిటీ సభ్యుడు



ఈఎస్ఐ శ్మశాన వాటిక

తీసివేతలకు తిప్పలే!

- రేషన్ కార్డుల్లో సభ్యుల తొలగింపునకు దరఖాస్తుల తాకిడి
- పేర్లు తీసివేస్తేనే కొత్త అర్జీలకు అవకాశం
- గ్రేటర్ పరిధిలో డిలిషన్ ప్రక్రియలో సైతం నిర్లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: కొత్త రేషన్ కార్డు మంజూరు మాటేమో గానీ.. పాత కార్డులోని పేర్ల తొలగింపు ప్రక్రియకు సైతం తిప్పలు తప్పడం లేదు. వివాహ బంధాలతో కొత్తగా ఏర్పాటైన కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. తల్లిదండ్రుల కుటుంబ కార్డుల్లో పేర్లు రద్దయితే కానీ, కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కుటుంబం రేషన్ కార్డుల నుంచి తమ పేర్లను తొలిగించుకునేందుకు ఉరుకులు పరుగులు చేస్తున్నారు. మీ సేవ, పౌర సరఫరాల సర్కిల్, తహసీల్ ఆఫీసుల్లో ఆఫ్‌లైన్ దరఖాస్తులు సమర్పించి మెంబర్ డిలిషన్ కోసం రెండు మూడుసార్లు చక్కర్లు చేయక తప్పడం లేదు. సంబంధిత సిబ్బంది సైతం సిఫార్సు దరఖాస్తులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ.. మిగతా వాటిని పెండింగ్‌లో పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



లక్షన్నరకు పైగా దరఖాస్తులు

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో సుమారు రేషన్ కార్డుల్లోంచి పేర్ల తొలగింపునకు సుమారు లక్షన్నరకుపైగా ఆఫ్‌లైన్ దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. అందులో సగానికిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో మగ్గుతున్నాయి. గ్రేటర్ మొత్తమ్మీద సుమారు పన్నెండు అర్బన్ సర్కిల్ పరిధిలో 12,34,873 కార్డులు ఉండగా.. వీటిలో 42,72,820 మంది లబ్ధిదారులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో మరో ఐదు లక్షల కార్డులు ఉండగా.. అందులో 17 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. అందులో మొత్తమ్మీద సుమారు 10 శాతం కుటుంబాల్లోని సభ్యులు పెళ్లిళ్లతో కొత్త కుటుంబాలుగా ఏర్పడ్డాయి. తాజాగా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండంతో కొత్త కుటుంబాలకు ఆసక్తి పెరిగింది. కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసేందుకు కుటుంబం కార్డులోని పేర్లు తొలగింపు పెద్ద సమస్యగా పరిణమించింది. కొత్త కుటుంబాల్లోని దంపతులిద్దరూ.. వారి తల్లిదండ్రుల కార్డుల్లో లబ్ధిదారులుగా ఉండటంతో అందులోంచి వారి పేర్లను తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రెండు కార్డుల్లోని ఇద్దరి పేర్లు డిలిషన్ కోసం తంటాలు పడుతున్నారు. రేషన్ కార్డుల్లో అర్బన్ పరిధికి సంబంధించి డిలిషన్ ప్రక్రియ సివిల్ సర్కిల్ కార్యాలయాల్లో జరుగుతుండగా, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ప్రక్రియ తహసీల్ ఆఫీస్‌లో జరుగుతోంది.



ఉత్సాహంగా 'ఫారెస్ట్ బాత్'

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్ పేరిట మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఆదివారం నిర్వహించిన 'ఫారెస్ట్ బాత్' ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది. ఇందులో 40 మంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. వీరిలో 9 మంది నిజాంపేట్, కూకట్‌పల్లి, కొండాపూర్, నార్సింగి వాళ్లు ఉండగా.. సాయి సేవ సంఘ్‌కు చెందిన 31 మంది 10వ తరగతి విద్యార్థినులు పాల్గొన్నారు. ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ ఎకో టూరిజం సుమన్ ఫారెస్ట్ బాత్ ప్రోగ్రాంపై వివరించారు. నేచర్ ట్రయల్, పక్షులను వీక్షించారు. పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. వాటి శాస్త్రీయ నామాలు, అలవాట్లు, అవి ప్రవర్తించే తీరు, రాళ్లు, చెట్ల ఉపయోగంపై తెలుసుకున్నారు. చిన్న పసరిక, నల్ల యోట్రింత, పికిల పిట్ట, ఊదా తేనెపిట్ట, ఆడ నెమలి వంటి పక్షులు, వాటి గూళ్ల తదితర అంశాలపై ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్ వివరించారు. - సాక్షి, సిటీబ్యూరో

‘ఫ్యూచర్’ కార్పొరేషన్?

- ఇప్పటికే ప్రత్యేక అథారిటీ ఏర్పాటు
- తాజాగా కార్పొరేషన్‌కు సన్నాహాలు!
- త్వరలో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్టు ప్రచారం
- మారనున్న రూపురేఖలు



ఫ్యూచర్ సిటీ స్వరూపం

కందుకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ఇప్పటికే ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి మండలి ఇటీవల ప్రకటించింది. దీంతో పాటు ఆ పరిధిలో వచ్చే ప్రాంతాన్ని అంతా కలిపి ప్రత్యేక కార్పొరేషన్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్‌ను హైదరాబాద్, సికింద్రాబాద్, హైటెక్ సిటీ ప్రాంతాన్ని సైబరాబాద్ కార్పొరేషన్లుగా, దీంతో పాటు నాలుగో సిటీగా ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

దీంతో ఈ ప్రాంతం భవిష్యత్‌లో ఊహించని విధంగా అభివృద్ధి చెందనుంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న కార్పొరేషన్‌కు కాంగ్రెస్ నుంచి మేయర్ అభ్యర్థిని సైతం ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది.

56 రెవెన్యూ గ్రామాలతో..

కందుకూరు, కడ్తాల్, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, ఆమనగల్లు మండలాల నుంచి 56 రెవెన్యూ గ్రామాలను కలిపి ప్రభుత్వం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేసింది. భవిష్యత్‌లో ఆ పరిధిని అంతా కలిపి కార్పొరేషన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఉత్తరంవైపు ఓఆర్ఆర్, దక్షిణం ఆర్ఆర్ఆర్, తూర్పున నాగార్జునసాగర్ రహదారి, పడమర శ్రీశైలం రహదారి మధ్యలో ఉన్న ప్రాంతం అంతా కలిపి ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యేక అథారిటీ కిందికి తెచ్చింది. ఆమనగల్లు పరిధి నుంచి కోనాపూర్, రామనుతల, ఇబ్రహీంపట్నం పరిధి నుంచి కప్పాడు, పోచారం, రాంరెడ్డిగూడ, తూలేకలాన్, తుర్కగూడ, ఎలిమినేడు, ఎర్రకుంట, తడలకాల్వ రెవెన్యూ గ్రామాలు, కడ్తాల్ పరిధి నుంచి చరికొండ, ఏక్‌రాజ్‌గూడ, కడ్తాల్, కర్కల్‌పహాడ్, ముద్విన్ రెవెన్యూ గ్రామాలు, కందుకూరు పరిధి నుంచి దాసర్లపల్లి, అన్నోజిగూడ, దెబ్బడగూడ, గూడూరు, గుమ్మడవెల్లి, కందుకూరు, కొత్తూరు, గఫూర్‌నగర్, లేమూరు, మాదాపూర్, మీర్‌ఖాన్‌పేట, మహ్మద్‌నగర్, ముచ్చర్ల, పంజగూడ, రాచులూరు, సార్లరావులపల్లి, తిమ్మాయిపల్లి, తిమ్మాపూర్ రెవెన్యూ గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న అథారిటీతో పాటు కార్పొరేషన్ చేస్తే అందులో కలపనున్నారు. అదేవిధంగా మహేశ్వరం పరిధి నుంచి మొహబత్‌నగర్, తుమ్మలూరు, మంచాల పరిధి నుంచి ఆగాపల్లి, నోముల, మల్లికార్జునగూడ, యాచారం పరిధి నుంచి చొదర్‌పల్లి, గునగల్, కొత్తపల్లె, కుర్మిద్ద, మేడిపల్లి, మలిక్‌జీగూడ, మొగల్లవంపు, నక్కర్త, నానక్‌నగర్, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, తక్కెల్లపల్లి, తాటిపర్తి, తులేకుర్దు, యాచారం, చింతపట్ల, నల్లవెల్లి రెవెన్యూ గ్రామాలను సైతం కలిపే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతం రూపు రేఖలు మారనున్నాయి.

కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా..!

కొత్తగా ఫ్యూచర్‌సిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి సమీప బంధువైన కడ్తాల్ మండలానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలిని మేయర్ అభ్యర్థిగా బరిలో దింపడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. భవిష్యత్‌లో ఏం జరగనుందో వేచి చూడాలి.

చెరువుల చెంత గస్తీ


మాసబ్ చెరువు వద్ద గస్తీ కాస్తున్న టీం సభ్యులు

ఆక్రమణలపై హైడ్రా నజర్

- పరిరక్షణకు పహారా
- షిఫ్టుల వారీగా సిబ్బంది విధులు
- అన్యాక్రాంతం కాకుండా చూడడమే పని
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

తుర్కయంజాల్: చెరువులు, కుంటలు, కాలువలను కబ్జా చేయలనుకునే వారు తస్మాత్ జాగ్రత్త. నిత్యం జలవనరుల వద్ద షిఫ్టుల వారీగా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్)కు చెందిన ఫోర్స్ గస్తీ కాస్తోంది. ఇటీవల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా ఇక మీదట వీటి పరిరక్షణకు నడుం బిగించింది. కొన్ని రోజులుగా పలు చెరువుల వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా సిబ్బంది పహారా కాస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటానికి సాహసించడం లేదు.

ఇరిగేషన్ సిబ్బంది సైతం..

హైడ్రాతో పాటు ఇరిగేషన్ అధికారులు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా రాత్రి వేళల్లో చెరువుల వద్దకు వచ్చి పరిశీలిస్తున్నారు. ఇటీవల తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు, ఇంజాపూర్‌లోని జిలావర్ ఖాన్ చెరువు, పెద్ద అంబర్‌పేటలోని ఈదులకుంట వద్ద హైడ్రా సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. హైడ్రా, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ పెరగడంతో చెరువుల్లో మట్టి పోయడానికి ప్రయత్నాలు కూడా చేయడం లేదు. నెల రోజుల క్రితం మాసబ్ చెరువు వద్ద గస్తీ ప్రారంభించకముందు ఓ వ్యక్తి చెరువులో పెద్ద ఎత్తున మట్టిని డంప్ చేసిన విషయం తెలిసిందే. అతడిపై కేసు నమోదు చేయడంతో పాటు, చెరువులో పోసిన మొత్తం మట్టిని అధికారులు దగ్గరుండి తొలగించారు.

అన్యాక్రాంతం కాకుండా..

జిల్లాలో మొత్తం 1,075 చెరువులు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ ప్రభావం అధికంగా ఉండే అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, గండిపేట, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మండలాల్లో ఆక్రమణలు ఎక్కువగా జరిగినట్లు గతంలోనే తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ సర్వేలో వెల్లడైంది. వీరి సర్వే ప్రకారం 225 చెరువులు పూర్తిగా, 196 చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు వెల్లడించారు. ఇలా కబ్జాదారుల చేతుల్లో చిక్కుకుని అన్యాక్రాంతం అవుతున్న వాటిని కాపాడడమే లక్ష్యంగా హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం అందించండి

చెరువుల్లో మట్టి పోస్తున్న వారి సమాచారం అందించాలని ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశాం. మట్టిని తరలిస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీల ఫొటోలు, వీడియోలు 90001 13667 నంబర్‌కు పంపించండి. టోల్ ఫ్రీ నంబర్ 18005990099, ల్యాండ్ లైన్ 040-29560509, 040-29560596, 040-29565758, 040-29560593 నంబర్లలోనూ ఫిర్యాదు చేయొచ్చు.

- వంశీ, ఇరిగేషన్ ఏఈ, అబ్దుల్లాపూర్‌మెట్

షిఫ్టుల వారీగా విధులు

ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో చెరువుల వద్ద విధులు నిర్వర్తిస్తున్నాం. చెరువుల్లో వ్యర్థాలు, మట్టి డంప్ చేసే వారిని గుర్తించడమే మా పని. ఒకే దగ్గర కూర్చుని కాకుండా చుట్టూ తిరుగుతూ గస్తీ కాస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి ఎవరైనా కబ్జాలకు ప్రయత్నిస్తే హైడ్రా దృష్టికి తీసుకురావాలి.

- దర్శనపు తిరుపతయ్య, హయత్‌నగర్ టీం-3

ప్రమాదవశాత్తు హుస్సేన్ సాగర్‌లో పడి సెక్యూరిటీ గార్డు మృతి


యాదగిరి (ఫైల్)

రాంగోపాల్‌పేట్: లుంబినీ పార్కులో బోటును శుభ్రం చేస్తూ ఓ సెక్యూరిటీ గార్డు ప్రమాదవశాత్తు నీళ్లలో పడి మరణించాడు. ఈ ఘటన లేక్ సెక్రటరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం న్యూ నల్లకుంట గాంధీనగర్‌కు చెందిన సురారం యాదగిరి (56) గత ఐదేళ్ల నుంచి లుంబినీ పార్కులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం బోటును శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు హుస్సేన్‌సాగర్ నీళ్లలో పడిపోయాడు. అటు తర్వాత పార్కు సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించగా నీళ్లలో పడిపోయినట్లు గుర్తించారు. ఆదివారం సాయంత్రం హుస్సేన్ సాగర్ జలాల్లో మృతదేహం తేలియాడుతుండగా లేక్ పోలీసులు వెలికితీశారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు ధర్యాప్తు చేపట్టారు.

టీఎన్జీఓ కేంద్ర సంఘం కోశాధికారి రామినేని శ్రీనివాసరావు మృతి



నాంపల్లి: టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర కోశాధికారి రామినేని శ్రీనివాసరావు అలియాస్ బొట్టు శీను అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. తెలంగాణ రాష్ట్ర అబ్కారీ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక భూమికను పోషించారు. ఆయన మరణం పట్ల టీఎన్జీఓ, టీజీఓ నేతలు సంతాపాన్ని తెలియజేశారు.

పోలీసుల అదుపులో జంట హత్యల నిందితుడు?

జవహర్‌నగర్: జవహర్‌నగర్, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిని జవహర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. యాప్రాల్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో నివసించే సుశీల అనే మహిళతోపాటు ఆమె కుమార్తె జ్ఞానేశ్వరిని ఇటీవల అరవింద్ అనే వ్యక్తి హత్యచేసిన విషయం విదితమే. కాగా అరవింద్ కోసం హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో 6 ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈమేరకు ఆదివారం అరవింద్‌ను జవహర్‌నగర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం విచారణ చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయాయని..

హస్తినాపురం: తనకు తెలియకుండా తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోయాయని మనస్తాపానికి గురైన యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వాలికి ఆకాశ్(20) నెల రోజుల క్రితం నగరానికి వచ్చి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ వనస్థలిపురంలోని వెంకటరమణకాలనీ ఎంఎస్ఆర్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ప్రతిరోజు పనులు ముగిసిన తర్వాత తన తల్లితో ఫోన్‌చేసి మాట్లాడుతుండేవాడు. శనివారం రాత్రి ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో తన తల్లికి ఫోన్ చేసి తన బ్యాంకు ఖాతానుండి ఏడున్నర వేలు డెబిట్ అయ్యాయని చెబుతూ ఏడ్వడంతో..తల్లిదండ్రులు అతనిని ఫోన్‌లో ఓదార్చారు. దీనిపై ఆవేదనకు గురైన ఆకాశ్ ఆదివారం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లిన పోలీసులు ఆకాశ్ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని అతని తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం మృతుని తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మంజీరా పైపులైన్‌కు భారీ లీకేజీ

తాగునీటి సరఫరాకు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగు నీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్- 2, 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు ఓల్డ్ బాంబే హైవేలోని మొఘల్ రెస్టారెంట్ వద్ద భారీ లీకేజీ ఏర్పడింది. దీంతో ఆదివారం రాత్రి తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జలమండలి అధికారులు అత్యవసరంగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డ్, నిజాంపేట్, హైదర్ నగర్, మూసాపేట్, ఎర్రగడ్డ, బీరంగూడ, అమీన్‌పూర్, మియాపూర్, దీప్తి శ్రీనగర్, ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి ప్రకటించింది.

ఫొటో షూట్‌కు వచ్చి..క్వారీ గుంతలో గల్లంతు


ఎతిన్ నాయుడు (ఫైల్)

జవహర్‌నగర్: ఫొటో షూట్ కోసం సరదాగా మల్కారం గుట్టలకు వచ్చిన నలుగురు యువకుల్లో ఓ యువకుడు ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి గల్లంతయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఎతిన్ నాయుడు (20) మరో ముగ్గురు మిత్రులతో కలిసి ఆదివారం సరదాగా జవహర్‌నగర్ పరిధిలోని మల్కారం గుట్టలపైన ఫొటోషూట్‌కు వచ్చారు. ఈ క్రమంలో ఫొటోలు దిగుతుండగా..ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న క్వారీ గుంతలో ఎతిన్ నాయుడు పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. వెంటనే తోటి స్నేహితులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న గజ ఈతగాళ్లు, డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి కావడంతో గాలింపు సాధ్యం కాలేదు. కాగా ఎతిన్ నాయుడు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

24 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట్: గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదివారం శామీర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు రోటరీ-1 వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా..ఏపీ 23 యూ 5899 నంబరు గల లారీలో 24 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. డ్రైవర్ ఎస్‌కే సర్దార్, క్లీనర్ చంద్రం లను అదుపులోకి తీసుకొని విచారించగా సిద్దిపేట జిల్లాకు చెందిన శశికుమార్‌కు అందించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఈ మేరకు లారీని సీజ్ చేయడంతో పాటు ఇరువురిపై కేసు నమోదు చేశారు. అనంతరం రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అందజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

‘రియల్’ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో భారీ చోరీ జరిగింది ఇంట్లో పని చేసే ముగ్గురు పని మనుషులు యజమానికి సంబంధించిన విలువైన బంగారు, వజ్రాభరణాలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 22 లో నివసిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి జీవీ శేఖర్ రెడ్డి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తమ సమీప బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే డ్రెస్సింగ్ రూమ్ లో పెట్టిన ఆభరణాలను పరిశీలించగా అందులో ఆభరణాలతోపాటు డబ్బు కనిపించలేదు. 11 గ్రాముల గోల్డ్ చైన్, 13 గ్రాముల ఇయర్ రింగ్స్, 2.4 క్యారెట్ల డైమండ్స్ తో కూడిన ఒక జత ఇయర్ రింగ్స్, దాదాపు 7 లక్షల రూపాయల నగదు కనిపించలేదు. ఇంట్లో పని చేస్తున్న అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన హసీనా, కర్నూలుకు చెందిన వహీదా, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అనూషలు అప్పటికే కనిపించలేదు. చోరీకి గురైన నగల విలువ, నగదుతో కలిపి మొత్తం రూ.36 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వారి ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తూ శేఖర్ రెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను సైతం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది.

పేకాట స్థావరంపై దాడి

ఇబ్రహీంపట్నంరూరల్: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని శ్రీనివాస రంగాపురం కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.93,140 నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆ ఎన్నికలు నిర్వహించే అర్హత కౌన్సిల్‌కు లేదు

ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా బార్ అసోసియేషన్ల ఎన్నికలు నిర్వహించే అర్హత బార్ కౌన్సిల్‌కు లేదని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఎన్నికల నోటిఫికేషన్ 2018 ప్రకారం ఇప్పుడు బార్ కౌన్సిల్ కాలపరిమితి రెండేళ్లన్నారు. ఆ మేరకు కాలపరిమితి ముగిసిన బార్ కౌన్సిల్‌కు అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకునే అధికారం లేదని వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ భేటీ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలోని అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్లు అన్ని సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం రూపుదిద్దుకున్నాయని, అవి స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నాయన్నారు. అసోసియేషన్ల వ్యవహారాల్లో కౌన్సిల్ తలదూర్చడం సరి కాదని చెప్పారు. ఏడాది గడవగానే అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు ఉత్సాహం కనబరిచే కౌన్సిల్.. తన ఎన్నికలను మాత్రం మర్చిపోయిందని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో పలు బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాల్ లిఫ్ట్ చేయకపోతే కిడ్నాప్ చేస్తా

వివాహితకు యువకుడి బెదిరింపులు

ఫిలింనగర్: ‘ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోతే నిన్ను, పిల్లలను కిడ్నాప్ చేస్తా’ అంటూ వివాహితను బెదిరిస్తున్న యువకుడిపై ఫిలింనగర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..టోలిచౌకి సమతాకాలనీలో నివసించే వివాహిత (32) స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కాగా, 2016 నుంచి భర్త దుబాయ్‌లో ఉంటున్నాడు. గత ఏడాది తన స్కూల్‌లో అడ్మిషన్లకు సంబంధించి ఇన్‌స్టాగ్రాంలో ప్రకటన పోస్ట్ చేసింది. షేక్ వసీం అనే యువకుడు ఆమె ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌ను ఫాలో అవుతూ ఆమె ఫోన్ నెంబర్‌ను అడ్మిషన్ కావాలంటూ అడిగి తెలుసుకున్నాడు. తరచూ ఫోన్ చేస్తుండడంతో ఆమె లిఫ్ట్ చేయలేదు. దీంతో స్కూల్‌లో సిబ్బంది నుంచి ఆమె పర్సనల్ నెంబర్‌ను కూడా సేకరించాడు. అప్పటి నుంచి స్కూల్‌కు, ఆమె ఇంటికి తిరుగుతూ 24 గంటలూ ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ వేధింపులకు గురిచేయసాగాడు. దీంతో ఆమె పర్సనల్ నెంబర్‌ను కూడా లిఫ్ట్ చేయడం ఆపేసింది. ఈ నేపథ్యంలోనే షేక్ వసీం ర్యాపిడో డ్రైవర్‌ను బుక్ చేసుకుని ఆమె ఇంటికి పంపించి పార్శిల్ ఇస్తారు..తీసుకురా అని చెప్పసాగాడు. ఆమె ఇంటికి వెళ్లిన ర్యాపిడో డ్రైవర్‌ను ఫోన్ ఆమెకు ఇవ్వు మాట్లాడతానంటూ వేధించడం మొదలుపెట్టాడు. గత ఏడు నెలల నుంచి నిందితుడి వేధింపులు రోజు రోజుకు పెరిగాయి. ఇంటి చుట్టూ, స్కూల్ చుట్టూ తిరుగుతూ ఆమెను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం మరింత రెచ్చిపోయిన నిందితుడు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే నిన్ను, పిల్లలను కిడ్నాప్ చేస్తానంటూ మెసేజ్‌లు పెట్టాడు. భయాందోళనకు గురైన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 78(2), 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


టోల్‌గేట్ సిబ్బంది వారిస్తున్నా..


బైక్‌పై ఔటర్ రింగు రోడ్డు ఎక్కి.. ప్రమాదంలో వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: టోల్‌గేటు సిబ్బంది వారిస్తున్నా.. బైక్‌పై ఔటర్ రింగు రోడ్డుపై ప్రయాణం చేస్తూ రాంగ్ రూట్‌లో వస్తుండగా ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నారాయణపేట ప్రాంతంలోని పల్లెర్లకు చెందిన సయ్యద్ మహబూబ్ అలీ(54) కుటుంబ సభ్యులతో కలిసి శంషాబాద్‌లోని రాజీవ్ గృహకల్ప నివాస సముదాయంలో ఉంటున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఇతను శనివారం షాద్‌నగర్‌లో పని ఉందంటూ ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో తొండుపల్లి ఔటర్ టోలుగేటు వద్ద అక్కడి సిబ్బంది వారిస్తున్నా వినకుండా.. బైక్‌పై ఔటర్‌పైకి వెళ్లాడు. పెద్దగోల్కొండ వైపు వెళ్లిన అతను..తిరిగి రాంగ్‌రూట్‌లో తొండుపల్లి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నార్కట్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం...

ఇద్దరు నగర యువకుల దుర్మరణం


సాయిగౌడ్ (ఫైల్)


సందీప్‌గౌడ్ (ఫైల్)

అల్వాల్: అల్వాల్‌కు చెందిన ఐదుగురు కారులో విజయవాడ వెళ్తుండగా..నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి సమీపంలోని లింగోటం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. అల్వాల్‌లో నివసించే సాయిగౌడ్(33), లోతుకుంటకు చెందిన సాయి సందీప్‌గౌడ్ (26) ప్రవీణ్, రాజేష్, రాజు ఐదుగురు మిత్రులు కలిసి శనివారం రాత్రి అల్వాల్ నుండి కారులో వియజవాడకు బయలుదేరగా..లింగోటం వద్ద వీరి కారు లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయిగౌడ్, సందీప్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందిగా రాజేష్, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రవీణ్ విషయం తెలియరాలేదు. అందరితో కలివిడిగా ఉండే వీరు ప్రమాదానికి గురయ్యారన్న వార్త స్థానికంగా కలచివేసింది. సాయిగౌడ్, సందీప్‌గౌడ్ మృతదేహాలకు పోస్టుమార్టం జరిపిన అనంతరం అల్వాల్‌కు తీసుకొచ్చారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

నిజాంపేట్: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముఠాను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు పోలీసులు, వ్యవసాయ అధికారి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం ..కర్ణాటకకు చెందిన గూడ్స్ క్యారియర్ ఆటోలో లూజు పత్తి విత్తనాలు తెస్తున్నారన్న సమాచారంతో వారు బాచుపల్లి పోలీసులు ఆదివారం మధ్యాహ్నం మల్లంపేట వద్ద తనిఖీలు చేపట్టారు. బాచుపల్లి ఎక్స్‌రోడ్డువైపు కర్ణాటకకు చెందిన ఆటో (కెఏ 34 డీ 0117) వస్తుండగా వారు ఆటోను ఆపి చెక్ చేయగా..15 బస్తాలలో లూజు పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న ఆలేరు మాధవ్, ఆదర్శ్, గొల్ల ఉదయ్‌కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. విత్తనాలను తూకం వేయించగా 745 కిలోలు ఉన్నాయి. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బీసీ బిల్లును ఆమోదించాలి

లిబర్టీ: బీసీ కేంద్రమంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రధానమంత్రి ఒత్తిడి తెచ్చి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లుకు ఆమోదముద్ర వేసేలా కృషి చేయాలని బీసీ దళ్‌ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. బీసీ ఓట్లతో గెలుపొందిన కేంద్ర మంత్రులు లోక్‌సభ సభ్యులు బీసీల అభ్యున్నతికి చేసిందేమీ లేదన్నారు. ఆదివారం దళ్‌ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడుసార్లు బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బీసీల ఓట్లే కీలకమయ్యాయన్నారు. కేంద్రస్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బడ్జెట్‌ను సవరించి బీసీల ఆర్థిక సంక్షేమ ప్రగతి కోసం రూ.రెండు లక్షల ఓట్లు కేటాయించాలని డిమాండ్‌ చేశారు.

లిటిల్‌స్టార్‌ హైస్కూల్‌లో ఇఫ్తార్‌ విందు..



బంజారాహిల్స్‌: రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకుని కుల మతాలకతీతంగా ఇఫ్తార్‌ విందులు ఏర్పాటు చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌-10లోని గాయత్రీహిల్స్‌ లిటిల్‌స్టార్‌ హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ అస్మతున్నీసా ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ విందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా రంజాన్‌ ఉపవాస దీక్షల్లో ఇఫ్తార్‌ విందులు ఏర్పాటు చేస్తుంటామని, ఈ సారి కూడా అదే ఆనవాయితీ కొనసాగించినట్లు తెలిపారు. మతాలకతీతంగా విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లలపై జరుగుతున్న అకృత్యాలపై ప్రత్యేకంగా పోక్సో చట్టం ఉందని దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఇంటిలో ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం తీసుకునే హక్కు భార్యకూ ఉంటుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మహిళలు దేనికీ భయపడాల్సిన అవసరం లేదని వారికి ఎన్నో రకాల చట్టాలు ఉన్నాయని, అలాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐలు జాతీయ మహిళా కన్వీనర్‌ సీహెచ్‌ శైలజ, కో కన్వీనర్‌ వనజ, ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారధి, మద్రాస్‌ హైకోర్టు న్యాయవాది చమ్కీరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

‘హిల్స్‌’ పీఎస్‌లు టాప్‌

- వెస్ట్‌జోన్‌ పరిధిలో లోక్‌ అదాలత్‌లో 313 కేసుల పరిష్కారం..
- నెంబర్‌-1 స్థానంలో జూబ్లీహిల్స్‌..
- నెంబర్‌-2లో బంజారాహిల్స్‌..
- అదాలత్‌కు విశేష స్పందన..
- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కక్షిదారులు..



జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌

బంజారాహిల్స్‌: జాతీయ లోక్‌ అదాలత్‌లో వెస్ట్‌జోన్‌ పరిధిలోని ఠాణాల్లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారమయ్యాయి. కక్షిదారులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి కేసులను పరిష్కరించుకున్నారు. తొందరపాటుతో కేసుల పాలై ఏళ్ల కొద్దీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులిరువురూ రాజీ కుదుర్చుకుని ప్రశాంత జీవనానికి బాటలు వేసుకున్నారు. పలుమార్లు న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారు జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకున్నారు.అప్పీలు లేని న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే మనకు అందుబాటులో ఉన్న లోక్‌ అదాలత్‌లను వినియోగించుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు వెస్ట్‌జోన్‌ పరిధిలోని బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, ఫిలింనగర్‌, మాసబ్‌ట్యాంక్‌, బోరబండ, మధురానగర్‌, పంజగుట్ట, ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది గత మూడు వారాలుగా కల్పించిన అవగాహన మంచి ఫలితాలు ఇచ్చిందనే చెప్పాలి. ఈ అవకాశాన్ని చాలామంది సద్వినియోగం చేసుకున్నారు. వెస్ట్‌జోన్‌ పరిధిలోని ఈ ఎనిమిది పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 313 కేసులు పరిష్కారమయ్యాయి. మొదటి స్థానంలో జూబ్లీహిల్స్‌ ఠాణా 80 కేసులతో సత్తా చాటింది. ఆ తర్వాత స్థానంలో బంజారాహిల్స్‌ 56 కేసులు పరిష్కరించి రెండో స్థానంలో నిలిచింది.

పోలీస్‌స్టేషన్‌	పరిష్కారమైన కేసులు
జూబ్లీహిల్స్‌	80
బంజారాహిల్స్‌	56
ఎస్సార్‌నగర్‌	53
ఫిలింనగర్‌	35
బోరబండ	33
పంజగుట్ట	28
మధురానగర్‌	17
మాసబ్‌ట్యాంక్‌	11



- లోక్‌అదాలత్‌ ద్వారా రాజీ కుదుర్చుకున్న కేసులకు అప్పీలు ఉండదని స్పష్టం చేయడంతో పాటు పోలీసు సిబ్బంది లోక్‌ అదాలత్‌పై స్పష్టమైన అవగాహన కల్పించారు.
- కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన బెంచ్‌ల ద్వారా కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి.
- క్షణికావేశంలో కేసుల పాలైన పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.
- అలాంటి కేసులను పరిష్కరించుకునేందుకు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌ అదాలత్‌ వేదిక ఉపయోగపడింది.
- కేసు ఏదైనా కోర్టుకు చేరిందంటే వాదోపవాదాలు, వాయిదాలతోనే కాలం గడుస్తుందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది.
- కేసులు అధిక సంఖ్యలో ఉండడంతో వాటి పరిశీలన, తుది తీర్పును వెలువరించడం అంత సులభమయ్యేది కాదు. తద్వారా ఇరుపక్షాలు ఆర్థికంగా, మానసికంగా క్షోభకు గురయ్యేవి.
- ఈ క్రమంలో రాజీ మార్గంలో కేసులను ఒకేసారి పరిష్కరించుకునేందుకు మొగ్గుచూపారు.
- న్యాయ పరిష్కారాలు, వివాదాలు జాప్యం లేకుండా వేగంగా కేసులు పరిష్కారమై వాదోపవాదాలు సన్నద్ధత పరమైన న్యాయ సంబంధిత ఖర్చులు తగ్గాయి.
- లోక్‌ అదాలత్‌లో పాల్గొన్న ప్రజలకు న్యాయ ప్రక్రియలపై అవగాహన ఏర్పడింది.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



స్పోర్ట్స్‌ డేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



వెంగళరావునగర్‌ : ప్రతి విద్యార్థికి అటు చదువుతో పాటుగా ఆటల్లోనూ రాణించాలని, తల్లిదండ్రులు వారిని క్రీడల పట్ల ప్రోత్సహించాలని ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ అన్నారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌ రెడ్డి ఇండోర్‌ స్టేడియంలో శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిరాం, శ్రీనిధి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌ కార్నివాల్‌-2025 పేరుతో క్రీడోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దానం నాగేందర్‌ మాట్లాడుతూ చదువు సంస్కారాన్ని నేర్పిస్తుందని, క్రీడలు జీవితంలో ఎదగడానికి దోహద పడతాయన్నారు. నేటితరం యువతీ యువకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అయితే తల్లిదండ్రులు పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాలని సూచించారు. కేవలం ర్యాంకులపైనే దృష్టి కేంద్రీకరించకుండా ఆటల ప్రాధాన్యతను సైతం వారికి వివరించాలన్నారు. చిన్నారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, త్రోబాల్‌, టగ్‌ ఆఫ్‌ వార్‌ తదితర పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో శ్రీనిధి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ నిర్వాహకులు నల్లపాటి వెంకటేశ్వరరావు, నల్లపాటి శ్రీదేవి, నల్లపాటి సాయినాథ్‌ నాయుడు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాయల్‌ కళాశాల చైర్మన్‌ కె.జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతోనే బస్తీ అభివృద్ధి



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

రహమత్‌నగర్‌ : బస్తీ అభివృద్ధికి స్థానికులు సహకరించాలని వినాయకనగర్‌ వీకర్స్‌ సెక్షన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అబ్జర్వేషన్‌ డెవలప్‌ మెంట్‌ కమిటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఎస్పీఆర్‌హిల్స్‌ వినాయ కనగర్‌ కమ్యూనిటీహాల్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన బస్తీ కమిటీ సమావేశం లో వీర స్వామియాదవ్‌, డానియేల్‌, మాణిక్య, శ్రీనివాస్‌, అమృత్‌, యోహాన్‌, డేవిడ్‌, సురేష్‌ మాట్లాడుతూ బస్తీ అభివృద్ధి కోసం బస్తీ వాసుల ఆమోదంతో అబ్జర్వేషన్‌, డెవలప్‌మెంట్‌ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తుందన్నారు. బస్తీ అధ్యక్షుడు లేక పోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని, త్వర లోనే మరోమారు సమావేశమై బస్తీ ఎన్నికల పై చర్చిస్తామన్నారు. సమావేశంలో మాజీ బస్తీ అధ్యక్షులు సింగారి శ్రీనివాస్‌, కేశవులు బస్తీ సీనియర్‌ నాయకులు యాదగిరి, ప్రేమ్‌సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

అనువాద గ్రంథాల ఆవిష్కరణ



అనువాద గ్రంథాల ఆవిష్కరణలో పాల్గొన్న నరసింహప్ప తదితరులు

ఖైరతాబాద్‌: తెలుగు సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదిస్తున్న భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్‌ సేవలు అభినందనీయమని మాజీ ఐఏఎస్‌ అధికారి నరసింహప్ప అన్నారు. ఆదివారం ప్రముఖ కన్నడ కవి డాక్టర్‌ బిక్కి కృష్ణ అధ్యక్షతన ఐఎల్‌టీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచారసభలో ప్రముఖ రచయిత్రి డాక్టర్‌ మామిడాల శైలజ, యువకవి ధృవనల్లా రాసిన అనువాద గ్రంథాల ఆవిష్కరణ, మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహప్ప, తెలుగువన్‌ యండీ కంఠంనేని రవిశంకర్‌ పుస్తకాలను ఆవిష్కరించారు. మామిడాల శైలజ రాసిన ‘గతి తప్పిన రుతువు’ నవలను ఆంగ్లంలో ‘ది ఎక్స్‌ ఆఫ్‌ సైలెన్స్‌’ పేరుతో హిందీలో ‘అవికసిత్‌’ పేరుతో అనువదించడం మంచి పరిణామమని వక్తలు కొనియాడారు. యువకవి ధృవ తెలుగులో రాసిన రెండు రంగుల ఇంద్ర ధనస్సు హిందీలో హిందీలో ‘దో రంగోంకా ఇంద్ర ధనుష్‌’ పుస్తకాలు అద్భుతంగా ఉన్నాయని రవిశంకర్‌ అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త అలూరు సుభాష్‌ బాబుకు విద్యా ఉద్యోగ ప్రధాత పేరుతో జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవికా చౌదరి, డాక్టర్‌ పి.సునందబాయి, వి.శుక్తిమతిలకు జాతీయ జీవన సాఫల్యపురస్కారాలు అందజేశారు. వీరితో పాటు మరో 28 మందికి నేషనల్‌ లెజెండరీ ఎక్స్‌లెన్‌ అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్‌ రాధాకుసుమ ఆధ్వర్యంలో జరిగిన కవిసమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది.

మహిళలకు క్రీడల పోటీలు

వెంగళరావునగర్‌ : మధురానగర్‌కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. మధురానగర్‌కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను అసోసియేషన్‌ కోశాధికారి సుగుణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ కార్యదర్శి కోడె సాంబ శివరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు మహిళలకు వివిధ రకాల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఈనెల 12న బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీలకు కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. సోమవారం కూడా పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



మ్యూజికల్‌ చైర్స్‌ ఆడుతున్న మహిళలు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

సినీ నటుడు, మాజీ ఎమ్మెల్యే బాబూ మోహన్‌



మ్యూజిక్‌ డైరెక్టర్‌ ఎంఎం శ్రీలేఖకు అవార్డు అందజేస్తున్న బాబూ మోహన్‌

శ్రీనగర్‌ కాలనీ : సమాజాభివృద్ధిలో మహిళలు పాత్ర ఎంతో కీలకమని, ఒక సమాజం, దేశ అభివృద్ధిలో మహిళల కృషి విశేషంగా ఉంటుందని ప్రముఖ సినీ నటుడు, మాజీ శాసన సభ్యుడు బాబూ మోహన్‌ అన్నారు. ఆదివారం సారథి స్టూడియోలో నిర్వహించిన తెలంగాణ ఎక్సలెన్స్‌ అవార్డ్స్‌-2025 వేడుకకు ఆయన ముఖ్య మాజీ సీబీఐ జాయింట్‌ డైరెక్టర్‌ లక్ష్మీనారాయణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడా రంగం, సామాజిక, సినీ తదితర రంగాల్లో విశేష సేవలందించిన పలువురు మహిళలకు అవార్డులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఒక సమాజం, ఒక దేశం ముందుకు వెళ్లాలన్నా, అభివృద్ధి చెందాలన్నా అందులో మహిళల పాత్ర కీలకమని అన్నారు. మహిళలకు సముచిత గౌరవం ఇచ్చి సత్కారాలు చేయడం అభినందనీయమన్నారు. తెలంగాణ చరిత్రను చూసినా రాణి రుద్రమదేవి, ఓ చాకలి ఐలమ్మ గుర్తుకు వస్తారన్నారు. భారత దేశాన్ని సైతం మనం భారత మాతగా పూజిస్తామని ఎక్కడైతే మహిళలు పూజింపబడతారో ఆ దేశంతో ఎంతో ఎత్తుకు ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో కిరణ్‌ కుమార్‌, సినీ నటి ఎస్తేర్‌, పారా ఒలింపిక్స్‌ విజేత దీప్తి జీవాంజి, యూ ట్యూబర్‌ గంగవ్వ, ప్రముఖ గైనకాలజిస్ట్‌ జయంతిరెడ్డి, తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, హంసవాణి తదితరులు పాల్గొన్నారు.

కురుమలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

పంజగుట్ట: త్వరలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ స్థానాల్లో కురుమ కులస్తులకు ఎమ్మెల్సీ కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జేఏసీ డిమాండ్‌ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు ముత్త సంపత్‌, కె.శ్రీనివాస్‌, వన్నాడి రమేష్‌, కనకాల శ్యామ్‌ కురుమ, బాపు మల్‌శెట్టి కురుమ మాట్లాడుతూ .. రాష్ట్రంలో కురుమలు దాదాపు 50 లక్షల జనాభా ఉందని, ఇటీవల నిర్వహించిన కులగణలో తక్కువగా చూపించారని ఆరోపించారు. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వెనకబడి ఉన్న కురుమలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కురుమల గుర్తింపు, గౌరవం, తమ జనాభాను చూపేందుకు త్వరలోనే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డి.శ్రీనివాస్‌, కాలే వెంకటేష్‌ కురుమ, గణం నరసింహ, మహేందర్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



రహమత్‌నగర్‌ : బోరబండ సైట్‌-2 ఎస్‌ఆర్‌ఆర్‌పురం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ 17 వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వనజ లక్ష్మణ్‌గౌడ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, లక్ష్మీగణపతిహోమం, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, దీపారాధన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కమిటీ సభ్యులు బాలకృష్ణ, కాశీరావు, విజయ్‌, సత్యనారాయణ, తివారి, మధులు పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్‌ : బ్యాంకు నుంచి రుణం ఇప్పిస్తానని మహిళను మోసం చేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్‌కు చెందిన మహిళకు ఎబీబీ బ్యాంకులో ఉద్యోగం చేసే ప్రసాద్‌ బాబు ద్వారా లక్ష్మీపతి అనే వ్యక్తితో 2023లో పరిచయం ఏర్పడింది. లక్ష్మీపతి ఆమెకు రూ.30 లక్షలు యూనియన్‌ బ్యాంక్‌ ద్వారా లోన్‌ ఇప్పిస్తానని, ఇందుకోసం రూ.70 వేలు కమిషన్‌ ఇవ్వాలని చెప్పాడు. అతని మాటలు నమ్మిన సదరు మహిళ లక్ష్మీపతికి విడతల వారీగా రూ.70 వేలు చెల్లించింది. అయితే అతను రుణం ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు ఆదివారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా..

వెంగళరావునగర్‌ : సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన సాయికృష్ణ నగరానికి వలస వచ్చి వెంగళరావునగర్‌ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. అదే సమయంలో జానీ అనే అతడి స్నేహితుడు చందు అమర్‌నాథ్‌ అనే వ్యక్తిని కలిసి డబ్బులు చెల్లిస్తే సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం ఇప్పిస్తాడని చెప్పాడు. తాను రూ.2.25 లక్షలు చెల్లించినట్లు చెప్పాడు అతడి మాటలు నమ్మిన సాయి కృష్ణ విడతల వారీగా రూ.2.25 లక్షలు చందు అమర్‌నాథ్‌కు చెల్లించాడు. ఆ తర్వాత ఉద్యోగం విషయం అడగ్గా డెకావర్స్‌ టెక్నాలజీ పేరుతో ఇంటర్వ్యూ అని చెప్పాడు. ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు వేయకుండా సెలక్ట్‌ చేసుకున్నారు. అనుమానం వచ్చి గూగుల్‌లో సెర్చ్‌ చేయగా ఆ పేరున ఎలాంటి సంస్థ కనిపించలేదు. అది ఫేక్‌ సంస్థగా గుర్తించిన సాయి కృష్ణ ఈ విషయం చందు అమర్‌నాథ్‌కు చెప్పగా వేరే కంపెనీలో ఇప్పిస్తానని అన్నాడు. అయితే ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన అతను మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లింగ సమానత్వాన్ని పెంపొందించాలి



బృహస్పతి టెక్నాలజీ లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బంజారాహిల్స్‌: ఐటీ పరిశ్రమలో లింగ సమానత్వం, మహిళా సాధికారతను పెంపొందించేందుకు బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-2లోని షాంగ్రిల్లా ప్లాజాలో బృహస్పతి టెక్నాలజీ లిమిటెడ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బృహస్పతి టెక్నాలజీలో సృజనాత్మకత, పురోగతికి దోహదపడే విశిష్ట మహిళలను గౌరవించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైవిధ్యం విజయాన్ని నడిపిస్తుందనే దృఢ నమ్మకంతో నాయకత్వం, ఇంజనీరింగ్‌, అభివృద్ధి కార్యకలాపాల్లో మహిళలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని సంస్థ ఎండీ పి.రాజశేఖర్‌ పేర్కొన్నారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



పంజగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటరమణ కాలనీలో డాక్టర్‌ ఎల్‌.వి.ప్రసాద్‌ డయోగ్నస్టిక్స్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం ఆదివారం ముగిసింది. రెండు రోజులపాటు కొనసాగిన ఈ వైద్యశిబిరాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకున్నారు. తమ సంస్థ 14వ వార్షికోత్సవం, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్‌ ఎల్‌.వి.ప్రసాద్‌ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ జి.సత్యనారాయణ, డాక్టర్‌ దీప, సాయి సుధీంద్ర పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు

ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌ డివిజన్‌లోని గౌషి ఆజం ఈ మజీద్‌లో ఆదివారం బీఆర్‌ఎస్‌ ఖైరతాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్‌ విందు ఏర్పాటు చేశారు. రంజాన్‌ పవిత్ర మాసంలో ఇఫ్తార్‌ విందు ఇవ్వడం సంతోషంగా ఉందని మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎండి జాఫర్‌ హుస్సేన్‌, ఎండి అజ్జు, హాజీ, జావిద్‌, ఫయాజ్‌, ఖదీర్‌ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌ విందులో పాల్గొన్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

పుస్తకావిష్కరణ



బహురూపులవాడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు ..

పంజగుట్ట: బహుభాషా వేత్త కల్లూరి భాస్కరం బహురూపులవాడు అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కల్లూరి భాస్కరం రచించిన ‘బహురూపులవాడు’ పుస్తక ఆవిష్కరణ, పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు వాడ్రేవు చినవీరభద్రుడు, డాక్టర్‌ గోవిందరాజు చక్రధర్‌, డాక్టర్‌ బులుసు శ్రీనివాస్‌, నందిరాజు రాధాకృష్ణ, డాక్టర్‌ విరించి విరివింటి, టి.ప్రకాష్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లూరి భాస్కరం రచనలు, వ్యాసాలు యువ రచయితలకు ఆదర్శమని, ఆయన రచనా వ్యాసంగం కొనసాగాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత



ఘనంగా మేడ్చల్ బాలుర ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాలు

మేడ్చల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. 1975 సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు రీ యూనియన్‌గా ఏర్పడి ఈ కార్యక్రమం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కోసం లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఉల్లాసంగా గడిపారు. 50 ఏళ్ళ తర్వాత కలుసుకోవడంతో సంతోషంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన ఆర్ అండ్ డీ షోకేస్



పిల్లర్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న విద్యార్థులు



ట్రిపుల్ ఐటీ ఆర్ అండ్ డీ షోకేస్ 2025లో ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ -హైదరాబాద్‌లో ప్రతియేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ షోకేస్-2025 ఆదివారం ముగిసింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో శనివారం ప్రారంభమైన ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగింది. ఈ ప్రదర్శనను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ట్రిపుల్ ఐటీలోని 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కుపైగా పరిశోధక పోస్టర్లు, డెమోలు, మోడళ్లను ప్రదర్శించారు. ప్రతియేటా సమాజానికి ప్రయోజనం కలిగించే పరిశోధనలను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో ప్రదర్శించి సందర్శకులకు వాటి ప్రాధాన్యతను వివరిస్తారు. తాజాగా సాంకేతిక రంగం, పరిశోధనల్లో వస్తున్న మార్పులు, ఇతర అంశాలపై చర్చా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ నుంచి పేటెంట్ గ్రహీతలందరినీ ఘనంగా డైరెక్టర్ చేతుల మీదుగా సత్కరించారు.

ఎక్స్‌పో..

మెలకువలు తెలుసుకో..!

హైటెక్స్‌లో ఎఫ్‌ఆర్‌ఓ ఎక్స్‌పో పేరుతో భారీ ప్రదర్శన

ఫ్రాంఛైజీలు ఇవ్వడానికి ముందుకొచ్చిన వ్యాపార సంస్థలు



సాక్షి, సిటీబ్యూరో: మార్కెట్‌లో ఎలాంటి వ్యాపారాలు లాభసాటిగా నడుస్తున్నాయో తెలుసుకోవాలనుందా.. మంచి గుర్తింపు ఉన్న సంస్థల ఫ్రాంఛైజీల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియడంలేదా.. అయితే ఎందుకు ఆలస్యం..? ఎఫ్‌ఆర్‌ఓ ఎక్స్‌పోను సందర్శించండి. ఈ మేరకు హైటెక్స్‌లో ఎఫ్‌ఆర్‌ఓ ఎక్స్‌పో కొలువుదీరింది. లాభసాటి బిజినెస్, వ్యాపార ఫ్రాంఛైజీల విస్తరణ ఆలోచన చేసేవారికి ఈ ఎక్స్‌పో వేదికైంది. వ్యాపార మెలకువలు నేర్చుకోవడం, కొత్త వ్యాపార అవకాశాలను తెలుసుకోవడం, వ్యాపార సంస్థలను విస్తరించడం ఇలా విభిన్నమైన కోణాల్లో ఇక్కడ చర్చలు జరిగాయి. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ, ఆహార ఉత్పత్తులు, సౌందర్యం, పెంపుడు జంతువులు, ఆరోగ్యం, విద్యుత్తు పొదుపు, టీ, సోడా తదితర విభాగాలకు చెందిన ఎన్నో సంస్థలు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. రెండు రోజులపాటు వేలాదిమంది సందర్శకులు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తమ ఆలోచనలకు అనుగుణమైన సంస్థలతో సంప్రదింపులు జరిపారు. ఫ్రాంఛైజీల రూపంలో వ్యాపార స్థాపనకు సుముఖంగా ఉన్నవారితో ఆయా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇలాంటి ఎక్స్‌పోలు ఉంటే వ్యాపార సంస్థలు, విస్తరణ, కొత్తగా వ్యాపార రంగంలో రాణించాలనుకున్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు.

బ్యూటీ రంగానికి ఆదరణ



బ్యూటీ, స్కిన్, హెయిర్ కేర్ రంగాలకు మంచి ఆదరణ ఉంది. మా బ్రాండ్ ఫెమీనా సెలూన్, సికారా క్లినిక్‌లు ఫ్రాంఛైజీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఒక్కో ఫ్రాంఛైజీకి రూ.1.7 కోట్లు వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. నెలకు దాదాపు రూ.40 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటి వరకు దేశంలో 30 ఫ్రాంఛైజీలు ఇచ్చాం. ఈ రెండు రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 300 మంది మా స్టాల్‌ను సందర్శించారు. 20 మంది లీడ్స్ సైన్ చేశాం. ఇలాంటి బిజినెస్ ఎక్స్‌పోలు నిర్వహించడం వల్ల ఇటు వ్యాపారులకు, అటు వ్యాపార రంగంలో రాణించాలనేకునేవారికి ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.రాఘవేందర్‌రెడ్డి, ఫెమీనా సెలూన్, సికారా క్లినిక్ సీఈఓ, బంజారాహిల్స్

పెంపుడు జంతువులకు డిమాండ్



పెంపుడు జంతువులకు నగరంలో చాలా డిమాండ్ ఉంది. మార్కెట్‌లో పెట్ ఐటమ్స్, బ్రాండెడ్ బ్రీడ్స్‌కు మంచి ఆదరణ ఉంది. మాకు రెండు స్టోర్లు ఉన్నాయి. ఫ్రాంఛైజీలు ఇవ్వాలనే ఉద్దేశంలో ఇక్కడికి వచ్చాం. చాలామంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్రాంఛైజీకి రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన ఇంటీరియర్ డెకరేషన్ ప్లాన్ ఇస్తాం. సరుకులు మేమే సరఫరా చేస్తాం.

– కె.సూర్యకళారెడ్డి, గో పప్పీ పెట్ కేర్ ఫౌండర్, డైరెక్టర్, హైదరాబాద్

ఫ్రూట్ జ్యూస్ వ్యాపారం చేయాలని...



ఫ్రూట్ జ్యూస్ తరహా వ్యాపారం కోసం చూస్తున్నాను. విశాఖపట్నం, హైదరాబాద్, విజయనగరం ప్రాంతాల్లో బిజినెస్ ప్రారంభించాలని ప్లాన్ చేసుకుంటున్నాం. షోడా, మిల్క్ షేక్, ఫ్రోజన్ వంటి స్టాల్స్ ప్రతినిధులతో మాట్లాడాం. వారి ఫ్రాంఛైజీకి తీసుకునే డబ్బు, మనకు అవసరమైన పెట్టుబడి వివరాలు వెల్లడించారు. మంచి గైడెన్స్ దొరుకుతుంది.

– మాణిక్యం, రాజాం, విజయనగరం జిల్లా

మిల్లెట్స్ ఆరోగ్యకరమైన ఆహారం



ప్రస్తుతం ట్రెండ్ మారుతోంది. మిల్లెట్స్ పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లతో మళ్లీ మిల్లెట్స్ ప్రాధాన్యతను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం రిషీస్ మిల్లెట్స్ స్థాపించాను. రైతులతో ఒప్పందం చేసుకుని నేరుగా వారి పంటలను తీసుకుంటున్నాం. 20 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాం.

– ఉదయవాణి, రిషీస్ మిల్లెట్స్ ఫౌండర్, హైదరాబాద్

ప్రశాంతంగా అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ-సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ/ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో అడ్మిషన్స్ పొందవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణను అకమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, ప్రొఫెసర్ ఆనంద్ పవార్, పరీక్షల నియంత్రణ అధికారి భోజు శ్రీనివాస్ పర్యవేక్షించారు.

టీజీ సీపీజీఈటీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ-సీపీజీఈటీ-2025 నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడునక్క శ్రీశైలం యాదవ్ కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఓయూ సంయుక్తంగా నిర్వహించే టీజీ-సీపీజీఈటీ నోటిఫికేషన్ విడుదలలో ప్రతి ఏటా తీవ్ర జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూతోపాటు రాష్ట్రంలోని ఇతర వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎంఎల్‌ఐసీ, ఎంఎస్‌డబ్ల్యూ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు టీజీ-సీపీజీఈటీ ప్రవేశ పరీక్ష ఆలస్యమవుతుండగా, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్, బీఈడీ, పీజీ ఇంజినీరింగ్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్, లాసెట్, ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదలై అభ్యర్థులు దరఖాస్తులు కూడా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలలో జాప్యం వలన ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్ ఆలస్యమవుతుందని, వివిధ పీజీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు, ఫలితాలలో జాప్యం కారణంగా విదేశీ విద్యార్థుల ప్రవేశాలు పూర్తిగా తగ్గాయని తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి వెంటనే టీజీ-సీపీజీఈటీ నోటిఫికేషన్ విడుదల చేయాలని శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు.

మహిళల ఆరోగ్యానికి 'ఫన్ ఫర్ షి' రన్



సాక్షి, సిటీ బ్యూరో: మహిళా దినోత్సవం సందర్భంగా ఉప్పల్ రన్నర్స్ 'ఫన్ ఫర్ షి' ఆధ్వర్యంలో 5కె, 10కె ఫన్ రన్ 2.0 నిర్వహించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు మొదలైన ఈ కార్యక్రమంలో అన్ని వయసుల నుంచి మహిళలు, పిల్లలు, పురుషులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా జుంబాతో అందరిలో ఉత్సాహాన్ని నింపి రన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ శిరీష, డాక్టర్ పద్మజ, సుధ, రాధ, సంగీత బ్రాండ్ అంబాసిడర్లుగా మహిళలకు ప్రోత్సాహాన్ని అందించారు. ప్రధానంగా మహిళలకు ఫిట్‌నెస్ ప్రాధాన్యత గురించి వివరించారు. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడంలో శ్రద్ధ వహిస్తే ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని, ప్రతి ఒక్కరిలో ఆరోగ్య స్పృహ పెరగాలని బ్రాండ్ అంబాసిడర్లు సూచించారు. ఈ రన్‌లో రన్నర్స్ కోసం నిర్వాహకులు నిర్వాహకులు రవి, శ్రీనివాస్ పానీయాలు, పండ్లు, అల్పాహారం అందుబాటులో ఉంచారు.

వాస్తవికత వైపే ఆధునిక తెలుగు సాహిత్య పయనం

హెచ్‌సీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు



ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సామాజిక వాస్తవికత వైపే ఆధునిక తెలుగు సాహిత్య పయనిస్తోందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయన గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి మాట్లాడారు. అర్ధ శతాబ్దపు ఆంధ్ర కవిత్వం ప్రగతిశీల మార్గంలో నడిచిందని, 1910 నుంచి 1960 వరకు మధ్యలో కొంత మంది సంప్రదాయ పద్య కవిత్వాన్ని అనుసరించినా, గురజాడ, కృష్ణశాస్త్రి, కాళోజీ, దాశరథి, శ్రీశ్రీ వంటి వారంతా సామాజిక వాస్తవికతను ప్రతిబింబించే రచనలే చేశారని శ్రీపాద గోపాలకృష్ణమూర్తి తన గ్రంథంలో వివరించారని గుర్తుచేశారు. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి ఫిజిక్స్‌లో డాక్టరేట్ సాధించిన శ్రీపాద లోతైన సాహిత్య విమర్శ చేశారని, ఆధారం లేకుండా ఏ ప్రకటనా చేయరని పేర్కొన్నారు. తెలుగులో ఆధునికత, నవ్య కవిత్వం అనేది ఒక్కసారిగా, ఒక వ్యక్తి పరంగా రాలేదని స్పష్టం చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటం, సంస్కరణ ఉద్యమ ప్రభావాలు దేశంలో ఆధునికతకు కారణమయ్యాయని, అదే తెలుగు సాహిత్యంలో కూడా ప్రతిబింబించిందని తన గ్రంథంలో నిరూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనంద్, డాక్టర్ శివప్రసాద్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

మహిళల చిత్ర కళాఖండాలు అద్భుతం



ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో డాక్టర్ మహేందర్‌కుమార్‌రెడ్డి, వివేక చూడామణి తదితరులు

లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేందర్‌కుమార్‌రెడ్డి

విజయనగర్ కాలనీ: మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో సిరి శక్తి పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. ఈ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేందర్‌కుమార్ రెడ్డి, భరత నాట్యం, కూచిపూడి నృత్య కళాకారిణి వివేక చూడామణి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 118 మంది బాలికలు, మహిళలు, వయోవృద్ధుల కుంచెల నుంచి జాలువారిన కళాఖండాలు అబ్బుర పరుస్తున్నాయని కొనియాడారు. ఈ ప్రదర్శన మే నెల 15 వరకు తిలకించవచ్చని కార్యక్రమ నిర్వాహకులు సిరి స్వామి, ప్రముఖ మెజీషియన్ చొక్కాపు వెంకటరమణలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత పద్మా కమలాకర్, ఎన్‌సీసీ అధికారి సరోజ్ బాల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో యూరాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



సెమినార్‌ను ప్రారంభిస్తున్న భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: పిల్లల్లో కనిపించే యూరాలజీ సమస్యలపై ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని పలువురు వైద్య నిపుణులు హెచ్చరించారు. ఆదివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో నెఫ్రో-యూరో సమ్మిట్-2025ను కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు ప్రారంభించగా కిమ్స్ కడల్స్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మౌనిక మోటమర్రి, డాక్టర్ బాబు ఎస్.మదాల్కర్, డాక్టర్ యోగ నాగేందర్, డాక్టర్ నరగే దెకాట్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ వీఎస్ రెడ్డి, డాక్టర్ నితిన్ చావ్లా పాల్గొన్నారు. చిన్నపిల్లల కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయని, నొప్పి అని చెప్పినా, మూత్రంలో రక్తచారికలు కనిపించినా తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. పట్టించుకోకుండా వదలేస్తే కిడ్నీలు పాడయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లల శరీర బరువులో ఒక కేజీకి 2 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువ ప్రోటీన్ ఉంటే జాగ్రత్త పడాలని, చిన్నతనంలోనే అధిక రక్తపోటు ఉంటుందని, దీన్ని పట్టించుకోకపోయినా కిడ్నీలు పాడైపోతాయని తెలిపారు. ఐదేళ్లు దాటిన కూడా కొందరు పిల్లలు పక్కతడిపే అలవాటు ఉంటుందని, దీని కోసం కిమ్స్ కడల్స్‌లో ప్రతి మంగళవారం బెట్ వెట్టింగ్ క్లినిక్ పనిచేస్తుందని చెప్పారు.

సహాయ ఫౌండేషన్ అవార్డుల ప్రదానం



సహాయ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రౌనక్‌యార్ ఖాన్ తదితరులు

బంజారాహిల్స్: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అవార్డులు ప్రదానం చేశారు. భారతదేశంలో లింగ తటస్థత ప్రాముఖ్యతను వివరించేందుకు సహాయ ఫౌండేషన్ బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమానికి ఆసఫ్‌జాహీ రాజవంశం తొమ్మిదో నిజాం రౌనక్‌యార్ ఖాన్ ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి పూనంకౌర్, నటుడు సుమన్, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామల, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనిత తదితరులు పాల్గొన్నారు. మహిళా సాధికారత కల్పించడానికి ఈ ఫౌండేషన్ తన వంతుగా నిబద్ధతతో కృషి చేస్తోందని వక్తలు పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఇందిరాపార్కు వద్ద ఉద్యోగుల ధర్నా



కవాడిగూడ: జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ సంస్థలకు నిధులు కేటాయించకపోవడం సరికాదని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు సిబ్బంది ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కుటుంబసభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ 2025-26లో సంస్థకు నిధులు కేటాయించకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. ధర్నా చేస్తున్నవారికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జి.నర్సింహారావు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్‌ల బలోపేతానికి ఎన్ఐఆర్‌డీపీఆర్ విశేషంగా కృషి చేస్తోందన్నారు. నర్సింహారావు మాట్లాడుతూ పెన్షన్లు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ అమలు కోసం గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి నిధులు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అకడమిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ జ్యోతీసత్యపాలన్, డాక్టర్ ధీరజ, డాక్టర్ రాజేష్ కుమార్ సిన్హా, డాక్టర్ పల్లా అనురాధ, డాక్టర్ ఎం.వి. రవిబాబు, డి.రామకృష్ణ, సునీల్ కుమార్, పరశురాముడు, మహ్మద్ అలీ, జంగయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞా దివస్ నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. 2011 మార్చి 10న నిర్వహించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ప్రతిజ్ఞా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చీమ శ్రీనివాస్, పట్లోళ్ల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీ వేసి గుర్తింపు కార్డులను జారీ చేయాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు వీరస్వామి, కొండా స్వామి, ఐలయ్యయాదవ్, జ్యోతిరెడ్డి, గగన్‌కుమార్, జానకిరెడ్డి, అనిల్, రాజేశ్వర్, దయానంద్, ఇందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనాలి

కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు

పంజగుట్ట: తెలంగాణలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, బొగ్గు బ్లాక్‌లను దక్కించుకుంటేనే సింగరేణికి భవిష్యత్ ఉంటుందని సింగరేణి కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'సింగరేణి భవిష్యత్తు కొత్త బ్లాక్‌ల కోసం వేలం పాటలో పాల్గొనడం' అనే అంశంపై సింగరేణి గుర్తింపు పొందిన కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ, సీఎంఓఏఐ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, వీరభద్రయ్య, ప్రసాద్, ఎస్.నర్సింహారెడ్డి, లక్ష్మీపతి గౌడ్, వై.వి.రావు మాట్లాడారు. ఇప్పటికే సత్తుపల్లి, ఇల్లందు బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేశారని, ఇప్పుడు కూడా వేలంలో పాల్గొనకపోతే సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ వేలం ప్రక్రియద్వారా బ్లాక్‌ను దక్కించుకుంటే ప్రతీ టన్ను బొగ్గుకు 18.5 శాతం వరకు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని, అదే కేటాయింపుల ద్వారా దక్కించుకుంటే 28 శాతం పన్నులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలు, 42 వేలమంది పర్మినెంట్ ఉద్యోగులు, మరో 30 వేల మంది ఒప్పంద కార్మికుల భవిష్యత్ దృష్ట్యా వేలం పాటలో పాల్గొనాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు.

న్యూరల్ ఏఐ ఆవిష్కరణ

మాదాపూర్: ప్రభుత్వ కార్యకలాపాల్లో సామర్థ్యం, భద్రత, పారదర్శకతను పెంచడానికి న్యూరల్ ఏఐ(టెక్నాలజీ)ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు భారత్ లైట్‌హౌస్ వ్యవస్థాపకుడు కేఆర్ మోహన్ కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూరల్ ఏఐ గవర్నెన్స్ సమ్మిట్-2025ను భారత్ లైట్‌హౌస్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అధికారులు, విధాన నిర్ణేతలు, ఏఐ ఆలోచనా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్ మాట్లాడుతూ తమ పరిష్కారాలను ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మౌలిక సదుపాయాలలో ఉన్న డేటాతో పొందవచ్చని తెలిపారు. భారత్‌లైట్‌హౌస్ బ్యూరోక్రాట్‌ల కోసం, పరిపాలన పనులను సులభతరం చేసే అత్యాధునిక న్యూరల్ ఏఐ అసిస్టెంట్ అయిన ఝ్ఫ్రజీ (మోడరన్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్‌ను విడుదల చేసింది). కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి ఆళ్ల, వ్యాపారవేత్త సందీప్ బుర్చండి, బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, ఐటీఐ హైదరాబాద్ జనరల్ మేనేజర్ గౌరభ్‌ధార్ తదితరులు పాల్గొన్నారు.



న్యూరల్ ఏఐ గవర్నెన్స్ సమ్మిట్‌లో పాల్గొన్న అధికారులు, విధాన నిర్ణేతలు, ఏఐ ఆలోచనా నాయకులు

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 10, మార్చి, 2025

ఏకం

డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్ : జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని అనంత్ డైమండ్ జ్యువెలర్స్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కలెక్షన్స్‌తో డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన విభిన్న రకాల డైమండ్ జ్యువెలరీ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. ఏకం పేరుతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని, ఏకం అంటే నగలు మాత్రమే కాదని, స్త్రీ తత్వానికి, స్త్రీ సాధికారతకు, వ్యక్తిత్వానికీ చిహ్నమని నిర్వాహకులు వెల్లడించారు.



అంబేడ్కర్ వర్సిటీలో..

పింక్ సైక్లోథాన్..

బంజారాహిల్స్: మహిళలు క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండడమే కాకుండా ఆరోగ్యకరంగా ఉంటారని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియాలో మహిళల క్రీడా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆదివారం పింక్ సైక్లోథాన్ (సైకిల్ ర్యాలీ) నిర్వహించారు. చక్రపాణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రత్యేకంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. పరిపాలనా భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ సైన్స్ బ్లాక్ మీదుగా అకడమిక్ భవనం మీదుగా అంబేడ్కర్ విగ్రహం, రోడ్డు నెంబర్ 45లోని ప్రధాన గేటు వరకూ వెళ్లి తిరిగి పరిపాలనా భవనం వరకూ సాగింది. వంద మందికి పైగా విద్యార్థినులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టిసిపెంట్లందరికీ ప్రత్యేక సర్టిఫికెట్లు అందించనున్నారు. అకడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, యూజీసీ–డెబ్ డైరెక్టర్ పల్లవీ కాబ్డే, మహిళా విభాగం ఇన్‌ఛార్జి డైరెక్టర్ మేరీ సునంద, ఎన్.రజనీ, కే శ్రీదేవి పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై

షీ లీడ్స్ టెక్



అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ముఖ్య అతిథులుగా మహిళా పోలీస్ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'షీ లీడ్స్ టెక్' కార్యక్రమం సైబర్ భద్రత, మహిళల సాధికారత ప్రాధాన్యతను ప్రదర్శించింది. బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ వేదికగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ ఎస్.స్వేత సైబర్ భద్రతలో మహిళల పాత్ర, ప్రాముఖ్యతను వెల్లడించారు. నాయకత్వ స్థాయిల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. సైబర్ క్రైం డీసీపీ దారా కవిత మాట్లాడుతూ.. ఈ డిజిటల్ యుగంలో సైబర్ అవగాహన, ప్రోయాక్టివ్ భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు. సైబర్ ముప్పులు, కెరీర్ వృద్ధి, డిజిటల్ నమ్మకంపై ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్ జీసీఎస్ శర్మ, షీ లీడ్స్ టెక్ డైరెక్టర్ అర్థ వరలక్ష్మి, సోషల్ మీడియా డైరెక్టర్ షారన్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య, అసిస్టెంట్ ట్రెజరర్ ఉషా గాయత్రి పాల్గొన్నారు.





వినోదం వికాసం

సాధారణ మనుషుల్లా కాకుండా ఆయనకు మూడో కన్ను ఉంటుంది.., అదే తన కెమెరా. ఈ కన్నుతో తాను చూసిన అద్భుతాలు, సామాజిక అంతరాలు వంటి విశేషాంశాలన్నింటినీ కెమెరాలో బంధిస్తాడు. అలా తను తీసిన ఫొటోలు భారత్‌తో పాటు విదేశాల్లోని ఫొటో ఎగ్జిబిషన్లలో ప్రదర్శించాడు. ఆయనే వినోద్ వెంకపల్లి. ఆయన ప్రయాణం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక ఇతివృత్తాలను బంధించి ప్రపంచానికి పరిచయం చేశాడు. చదువుకుంది ఐఐటీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, కానీ తన శోధన, పరిశోధన అంతా ఫొటోగ్రఫీనే. ఎందుకు అని ఎవరైనా అడిగితే.. అందులోనే సంతృప్తి దొరుకుతుందని చెబుతాడు. తన ఫొటోగ్రఫీ నైపుణ్యంతో క్యోటో వేదికగా జరగనున్న కేజీ ప్లస్ సెలెక్ట్ 2025 ఫొటో ఎగ్జిబిషన్‌కు అర్హత సాధించారు. ఇందులో పాల్గొనడానికి ప్రపంచ వ్యాప్తంగా 10 మందికి మాత్రమే అవకాశముంటుంది. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన వినోద్ తన అనుభవాలను, ప్రయాణాన్ని సాక్షితో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..
- సాక్షి, సిటీబ్యూరో

ఇంజనీరింగ్.. చెన్నైలో, ఎమ్‌టెక్ ఐఐటీ దన్‌బాగ్‌లో చేశాను. కానీ నా ఆలోచనలన్నీ సమాజం చుట్టూనే తిరిగేవి. ముఖ్యంగా సామాజిక సమస్యలు, ఇతివృత్తాలను పరిశోధించడం, ఫొటోలుగా బంధించడం ఇష్టం. వాటితో స్టోరీ టెల్లింగ్ ఇంకా ఇష్టం. దీని కోసం ఎంత దూరమైనా కెమెరా బుజాన వేసుకుని బైక్‌పై వెళుతుంటాను. కొన్ని రోజులు జాబ్ కూడా చేశాను.. కానీ సంతృప్తినివ్వలేదు. కెమెరాతో ఊర్లు తిరుగుతూ.. అక్కడి సంస్కృతులు, సంప్రదాయాలు, పండుగలు, జాతరలు, కష్టాలు, సంతోషాలను ఫొటోలుగా తీయడం మంచి అనుభూతినిచ్చేది. ఇలా 11 ఏళ్ల నుంచి ఫొటోగ్రఫీ, డాక్యుమెంటరీలతో నా సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. ఈ ప్రయాణంలో కేజీ ప్లస్ సెలెక్ట్ 2025 ఫొటో ఎగ్జిబిషన్‌లో పాల్గొనుండటం సంతోషంగా ఉంది. ఏప్రిల్ 12 క్యోటోలో నా ఫొటోలను ప్రదర్శించనున్నాను. గతంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కంబోడియా, తైవాన్, అమెరికా వంటి దేశాల్లో నిర్వహించిన ఎగ్జిబిషన్లలో ఫొటోలు ప్రదర్శితమయ్యాయి.





ఫొటోగ్రఫీతో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

తెలంగాణ సామాజిక ఇతివృత్తాలే నేపథ్యం

- ప్రతిష్టాత్మక కేజీ ప్లస్ సెలెక్ట్-2025 ఫొటో ఎగ్జిబిషన్‌లో అర్హత
- తెలంగాణ సంస్కృతి, సంక్షోభాలను ప్రదర్శించిన కెమెరా
- పలు అంతర్జాతీయ వేదికల్లోనూ వినోద్ ఫొటోలు



ప్రయాణం నగరం నుంచే..

నగరంలోని ట్యాంక్‌బండ్ వంటి ప్రదేశాల్లో ఫొటోలు తీస్తూ మొదలు పెట్టిన ప్రయాణం తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు చేరింది. చిన్నప్పటి నుంచి గ్రామీణ వాతావరణం ఏమీ తెలియదు. అమ్మా, నాన్న డాక్టర్లు. కానీ వారు నా సామాజిక బాధ్యతను ప్రేరేపించే వారు. అటువైపు నన్ను ప్రోత్సహించేవారు. ఈ ప్రయాణంలో నల్గొండ ఫ్లోరోసిస్‌పై పరిశోధనాత్మక ఫొటోగ్రఫీ చేశాను. దీని కోసం బైక్‌పై నల్గొండలోని ఫ్లోరైడ్ బెల్ట్‌కు వెళ్లేవాడిని. అంతేకాకుండా తెలంగాణలోని అప్పటి నీళ్ల కష్టాలను నా ఫొటోలతో చూపించాను. అరకులో మలేరియా వ్యాపించి ప్రజలు అవస్థలు పడుతున్నారనే విషయం తెలుసుకుని చేసిన ప్రాజెక్టు ఇంకా కళ్ల ముందే మెదులుతోంది. మహబూబ్‌నగర్‌లో నీటి ఎద్దడికి ఇసుక చలిమల్లో ఓ చిన్నారి ముంతతో నీరు సేకరించిన ఘటన..నీటి ప్రధాన్యతను తెలియజేసింది. కరువు, సంక్షోభాలు, విపత్కర పరిస్థితులు, సామాజిక సమస్యలు, మానవీయ కోణాలు, వివక్ష, సాంఘిక అకృత్యాలను ఫొటోలుగా బంధిస్తూ వచ్చాను.



క్రమంగా నమ్మకం కలిగింది..

హైదరాబాద్‌లో బోనాలు, ముంబైలో వినాయక చవితి, మహాకుంభ మేళా.. ఇలా సందర్భం ఏదైనా అక్కడి పరిస్థితులను చిత్రించాను. అమ్మ నాన్నలు నాస్తికులు.. కానీ ప్రజల్లో దేవుని పై నమ్మకం నన్ను ఆలోచింపజేసేది. నమ్మకం లేకుంటే మనిషి పరిస్థితులు ఏంటనే దిశగానూ శోధించాను. అప్పులు చేసి పంట వేసిన ఒక రైతు దేవుడి పై నమ్మకంతో తన జీవనాన్ని ఎలా ముందుకు సాగిస్తాడు.. ఆ నమ్మకమే లేకుంటే కష్టజీవుల మానసిక అవస్థలు ఎలా ఉంటాయో దగ్గరగా చూశాను.



అది అమాయకత్వం కాదు.. ఆప్యాయత..

ఫొటోల కోసం గ్రామాలకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజల స్వచ్ఛమైన మనస్తత్వం చూశాను. మొదట్లో ఆశ్చర్యపడేవాడిని. ఓ అవ్వ అన్నం పెట్టేది. ఒక పెద్దాయన తన ఇంట్లో ఆశ్రయం కల్పించేవారు. ఇలా పల్లె మట్టిలో అమ్మతనం నన్ను ఫొటోగ్రఫీలో మరింత లోతుగా తీసుకెళ్లింది. మొదట్లో అదంతా అమాయకత్వం అనుకున్నా.. కాదు ఆప్యాయత అని నెమ్మదిగా తెలుసుకున్నా. తోటి మనుషులకు వారిచ్చే విలువను తెలుసుకున్నా. అఫ్గాన్ వార్‌లో చనిపోయిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ దానిష్‌సిద్ధికీ (ఢిల్లీ) పలు విలువైన సూచనలిచ్చి ఫ్రీలాన్స్ ఫొటో జర్నలిస్టుగా మారేలా చేశారు.



వివిధ వేదికల్లో..

నా ఫొటోలు ది న్యూయార్క్ టైమ్స్, ది గార్డియన్, ది వాషింగ్టన్ పోస్ట్, ఎమ్ఎస్ఎన్ సౌత్ ఆఫ్రికా, డైలీ మెయిల్, యాయూ న్యూస్ యూకే, నేషనల్ పోస్ట్, యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ వంటి వేదికల్లో ప్రచురితమయ్యాయి. నాకు విభిన్న కళల్లో ప్రావీణ్యముంది.. డ్రాయింగ్ వేస్తాను. శిల్ప కళలోనూ ప్రావీణ్యముంది. మెటల్ ఫేస్ తయారు చేస్తాను. ఫొటోగ్రఫీకి బయటకు వెళ్లడానికి నాకు డబ్బులను అందించేది నా డ్రాయింగ్ మాత్రమే. నా ఫొటోల్లో బంధించలేని వాటిని బొమ్మలుగా వేసి ముంబై ఆర్ట్ ఫెయిర్‌లో ప్రదర్శిస్తే.. అన్నీ అమ్ముడుపోయాయి. ఫొటోగ్రఫీలో ప్రతిష్టాత్మక టోటో ఫొటోగ్రఫీ అవార్డ్, రెండు సార్లు తెలంగాణ స్టేట్ అవార్డులను అందుకున్నాను. ఇండియన్ ఫొటోగ్రఫీ ఫెస్టివల్‌లో సభ్యుడిని. సామాజిక అంశాల ఇతివృత్తంతో రెండు, మూడు డాక్యుమెంటరీలు, షార్ట్‌ఫిల్మ్‌లు తీసే ప్రయత్నంలో ఉన్నాను.



సోషల్ పోలీస్..

- విధులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్న ఇన్‌స్పెక్టర్
- జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌కు జ్యూరీ అవార్డు
- యూట్యూబ్ చానల్‌లో వివిధ అంశాలపై అవగాహన

'అత్యాశ, అమాయకత్వం, అత్యుత్సాహం.. ఈ మూడింటినీ ఎవరికి వారు నియంత్రించుకోవాలి. సైబర్ మోసాల పట్ల అవగాహన పెంచుకో.. నిన్ను నువ్వు కాపాడుకో.. నివారణ కంటే నియంత్రణ ఉత్తమం'.. అని అవగాహన కల్పిస్తున్నారు జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్. సెల్‌ఫోన్ వినియోగంతో పాటు సోషల్ మీడియా ఫాలోవర్స్ అంతకంతకూ పెరిగిపోతున్నారు..దీనికి తగ్గట్టుగానే సైబర్‌నేరాలు సైతం ఎక్కువయ్యాయి. సైబర్ నేరగాళ్ల మాయలోపడి కొంతమంది డబ్బు పోగొట్టుకుంటే.. మరికొంత మంది నేరగాళ్ల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పోలీసు విభాగంలో పని చేస్తున్న మల్లేష్‌కు ఇలాంటివి విన్నప్పుడల్లా ఏదో తెలియని ఆవేదన. ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలన్న తపనతో సోషల్ మీడియా ద్వారా వారికి అవగాహన కల్పించాలని 'క్రైం ఫ్రీ ఇండియా 2020' యూట్యూబ్ చానల్ ప్రారంభించారు. ప్రస్తుతం మల్లేష్‌కు అదే చానల్ పోలీసు విభాగంలో మంచి పేరును సంపాదించి పెట్టింది. అవార్డు వచ్చేలా తోడ్పడింది. - జీడిమెట్ల

క్రైం ఫ్రీ ఇండియా 2020లో 100కు పైగా వీడియోలు.. లక్షకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రోత్సాహంతో మల్లేష్ తన యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించాడు. సైబర్ నేరాలపై సాధారణ ప్రజలకు అర్థమయ్యే విధంగా వీడియోస్ చేసి పోస్టు చేస్తున్నాడు. అనతి కాలంలోనే లక్షకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. వీడియోస్ చూసిన ప్రజలు.. వాటి వల్ల జాగ్రత్తగా ఉంటున్నాం సార్ అంటూ రిప్లై ఇస్తుండటంతో మరింత ఉత్సాహంతో వీడియోస్ చేస్తున్నారు.

పలు వేదికలపై అవగాహన కల్పిస్తూ..

వివిధ కార్యాలయాలతో పాటు కళాశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ గేమింగ్, జాబ్‌ఫ్రాడ్స్ నుంచి ఎలా జాగ్రత్తగా ఉండాలో సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఎలాంటి ఫొటోలు, వీడియోలు ఇతరులకు షేర్ చేస్తున్నారో సరి చూసుకోవాలని, సోషల్ మీడియాలో పెట్టదగ్గవి మాత్రమే ఉంచాలని సూచిస్తున్నారు. ప్రొఫైల్ లాక్ తప్పకుండా ఉండాలని వివరిస్తున్నారు.



ప్రజలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బు, ప్రాణాలు పోగొట్టుకోవడం కలచివేసింది. వెంటనే ఏదైనా చేయాలి అనే ఆలోచన మనసులో తట్టింది. సోషల్‌మీడియా చేసే గాయాలను అదే వేదిక ద్వారా మార్చాలి అనుకున్నా.. ఉన్నతాధికారుల అండతో చానల్ ప్రారంభించి అవగాహన కల్పిస్తున్నాను. ఆరోజు తట్టిన ఆలోచనే 2023లో సజ్జనార్ నుంచి సోషియో వుడ్, 2025 ఢిల్లీలో స్పెషల్ జ్యూరీ అవార్డు వచ్చేలా చేసింది. అవార్డుల కంటే ప్రజలకు అవగాహన కల్పించడం తృప్తిని ఇస్తుంది.

క్రికెట్‌లో యువ చాణక్యుడు..

40 టోర్నమెంట్లు.. 7 మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు

13 ఏళ్లకే క్రికెట్‌లో సత్తా చాటుతున్న కుర్రోడు

- జూనియర్స్ విభాగంలో కార్తీక్ ప్రతిభ



గోల్కొండ : పదమూడు యేళ్ల వయసులో ఓ కుర్రాడు వివిధ ప్రాంతాల్లో 40 క్రికెట్ టోర్నమెంట్‌లు ఆడేశాడు. వీటిలో ఏకంగా ఏడింటిలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. షేక్‌పేట్‌కు చెందిన వై.చాణక్యానంద కార్తీక్ (13) ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకొని కోచింగ్ సెంటర్‌కు వెళ్లడం ప్రారంభించాడు. టోలిచౌకీ ఫరూక్ క్రికెట్ అకాడమీలో కోచ్ ఫరూక్ శిక్షణలో ఇటు బ్యాటింగ్‌లోనూ అటూ బౌలింగ్‌లోనూ రాటుతేలాడు. స్పిన్ ఆల్ రౌండర్ స్థాయికి ఎదిగాడు. ఆడిన ప్రతి టోర్నమెంట్‌లోనూ తన సత్తాచాటుతున్నాడు. ఇంటర్ స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో యేటా జహీరాబాద్‌లో జరిగిన క్రికెట్ ఫైనల్స్‌లో తన టీమ్‌ను విజేతగా నిలిపాడు.



షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుతున్న కార్తీక్ ఇప్పటి వరకు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ జిల్లాల్లో జూనియర్, సబ్ జూనియర్ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నాడు. ఆడిన ప్రతి టోర్నమెంట్‌లోనూ టీమ్ మేనేజ్‌మెంట్‌ను నిరాశపరచకుండా విజేతగా నిలుపుతున్నాడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే సెలక్షన్స్ ట్రైల్స్‌కి కార్తీక్‌ను పంపుతామని అకాడమీ కోచ్ ఫరూక్ చెబుతున్నారు. తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే సత్తా కార్తీక్‌లో ఉందని కోచ్ అంటున్నారు.

పరుగులు.. వికెట్లు..

కార్పొరేట్ పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో కార్తీక్ ఆడిన మూడు మ్యాచ్‌లలో ఆల్ రౌండర్ ప్రతిభ కనబరిచాడు. రెండు సార్లు బ్యాటింగ్ చేసి 135 పరుగులు సాధించాడు. మొత్తం మూడు మ్యాచ్‌లలో 11 వికెట్లు సాధించి ప్రత్యర్థి బ్యాట్స్ మెన్‌లకు తన స్పిన్ రుచి చూపించాడు. హైదరాబాద్‌కు రంజీ ఆడడమే తన లక్ష్యమని కార్తీక్ చెబుతున్నాడు.

క్లుప్తంగా...

నాటి కేసీఆర్ ప్రభుత్వంతో మీకు పోలికా..?

● ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన నాటి కేసీఆర్ ప్రభుత్వానికి.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి.. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ ద్వారా ఆడబిడ్డల నీటి కష్టాలను కేసీఆర్ తీర్చారని ఆమె గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు మళ్లీ మహిళల ఖాళీ బిందెల ప్రదర్శనలు మొదలయ్యాయని ఎద్దేవా చేశారు. తులం బంగారం హామీని తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి.. ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి వినూత్న పథకాల సృష్టికర్త కేసీఆర్‌తో పోటీనా..? అని నిలదీశారు. కేసీఆర్ కిట్, అమ్మఒడి, న్యూట్రిషన్ కిట్, జిల్లాకు ఒక సఖి సెంటర్ ఏర్పాటు చేసి.. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు ఇచ్చి అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వంతో పోటీనా..? అని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తుంటారని సబిత హెచ్చరించారు.

పేదోడి ప్రాణానికి విలువ ఇదా?

● బీసీ రాజకీయ చైతన్య సదస్సులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'నల్లమల నుంచి వచ్చానని.. చెట్టు, పుట్ట అన్నీ తెలుసంటడు.. కానీ 14 రోజులవుతున్నా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో శవాలను తీసుకురాలేకపోతున్నారు.. ఇదీ మీ పనితీరు' అని సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మండిపడ్డారు. అదే టన్నెల్‌లో మంత్రో, ఎంపీనో, ఎమ్మెల్యేనో ఇరుక్కుపోతే ఇప్పటికే కూలగొట్టకపోదురా అని అసహనం వ్యక్తం చేశారు. పేదోడి ప్రాణానికి ఇస్తున్న విలువ ఇదా అని ప్రశ్నించారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీసీ రాజ్యాధికార చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డికి తెలివిలేదని తన సస్పెన్షన్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. తూడి మేఘారెడ్డికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెడతాష్.. గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను తిట్టినా ఏమనవు.. మీకో న్యాయం .. మాకో న్యాయమా అని నిలదీశారు.

పోస్టు లేదు.. వచ్చినా ప్రమోషన్ అందదు!

- దేవాదాయ శాఖలో చిత్రమైన బది'లీలలు'
- దేవాలయాల నుంచి తాత్కాలిక ట్రాన్స్‌ఫర్లు
- వారి అసలైన పోస్టులో పదోన్నతి వచ్చినా.. బదిలీ అయిన చోట పాత హోదాతోనే కొనసాగింపు
- ప్రయోజనాలు అందుకోలేక ఉద్యోగుల ఆందోళన
- ఈ శాఖలో ఆడిట్ అంతా ఉత్తదేనన్న ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: ఆ దేవాలయంలో పోస్టు ఖాళీ ఉండదు.. కానీ మరో దేవాలయం నుంచి ఓ ఉద్యోగిని బదిలీ చేస్తారు.. ఆ ఉద్యోగికి తొలి దేవాలయం (పేరెంట్ ఇన్‌స్టిట్యూషన్)లో పదోన్నతి వస్తుంది.. కానీ బదిలీపై పనిచేస్తున్న చోట ఆ స్థాయి పోస్టు ఖాళీగా ఉండదు.. ఫలితంగా పాత హోదాలోనే పనిచేయాల్సి వస్తుంది.. పదోన్నతితో లభించే ఆర్థిక లబ్ధి, ఇతర ప్రయోజనాలు అందవు.. పోస్టు లేకున్నా అదనంగా పనిచేయించడం ఏమిటంటూ ఆడిట్ నిలదీయదు, అసలు ఆడిట్ జరుగుతోందా లేదా అన్నది ఉన్నతాధికారులు పట్టించుకోరు.. ఇది రాష్ట్ర దేవాదాయ శాఖలో జరుగుతున్న తంతు. సరైన పర్యవేక్షణ లేక ఈ శాఖ వ్యవహారమంతా అస్తవ్యస్తంగా మారిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

➤ వేములవాడ దేవాలయానికి చెందిన ఓ సీనియర్ అసిస్టెంట్‌ను అడ్‌హాక్ బదిలీ కింద కొండగట్టు దేవాలయానికి పంపారు. తర్వాత వేములవాడ ఆలయంలో సూపరింటెండెంట్ పదవీ విరమణ చేయటంతో.. సీనియారిటీ ప్రకారం ఆ పోస్టులో సదరు బదిలీ అయిన ఉద్యోగికి పదోన్నతి లభించింది. సీనియర్ అసిస్టెంట్ కాస్తా సూపరింటెండెంట్ అయ్యారు. కానీ కొండగట్టు దేవాలయంలో ఆ స్థాయి పోస్టు ఖాళీగా లేదు. అయినా నాలుగు నెలలుగా కొండగట్టులోనే ఆ ఉద్యోగి పనిచేస్తున్నారు. అక్కడ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీ లేనందున.. ఆ ఉద్యోగికి సూపరింటెండెంట్ వేతనంగానీ, ఇతర ప్రయోజనాలుగానీ అందడం లేదు. ఇలా పోస్టు లేకున్నా నాలుగు నెలలుగా కొండగట్టులో పనిచేస్తున్నా ఉన్నతాధికారులు అభ్యంతరం వ్యక్తం చేయకపోవటం విశేషం.

➤ యాదగిరిగుట్ట ఆలయానికి చెందిన ఓ సూపరింటెండెంట్‌ను గతంలో వేములవాడకు బదిలీ చేశారు. తర్వాత యాదగిరిగుట్టలో ఓ ఏఈఓ రిటైర్ కావటంతో.. ఆ పోస్టు ఈ బదిలీ అయిన ఉద్యోగికి దక్కింది. కానీ వేములవాడలో ఏఈఓ పోస్టు ఖాళీగా లేకపోవటంతో.. ఆ ఉద్యోగి పదోన్నతి ప్రయోజనం కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికీ ఆయన ఏఈఓ బదులు సూపరింటెండెంట్‌గానే పనిచేయాల్సి వస్తోంది.

➤ వేములవాడకు చెందిన ఏఈఓ స్థాయి అధికారిని గతంలో యాదగిరిగుట్టకు బదిలీ చేశారు. తర్వాత ఆయనకు వేములవాడలో డీఈఓ పోస్టు ఖాళీకావటంతో పదోన్నతి కల్పించారు. కానీ యాదగిరిగుట్టలో డీఈఓ పోస్టు ఖాళీగా లేకపోవటంతో ఆయనకు పదోన్నతి ప్రయోజనం అందడం లేదు.

➤ యాదగిరిగుట్ట నుంచి అడ్‌హాక్ బదిలీ కింద వేములవాడకు ట్రాన్స్‌ఫర్ చేసిన ఓ సూపరింటెండెంట్ వ్యథ కూడా ఇదే.

తూతూమంత్రంగా ఆడిట్..

రాష్ట్రంలో 6ఏ కేటగిరీ కింద ఉన్న ఆరు పెద్ద దేవాలయాల్లో పరిస్థితి మరీ గందరగోళంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు కావాలని పనిగట్టుకుని బదిలీ చేస్తూ, గందరగోళం సృష్టిస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. పదోన్నతి ముందు ఎందుకు బదిలీ చేస్తున్నారో, పదోన్నతి లభించాక అక్కడే ఉంచి ఆర్థిక ప్రయోజనాలు అందకుండా ఎందుకు చేస్తున్నారో అంతుచిక్కడం లేదని అంటున్నారు. ఈ బదిలీల వ్యవహారాలు చూసే ఉన్నతాధికారి టేబుల్‌పై ఇలాంటి అభ్యర్థనలు ఎన్నో పేరుకుపోయినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికిప్పుడు ఈ శాఖలో ఆడిట్ జరిగితే.. ఈ వ్యవహారాలన్నీ బయటపడే అవకాశం ఉందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఉద్యోగులను వేధించటం ద్వారా 'లబ్ధి'పొందే మార్గాలు సృష్టించుకోవటం కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వర్గీకరించకుండా ఉద్యోగ నియామకాలా?

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



పంజగుట్ట (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ చట్టం చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఎలా చేపడతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. ఆయన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేశాకే ఉద్యోగ నియామకాలు చేపడతానని.. ఇప్పటివరకు ఇచ్చిన నోటిఫికేషన్లలో కూడా వర్గీకరణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు గ్రూప్స్ ఫలితాలే కాకుండా.. ఇతర శాఖల ఉద్యోగ నియామక ఫలితాలు వెల్లడించి నియామకాలు చేపడతానని సీఎం చెప్పడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రిని మాదిగలు కలిసినప్పుడు.. తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇస్తానే.. మాలలు కలిసినప్పుడు వారి సూచనలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణ చట్టం తీసుకొచ్చాకే.. నియామకాలు చేపట్టాలంటూ సోమవారం నుంచి ప్రతీ జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో నిరసన దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వర్సిటీలు, జిల్లాల్లోని ప్రధాన విద్యాకేంద్రాల్లో నిరసన తెలుపుతామన్నారు.

ప్రపంచీకరణతో కులవృత్తులకు విఘాతం

● ఎమ్మెల్సీ మధుసూదనాచారి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచీకరణతో కులవృత్తులు.. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణుల వృత్తులు బాగా దెబ్బ తిన్నాయని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి చెప్పారు. విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం స్వర్ణోత్సవాలు తెలుగు వర్సిటీలో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు కన్నెకంటి వెంకట రమణ రాసిన వ్యాసాల సంపుటి 'కాకతీయుల గురించి మరికొంత..' పుస్తకాన్ని, విశ్వబ్రాహ్మణ ధర్మ పీఠం సంచాలకుడు చొల్లేటి కృష్ణమాచార్యులు రచించిన 'విశ్వ శిల్పి రామప్ప రమణీయ శిల్పకళ' నవలను మధుసూదనాచారి ఆవిష్కరించారు.

ఉమెన్స్‌డే రోజు కూడా మహిళలను మోసం చేస్తారా?

బహిరంగసభలో సీఎం, డిప్యూటీ సీఎం అబద్ధాలు చెప్పారు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా దినోత్సవం రోజు కూడా నిజాలు చెప్పకుండా అబద్ధాలతోనే కాలం గడిపిందని మాజీమంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహిళల సభలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్టు చెప్పే మాటలు నిజం కావని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రూ. 5 లక్షల వరకు తీసుకునే రుణాలకే వడ్డీ ఉండదని, మిగిలిన రుణాలపై 12.5 శాతం వడ్డీ చెల్లించాల్సిందేనన్నారు. మహిళా సంఘాలకు రుణాలు పెంచుతామన్న హామీని అమలు చేయకుండా, పాత జీవోను కూడా మార్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. కనీసం మహిళా దినోత్సవం రోజైనా 10 లక్షల వరకూ వడ్డీ లేని రుణాలు ప్రకటిస్తారని అనుకున్నామని, అయితే కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందని తెలిపారు. మహిళా సంఘాలు స్కూల్ యూనిఫామ్‌లు కుట్టినందుకు 75 రూపాయలు ఇస్తున్నామని సీఎం చెప్పారని, నిజానికి 50 రూపాయలే ఇస్తున్నారన్నారు. ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా వరంగల్‌లో రూ. 35 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు ఇచ్చారని, అది క్లియర్ కాక మళ్లీ మరో రూ. 9 కోట్లు కలిపి రూ. 44 కోట్ల చెక్కు ఇచ్చారని, ఇది ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని, ఇప్పటికైనా అవాస్తవాల ప్రచారం మానుకొని ప్రజలకు మేలు చేసేలా పాలన సాగించాలని హరీశ్‌రావు హితవు పలికారు.

వర్గీకరణపై మళ్లీ మోసానికి కుట్ర

బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

సాక్షి హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ విషయంలో మరోసారి మోసగించేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆ పార్టీ నాయకులు టి.రాజయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, గువ్వల బాలరాజు, మెతుకు ఆనంద్ విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు నేపథ్యంలో.. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. కానీ వాస్తవానికి ఎస్సీలను మోసగించాలనే దురుద్దేశంతో గ్రూప్ పోస్టులను భర్తీ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక పూర్తిగా తప్పుల తడకని మాదిగ, మాదిగ ఉపకులాల నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేశారని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ కమిషన్ ఎస్సీలను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించాలని సూచించిందని చెప్పారు. ఆర్థికంగా ముందున్న కులాలను గ్రూప్–ఏలో చేర్చారని, అసలు మాదిగల సంఖ్య 33.33 లక్షలుంటే, 15 లక్షల మంది ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. మాదిగలకు కనీసం 11 శాతం రిజర్వేషన్లు రావాలని డిమాండ్ చేశారు. బుడగజంగాలను మాదిగల ఉపకులంగా గుర్తించినప్పటికీ, వారిని మాదిగల నుంచి వేరు చేశారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తర్వాతే.. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

పెండింగ్ నిధులపై పోరాటం

- రాజ్యసభలో ప్రస్తావించాలని బీఆర్ఎస్ నిర్ణయం
- కాంగ్రెస్ అవినీతిపై కూడా ప్రశ్నిస్తాం: ఎంపీ రవిచంద్ర



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి రావలసిన పెండింగ్ నిధులపై రాజ్యసభలో కేంద్రాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. పార్లమెంట్ మలివిడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ఎంపీల బృందానికి దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ పార్టీలు.. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదని రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. రాష్ట్రానికి రూ.కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉండగా.. కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది ఎంపీలు, బీజేపీకి చెందిన ఎనిమిది ఎంపీలు నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన అంతా తప్పుల తడకని మండిపడ్డారు. ఈ అంశాన్ని కూడా తాము రాజ్యసభలో ప్రస్తావించనున్నట్లు స్పష్టం చేశారు. పలు కేంద్ర పథకాల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలకు పాల్పడుతున్నా.. కేంద్రం పట్టించుకోకపోవడాన్ని కూడా కచ్చితంగా రాజ్యసభలో లేవనెత్తుతామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 20 పోస్టులు

పుణెలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 20.

» పోస్టుల వివరాలు: జనరల్ మేనేజర్(ఐటీయూ)-01, డిప్యూటీ జనరల్ మేనేజర్(ఐటీయూ)-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ట్రెజరీ)-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫారెక్స్ డీలర్)-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(కాంప్లియన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్)-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(క్రెడిట్)-01, చీఫ్ మేనేజర్(ఫారెక్స్/క్రెడిట్/ట్రేడ్ ఫైనాన్స్)-04, చీఫ్ మేనేజర్(కాంప్లియన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్)-02, చీఫ్ మేనేజర్(లీగల్)-01, సీనియర్ మేనేజర్(బిజినెస్ డెవలప్‌మెంట్)-02, సీనియర్ మేనేజర్(బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్స్)-05.

» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎల్ఎల్‌బీ, పీజీ, సీఏ, ఎంబీఏ, పీజీడీఎం, పీజీడీబీఎఫ్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.

» వయసు: జనరల్ మేనేజర్‌కు 55 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 40 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 25 నుంచి 38 ఏళ్లు ఉండాలి.

» వేతనం: నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.1,56,500 నుంచి రూ.1,73,860, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,40,500 నుంచి రూ.1,56,500, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.1,20,940 నుంచి రూ.1,35,020, చీఫ్ మేనేజర్‌కు రూ.1,02,300 నుంచి రూ.1,20,940, సీనియర్ మేనేజర్‌కు రూ.85,920 నుంచి రూ.1,05,280.

» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .

» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.03.2025

» వెబ్‌సైట్: https://bankofmaharashtra.in

ఐటీబీపీ స్పోర్ట్స్ కోటాలో 133 కానిస్టేబుల్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ) స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ), గ్రూప్–సి(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 133(పురుషులు–70, మహిళలు–63).

» విభాగాలు: అథ్లెటిక్స్, స్విమ్మింగ్, షూటింగ్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, తైక్వాండో, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, ఐస్‌హాకీ, హాకీ, ఫుట్‌బాల్, గుర్రపు స్వారీ, కాయాకింగ్, రోయింగ్, వాలీబాల్, జూడో, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, ఐస్ స్కైయింగ్, పవర్ లిఫ్టింగ్, ఖో ఖో, సైక్లింగ్, యోగాసన, పెన్‌కాక్ సిలాట్, బాస్కెట్‌బాల్.

» అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. క్రీడల్లో వివిధ స్థాయిల్లో విజయాలు సాధించి ఉండాలి. వయసు: 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.

» బేసిక్ పే స్కేల్: నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 ఉంటుంది.

» ఎంపిక విధానం: 03.04.2025 నుంచి 02.04.2025 వరకు జరిగిన పారా–4(డి) క్రీడల్లో పతకాలు పొంది ఉండాలి. అభ్యర్థులను ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, మెడికల్ ఎగ్జామినేషన్, మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.04.2025

» వెబ్‌సైట్: http://https//itbpolice.nic.in

ఈఎస్ఎస్ఓ–ఎన్‌సీపీఓఆర్, గోవాలో సైంటిస్ట్ పోస్టులు

గోవాలోని ఈఎస్ఎస్ఓ–నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్ (ఎన్‌సీపీఓఆర్).. సైంటిస్ట్(బీ, సీ, డీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03.

» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

» వయసు: సైంటిస్ట్–డి పోస్టుకు 50 ఏళ్లు, సైంటిస్ట్–బి పోస్టుకు 35 ఏళ్లు, సైంటిస్ట్–సి పోస్టుకు 40 ఏళ్లు నిండి ఉండాలి.

» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.

» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.03.2025

» వెబ్‌సైట్: https://ncpor.res.in

అవుతారా.. బ్యాంక్ మేనేజర్

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ).. 650 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ ఖాళీలకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనుంది. పీజీడీబీఎఫ్ పేరుతో ప్రత్యేక కోర్సును అందిస్తూ.. బ్యాంకులో కొలువులు ఖరారు చేస్తోంది. ఈ నేపథ్యంలో.. ఐడీబీఐ పీజీడీబీఎఫ్ ప్రత్యేకత, ఎంపిక విధానం, కోర్సు–శిక్షణ, రాత పరీక్ష, ప్రిపరేషన్ తదితర వివరాలు..



» మొత్తం 650 పోస్ట్‌లకు ఐడీబీఐ నోటిఫికేషన్
» పీజీడీబీఎఫ్ ప్రోగ్రామ్ + జేఏఎం కొలువు
» ఏడాది పాటు క్లాస్‌రూమ్ శిక్షణ, ఆన్ జాబ్ ట్రైనింగ్
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

పోస్టుల సంఖ్య 650

ఐడీబీఐ తాజాగా పీజీడీబీఎఫ్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 650 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్ట్‌ల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఈ పోస్ట్‌లకు అభ్యర్థుల ఎంపిక చేసి.. వారికి బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు పీజీడీబీఎఫ్ కోర్సును నిర్వహిస్తోంది.

అర్హతలు

- మార్చి 1, 2025 నాటికి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: మార్చి 1, 2025 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పీజీడీబీఎఫ్.. శిక్షణ + కొలువు

ఐడీబీఐ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్).. అందిస్తోంది. ఈ కోర్సు వ్యవధి ఒక ఏడాది. ఈ కోర్సులో భాగంగా అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగ నైపుణ్యాలపై ఆరు నెలల పాటు క్లాస్ రూమ్ శిక్షణ, రెండు నెలల ఇంటర్న్‌షిప్, మరో నాలుగు నెలలు.. ఐడీబీఐ శాఖల్లో ఆన్ జాబ్ ట్రైనింగ్ సదుపాయం కల్పిస్తారు. ఇందుకోసం ఐడీబీఐ.. మణిపాల్ అకాడమీ ఆఫ్ బీఎఫ్ఎస్ఐ, నిట్ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రత్యేక ఒప్పందం చేసుకుంది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత అభ్యర్థులకు ఐడీబీఐ శాఖల్లో అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ స్థాయిలో నియామకం ఖరారవుతుంది. కోర్సు పూర్తి చేసుకున్న వారికి కొలువుతోపాటు పీజీడీబీఎఫ్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

స్టయిఫండ్ సదుపాయం

ఐడీబీఐ పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టయిఫండ్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. కోర్సు సమయంలో ఆరు నెలల క్లాస్ రూం లెర్నింగ్ వ్యవధిలో నెలకు రూ.5వేలు; రెండు నెలల ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారు.

రూ.6.5 లక్షల వేతనం

పీజీడీబీఎఫ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకుని.. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ హోదాలో కొలువు ఖరారు చేసుకున్న వారికి ప్రారంభ వార్షిక వేతనం రూ.6.14 లక్షల నుంచి రూ.6.5 లక్షల వరకు ఉంటుంది. ఈ హోదాలో మూడేళ్ల పని చేసిన అనంతరం బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా గ్రేడ్–ఎ ఆఫీసర్లుగా పదోన్నతికి అర్హత లభిస్తుంది.

ప్రొబేషన్.. సర్వీస్ బాండ్

పీజీడీబీఎఫ్ కోర్సును పూర్తి చేసుకుని.. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ హోదాలో నియమితులైన వారికి ఏడాది పాటు ప్రొబేషనరీ పిరియడ్ విధానం అమలవుతోంది. అదేవిధంగా నియామకం ఖరారు చేసుకున్న వారు బ్యాంకులో కనీసం మూడేళ్ల పాటు విధులు నిర్వర్తిస్తామని రూ.2 లక్షల సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

ఐడీబీఐ బ్యాంకులో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ పోస్ట్‌లకు మార్గం వేసే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సులో ప్రవేశానికి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

200 మార్కులకు రాత పరీక్ష

ఐడీబీఐ.. పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్ష.. రెండు వందల మార్కులకు నాలుగు విభాగాల్లో ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 60 ప్రశ్నలు–60 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ ఆన్‌లైన్ టెస్ట్‌కు కేటాయించిన సమయం 2:30 గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు.

మలి దశలో.. పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష తర్వాత చివరగా 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. రాత పరీక్షలో రిజర్వేషన్, ఇతర నిబంధనలు పాటిస్తూ.. నిర్దేశిత కటాఫ్‌లను పేర్కొని..ఆ జాబితాలో నిలిచిన వారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పీజీడీబీఎఫ్ కోర్సుకు నిర్దేశించిన సీట్లకు మూడు రెట్లకు సమానమైన సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు పిలుస్తారు. తుది జాబితా ఖరారులో వెయిటేజీ విధానం అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ టెస్ట్ మార్కులకు 75 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 25 శాతం వెయిటేజీ కల్పిస్తారు.

అసిస్టెంట్ మేనేజర్

ఐడీబీఐ పీజీడీబీఎఫ్ పూర్తి చేసుకుని ఐడీబీఐలో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ హోదాలో నియమితులైన వారు భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకునే అవకాశం ఉంది. పదోన్నతులకు నిర్దేశించిన అర్హతలు.. తొలుత అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఎగా పదోన్నతి లభిస్తుంది. అనంతరం మేనేజర్(గ్రేడ్–బి)గా పదోన్నతి పొందొచ్చు. ఆ తర్వాత నిర్దేశిత కాల వ్యవధి ఆధారంగా.. ఏజీఎం (గ్రేడ్–సి), ఏజీఎం (గ్రేడ్–డి), డీజీఎం (గ్రేడ్–డి), జనరల్ మేనేజర్ (గ్రేడ్–ఇ), చీఫ్ జనరల్ మేనేజర్ (గ్రేడ్–ఎఫ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాల్లో పదోన్నతులు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2025, మార్చి 12
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: 2025, ఏప్రిల్ 6
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.idbibank.in/idbibankcareerscurrentopenings.aspx

ఆన్‌లైన్ టెస్ట్‌లో రాణించేలా

- లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి డైరక్షన్స్, డిస్టెన్స్, అనాలజీ, బ్లడ్ రిలేషన్స్, సిరీస్, డబుల్ లైనప్, డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- ఇంగ్లిష్‌కు సంబంధించి గ్రామర్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. ముఖ్యంగా వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి మ్యాథమెటిక్స్‌లోని కోర్ అంశాలతోపాటు అర్థమెటిక్ అంశాలు (నిష్పత్తులు, శాతాలు, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, యావరేజెస్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, కూడికలు, హెచ్చవేతలు తదితర)పై దృష్టి పెట్టాలి.
- నాలుగో విభాగంలోని జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ఎకానమీలో ఇటీవల కాలంలో ఆర్థిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తెలుసుకోవాలి.
- బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో బ్యాంకింగ్ వ్యవస్థ స్వరూపంతోపాటు తాజా పరిణామాలు, బ్యాంకింగ్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. కంప్యూటర్/ఐటీ అవేర్‌నెస్‌లో అభ్యర్థులు కంప్యూటర్ ఆపరేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి. ఇలా.. ప్రతి విభాగంలోనూ ఆయా అంశాలపై క్షుణ్నమైన అవగాహనతో ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్

మన గుడి... మన ఉత్సవం


శ్రీవారి బ్రహ్మ రథోత్సవ దృశ్యం (ఫైల్)


శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

కాటమరాయుడా.. కదిరి నరసింహుడా!

ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ఆరంభం

- 800 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన దివ్య క్షేత్రం
- నేడు శ్రీవారి కల్యాణోత్సవం
- 20న స్వామివారి బ్రహ్మ రథోత్సవం

ఆ దేవుడు లక్ష్మీనారసింహుడు. భక్తులచేత వసంతవల్లభుడిగా, కాటమ రాయుడిగా, ప్రహ్లాదవరదుడిగా పూజలందుకుంటున్న శ్రీ ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రం శ్రీసత్యసాయిజిల్లా కదిరిలో వెలసింది. ఖాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణంతో అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు పక్షం రోజులపాటు జరుగుతాయి. భక్తప్రహ్లాద సమేత నారసింహుని దర్శనం ఇక్కడ మాత్రమే చూడవచ్చు.

స్థల పురాణం

హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం శ్రీవారు ఆ ఉగ్రరూపంలోనే సమీపంలోని కదిరి కొండ వద్ద సంచరించసాగారు. మహర్షులు ఆయనను శాంతింపజేసేందుకు ఆ కొండపై ఆలయాన్ని నిర్మించి స్వామివారిని అందులో వసించమని వేడుకున్నారు. అదే కొండపై శ్రీవారి పాదముద్రికలు కూడా ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి కాస్తా కదిరిగా పిలుస్తున్నారు.

మహిమాన్వితుడు.. ఖాద్రీశుడు

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు(చంద్ర వృక్షాలు) ఎక్కువగా ఉండేవి. వీటికింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభువుగా వెలిశాడని అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతినక్షత్రం రోజు మాత్రమే ఇక్కడ మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు.

వసంత వల్లభుడని పేరు

శ్రీ మహావిష్ణువు అనుగ్రహం కోసం భృగు మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశాడని, అందుకు మెచ్చిన విష్ణువు తాను కోనేటిలో వెలిశానని, తన విగ్రహాలను వెలికితీసి పూజాది కార్యక్రమాలు చేయాలని కోరినట్లు ఓ కథనం. ఉత్సవ విగ్రహాల వెలికితీత జరిగింది వసంత మాసంలో కనుక స్వామివారికి వసంత వల్లభుడని పేరు కూడా ఉంది. అందుకే కోనేరును భృగుతీర్థమని పిలుస్తారు. ఆ ఉత్సవవిగ్రహాలనే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ తిరువీధుల్లో ఊరేగిస్తారు. ఇంతటి తేజస్సు కలిగిన ఉత్సవ విగ్రహాలు ఎక్కడా లేవని భక్తులు చెబుతారు.

దేశంలోనే 3వ అతి పెద్ద బ్రహ్మరథం

స్వామివారి బ్రహ్మ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు ఉంది. 130 ఏళ్ల క్రితం ఈ బ్రహ్మ రథం తయారు చేశారు. రథంపై 256 శిల్పకళాకృతులను టేకుతో అందంగా తీర్చిదిద్దారు. తమిళనాడులోని అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత 3వ అతి పెద్దది ఈ ఖాద్రీశుడి బ్రహ్మరథం.

ఆదివారం (9న) అంకురార్పణతో మొదలయిన ఈ బ్రహ్మోత్సవాలలో రోజుకో వాహనం మీద స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. 22వ తేదీ తీర్థవాది ఉత్సవం, 23న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి.

– చెరువు శ్రీనివాసరెడ్డి, సాక్షి, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా

మా వంశమంతా స్వామి సేవలోనే..



తర తరాలుగా మా వంశాలు స్వామివారి సేవలోనే తరిస్తున్నాయి. అది మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాం. ప్రహ్లాద సమేత లక్ష్మీనారసింహుడి దర్శనం ఇంకెక్కడా ఉండదు. బ్రహ్మోత్సవాలు 15 రోజుల పాటు జరిగేది కూడా ఇక్కడే. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మూలవిరాట్‌కు అభిషేకం చేస్తాం.

– నరసింహాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో రోజంతా నిత్యాన్నదానం ఉంటుంది. కల్యాణోత్సవంతో పాటు రథోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరిగేలా చూస్తున్నాం.

– శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ.

ఆత్మీయం

ఆలిం‘ఘనం’

మనుష్యుల మధ్య మాటల కన్నా స్పర్శ ఎన్నో అనుభూతులను, ఎన్నో సంగతులను చెబుతుంది. భావోద్వేగాలను తెలియజేయడానికి కౌగిలి ఒక శక్తిమంతమైన మాధ్యమంగా పనిచేస్తుంది. ప్రేమ, కృతజ్ఞతల నుంచి కోపం భయం వరకు స్పర్శ ద్వారా వ్యక్తీకరించబడిన భావోద్వేగాలను కౌగిలి, శబ్ద భాషకు మించిన సంబంధాన్ని పెంపొందిస్తుంది, అవగాహనను, సానుభూతిని ప్రోత్సహిస్తుంది.



శకుంతలను దుష్యంతుడు గాంధర్వ వివాహం చేసుకొని రాజ్యానికి వెళ్లిపోతాడు. కణ్వమహర్షి తన కూతురిని, మనుమడిని శిష్యులతో దుష్యంతుని దగ్గరకు పంపిస్తాడు. శకుంతల నిండు కొలువులో తానెవరో చెప్తుంది. కానీ దుష్యంతుడు మాత్రం వారి వివాహాన్ని అంగీకరించడు. ‘నీ కొడుకును పరిష్వంగం చేసుకో... అపుడు నీ కొడుకు అవునో కాదో తెలుస్తుంది’ అని చెప్తుంది. అంటే పరిష్వంగంలోని శక్తి అదన్న మాట.

దమయంతిని దూరం చేసుకొని నలుడు మారుపేరుతో, దేశదేశాలు తిరిగి ఋతుపర్ణ మహారాజు దగ్గర కాలం గడుపుతుండేవాడు. దమయంతి బాహుకుని పేరుతో ఉన్న నలుడిని గుర్తించాలని తనకు ద్వితీయ వివాహం జరుగుతున్నట్లు ఋతుపర్ణ మహారాజుకు చెప్పి పంపిస్తుంది. ఆ వివాహానికి ఋతుపర్ణ రాజు నలుడిని అంటే బాహుకుడిని తన రథసారథిగా చేసుకొని దమయంతి దగ్గరకు వస్తారు. బాహుకుని రూపంలో ఉన్న నలుని గుర్తించడానికి తన చెలికత్తె ద్వారా తన కూతురిని, కొడుకును వంటచేసుకొంటున్న బాహుకుడి దగ్గరకు పంపుతుంది. ఆ పిల్లలను చూడగానే బాహుకుడు చేతులు చాపి వారిని అక్కున చేర్చుకుంటాడు. కంటతడి పెడ్తాడు. తండ్రీ పిల్లల ముఖకవళికలను చూసి దమయంతి ఆ వంటవాడే తన భర్త నలుడని గుర్తిస్తుంది. పిల్లల పరిష్వంగంలోని శక్తి అది అన్నమాటే కదా.

సీతమ్మ క్షేమవార్త చెప్పిన ఆంజనేయుడికి చేతులు చాపి గాఢ పరిష్వంగాన్ని రాముడు ఇచ్చాడు. లంకలో సీతమ్మను చూసి, రావణునిలో భయం కలిగించి, ధైర్యాన్ని సీతమ్మలో నింపి వచ్చిన హనుమకి ప్రాణ సముడవు అని చెప్ప డానికి రెండు చేతులు చాపి కౌగిలించుకున్నాడు రాముడు. పరిష్వంగం ద్వారానే రాముడు తన కుమారులుగా లవకుశులను గుర్తించినట్లు కొన్ని రామాయణాల్లో కనిపిస్తుంది.

– ఆనంద‘మైత్రేయ’మ్

కొల్లేరులో కొలువైన కొంగు బంగారం పెద్దింట్లమ్మ

- మార్చి 13 వరకు పెద్దింట్లమ్మ జాతర
- వేంగి - చాళుక్యుల కాలం నుంచి పెద్దింట్లమ్మకు పూజలు
- తెలంగాణ బోనాల తరహాలో మొక్కులు

కొల్లేటికి మహాపట్టమహిషి పెద్దింట్లమ్మ జాతర ద్వీపకల్పమైన కొల్లేరు సరస్సు మధ్యన అంగరంగ వైభవంగా జరుగుతోంది. రాష్ట్రంలో అత్యంత పురాతన చరిత్ర కలిగిన దేవాలయాల్లో ఏలూరు జిల్లా, కైకలూరు మండలం కొల్లేటి కోట పెద్దింట్లమ్మ దేవస్థానం ఒకటి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పౌర్ణమి వరకూ జాతర జరుగుతుంది. ఈ ఏడాది మార్చి 1 నుంచి 13 వరకు అమ్మవారి జాతర (తీర్థం) నిర్వహిస్తున్నారు. జాతరలో అత్యంత కీలకఘట్టమైన జలదుర్గా గోకర్ణేశ్వరుల కల్యాణం మార్చి 10, ఆదివారం రాత్రి జరిగింది.

కొల్లేరు సరస్సు మధ్యలో కోట దిబ్బపై పెద్దింట్లమ్మతల్లి 9అడుగుల ఎత్తులో, విశాల నేత్రాలతో వీరాసన భంగిమలో భక్తులకు దర్శనమిస్తారు. కాలాలతో పాటు కోటలు మాయమైనప్పటికీ పెద్దింట్లమ్మ తల్లి విగ్రహం చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. సామాన్యంగా ఒక గ్రామానికి ఒక దేవత ఉంటుంది. కానీ పెద్దింట్లమ్మ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 44 కొల్లేరు దిబ్బలపై నివసించే వారందరికీ కులదైవంగా ఆరాధింపబడటం విశేషం.

పార్వతీదేవీ ప్రతిరూపమే పెద్దింట్లమ్మ..


పెద్దింట్లమ్మ ఆదిశక్తి స్వరూపిణి. కోటశక్తి అందుకే పెద్దింట్లమ్మకు కల్యాణం లేదు. అమ్మవారి విగ్రహం క్రింద జలదుర్గ మాత విగ్రహం ఉంటుంది. సమీప గోకర్ణపురంలో గోకర్ణేశ్వరస్వామితో జలదుర్గకు వివాహం చేయిస్తాం. పెద్దింట్లమ్మను భక్తితో వేడుకుంటే కోరిన కోరికలు నెరవేరతాయి.

– పేటేటి పరమేశ్వరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు, కొల్లేటికోట.

గ్రంథాల్లో కొల్లేరు అందాలు..

రామాయణం అరణ్యకాండలో అగస్త్య మహాముని శ్రీరాముడికి ఈ సరస్సు గురించి చెప్పినట్లు ఉంది. అదే విధంగా దండి అనే మహాకవి తన దశకుమార చరిత్రలో కొల్లేరు సరస్సును అభివర్ణించాడు. చరిత్రలో కొల్లేటి కోట, కొల్లేరు సరస్సు ప్రాంతాన్ని కొల్లేటికోట, కొల్లివీటికోట, కర్ణపురి, కొల్హాపురి, కృష్ణా, గోదావరి సంగమ దేవ పుష్కరిణీ, సృష్ట్యారంభ పద్మ సరస్సు, దేవపుష్కరిణి, బ్రహ్మ సరస్సు, అరజా సరోవరం, బ్రహ్మాండ సరస్సు, కోలాహలపురం, కొల్లేరు, కొలనువీడు అని వ్యవహరించేవారు.


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం

కొల్లేరుకు తెలంగాణ బోనాల సాంప్రదాయం..

తెలంగాణలో ఉజ్జయిని మహంకాళి, మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, మారెమ్మలకు జూలై నెలలో బోనాలు సమర్పిస్తారు. అదేవిధంగా 2020 నుంచి కొల్లేటికోట పెద్దింట్లమ్మకు బోనాలు సమర్పిస్తోన్నారు. అమ్మవారి దేవస్థానానికి 2 కిలోమీటర్ల దూరంలోని పందిరిపల్లిగూడెం నుంచి ప్రభల ఊరేగింపుతో పాటు బోనాలు ప్రతీ ఏటా తీసుకొస్తున్నారు. రాత్రి సమయంలో దీపాల మధ్య బోనాలు, 7 కావిళ్ళలో అమ్మవారి పుట్టింటి నైవేద్యం పసుపు, కుంకుమ, నెయ్యి, వేప రొట్టలు, నిమ్మకాయలు, పానకం, కల్లుతో పెద్దింట్లమ్మ దేవస్థానం తీసుకు రానున్నారు.

3 మైళ్ళ దూరంలోని గోకర్ణేశ్వరపురంలో గోకర్ణేశ్వరస్వామిని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారితో అంగరంగ వైభవంగా ఆదివారం కల్యాణం జరిపించారు. ఆ సమయంలో కొల్లేరు పెద్ద జనారణ్యంగా మారిపోయింది. జాతర పదమూడు రోజులని పేరే కానీ ఫాల్గుణ మాసం నెలరోజులూ ప్రతి ఆదివారం కొల్లేరు భక్తజన సంద్రంగా మారిపోతుంటుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి, జిల్లాల నుంచి భక్తులు విరివిగా విచ్చేసి అమ్మవారిని, స్వామివారినీ దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటూ ఉంటారు.

– బి.శ్యామ్, సాక్షి, కైకలూరు, కృష్ణా జిల్లా

సాక్షి సినిమా

కొలంబో కాలింగ్


ఎన్టీఆర్

కొలంబో వెళ్లనున్నాడట డ్రాగన్. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ మూవీ ‘డ్రాగన్’ (ప్రచారంలో ఉన్న టైటిల్). ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. గత నెల 20న ఈ సినిమా రెగ్యులర్ షూట్ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో ప్రారంభమైంది. కానీ ఈ షూటింగ్ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొనలేదని తెలిసింది. అయితే ఈ సినిమా తదుపరి షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొంటారు. ఈ షూటింగ్ షెడ్యూల్ శ్రీలంకలోని కొలంబోలో జరగనుందట. ఆల్రెడీ యూనిట్‌లోని కీలక సాంకేతిక నిపుణులు కొలంబో వెళ్లి, అక్కడి లొకేషన్స్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జనవరి 9న రిలీజ్ కానుంది.

మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు

– శ్రీలీల


చిరంజీవి, శ్రీలీల

‘‘ఉమెన్స్ డే సందర్భంగా మీ (చిరంజీవిని ఉద్దేశించి) శుభాకాంక్షలకు నా ధన్యవాదాలు. అలాగే మీ అన్‌లిమిటెడ్ ఫుడ్‌కి కూడా. ఉప్మా, దోసెలు... ఇంకా చాలా చాలా’’ అంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు హీరోయిన్ శ్రీలీల. విషయం ఏంటంటే... చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోన్న ‘విశ్వంభర’ సినిమా షూటింగ్ అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో జరుగుతోంది. అదే స్టూడియోలో మరో సినిమా షూటింగ్‌లో ఉన్న శ్రీలీలకు ఈ విషయం తెలిసి, ‘విశ్వంభర’ సెట్స్‌కి వెళ్లారు. శ్రీలీలను ఆప్యాయంగా ఆహ్వానించి, మాట్లాడటంతో పాటు ఆమెకు మహిళా దినోత్సవం సందర్భంగా శాలువా కప్పి, దుర్గాదేవి రూపం ముద్రించిన శంఖాన్ని కూడా బహుమతిగా ఇచ్చారు చిరంజీవి. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, ‘‘ఓజీతో... శంకర్‌దాదా ఎంబీబీఎస్... మిమ్మల్ని వెండితెరపై చూడటం ఓ పండగ’’ అని పేర్కొన్నారు శ్రీలీల.

మా సినిమా ఉద్దేశం అదే

– దర్శకుడు రాజ్


ఝాన్సీ, బీనా, రాజ్

తేజ, తన్మయి ముఖ్య పాత్రధారులుగా, ఝాన్సీ, పావోస్ రమేశ్, తాగుబోతు రమేశ్, ప్రణీత్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘23’. వాస్తవ సంఘటనల ఆధారంగా ‘మల్లేశం’ ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వంలో స్టూడియో 99 సంస్థ నిర్మించింది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనుంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్ రాచకొండ మాట్లాడుతూ– ‘‘తప్పుని తప్పని తెలుసుకోవడం చెప్పాలన్నది మా సినిమా ఉద్దేశం. హింసకి వ్యతిరేకంగా తీసిన సినిమా ఇది. మూడు ఘటనలు జరిగాయి. చాలామంది మరణించారు. అయితే చంపిన వారందరికీ సమానంగా శిక్ష పడిందా? లేదా అనేది ప్రశ్న. జైలుకి వెళ్లొచ్చిన తర్వాత మనిషి పరివర్తన కూడా ఈ సినిమాలో చూపించాం. మానవ హక్కుల వైపు, న్యాయం దొరకని వారి తరపున ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు. ‘‘నేను చెప్పిన ఎక్స్‌పీరియన్స్‌ని చాలా సీరియస్‌గా రాసుకున్నాడు రాజ్. ఆయన విజన్ చాలా ఇంపాక్ట్‌ఫుల్‌గా ఉంటుంది’’ అన్నారు బీనా. ‘‘నిజ జీవిత కథను నిజాయితీగా చెప్పారు’’ అని తెలిపారు ఝాన్సీ. ‘‘నటుడిగా ఇది నా తొలి సినిమా. అవకాశం ఇచ్చిన రాజ్ గారికి థ్యాంక్స్’’ అన్నారు తేజ. ఈ వేడుకలో తాగుబోతు రమేశ్ మాట్లాడారు. చుండూరు ఊచకోత, చిలకలూరిపేట బస్సు దహనం, జూబ్లీహిల్స్ కారు బాంబు పేలుడు సంఘటనల ఆధారంగా ‘23’ రూపొందింది.


రవిశంకర్ వర్మ, సత్య, ఆరాధ్య, రామ్‌గోపాల్ వర్మ

సోషల్ మీడియా నేపథ్యంలో...

సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ‘శారీ’. ‘టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ’ అనేది ట్యాగ్‌లైన్. గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో ఆర్‌జీవీ – ఆర్వి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై రవిశంకర్ వర్మ నిర్మించారు. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 21న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ‘‘సోషల్ మీడియా ప్రభావం, దీని ద్వారా ప్రమాదభరితంగా జరుగుతున్న కొన్ని సంఘటనలను ముఖ్య అంశాలుగా తీసుకుని ఈ సినిమా తీయడం జరిగింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తీశాం’’ అన్నారు. ‘‘ఢిల్లీకి చెందిన స్టేజ్ ఆర్టిస్టుని నేను. ఈ సినిమాలో సైకో పాత్రలో కనిపిస్తాను’’ అని పేర్కొన్నారు సత్య యాదు. ‘‘నేను కేరళ అమ్మాయిని. కానీ తెలుగు అమ్మాయిలా నన్ను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను. రాముగారి ‘శారీ’ చిత్రంతో మీ ముందుకు వస్తున్నందుకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలు నాకు దక్కాలని ఆశిస్తున్నాను’’ అని అన్నారు ఆరాధ్య దేవి. ఈ కార్యక్రమంలో రామ్‌గోపాల్ వర్మ సోదరి విజయ పాల్గొన్నారు.

కొత్త కథాంశంతో ల్యాంప్


మధుప్రియ, వినోద్

వినోద్ నువ్వుల, మధుప్రియ జంటగా నటించిన చిత్రం ‘ల్యాంప్’. రాజశేఖర్ రాజ్ దర్శకత్వంలో జీవీఎస్ శేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిలుగా హాజరైన నటుడు, నిర్మాత మురళీమోహన్, నిర్మాతలు దామోదర ప్రసాద్, సాయి వెంకట్, రామసత్యనారాయణ, ప్రసన్న కుమార్ ‘ల్యాంప్’ విజయం సాధించాలి అన్నారు. ‘‘అన్ని వాణిజ్య అంశాలున్న మంచి చిత్రమిది’’ అన్నారు రాజశేఖర్ రాజ్. ‘‘కొత్త కంటెంట్ మూవీ చూడాలనుకునే ప్రేక్షకులు మా సినిమాకి రండి’’ అని వినోద్ నువ్వుల పేర్కొన్నారు. ‘‘దర్శకుడు రాజ్ మంచి సినిమా ఇచ్చారు. ప్రేక్షకులు ఆదరించాలి’’ అని జీవీఎస్ శేఖర్ రెడ్డి అన్నారు.

ప్రేమకథను కొత్తగా చెప్పాను

– దర్శకుడు విశ్వ కరుణ్



కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం ‘దిల్ రుబా’. ఈ చిత్రంలో రుక్సార్ థిల్లాన్, నజియా డేవిసన్ హీరోయిన్లు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డిలతో కలిసి సారెగమ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా విశ్వ కరుణ్ మాట్లాడుతూ– ‘‘దర్శకుడిగా నాకిది తొలి సినిమా. ‘దిల్ రుబా’ అనే ప్రేమకథను రెడీ చేసి, కిరణ్ అబ్బవరంగారికి వినిపించాను. ఆయన ఓకే అన్నారు. ఈ చిత్రంలో ప్రేమకథను కొత్తగా చెప్పే ప్రయత్నం చేశాం. ఓ రకంగా చెప్పాలంటే క్యారెక్టర్ డ్రివెన్ ఫిల్మ్ ఇది. ఊరికే ‘సారీ, థ్యాంక్స్’లు చెప్పటానికి హీరో ఇష్టపడడు. ఓ సందర్భంలో హీరో ‘సారీ’ చెప్పకపోవడం వల్ల అతని చుట్టూ ఉన్నవాళ్లు కూడా ఇబ్బందులపాలవుతారు. ఈ సమస్య నుంచి హీరో ఎలా బయటపడ్డాడు? అన్నదే కథ. అలాగే ఊరికే కోపం రాకూడదు... కోపం వస్తే దాని వెనకాల సహేతుకమైన కారణం ఉండాలని హీరో భావిస్తాడు. ఈ అంశం కూడా సినిమాలో ఉంది. ‘క’ సినిమా విజయం సాధించడంతో, ‘దిల్ రుబా’పై మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. కొన్ని మార్పులు చేశాం. కానీ కథలోని ఆత్మ ఏ మాత్రం మారలేదు. నా తర్వాతి సినిమా గురించి త్వరలోనే చెబుతాను’’ అని అన్నారు.

ఓటీటీ | ఇది చూడొచ్చు

మమ్మీ ప్రేమ... భయంతో...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం ‘హలో మమ్మీ’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



హాలీవుడ్‌లో మమ్మీ సినిమాల పరంపర మీకు గుర్తుండే ఉంటుంది. పురాతన కాలంలో గ్రీకు సాంప్రదాయం ప్రకారం సజీవంగా మనుషులను రాతి కట్టడాల్లో పాతి పెట్టడంతో, అందులో చనిపోయిన వారి ఆత్మల రూపంలో తిరిగి వస్తే కథేంటి? అన్నదే హాలీవుడ్ మమ్మీల కథా కమామీషు. కాకపోతే ఈ ‘హలో మమ్మీ’ కథ మాత్రం పూర్తిగా వినూత్నం, వైవిధ్యం... మరీ ముఖ్యంగా వినోదాత్మకం. ఇదో హారర్ కామెడీ. వైశాఖ్ ఎలాన్స్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ మలయాళ సినిమా నిడివి రెండున్నర గంటలు. చూసినంతసేపు ఈ సినిమా ఓ పక్క కాస్త భయపెడుతూనే మరో పక్క గిలిగింతలు పెడుతుంటుంది. షరీఫ్, ఐశ్వర్య ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా ఆద్యంతం వినోదభరితమనే చెప్పాలి. అంతలా ఏముందో ఈ సినిమా కథను ఓసారి తెలుసుకుందాం. స్టెఫీని బోనీ ప్రేమిస్తాడు. స్టెఫీ తన తండ్రి శామ్యూల్‌తో ఉంటుంది. స్టెఫీ తల్లి 20 ఏళ్ల క్రిందటే చనిపోతుంది. కానీ ఈ 20 ఏళ్లు స్టెఫీని ఆ తల్లి ఆత్మ రూపంలో అంటిపెట్టుకునే ఉంటుంది. ఎందుకంటే స్టెఫీ అంటే తల్లికి చాలా ఇష్టం. స్టెఫీ మీద ఈగ కూడా వాలనీయదు. అలాగే ఇంట్లో ఆత్మ రూపంలోనే బోలెడన్ని రూల్స్ పెడుతుంది. స్టెఫీ తల్లి ఆత్మ విషయం ఈ ప్రపంచంలో స్టెఫీకి, ఆమె తండ్రికి తప్ప మరెవరికీ తెలియదు. బోనీని స్టెఫీ ఇష్టపడినపుడు తన తల్లి విషయాన్ని బోనీకి చెబుతుంది. కానీ బోనీ వినిపించుకోడు. పెళ్లై స్టెఫీ ఇంట్లోకి అడుగుపెట్టిన తరువాత స్టెఫీ తల్లి ఆత్మ పరిచయమవుతుంది అతనికి. దాంతో బోనీ ఖంగు తింటాడు. ఇక అక్కడ నుండి కథ ఎలా మలుపులు తిరుగుతుందో ప్రైమ్ వీడియో ఓటీటీలోనే చూడాలి. కొన్ని కథలు చాలా అరుదుగా వస్తుంటాయి. వాటిని మిస్ చేసుకోకూడదు.

వర్త్‌ఫుల్ వాచ్... ఇంకెందుకు ఆలస్యం... ‘హలో మమ్మీ’ని పలకరించండి... భయంతో కాదు... ప్రేమతో...

– ఇంటూరు హరికృష్ణ

‘నేను రిటైర్ కావడం లేదు’

చాలా సంతోషంగా ఉంది. చక్కటి క్రికెట్ ఆడిన మాకు దక్కిన ఫలితమిది. మొదటి నుంచి మా స్పిన్నర్లు ప్రభావం చూపించారు. ఎన్నో అంచనాలు ఉన్న సమయంలో వారు నిరాశపర్చలేదు. ఈ సానుకూలతను మేం సమర్థంగా వాడుకున్నాం. రాహుల్ మానసికంగా దృఢంగా ఉంటాడు. సరైన షాట్‌లను ఎంచుకుంటూ ఒత్తిడి లేకుండా అతను ఈ మ్యాచ్‌ను ముగించగలిగాడు. అతని వల్లే అవతలి వైపు పాండ్యా స్వేచ్ఛగా ఆడగలిగాడు. మా బ్యాటర్లంతా ఆకట్టుకునే ప్రదర్శన ఇచ్చారు. వరుణ్ బౌలింగ్‌లో ఎంతో ప్రత్యేకత ఉంది. అతను కీలక సమయాల్లో వికెట్లు తీశాడు. ఇలాంటి పిచ్‌పై అలాంటి బౌలర్ కావాలని అంతా కోరుకుంటారు. మాకు ఇది సొంత మైదానం కాకపోయినా పెద్ద సంఖ్యలో వచ్చి మద్దతుగా నిలిచిన అభిమానులకు కృతజ్ఞతలు. దూకుడుగా బ్యాటింగ్ చేసేందుకు నన్ను కోచ్ ప్రోత్సహించారు. మరో విషయం నేను స్పష్టం చేయదల్చుకున్నాను. నేను ఈ ఫార్మాట్‌నుంచి రిటైర్ కావడం లేదు. ఎలాంటి వదంతులు రాకూడదని ఇది చెబుతున్నాను -రోహిత్, భారత కెప్టెన్



గొప్పగా అనిపిస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్ తర్వాత సరైన రీతిలో పునరాగమనం చేయాలని భావించాం. కుర్రాళ్లతో కలిసి ఆడటం ఎంతో బాగుంది. వారు సరైన సమయంలో స్పందిస్తూ జట్టును ముందుకు తీసుకెళుతున్నారు. ఇన్నేళ్లుగా ఆడుతున్న తర్వాత ఒత్తిడి కొత్త కాదు. టైటిల్ గెలవాలంటే ఆటగాళ్లంతా రాణించాల్సి ఉంటుంది. అందరూ సమష్టిగా సత్తా చాటడంతోనే ఇది సాధ్యమైంది. సరైన, తగిన సమయం సమయం చూసి తప్పుకోవడం ముఖ్యం (రిటైర్మెంట్‌పై). -విరాట్ కోహ్లి

భారత జట్టు మరోసారి తమ చాంపియన్ ఆటను ప్రదర్శించింది. తొలి మ్యాచ్ నుంచి అన్ని రంగాల్లో ఆధిక్యం ప్రదర్శిస్తూ వచ్చిన జట్టు అజేయంగా విజయప్రస్థానాన్ని ముగించింది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సమష్టి ఆటతో ఒక్కో ప్రత్యర్థిని పడగొడుతూ వచ్చిన జట్టు తమ స్థాయికి తగ్గ విజయాన్ని అందుకుంది. ఏడాది వ్యవధిలో మరో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టైటిల్‌ను సొంతం చేసుకొని ప్రపంచ క్రికెట్‌పై తమ ఆధిపత్యాన్ని స్పష్టంగా చూపించింది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిని పూర్తిగా మరచిపోయేలా కాకపోయినా... ఈ ఫార్మాట్‌లో మరో ప్రతిష్టాత్మక టైటిల్‌ను గెలుచుకొని అభిమానులకు ఆనందాన్ని పంచింది. 2013లాగే ఒక్క ఓటమి కూడా లేకుండా టీమిండియా ట్రోఫీని గెలుచుకోవడం విశేషం.

మనమే చాంపియన్స్



ఫైనల్లో టాస్ ఓడినా న్యూజిలాండ్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేయడంతోనే భారత్‌కు గెలుపు దారులు తెరుచుకున్నాయి. మన స్పిన్ చతుష్టయాన్ని ఎదుర్కోవడంలో మళ్లీ తడబడిన కివీస్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఛేదనలో రోహిత్ శర్మ దూకుడైన ఆరంభం లక్ష్యాన్ని అందుకునేందుకు తగిన పునాది వేసింది. మధ్యలో కొద్దిసేపు కివీస్ స్పిన్నర్లూ ప్రభావం చూపడంతో 17 పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోయి కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే లక్ష్యం మరీ చిన్నది కావడంతో సమర్థమైన బ్యాటింగ్ లైనప్ తడబడకుండా టీమ్‌ను విజయతీరం చేర్చింది. క్రికెట్‌లో ‘మంచి బాలురు’వంటి న్యూజిలాండ్ టీమ్ మరోసారి ‘పోరాడి ఓడిన’ ముద్రతోనే నిరాశగా నిష్క్రమించింది.

దుబాయ్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025ను భారత్ సొంతం చేసుకుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లతో పాటు సెమీఫైనల్, ఫైనల్ కలిపి ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఓటమి లేకుండా జట్టు టైటిల్ గెలుచుకుంది. దుబాయ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. గతంలో భారత్ 2002, 2013లలో కూడా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెల్చుకుంది. ఫైనల్లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. డారైల్ మిచెల్ (101 బంతుల్లో 63; 3 ఫోర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (40 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లకు 254 పరుగులు సాధించి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ రోహిత్ శర్మ (83 బంతుల్లో 76; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగగా... శ్రేయస్ అయ్యర్ (62 బంతుల్లో 48; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టోర్నీ మొత్తంలో 263 పరుగులు చేసి 3 వికెట్లు తీసిన న్యూజిలాండ్ ప్లేయర్ రచిన్ రవీంద్ర ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డు గెల్చుకున్నాడు.

మిచెల్ హాఫ్ సెంచరీ...

కివీస్ ఇన్నింగ్స్‌ను రచిన్ రవీంద్ర (29 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా మొదలు పెట్టాడు. పాండ్యా ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను షమీ ఓవర్లో మరో రెండు ఫోర్లు బాదాడు. దాంతో ఆరో ఓవర్లోనే భారత్ స్పిన్నర్ వరుణ్‌ను బౌలింగ్‌కు దింపింది. విల్ యంగ్ (23 బంతుల్లో 15; 2 ఫోర్లు)ను అవుట్ చేసి అతను ఓపెనింగ్ జోడీని విడదీశాడు. 10 ఓవర్లలో కివీస్ స్కోరు 69 పరుగులకు చేరింది. తన తొలి బంతికే రచిన్‌ను బౌల్డ్ చేసిన కుల్దీప్, తన రెండో ఓవర్లో విలియమ్సన్ (14 బంతుల్లో 11; 1 ఫోర్)ను పెవిలియన్ పంపించి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. లాథమ్ (30 బంతుల్లో 14) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ (52 బంతుల్లో 34; 2 ఫోర్లు, 1 సిక్స్) కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే స్పిన్నర్లను ఎదుర్కోవడంలో బ్యాటర్లు బాగా ఇబ్బంది పడటంతో పరుగులు నెమ్మదిగా వచ్చాయి. వరుసగా 81 బంతుల పాటు బౌండరీనే రాలేదు. ఎట్టకేలకు 91 బంతుల్లో మిచెల్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఒక వైపు తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయినా... ఆఖర్లో బ్రేస్‌వెల్ వేగంగా ఆడటంతో జట్టు స్కోరు 250 పరుగులు దాటింది. చివరి 10 ఓవర్లలో కివీస్ 79 పరుగులు చేసింది. నలుగురు భారత స్పిన్నర్లు కలిపి 38 ఓవర్లలో 144 పరుగులిచ్చి 5 వికెట్లు తీయగా... ఇద్దరు పేసర్లు 12 ఓవర్లలో 104 పరుగులిచ్చి ఒకే వికెట్ తీయడం మన స్పిన్నర్ల ప్రభావాన్ని చూపించింది.

చాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్

మూడోసారి టైటిల్ గెలిచిన టీమిండియా	ఫైనల్లో న్యూజిలాండ్‌పై 4 వికెట్లతో విజయం	రోహిత్ శర్మ అర్ధ సెంచరీ / రాణించిన నలుగురు స్పిన్నర్లు వరుణ్, జడేజా, కుల్దీప్, అక్షర్

రాణించిన అయ్యర్...

ఇన్నింగ్స్ రెండో బంతికే సిక్స్‌తో మొదలు పెట్టిన రోహిత్ తన ఇన్నింగ్స్ ఆసాంతం దూకుడుగా ఆడాడు. నాథన్ స్మిత్ ఓవర్లో అతను 2 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. మరో ఎండ్‌లో శుబ్‌మన్ గిల్ (50 బంతుల్లో 31; 1 సిక్స్) పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమించాడు. 10 ఓవర్లలో స్కోరు 64 పరుగులు కాగా, 41 బంతుల్లోనే రోహిత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. ఎట్టకేలకు శతక భాగస్వామ్యం తర్వాత గిల్ అవుట్ కావడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆపై మరో 17 పరుగుల తేడాతో రెండు కీలక వికెట్లు తీసి కివీస్ పైచేయి సాధించింది. బ్రేస్‌వెల్ తొలి బంతికి కోహ్లి (1) వికెట్ల ముందు దొరికిపోగా, రోహిత్ భారీ షాట్‌కు ప్రయత్నించి స్టంపౌటయ్యాడు. ఈ దశలో అయ్యర్, అక్షర్ పటేల్ (40 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్) కలిసి చక్కటి సమన్వయంతో జాగ్రత్తగా ఆడుతూ మళ్లీ ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే వీరిద్దరిని తక్కువ వ్యవధిలో వెనక్కి పంపడంతో కివీస్ బృందంలో ఆశలు రేగాయి. అయితే కేఎల్ రాహుల్ (33 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ముందుండి నడిపిస్తూ జట్టును విజయం దిశగా తీసుకెళ్లాడు. 68 బంతుల్లో 69 పరుగులు చేయాల్సిన స్థితిలో బరిలోకి దిగిన రాహుల్‌కు హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) సహకరించాడు. 49వ ఓవర్ చివరి బంతిని జడేజా (6 బంతుల్లో 9 నాటౌట్; 1 ఫోర్) డీప్‌స్క్వేర్ లెగ్ దిశగా ఫోర్ కొట్టడంతో భారత్ విజయాన్ని పూర్తి చేసుకుంది.



‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ ట్రోఫీతో రచిన్ రవీంద్ర



రోహిత్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (ఎల్బీ) (బి) వరుణ్ 15; రచిన్ (బి) కుల్దీప్ 37; విలియమ్సన్ (సి అండ్ బి) కుల్దీప్ 11; మిచెల్ (సి) రోహిత్ (బి) షమీ 63; లాథమ్ (ఎల్బీ) (బి) జడేజా 14; ఫిలిప్స్ (బి) వరుణ్ 34; బ్రేస్‌వెల్ (నాటౌట్) 53; సాంట్నర్ (రనౌట్) 8; స్మిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 251. వికెట్ల పతనం: 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239. బౌలింగ్: షమీ 9-0-74-1, పాండ్యా 3-0-30-0, వరుణ్ చక్రవర్తి 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 10-0-40-2, అక్షర్ పటేల్ 8-0-29-0, రవీంద్ర జడేజా 10-0-30-1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (స్టంప్డ్) లాథమ్ (బి) రచిన్ 76; శుబ్‌మన్ గిల్ (సి) ఫిలిప్స్ (బి) సాంట్నర్ 31; కోహ్లి (ఎల్బీ) (బి) బ్రేస్‌వెల్ 1; శ్రేయస్ అయ్యర్ (సి) రచిన్ (బి) సాంట్నర్ 48; అక్షర్ పటేల్ (సి) రూర్కే (బి) బ్రేస్‌వెల్ 29; కేఎల్ రాహుల్ (నాటౌట్) 34; హార్దిక్ పాండ్యా (సి అండ్ బి) జేమీసన్ 18; జడేజా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (49 ఓవర్లలో 6 వికెట్లకు) 254. వికెట్ల పతనం: 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241. బౌలింగ్: జేమీసన్ 5-0-24-1, రూర్కే 7-0-56-0, స్మిత్ 2-0-22-0, సాంట్నర్ 10-0-46-2, రచిన్ 10-1-47-1, బ్రేస్‌వెల్ 10-1-28-2, ఫిలిప్స్ 5-0-31-0.

ఫిలిప్స్ అసాధారణం



ఫీల్డింగ్ అత్యుత్తమ ప్రమాణాలు చూపిస్తూ తన స్థాయిని పెంచుకున్న ఫిలిప్స్ ఆదివారం మరోసారి దానిని ప్రదర్శించాడు. షార్ట్ కవర్ వైపు గిల్ షాట్ ఆడగా అసాధారణంగా గాల్లోకి ఎగురుతూ ఒంటి చేత్తో ఫిలిప్స్ అందుకోవడం అందరినీ ఒక్కసారిగా షాక్‌కు గురి చేసింది. ఈ టోర్నీలో అతను ఇప్పటికే కోహ్లి, రిజ్వాన్ క్యాచ్‌లను కూడా ఇదే తరహాలో అందుకున్నాడు.

క్యాచ్‌లు వదిలేశారు...



భారత జట్టు ఫీల్డింగ్‌లో పలు అవకాశాలు చేజార్చింది. కష్టసాధ్యమే అయినా ఏకంగా నాలుగు క్యాచ్‌లు వదిలేసింది. అయితే లైఫ్ లభించిన ఆటగాళ్లెవరూ దానిని పెద్దగా సద్వినియోగం చేసుకోలేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదు. రచిన్ రవీంద్ర స్కోరు 29 వద్ద ఉన్నప్పుడు రెండుసార్లు బతికిపోయాడు. షమీ రిటర్న్ క్యాచ్ వదిలేయగా, అయ్యర్ మరో క్యాచ్ వదిలేశాడు. మిచెల్ స్కోరు 38 వద్ద రోహిత్ క్యాచ్ వదిలేయగా, ఫిలిప్స్ స్కోరు 27 వద్ద గిల్ క్యాచ్ వదిలేసి అవకాశమిచ్చాడు. ఆ తర్వాత కివీస్ కూడా గ్రౌండ్ ఫీల్డింగ్ అద్భుతంగా చేసినా... రెండు క్యాచ్‌లు వదిలేసింది. గిల్ 1 పరుగు వద్ద మిచెల్ క్యాచ్ వదిలేయగా, అయ్యర్ 44 పరుగుల వద్ద ఉన్నప్పుడు జేమీసన్ అతి సులువైన క్యాచ్‌ను అందుకోలేకపోయాడు.

12 రోహిత్ శర్మ వరుసగా 12వసారి టాస్ ఓడిపోయాడు. ఈ జాబితాలో అగ్ర స్థానంలో ఉన్న వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా (12) రికార్డును సమం చేశాడు. అయితే మ్యాచ్‌లు గెలుస్తూ ఐసీసీ టైటిల్ సాధించిన వేళ ఇలాంటి టాస్‌లు ఎన్ని ఓడిపోయినా రోహిత్‌కు లెక్క లేదు!

ప్రధాని ప్రశంసలు...

మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలిచిన భారత క్రికెట్ జట్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ‘అద్భుతమైన మ్యాచ్...అద్భుతమైన ఫలితం... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన మన క్రికెట్ జట్టును చూసి గర్వపడుతున్నా. టోర్నమెంట్ ఆసాంతం వారంతా చాలా బాగా ఆడారు. అసాధారణ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన మన జట్టుకు నా అభినందనలు’ అని ‘ఎక్స్’లో మోదీ పేర్కొన్నారు. టీమిండియాకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా అభినందనలు తెలిపారు.

మాజీ సీఎం జగన్ అభినందనలు

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో అసాధారణ విజయం సాధించిన భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి తన ‘ఎక్స్’ ఖాతా ద్వారా స్పందించారు. ‘ఇది ఎంతో అర్హమైన అజేయ విజయం. మన దేశానికి గర్వకారణమైన క్షణం! టీమిండియాకు అభినందనలు’ అని ఆయన పేర్కొన్నారు.

7 భారత్ సాధించిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టైటిల్స్ సంఖ్య. ఇందులో 2 వన్డే వరల్డ్‌కప్‌లు (1983, 2011), 2 టి20 వరల్డ్‌కప్‌లు (2007, 2024), 3 చాంపియన్స్ ట్రోఫీలు (2002, 2013, 2025) ఉన్నాయి. ఈ జాబితాలో ఆస్ట్రేలియా 10 ఐసీసీ టైటిల్స్‌తో అగ్రస్థానంలో ఉంది.

ఎవరికెంత ప్రైజ్‌మనీ అంటే?

విజేత భారత్	రన్నరప్ కివీస్
22 లక్షల 40 వేల డాలర్లు (రూ. 19 కోట్ల 52 లక్షలు)	11 లక్షల 20 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 76 లక్షలు)

వన్డే విజయం తెచ్చిన ఆనందం...

నవంబర్ 19, 2023... కోట్లాది మంది భారతీయుల ఆశలు మోస్తూ వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ బరిలోకి దిగిన భారత్ అనూహ్య పరాజయంతో అభిమానుల గుండెలు బద్దలయ్యాయి...

జూన్ 29, 2024... టి20 ఫార్మాట్‌లో తమ స్థాయికి తగ్గ ఆటను కనబరుస్తూ భారత జట్టు వరల్డ్ కప్ గెలుచుకుంది...ఫ్యాన్స్‌కు కాస్త ఊరట...

మార్చి 9, 2025... అంచనాలకు అనుగుణంగా ప్రతీ మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిక్యంతో భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ సాధించింది... దేశవ్యాప్తంగా అన్ని చోట్లా ఆనందం...

సాక్షి క్రీడా విభాగం

సుమారు 16 నెలల వ్యవధిలో భారత జట్టు మూడు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్ చేరింది. వాటిలో రెండింటిలో విజేతగా నిలిచింది. వన్డే వరల్డ్ కప్ ఓటమి వేదన ఇప్పటికీ తీరనిది అయినా మిగతా రెండు విజయాలతో సాంత్వన దక్కిందనేది మాత్రం వాస్తవం. అంతర్జాతీయ క్రీడల్లో ఒక టోర్నమెంట్‌కు, మరో టోర్నమెంట్‌కు పోలిక ఉండదు. ఒక విజయానికి, మరో విజయానికి సంబంధం ఉండదు. దేని ప్రత్యేకత దానిదే. కానీ గెలుపు ఇచ్చే కిక్ మాత్రం ఎప్పుడైనా ఒకటే! ఇప్పుడు టీమిండియా ఆటగాళ్లు దానినే అనుభవిస్తున్నారు. వరల్డ్ కప్ కాకపోయినా టాప్-8 జట్ల మధ్య జరిగిన సమరంలో భారత్ తమ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2013లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులో సభ్యులైన రోహిత్, కోహ్లి, జడేజా ఇప్పుడూ ఉన్నారు. 2017 ఫైనల్లో పాక్ చేతిలో ఓడిన వారిలో ఈ ముగ్గురితో పాటు హార్దిక్ పాండ్యా, షమీ కూడా ఉన్నారు. షమీ, అయ్యర్, రాహుల్, హర్షిత్ రాణా, వరుణ్, సుందర్‌లకు ఇదే తొలి ఐసీసీ టైటిల్. దాని విలువ ఏమిటో వారి ఆనందంలోనే కనిపిస్తోంది.

స్పిన్నర్లే విన్నర్లు...

చాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టును ప్రకటించినప్పుడు ‘ఐదుగురు స్పిన్నర్లా’ అంటూ అన్ని వైపుల నుంచి ఆశ్చర్యం వ్యక్తమైంది. పైగా అప్పటికే ఎంపిక చేసిన జట్టులో ఉన్న బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను తప్పించి మరీ వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేశారు. టోర్నీలో మన స్పిన్నర్ల ప్రదర్శన చూస్తే ఇది ఎంత సరైన నిర్ణయమో తేలింది. సుందర్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాకపోగా... మిగతా నలుగురు వరుణ్, కుల్దీప్, అక్షర్, జడేజా పెను ప్రభావం చూపించారు. ఈ నలుగురు కలిసి మొత్తం 26 వికెట్లు పడగొట్టారు. ఇందులో వరుణ్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. కేవలం 15.11 సగటుతో అతను 9 వికెట్లు తీశాడు. లీగ్ దశలోనే కివీస్ పని పట్టిన అతను ఫైనల్లోనూ అదే ఆటను ప్రదర్శించి జట్టు విజయానికి కారణమయ్యాడు. కీలకమైన యంగ్, ఫిలిప్స్ వికెట్లు తీసిన అతను కనీసం ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడం విశేషం! టోర్నీకి ముందు అతను ఒకే ఒక వన్డే ఆడాడు. ‘వరుణ్ బౌలింగ్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. నెట్స్‌లో కూడా అతను మాకు మామూలుగానే బౌలింగ్ చేస్తాడు. తన అసలైన ఆయుధాలను మ్యాచ్‌లోనే ప్రదర్శిస్తాడు. అలా చేస్తే చాలు’ అంటు రోహిత్ చేసిన ప్రశంస వరుణ్ విలువను చూపించింది. ఆరంభంలో కుల్దీప్ పెద్దగా ప్రభావం చూపకపోయినా... తుది పోరులో రెండు కీలక వికెట్లతో కివీస్‌ను నిలువరించాడు. జడేజా, అక్షర్ కూడా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను కట్టి పడేశారు. వీరిద్దరి ఎకానమీ 4.35 మాత్రమే ఉందంటే వారు ఎంత పొదుపుగా బౌలింగ్ చేశారో అర్థమవుతుంది. గాయం నుంచి కోలుకొని తిరిగొచ్చిన షమీ గతంలోలా అద్భుతంగా బౌలింగ్ చేయకపోయినా కీలక సమయాల్లో జట్టును ఆదుకున్నాడు. టోర్నీలో అతను తీసిన 9 వికెట్లలో సెమీస్‌లో స్మిత్‌ను అవుట్ చేసిన క్షణం హైలైట్‌గా నిలిచింది. బుమ్రా లేని లోటును పూరిస్తూ ఈ సీనియర్ బౌలర్ తన వంతు పాత్రను పోషించాడు.



హర్షిత్ రాణా, జడేజా, అర్ష్‌దీప్ సంబరం

బ్యాటర్లు సమష్టిగా...

బ్యాటింగ్‌లో ఎప్పటిలాగే విరాట్ కోహ్లి (మొత్తం 218 పరుగులు) భారత జట్టు మూల స్తంభంగా నిలిచాడు. 1 సెంచరీ, 1 అర్ధసెంచరీతో రెండుసార్లు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా అతను జట్టును గెలిపించాడు. టోర్నీకి ముందు అతని బ్యాటింగ్‌పై కాస్త సందేహాలు రేగినా... వాటిని అతను పటాపంచలు చేశాడు. కోహ్లినే స్వయంగా చెప్పినట్లు ఆస్ట్రేలియా టూర్ తర్వాత తాము ఒక విజయం కోసం చూస్తున్న స్థితిలో ఈ టైటిల్ దక్కింది. మొత్తం పరుగులు చూస్తే రోహిత్ శర్మ (180) తక్కువగానే కనిపిస్తున్నా... ఓపెనర్‌గా అతను చూపించిన ప్రభావం ఎంతో ఉంది. శ్రేయస్ అయ్యర్ (243) జట్టు అత్యధిక స్కోరర్‌గా నిలవగా, గిల్ (188 పరుగులు) ఒక సెంచరీతో తాను ప్రధాన పాత్ర పోషించాడు. తనపై వస్తున్న విమర్శలకు జవాబిస్తూ కేఎల్ రాహుల్ (140 పరుగులు) మూడు మ్యాచ్‌లలో చివరి వరకు నిలిచి జట్టును గెలుపు తీరం చేర్చాడు. ఐదో స్థానంలో ప్రమోట్ అయిన అక్షర్ పటేల్ (109 పరుగులు) కూడా ఆకట్టుకున్నాడు. టాప్-6 బ్యాటర్లు ఆశించిన స్థాయిలో ఆడటంతో ఆందోళన లేకపోయింది. ఐదు మ్యాచ్‌లలో భారత్ నాలుగు సార్లు సునాయాసంగా 232, 242, 265, 252 లక్ష్యాలను అందుకుంది.

కెప్టెన్‌గా రోహిత్ ముద్ర...

భారత్ నుంచి ధోని మాత్రం కెప్టెన్‌గా ఒకటికి మించి ఐసీసీ టైటిల్స్ సాధించాడు. ఇప్పుడు రెండు ట్రోఫీలతో రోహిత్ శర్మ తన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాడు. మరో దాంట్లో ఫైనల్ కూడా చేర్చిన ఘనత, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఫైనల్లో సారథిగా వ్యవహరించిన ఘనత కూడా అతని ఖాతాలో ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో కీలక సమయాల్లో కెప్టెన్‌గా అతను జట్టును నడిపించిన తీరు హైలైట్‌గా నిలిచింది.

గంభీర్‌కు ఊరట...

ద్రవిడ్ నుంచి కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత గంభీర్ కోచింగ్‌లో చెప్పుకోదగ్గ ఫలితాలు రాలేదు. శ్రీలంకపై టి20 సిరీస్, స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్ లు గెలిచినా వాటిని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. సొంతగడ్డపై న్యూజిలాండ్, ఆ తర్వాత ఆసీస్ చేతిలో టెస్టుల్లో చిత్తయిన అవమాన భారం మాత్రమే అందరికీ గుర్తుండిపోయింది. ఇలాంటి సమయంలో వచ్చిన గెలుపు కోచ్‌గా అతనికి ఊరటనిచ్చిందనడంలో సందేహం లేదు. ‘అంతర్జాతీయ క్రికెట్‌లో సంతృప్తికరమైన ఆట ఎప్పటికీ ఉండదు. ప్రతీసారి ఏదో ఒక విషయం మెరుగు పర్చుకోవాల్సిందే. అప్పుడే నిలకడగా ఫలితాలు వస్తాయి’ అంటూ ఆటగాళ్లలో స్ఫూర్తి నింపిన కోచ్ ఇప్పుడు ఫైనల్ అనంతరం చిరునవ్వులు చిందించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
8	8
74,333	22,553

విదేశీ సూచీలు


సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	18,213	△	43
డోజోన్స్	42,802	△	222
ఎఫ్‌టీఎస్ఈ 100	8,680	▽	3
డాక్స్	23,009	▽	410
హాంగ్‌సెంగ్	3,372	▽	8
నికాయ్	36,887	▽	818

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.70	87.72
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	111.00	113.85
€	యూరో	ఒకటి	92.92	95.59
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	58.38	59.88
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.91	56.12
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.97	67.66
SAR	సౌదీ రియాల్	[illegible]	27.27	23.82
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.76	24.54
¥	చైనా యువాన్	[illegible]	11.13	12.96

మీ బ్యాంక్ డిపాజిట్ ఎంత భద్రం?



రూ.5 లక్షల వరకు ఢోకా లేదు

- డీఐసీజీసీ ద్వారా ఈ మొత్తం వెనక్కి
- మూడు నెలల్లోగా చెల్లింపులు
- అంతకుమించితే రిస్క్ ఉన్నట్టే
- బ్యాంకు సంక్షోభంలో పడితే చిక్కులు
- పరిష్కారమయ్యేంత వరకు వేచి చూడాలి
- బీమా రక్షణ మరింత పెంచాలన్న ప్రతిపాదన

ముంబైకి చెందిన ధనరాజ్ (50) ఉదయం నిద్రలేచి, పేపర్ చూడగానే ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. న్యూ ఇండియా సహకార బ్యాంక్‌లో స్కామ్ జరిగిందనేది ఆ వార్త సారాంశం. చిరుద్యోగి అయిన ధనరాజ్ తన కుమార్తె వివాహం కోసమని రూ.4 లక్షలను అదే బ్యాంక్‌లో కొన్నాళ్ల క్రితం డిపాజిట్ చేశాడు. కంగారుగా బ్యాంక్ శాఖకు చేరుకుని విచారించగా, డిపాజిట్లకు ఢోకా లేదన్న సమాచారం విని కాస్తంత కుదుటపడ్డాడు. రూ.5 లక్షల వరకు డిపాజిట్లపై బీమా సదుపాయం ఉంటుందని కస్టమర్లు చెప్పుకుంటుండగా విని.. హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నాడు. బ్యాంక్ డిపాజిట్.. దేశంలో చాలా మందికి తెలిసిన, ఇష్టమైన పెట్టుబడి సాధనం. చాలా మంది తమ పొదుపు సొమ్మును డిపాజిట్ రూపంలో మదుపు చేయడం కూడా చూస్తుంటాం. కానీ, ఇందులో ఉండే రిస్క్‌ల గురించి అవగాహన ఉండదు. డిపాజిటర్లు అందరూ దీనిపై ఓసారి దృష్టి సారించాల్సిన అవసరాన్ని న్యూ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్ ఉదంతం గుర్తు చేస్తోంది.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఒకప్పుడు ప్రతి కుటుంబ ఆర్థిక సాధనాల్లో బ్యాంక్ డిపాజిట్ (ఎఫ్‌డీ) తప్పకుండా ఉండేది. కాలక్రమంలో ఇతర సాధనాల పట్ల ఆసక్తి పెరుగుతూ వస్తోంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు తదితర వాటిల్లో పెట్టుబడులు పెరుగుతూ, డిపాజిట్లు తగ్గుతున్నాయి. ఇప్పటికీ 15 శాతం గృహ పొదుపులు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలోకే (ఎఫ్‌డీలు/టర్మ్ డిపాజిట్లు) వెళుతున్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎఫ్‌డీలు ఎంతో మందికి నమ్మకమైన, మెరుగైన సాధనం. దీర్ఘకాలంలో గొప్ప రాబడి రాకపోయినా సరే, అత్యవసరంలో వేగంగా వెనక్కి తీసుకునేందుకు అనుకూలంగా ఉండడం చాలా మందికి నచ్చే అంశం. పైగా డిపాజిట్ అంటే ఏ మాత్రం రిస్క్ ఉండదని చాలా మంది అభిప్రాయపడుతుంటారు. ప్రభుత్వ గ్యారంటీ (సావరీన్) ఉంటే తప్పించి, బ్యాంక్ ఎఫ్‌డీ అయినా, ఏ ఇతర పెట్టుబడి సాధనంలో అయినా ఎంతో కొంత రిస్క్ ఉంటుంది. దీనిపట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం.

మెరుగైన నియంత్రణలు

ఎఫ్‌డీ ఎంతో ప్రాచుర్యానికి నోచుకోవడం వెనుక అందులోని సరళత్వం, భద్రత కీలకమని చెప్పుకోవాలి. ఏవో కొన్ని బ్యాంకు వైఫల్యాలను పక్కన పెడితే, మన దేశంలో బ్యాంకింగ్ రంగం పటిష్ట నియంత్రణల మధ్య కొనసాగుతుంటుంది. ప్రజల్లో నమ్మకం ఏర్పడడానికి ఇది కూడా ఒక కారణం. బ్యాంక్ యాజమన్యాలు/ఉద్యోగుల మోసపూరిత వ్యవహారం, రుణ వ్యాపారంలో దూకుడైన తీరు కొన్ని సందర్భాల్లో సమస్యలు, సంక్షోభాలకు దారితీయవచ్చు. ఎంత కట్టుదిట్టమైన నియంత్రణలు ఉన్నా కానీ, 2019లో పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్, 2020లో యస్ బ్యాంక్, ఇప్పుడు న్యూ ఇండియా కోపరేటివ్ బ్యాంక్ సంక్షోభాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ కరాడ్ ఉదంతాలూ గుర్తుండే ఉంటాయి. కనుక బ్యాంక్ డిపాజిట్లలోనూ రిస్క్ ఉంటుందని అర్థం చేసుకోవాలి. కాకపోతే మనదగ్గర ఆర్‌బీఐ పటిష్ట నియంత్రణల కారణంగా ఈ తరహా సంక్షోభాలు చాలా తక్కువగా కనిపిస్తుంటాయి.

డిపాజిట్‌పై బీమా



ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోని అన్ని బ్యాంకుల్లోనూ రూ.5 లక్షల వరకు డిపాజిట్‌కు బీమా రక్షణ ఉంటుంది. అసలు లేదా అసలుతోపాటు వడ్డీ కలుపుకుని రూ.5 లక్షలకు మించి ఉన్నప్పటికీ బీమా రూ.5 లక్షలకే పరిమితం. బ్యాంక్ ఏదైనా సంక్షోభం పాలైతే అప్పుడు ఒక్కో డిపాజిట్ దారుడికి గరిష్ఠంగా రూ.5 లక్షలు వెనక్కి వస్తాయి. సేవింగ్స్, ఫిక్స్‌డ్, కరెంట్, రికరింగ్ ఇలా అన్ని డిపాజిట్లకూ ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ వ్యవహారం అంతా చూసేది ఆర్‌బీఐ అనుబంధ సంస్థ అయిన 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (డీఐసీజీసీ). ప్రతి రూ.100 డిపాజిట్‌పై రూ.12 పైసలు చొప్పున ప్రీమియం కింద బ్యాంక్‌లు డీఐసీజీసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఒక బ్యాంక్‌కు చెందిన ఒకటికి మించిన శాఖలో డిపాజిట్లు ఉన్నప్పటికీ.. ఒక్కో ఖాతాదారుని పేరు మీద గరిష్ఠ బీమా రూ.5 లక్షలుగానే ఉంటుంది. కనుక ఒక బ్యాంక్‌లో రూ.5 లక్షలకు మించి చేసే డిపాజిట్‌పై కచ్చితంగా రిస్క్ ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఒకవేళ ఒక వ్యక్తి వేర్వేరు బ్యాంకుల్లో డిపాజిట్‌లు చేస్తే.. అప్పుడు విడిగా ఒక్కో బ్యాంక్ పరిధిలో సంబంధిత వ్యక్తికి గరిష్ఠంగా రూ.5 లక్షల డిపాజిట్‌కు బీమా రక్షణ వర్తిస్తుంది.

బ్యాంక్ కుదుటపడితే..

బ్యాంకులో మోసం కావచ్చు. లేదా లిక్విడిటీ సంక్షోభం తలెత్తవచ్చు. రుణ ఎగవేతలతో క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లిపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఆర్‌బీఐ తప్పకుండా జోక్యం చేసుకుంటుంది. తాత్కాలిక నిర్వహణ బాధ్యతల కోసం బోర్డ్‌ను ఏర్పాటు చేస్తుంది. బ్యాంక్ వ్యవహారాలను లోతుగా పరిశీలించి, చక్కదిద్దే వరకు డిపాజిట్ల ఉపసంహరణపై పూర్తిగా లేదా పాక్షికంగా ఆంక్షలు విధిస్తుంది. పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్‌లో రుణ అవకతవకలు సంక్షోభానికి దారితీయగా, ఆర్‌బీఐ దాన్ని చక్కదిద్దింది. అది ఇప్పుడు యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో భాగం అయింది. యస్ బ్యాంక్‌లోనూ రుణ మోసాలు బయటపడగా, కొత్త బోర్డ్‌ను ఏర్పాటు చేసి గాడిన పెట్టింది. రూ.5 లక్షలకు పైగా డిపాజిట్లు కలిగిన వారు.., రూ.5 లక్షలకు పైబడిన మొత్తాన్ని తిరిగి పొందడం కోసం బ్యాంక్ గాడిన పడే వరకు వేచి చూడాల్సిందే. అప్పటికీ పూర్తి మొత్తం వెనక్కి వస్తుందన్న గ్యారంటీ ఉండదు. ఎంత కోత పడుతుందన్నది బ్యాంక్ ఆర్థిక పద్దుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది.



బ్యాంకు నుంచే చెల్లింపులు

బ్యాంక్‌లో సమస్య తలెత్తినప్పుడు డిపాజిట్‌దారులు డీఐసీజీసీని సంప్రదించాల్సిన అవసరం ఉండదు. బ్యాంక్ నిర్వహణ బాధ్యతలు చూసే బోర్డ్.. డిపాజిట్‌దారుల వివరాలతో జాబితాను డీఐసీజీసీకి పంపిస్తుంది. ఆ వివరాల వాస్తవికతను 30 రోజుల్లోపు డీఐసీజీసీ తేల్చాలి. అక్కడి నుంచి 15 రోజుల్లోపు డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన బీమా మొత్తాన్ని బ్యాంక్‌కు డీఐసీజీసీ బదిలీ చేస్తుంది. అప్పుడు ఖాతాదారులకు బ్యాంక్ సిబ్బంది చెల్లింపులు చేస్తారు. బ్యాంక్‌పై ఆంక్షలు విధించిన నాటి నుంచి 90 రోజుల్లో డిపాజిట్‌దారులకు బీమా మొత్తం వెనక్కి చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి.

విచారించుకున్న తర్వాతే..

ఆర్‌బీఐ పరిధిలోని అన్ని బ్యాంక్‌లు తప్పనిసరిగా డీఐసీజీసీ పరిధిలోకి వస్తాయి. అవి డిపాజిట్లపై బీమా ప్రీమియం కచ్చితంగా చెల్లించాల్సిందే. సందేహం ఉంటే డిపాజిట్ చేసే ముందు బ్యాంక్ అధికారిని అడిగి బీమా ఉందా? అని నిర్ధారించుకోవచ్చు. అన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ప్రైవేటు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌లు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించే విదేశీ బ్యాంక్‌లు, కో ఆపరేటివ్ బ్యాంక్‌లు, లోకల్ ఏరియా బ్యాంక్‌లు, రీజినల్ రూరల్ బ్యాంక్‌లు, పేమెంట్స్ బ్యాంక్‌లు, స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లు, అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లు డీఐసీజీసీ పరిధిలోకి వస్తాయి. ప్రైమరీ కో ఆపరేటివ్ సొసైటీలు మాత్రం దీని కిందికి రావు.

అధిక వడ్డీ రేట్లు.. అన్నీ చూసాకే

ప్రభుత్వరంగ బ్యాంక్‌లు, ప్రైవేటు యూనివర్సల్ బ్యాంకులతో పోల్చితే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తుంటాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు రుణాలపై అధిక రేట్లను చార్జ్ చేస్తుంటాయి. కనుక అవి డిపాజిట్లను ఆకర్షించేందుకు ఎక్కువ రేట్లను ఇస్తుంటాయి. ఏ బ్యాంక్ అయినా సరే అధిక వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తుంటే, అందులో ఇన్వెస్ట్ చేసే ముందు ఈ రేషియోలను ఒక్కసారి పరిశీలించడం మంచిది.

సీఆర్ఏఆర్: క్యాపిటల్ టు రిస్క్ అస్సెట్ రేషియో అని, దీన్నే క్యాపిటల్ అడెక్వెసీ రేషియో అని కూడా అంటారు. ప్రభుత్వరంగ బ్యాంక్‌లకు ఇది కనీసం 12 శాతంగా, ప్రైవేటు షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్‌లకు 9 శాతం మేర ఉండాలి. అదే స్మాల్ ఫైనాన్స్‌బ్యాంక్‌లకు 15 శాతం ఉండాలి. బ్యాంక్ తనకు ఎదురయ్యే చెల్లింపుల బాధ్యతలను ఎంత సమర్థంగా ఎదుర్కోగలదన్నది ఇది తెలియజేస్తుంది.

ఎల్‌సీఆర్: లిక్విడిటీ కవరేజీ రేషియో 100 శాతం ఉండాలి. 30 రోజుల అవసరాలకు సరిపడా నిధులు బ్యాంకుల వద్ద ఉంచడం కోసం ఈ నిబంధన. దీనివల్ల లిక్విడిటీ షాక్‌లను బ్యాంక్‌లు సమర్థంగా ఎదుర్కోగలవు.

అసలు రాబడి ఎంత?

అత్యవసర నిధిని అట్టి పెట్టుకునేందుకు, స్వల్పకాలిక అవసరాలకు ఉద్దేశించిన నిధులను బ్యాంక్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేసుకుంటానంటే ఫర్వాలేదు. కానీ, దీర్ఘకాల లక్ష్యాల కోసం నిధిని సమకూర్చుకునేందుకు, సంపద సృష్టికి బ్యాంక్ డిపాజిట్ మెరుగైన సాధనం కాబోదు. ఈక్విటీలపై దీర్ఘకాలంలో 12 శాతం, బంగారంలో 8 శాతం మేర సగటు రాబడి ఉంటోంది. ఈక్విటీ, బంగారంలో పెట్టుబడిని విక్రయించినప్పుడే లాభాలపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. బ్యాంక్ డిపాజిట్లపై అలా కాదు. ప్రతి ఏటా ఆర్జించే వడ్డీ రాబడి అదే ఏడాది ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలిపి చూపించాలి. అవసరమైతే పన్ను చెల్లించాలి. ఎఫ్‌డీ రాబడిపై పన్ను చెల్లించగా, మిగిలే నికర రాబడి ద్రవ్యోల్బణ స్థాయిలోనే ఉంటుంది. కనుక డిపాజిట్లలో కాంపౌండింగ్ ప్రయోజనం పెద్దగా ఉండదు.

బీమా మరింత పెంచేనా..?



2019లో పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్‌లో సంక్షోభం తలెత్తిన తర్వాతే.. డిపాజిట్లపై రూ.లక్షగా ఉన్న బీమా పరిమితిని 2020 ఫిబ్రవరిలో రూ.5 లక్షలకు పెంచారు. ఈ బీమా రక్షణను మరింత పెంచాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎం.నాగరాజు ఇటీవల చేసిన ప్రకటన ఈ దిశగా డిపాజిటర్లలో అంచనాలను పెంచింది. ఇప్పటికిప్పుడు దీన్ని పెంచకపోయినా, భవిష్యత్తులో ఇందుకు తప్పక అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్ల సంగతేంటి?



బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ తదితర డిపాజిట్లు స్వీకరించే ఆర్‌బీఐ అనుమతి కలిగిన ఎన్‌బీఎఫ్‌సీలు (ఎన్‌బీఎఫ్‌సీ-డీ) దేశంలో 25 ఉన్నాయి. వీటి పరిధిలో 2024 మార్చి నాటికి రూ.1,02,994 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. మరి ఉన్నట్టుండి వీటిల్లో ఏదైనా ఎన్‌బీఎఫ్‌సీకి నిధుల సమస్య తలెత్తితే పరిస్థితి ఏంటి? బ్యాంకుల్లో మాదిరి వీటిల్లో డిపాజిట్‌లకు డీఐసీజీసీ కింద ఎలాంటి బీమా రక్షణ లేదు. ఇవన్నీ ప్రజల డిపాజిట్లే కనుక వీటిని సైతం డీఐసీజీసీ కిందకు తీసుకురావాలన్న డిమాండ్లు ఉన్నాయి. వీటిల్లో డిపాజిట్ చేసే ముందు ఇన్వెస్టర్లు రిస్క్‌లను అర్థం చేసుకోవాలి.

బ్యాంకులకూ రేటింగ్ ఉండాలి..



ఎన్‌బీఎఫ్‌సీలు తమ నిధుల అవసరాల కోసం బాండ్లు, ఎన్‌సీడీలను జారీ చేస్తుంటాయి. సంబంధిత ఎన్‌బీఎఫ్‌సీ ఆర్థిక ఆరోగ్యం ఆధారంగా రేటింగ్ ఏజెన్సీలు క్రెడిట్ రేటింగ్‌ను ప్రకటిస్తాయి. నిబంధనల ప్రకారం రేటింగ్ తప్పనిసరి. బ్యాంక్‌లు సైతం బాండ్లను జారీ చేయాలంటే రేటింగ్ తీసుకోవాల్సిందే. కానీ బ్యాంక్ డిపాజిట్లకు వచ్చే సరికి ఈ తరహా రేటింగ్ విధానం లేకపోవడాన్ని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్ డిపాజిట్లకు సైతం రేటింగ్‌ను తప్పనిసరి చేయడం వల్ల పాలన మెరుగుపడుతుందని ఎస్ఎస్‌జీ అండ్ పార్ట్‌నర్స్ పార్ట్‌నర్ రవి భడానీ అభిప్రాయపడ్డారు. దీని వల్ల డిపాజిట్ చేసే సమయంలో ఆయా బ్యాంక్‌లకు సంబంధించి రిస్క్‌ను ఇన్వెస్టర్లు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అలా చేస్తే అప్పుడు బలహీన బ్యాంక్‌ల నుంచి అధిక రేటింగ్ ఉన్న బ్యాంకుల్లోకి డిపాజిట్లు తరలిపోయే రిస్క్ ఏర్పడుతుందని ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్ సతీష్ మరాటే పేర్కొన్నారు. దీనికి బదులు మెరుగైన రేటింగ్ ఉన్న బ్యాంకులకు డిపాజిట్లపై బీమా ప్రీమియం తక్కువ వసూలు చేసే విధానం ఫలితమిస్తుందన్నారు.

ప్రీమియం ప్రామిస్‌తో గెలాక్సీ టాప్ అప్ ప్లాన్

Galaxy HEALTH INSURANCE

ముంబై: స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ గెలాక్సీ తాజాగా తక్కువ వ్యయాలతో అధిక కవరేజీని అందించేలా 'ప్రీమియం ప్రామిస్'తో గెలాక్సీ టాప్ అప్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. దీని ప్రకారం పాలసీదారులు క్లెయిమ్ చేసే వరకు లేదా వారికి 55 ఏళ్లు వచ్చే వరకు (ఏది ముందైతే అది) ప్రీమియంలు పెరగవని సంస్థ తెలిపింది. ఇది రూ. 5 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు సమ్ అష్యూర్డ్‌ను ఎంచుకోవచ్చని వివరించింది. క్యాన్సర్ మొదలైన వాటి ట్రీట్మెంట్‌లో తక్కువ సైడ్ ఎఫెక్ట్‌లతో పని చేసే నానోటెక్నాలజీ ఆధారిత చికిత్సలకు, కేవలం ఏడాది వెయిటింగ్ పీరియడ్‌తో అవయవాల ట్రాన్స్‌ప్లాంటేషన్, బేరియాట్రిక్ సర్జరీ తదితరాలకు కూడా కవరేజీ లభిస్తుందని సంస్థ పేర్కొంది.

పరిశ్రమల కోసం ఐసీఐసీఐ లాంబార్డ్ ఐఏఆర్ సుప్రీం పాలసీ

ICICI Lombard

ముంబై: సాంప్రదాయ పాలసీల పరిధికి మించి తయారీ, తయారీయేతర రంగ సంస్థలకు సమగ్ర కవరేజీనిచ్చేలా ఐఏఆర్ సుప్రీం పాలసీని ప్రవేశపెట్టింది ఐసీఐసీఐ లాంబార్డ్. ఇందులో 120 పైచిలుకు కస్టమైజబుల్ కవరేజీ ఆప్షన్లు ఉంటాయని సంస్థ తెలిపింది. మెటీరియల్ డ్యామేజీ, మెషినరీ దెబ్బతినడం, వ్యాపారానికి అంతరాయాలు ఏర్పడటం తదితర అంశాలకు సంబంధించి, పాలసీదారు తమ అవసరాలకు అనుగుణంగా కవరేజీని ఎంచుకోవచ్చని పేర్కొంది.


'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గ్లోబల్ ట్రెండ్స్, గణాంకాలపై దృష్టి
అన్ని కాలాలకూ అనువైనది! ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్

లార్జ్ క్యాప్స్‌లో పెట్టుబడులకు శామ్‌కో ఫండ్




శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ తాజాగా లార్జ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మార్చి 19 వరకు అందుబాటులో ఉంటుంది. ఏకమొత్తంగా అయితే కనీసం రూ. 5,000, సిప్ పద్ధతిలో రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. టాప్ 100 లార్జ్ క్యాప్ కంపెనీల్లో నుంచి అత్యంత నాణ్యమైన, వృద్ధికి అవకాశాలున్న షేర్లను గుర్తించి, ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి ప్రయోజనాలను అందించాలనేది ఈ ఫండ్ లక్ష్యం. ఇలాంటి స్టాక్స్‌ను గుర్తించేందుకు సొంతంగా రూపొందించుకున్న సీ.ఏ.ఆర్.ఈ. మూమెంటం వ్యూహాన్ని ఉపయోగిస్తామని సంస్థ సీఈవో విరాజ్ గాంధీ తెలిపారు. మార్కెట్లు ఎంతటి ఒడిదుడుకులకు లోనవుతున్నా మిగతా వాటితో పోలిస్తే లార్జ్ క్యాప్ షేర్లు కాస్త నిలదొక్కుకుని, నిలకడైన రాబడులను అందించే విధంగా ఉంటాయని వివరించారు. ప్రస్తుతం రిస్కుకు తగ్గ రాబడులు, స్థిరత్వాన్ని అందించేలా లార్జ్ క్యాప్ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు.

రెండు తరాలకు ఆర్థిక భద్రత.. కోటక్ జెన్2జెన్ ఇన్‌కం పథకం



సమగ్ర ఆర్థిక భద్రతను కల్పించేలా కోటక్ జెన్2జెన్ ఇన్‌కం పేరిట నాన్-లింక్డ్ సేవింగ్స్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తెలిపింది. పరిశ్రమలోనే తొలిసారిగా ఒకే ప్లాన్‌లో రెండు తరాలకు ఆదాయం, ఆర్థిక భద్రత కల్పించేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించింది. లెగసీ ఆప్షన్‌ను ఎంచుకున్న వారికి ఇది వర్తిస్తుంది. ఇందులో లైఫ్ ఇన్‌కం, లెగసీ ఇన్‌కం తదితర నాలుగు ఆప్షన్లు ఉంటాయి. ప్రీమియంలలో మార్పు లేకుండా మహిళలకు అధిక సమ్ అష్యూర్డ్ ప్రయోజనాలు లభిస్తాయి.

ఈటీఎఫ్‌లు-ఇండెక్స్ ఫండ్స్ మధ్య వ్యత్యాసం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ఒకే అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పరిధిలో (ఏఎంసీ) ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్ నుంచి, మరో ఈక్విటీ పథకంలోకి సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) ద్వారా పెట్టుబడులను మార్చుకోవాలని అనుకుంటున్నాను. దీనిపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను పడుతుందా?

- శ్రీకాంత్ ఎస్‌వీ

ఈఎల్ఎస్ఎస్ పథక నుంచి మరో ఈక్విటీ పథకంలోకి ఎస్‌టీపీ చేసుకుంటే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది. ఆ రెండు ఒకటే ఏఎంసీ పరిధిలో ఉన్నా సరే ఈ నిబంధనే వర్తిస్తుంది. ఇన్వెస్టర్ ఎస్‌టీపీ ద్వారా ఒక ఈక్విటీ పథకంలోని పెట్టుబడులను క్రమంగా మరో ఈక్విటీ పథకంలోకి మార్చుకునేందుకు వీలు కల్పిస్తుంది. మధ్యలో బ్యాంక్ ఖాతా అవసరం ఉండదు. కానీ, పన్ను పరంగా చూస్తే, ప్రతీ ఎస్‌టీపీ బదిలీని ఉపసంహరణగానే చట్టం కింద పరిగణిస్తారు. తిరిగి తాజా పెట్టుబడి కింద చూస్తారు. ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో పెట్టుబడికి మూడేళ్ల లాకిన్ పీరియడ్ వర్తిస్తుంది. మూడేళ్ల కాలం ముగిసిన యూనిట్లనే ఎస్‌టీపీ ద్వారా బదిలీ చేసుకోగలరు. ఉపసంహరణపై వచ్చిన లాభం ఒక ఆర్థిక సంత్సరంలో రూ.1.25 లక్షలు మించితే, అదనపు మొత్తంపై 12.5 శాతం పన్ను పడుతుంది. పన్ను పడకుండా ఎస్‌టీపీ చేసుకోవాలంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ఉపసంహరణ, బదిలీ అన్నది రూ.1.25 లక్షలు మించకుండా చూసుకోవాలి.



ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ మధ్య వ్యత్యాసం ఏంటి?

- దీప్తి

ఈ రెండు సాధనాల మధ్య సూక్ష్మమైన వ్యత్యాసమే ఉంది. ఈ రెండూ కూడా ప్యాసివ్ పెట్టుబడుల కోసం రూపొందించినవే. ఇండెక్స్‌ను (నిఫ్టీ50, సెన్సెక్స్ తదితర) ప్రతిఫలిస్తూ పెట్టుబడులు పెడుతుంటాయి. వీటిల్లో వ్యయాలు చాలా తక్కువ. చూడ్డానికి ఈ రెండు ఒకే విధంగా ఉన్నప్పటికీ, వాటిల్లో పెట్టుబడుల పరంగా వ్యత్యాసం ఉంటుంది. ధరల అస్థిరతల భయం లేకుండా ఇన్వెస్ట్ చేసుకునేందుకు ఇండెక్స్ ఫండ్స్ వీలు కల్పిస్తాయి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. చాలా సులభంగా, పెట్టుబడులను ఆటోమేట్ చేసే సాధనమే ఇండెక్స్ ఫండ్స్. ఈటీఎఫ్‌లు అలా కాదు. ఇవి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడ్ అవుతుంటాయి. వీటిని మీరే స్వయంగా కొనుగోలు చేసుకోవాలి. అందుకోసం ట్రేడింగ్, డీమ్యాట్ ఖాతాలుండాలి. కొనుగోళ్లపై బ్రోకర్, ఇతర చార్జీలు చెల్లించాలి. దీర్ఘకాల ఇన్వెస్టర్లకు ఇండెక్స్ ఫండ్స్ సులభమైన ఎంపిక. వీటిని తరచుగా పర్యవేక్షించుకోవక్కర్లేదు. సిప్ రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలుండి, మార్కెట్ కదలికలను అర్థం చేసుకుని పెట్టుబడులు పెట్టే వారికి ఈటీఎఫ్‌లు అనుకూలం.

చాలెట్ హోటల్స్ | బ్రోకరేజ్: ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 790 టార్గెట్: రూ. 1.039

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో చాలెట్ హోటల్స్ ఫలితాలు అంచనాలకు అనుగుణంగా వెలువడ్డాయి. అయితే లాభదాయకత ఆశించిన స్థాయికంటే స్వల్ప వెనకడుగు వేసింది. ఇందుకు అంచనాలను మించిన తరుగుదల, వడ్డీ వ్యయాలు ప్రభావం చూపాయి. ఆతిథ్యం, కమర్షియల్ లీజ్ రెంటల్స్ విభాగాల ఆర్థిక ఫలితాలు సంతృప్తికరంగానే వెలువడ్డాయి. రూ. 110 కోట్ల నికర లాభం అంచనా వేయగా.. రూ. 96.5 కోట్లు ఆర్జించింది. అయినప్పటికీ కంపెనీపట్ల వ్యవస్థాగతంగా కంపెనీపట్ల సానుకూల ధోరణితో ఉన్నాం. 2029వరకూ గదులను జత చేసుకుంటూ వెళ్లనున్న ప్రణాళికలు దీనికి కారణంకాగా.. ఈ ఏడాది నుంచి సాధించనున్న పటిష్ట నగదు ఆర్జన ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా వృద్ధికి దోహదపడనుంది. ఆదాయంలో ముంబై మెట్రోపాలిటన్ ప్రాంత(ఎంఎంఆర్) వాటా 63 శాతం నుంచి 56 శాతానికి క్షీణించడం ఇతర కీలక మార్కెట్లలో వ్యూహాత్మక విస్తరణను ప్రతిఫలిస్తోంది. ఇందుకు ప్రధానంగా హైదరాబాద్, జాతీయ రాజధాని ప్రాంతాలు(ఎన్‌సీఆర్) సహకరిస్తున్నాయి. ఎంఎంఆర్‌లో రోజువారీ రేటు 13 శాతం బలపడి రూ. 12,972ను తాకడం ధరల నిర్ధారిత శక్తిని ప్రదర్శిస్తోంది.అయితే చౌక చెల్లింపుల క్లయింట్లను వదలించుకోవడంతో గదుల ఆక్యుపెన్సీ 4 శాతం క్షీణించి 74 శాతానికి పరిమితమైంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి నగదు ఆర్జన పుంజుకోనుండటంతో ఇతర సంస్థల కొనుగోళ్లపై కంపెనీ దృష్టి సారించే అవకాశముంది. తద్వారా వృద్ధి అవకాశాలను అన్వేషించేందుకు వీలు చిక్కనుంది. ప్రమోటర్ రహేజా గ్రూప్ నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యం, ఆర్థిక పటిష్టత, గ్లోబల్ బ్రాండ్లతో ఒప్పందాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి.

ఎంఅండ్ఎం ఫైనాన్షియల్ | బ్రోకరేజ్: యాక్సిస్ క్యాపిటల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 275 టార్గెట్: రూ. 330

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో అంచనాలను మించుతూ మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ రూ. 900 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత నాన్‌రికరింగ్ పోర్ట్‌ఫోలియోపై ప్రొవిజన్ రైట్‌బ్యాక్ నేపథ్యంలో నమోదైన నామమాత్ర క్రెడిట్ వ్యయాలు ఇందుకు సహకరించాయి. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) పూర్తిగా అంచనాలకు అనుగుణంగా వెలువడింది. ప్యాసింజర్ వాహనాలు(పీవీ), ట్రాక్టర్ల కారణంగా రుణ విడుదల పుంజుకుంది. దీంతో నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం)లో నిలకడైన వృద్ధిని సాధించింది. ఆస్తుల(రుణాలు) నాణ్యతలో నిలకడను చూపింది. క్రెడిట్ వ్యయాలలోనూ నిలకడను యాజమాన్యం అంచనా వేస్తోంది. కొత్త భాగస్వామ్యాల కారణంగా ఫీజు, నిర్వహణ ఆదాయాలు మెరుగుపడే వీలుంది. 2027కల్లా ఆర్‌వోఏ 2 శాతం, ఆర్‌వోఈ 14 శాతానికి చేరగలవని భావిస్తున్నాం. 15 శాతంగా నమోదైన టైర్1 నేపథ్యంలో సమీప భవిష్యత్‌లో పెట్టుబడులను సమీకరించే అవకాశముంది. లోబేస్ కారణంగా ఎస్ఎంఈ విభాగం వృద్ధిలో ఉంది. ప్రీఓన్డ్ విభాగం మందగమనాన్ని చవిచూస్తోంది. అయితే ఈ విభాగం వృద్ధికి వీలుగా యాజమాన్యం టీమ్‌ను పటిష్టపరుస్తోంది. పీవీ విభాగంలో ప్రీమియమైజేషన్‌పై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా కొత్త ఈవీల ఫైనాన్సింగ్‌కు ఎంఅండ్ఎంతో చేతులు కలిపింది. అయితే వాణిజ్య వాహన(సీవీ) విభాగంపట్ల యాజమాన్యం అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. ఏయూఎం నిలకడైన వృద్ధిని సాధిస్తుండగా.. ఎస్ఎంఈ బిజినెస్ పుంజుకోవలసి ఉంది. ఆశించిన విధంగా ట్రాక్టర్ల ఎన్‌పీఏలు మెరుగుపడ్డాయి. రుణాలపై ఈల్డ్స్, ఫీజు ఆదాయం మెరుగుపడటంతో నికర వడ్డీ మార్జిన్లు(ఎన్ఐఎం) బలపడుతున్నాయి. సమీపకాలానికి 7 శాతం ఎన్ఐఎంను యాజమాన్యం అంచనా వేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

నా కూతురు 8వ తరగతితో చదువు మానేసింది. యూట్యూబ్ చానల్ ప్రారంభించి ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలనుకుంటోంది. భారీ పెట్టుబడి లేకుండానే త్వరగా డబ్బు సంపాదించవచ్చని అంటోంది. కౌన్సెలింగ్ కూడా ఇప్పించా. అయినా ఫలితం లేదు. ఆమె మనసును ఎలా మార్చాలో తెలియడం లేదు..

హైదరాబాద్‌కు చెందిన ఓ తండ్రి బాధ

మా అమ్మాయిలు ఒకరు 9, మరొకరు 8 చదువుతున్నారు. ఇటీవలే రీల్స్ చేయడం అలవాటు చేసుకున్నారు. మొదట్లో మేం కూడా సరదాగా ఎంకరేజ్ చేశాం. ఇప్పుడు అదే పనిలో పడిపోయి చదువును పూర్తిగా అటకెక్కించారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు..

వరంగల్ జిల్లాకు చెందిన ఓ తల్లి ఆవేదన

పిల్లల మనసు మార్చాలని మా వద్దకు తీసుకొస్తే.. ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఎంత సంపాదిస్తారో తెలుసా? మీ డాక్టర్లు కూడా అంత సంపాదించలేరు అంటూ ఎదురు ప్రశ్నలేస్తున్నారు..

మానసిక వైద్యులు చెబుతున్నది ఇది



‘ఇన్‌ఫ్లుయెన్స్’ అయి.. చదువుకు దూరమై..

ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారేందుకు చదువును నిర్లక్ష్యం చేస్తున్న ‘టీన్స్’

- ఈజీ మనీ ప్రచారానికి ఆకర్షితులవుతున్న పిల్లలు
- కౌన్సెలింగ్ ఇచ్చినా మారటంలేదంటున్న వైద్యులు
- ఆన్‌లైన్ విద్య మొదటికే మోసం తెచ్చిందనే అభిప్రాయాలు
- పిల్లలను మార్చలేక తలలు పట్టుకుంటున్న పేరెంట్స్

సాక్షి, హైదరాబాద్

బాల్యం సోషల్ మీడియా వలలో చిక్కి విలవిలలాడుతోంది. రీల్స్, యూట్యూబ్ చానల్స్‌తో లక్షలు సంపాదించొచ్చన్న ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటల గారడీలో పడి స్కూలు పిల్లలు కూడా జీవితాలు పాడుచేసుకుంటున్నారు. పట్టణాలు, నగరాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా అంతటా ఈ జాడ్యం పెరుగుతోంది. దీంతో స్కూల్ పిల్లల్లో చదువుపట్ల ఆసక్తి తగ్గిపోతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చదువు కోసం మొదలై..

కరోనా లాక్‌డౌన్ సమయంలో పిల్లల చదువు పాడవకూడదని అందరూ ఆన్‌లైన్ చదువుల వైపు మొగ్గారు. అందుకోసం పిల్లలకు పర్సనల్ కంప్యూటర్స్, ఫోన్లు, ట్యాబులు కొనిచ్చారు. ఇప్పుడు అదే పాపంగా మారింది. ఆన్‌లైన్‌లో అధిక సమయం గడపడంతో పిల్లలకు క్విక్ మనీకి బోలెడు మార్గాలు కనిపించాయి. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సహా అనేక అంశాలపై అర్ధసత్యాలు, అసత్యాలతో కూడిన అనవసర పరిజ్ఞానాన్ని అందించాయి. ‘హౌ టు మేక్ 30 లాక్స్ ఇన్ 2 ఇయర్స్’వంటి ఊరింపులు టీనేజ్ ఆలోచనలను కలుషితం చేశాయి.

సంపాదనకు వెల్‌కమ్.. స్కూల్‌కు బైబై..

సోషల్ మీడియాకు బానిసైన 8 లేదా 9వ తరగతి విద్యార్థుల్లో చాలామంది పాఠశాలకు వెళ్లడానికి కూడా ఇష్టపడడం లేదు. తాము సుఖంగా బతకడానికి సంప్రదాయ విద్య సరిపోదని వీరు బలంగా నమ్ముతున్నారు. ‘సోషల్ మీడియా ద్వారా కొందరు సులభంగా డబ్బు, పాపులారిటీ సంపాదించడాన్ని చూసి తామూ అలాగే చేయగలమని చాలామంది విద్యార్థులు భావిస్తున్నారు. పాఠశాలలో గడిపే కాలం వృథా అనే ప్రమాదకర అభిప్రాయం పెంచుకుంటున్నారు’అని సైకాలజిస్ట్ అరుణ్ చెప్పారు. యూట్యూబ్ చానల్ ప్రారంభించాలని కొందరు, తమ వ్యాపార ఆలోచనలకు తల్లిదండ్రులు నిధులు సమకూర్చాలని ఇంకొందరు, సేవా సంస్థను ప్రారంభించాలని/ ఇన్‌ఫ్లుయెన్సర్ / సింగర్‌గా మారాలని.. ఇలా ఏవేవో కోరుకుంటున్నారు. వీరిలో కొందరు చాలా మొండిగా తయారవుతుండడంతో వారికి కౌన్సెలింగ్ కూడా పనిచేయడం లేదని సైకాలజిస్టులు చెబుతున్నారు.



డా.చరణ్ తేజ, కన్సల్టెంట్ న్యూరో సైకియాట్రిస్ట్, హైదరాబాద్

జాగ్రత్తగా డీల్ చేయాలి

స్కూల్ విద్యతో ఉపయోగం లేదని 13–15 ఏళ్ల మధ్య వయస్కులు కొందరు పాఠశాల నుంచి నిష్క్రమించాలని కోరుకుంటున్నారు. దీంతో పిల్లలు కనీసం ఇంటర్ పూర్తి చేసినా చాలని, మందులతోనైనా బాగు చేయాలని వారి తల్లిదండ్రులు అడుగుతున్నారు. నా దగ్గరకు కౌన్సెలింగ్‌కు తీసుకొచ్చిన ఓ టీనేజ్ అమ్మాయి ఆన్‌లైన్‌లో ఓ రీల్ చూపించి తన వయసే ఉన్న ఓ టీనేజర్ రూ.30 లక్షలు సంపాదించిందని.. మీ డాక్టర్లు కూడా అంత సంపాదించలేరని చెప్పింది. ఫ్రెండ్స్ అంతా కలిసి ప్లాన్ చేసుకుని మరీ డ్రాప్ అవుట్స్‌గా మారుతున్నారు. వీరిని చాలా జాగ్రత్తగా డీల్ చేయాలి. గైడెన్స్, అవేర్‌నెస్ అందించాలి. మన విద్యా విధానం కూడా మారాలి. చదువుతో పాటు లైఫ్ స్కిల్స్ కూడా నేర్పించాలి.

బీద, మధ్యతరగతి వర్గాల్లోనే ఎక్కువ

ఇటీవల ఈజీ మనీ మీద టీనేజర్లలో బాగా ఆసక్తి పెరిగింది. అది వారి చదువు మీద వ్యతిరేక ప్రభావం చూపిస్తోంది. ఇది బీద, మధ్యతరగతి వర్గాల్లోనే ఎక్కువ కనిపిస్తోంది. గేమింగ్‌తో సహా రకరకాల యాప్స్ ద్వారా సులభంగా డబ్బులు సంపాదించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమ పిల్లల్ని వాటికి దూరం చేసి ఎలాగోలా చదువు మీద దృష్టిపెట్టేలా చేయమని మమ్మల్ని సంప్రదించే తల్లిదండ్రులు పెరిగారు. అయితే ఈ వ్యసనాన్ని ముదరనీయకుండా ప్రాథమిక దశలోనే గుర్తించి తుంచాల్సిన అవసరం ఉంది. దీనిపై స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. ఫోన్ల ద్వారా కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.



డా. పృథ్వీ రెడ్డి, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, కరీంనగర్

చదువు పాతదాయె.. కొలువు కొత్తగాయె..

- ప్రస్తుత జాబ్‌మార్కెట్‌ను అందుకోలేకపోతున్న టెకీలు
- డిమాండ్‌కు తగ్గట్టుగా లేని విద్యార్హతలు, అనుభవాలు
- దేశంలోని ప్రతి 10 మందిలో 8 మంది వృత్తి నిపుణులది ఇదే సమస్య
- గురుగోవింద్‌సింగ్ ఇంద్రప్రస్థ వర్సిటీ అధ్యయనంలో వెల్లడి

టెక్ ప్రపంచంలో రోజుకో కొత్త సాంకేతికత పుట్టుకొస్తోంది. ఒక టెక్నాలజీని నేర్చుకోవటం మొదలుపెట్టేలోపు.. కొంగొత్తది పుట్టుకొచ్చి.. నేర్చుకునేది పాతబడిపోతోంది. చదివిన చదువుకు, సాధించిన డిగ్రీలకు.. ఇప్పుడున్న మార్కెట్ అవసరాలకు పొంతనే లేకుండా పోతోంది. దేశంలోని 80 % వృత్తి నిపుణులది ఇప్పుడు ఇదే సమస్య. కృత్రిమ మేధ, మిషన్ లర్నింగ్, జనరేటివ్ ఏఐ, డేటా అనలిటిక్స్ వంటి నైపుణ్యాలున్న వారికి మంచి ప్యాకేజీలతో అవకాశాలు లభిస్తున్నాయి. కానీ, పాతకాలపు టెక్నాలజీ కోర్సులు చదివినవారికి ఎంత వృత్తి అనుభవం ఉన్నా కొత్త ఉద్యోగాలు దొరకటం లేదు. గురుగోవింద్‌సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ, హీరోవైర్డ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఇలాంటి అనేక విషయాలు వెల్లడయ్యాయి.

సర్వేలోని ముఖ్యాంశాలు..

- దేశంలోని ప్రతి 10 మంది వృత్తి నిపుణుల్లో 8 మంది విద్యార్హతలు ప్రస్తుత జాబ్ మార్కెట్ అవసరాలకు సరిపోవడం లేదు. కాలేజీల్లో నేర్చుకున్నదానికి భిన్నంగా జాబ్ మార్కెట్ ఉండడంతో.. అందుకు తగ్గట్టుగా తాము సిద్ధం కాలేకపోతున్నామని సర్వేలో పాల్గొన్న వారిలో 77% మంది తెలిపారు.
- నేటి అవసరాలకు తగ్గట్టుగా తమను తాము మలుచుకోవాలంటే ఏఐ టెక్నాలజీపై పట్టు సాధించాలని 90.1 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం డేటా అనలిటిక్స్ కీలకపాత్ర పోషిస్తున్నట్లు 89.6 శాతం మంది తెలిపారు.
- ఆగ్‌మెంటెడ్ అనలిటిక్స్ ఓ గేమ్‌ఛేంజర్‌గా మారుతున్నదని 72 శాతం వృత్తి నిపుణులు అభిప్రాయపడ్డారు.
- సస్టెయినబుల్ ఇన్నోవేషన్ ఒక ముఖ్యమైన పరిశ్రమగా ఉద్భవిస్తోందని 69.7 శాతం మంది చెప్పారు.
- క్రియేటివ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ ద్వారా సుస్థిరమైన కెరీర్‌ను నిర్మించుకోవచ్చని 62.3% అభిప్రాయం



నిపుణుల సూచనలు

- ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలకు తగ్గట్టుగా ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలి.
- సాంకేతికతపై పట్టుకే పరిమితం కాకుండా సృజనాత్మకత, టీంవర్క్, సవాళ్లకు తగ్గట్టుగా స్పందించే తీరుతోనే ప్రయోజనం ఉంటుంది.
- ఎప్పటికప్పుడు మారుతున్న ‘జాబ్ రోల్స్’కు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి.
- నైపుణ్యాలకు తగ్గట్టుగా కెరీర్‌ను ఎంచుకోవాలి.
- ఏఐ నైపుణ్యాలకే పరిమితం కాకుండా కంటెంట్ క్రియేషన్, డేటా అనలిటిక్స్ వంటి వాటి ద్వారా కూడా ముందుకు సాగొచ్చు.
- గతంలో ఓ వెలుగు వెలిగిన ఇంజనీరింగ్, మీడియా/ఎంటర్‌టైన్‌మెంట్, మెడిసిన్ వంటి రంగాలు ప్రస్తుతం కొంత నెమ్మదిస్తున్నాయి. ఆగ్‌మెంటెడ్ అనలిటిక్స్, సస్టెయినబుల్ ఇన్నోవేషన్, క్రియేటివ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్, మల్టీసెన్సరీ డిజైన్ వంటివి ప్రాధాన్యం సాధిస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్

అమ్మను చూడాలని..

- ఛత్తీస్‌గఢ్‌కు బయల్దేరిన మావోయిస్టు దంపతుల తనయ
- 2001లో మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో తండ్రి మృతి
- ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన తల్లి
- పోలీసుల సమాచారంతో 30 ఏళ్ల తర్వాత తల్లిని కలిసేందుకు కాంకేర్‌కు వెళ్లిన భవాని



తండ్రి రాంరెడ్డితో భవాని



కాంకేర్ రాణాలో వసంత



భవాని

కోరుట్ల

తల్లిని కలిసేందుకు ఓ తనయ ఆరాటపడుతోంది. 30 ఏళ్లుగా ఆమెకు దూరమై తల్లడిల్లిపోయింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ రాణాలో మీ అమ్మ ఉందంటూ భవానికి తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో భవాని ఆదివారం కోరుట్లలో ఉంటున్న తన బంధువులతో కలిసి అక్కడకు బయలుదేరి వెళ్లింది. వివరాల్లోకి వెళితే..జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన పసుల రాంరెడ్డి 1979లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అప్పుడే అరెస్ట్ అయ్యారు. జైలు నుంచి విడుదలయ్యాక ఏడాదిపాటు ఇంటి వద్దే ఉండగా, కథలాపూర్ మండలం సిరికొండకు చెందిన వసంతతో వివాహం జరిగింది. ఏడాది వ్యవధిలోనే రాంరెడ్డి–వసంత దంపతులిద్దరూ పీపుల్స్‌వార్‌లోకి వెళ్లారు. అజ్ఞాతంలో ఉండగానే కూతురు జన్మించింది. ముంబైలో ఉండే తన అన్నసాయిబాబాకు కూతురు(భవాని)ని అప్పగించాడు రాంరెడ్డి. 2001లో ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కార్యదర్శి హోదాలో ఉన్న సమయంలో కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం మద్దిమల్ల సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పసుల రాంరెడ్డి హతమయ్యాడు. అయినా అజ్ఞాతం వీడని వసంత శాంతక్క, మమతక్క పేర్లతో దండకారణ్యంలోని బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలిగా కొనసాగారు. మోకాళ్ల నొప్పులు, షుగర్ వంటి అనారోగ్య సమస్యలతో 2024 నవంబర్‌లో వసంత కాంకేర్ జిల్లా పోలీసులకు పట్టుబడ్డారు. ఆ తర్వాత కాంకేర్ పోలీసులు ఆమెతోపాటు మరో ఏడుగురు మావోయిస్టులు 2025 జనవరిలో లొంగిపోయినట్టు ప్రకటించారు. అప్పటి నుంచి కాంకేర్‌లోనే పోలీసుల అధీనంలో ఉంటోంది. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆమె గురించి ఆరా తీస్తూ తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులకు విషయం చెప్పారు. రెండురోజుల క్రితం తెలంగాణ పోలీసులు భవాని ఆచూకీ తెలుసుకున్నారు. ఆమెకు తల్లి సమాచారం చెప్పడంతో ఛత్తీస్‌గఢ్‌కు బయలుదేరింది.

ఒకట్రెండుసార్లు అమ్మను కలిశాను

చిన్నప్పుడు కోరుట్లలోనే ఓ చోట ఒకట్రెండు సార్లు అమ్మను కలిశా. అప్పుడు అమ్మానాన్న ఇద్దరూ అజ్ఞాతంలోనే ఉన్నారు. ఇప్పుడు నేను వెళితే నన్ను అమ్మ తప్పకుండా గుర్తుపడుతుంది. ఇన్నాళ్లు పెద్దనాన్న దగ్గర దత్తపుత్రికగానే పెరిగాను. కొన్నేళ్ల క్రితమే పెద్దనాన్న దంపతులు ఇద్దరూ చనిపోయారు. అమ్మ వస్తుందంటే బంధువులంతా సంతోషపడుతున్నారు. **- భవాని**

యాదగిరిక్షేత్రంలో రథోత్సవం



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆది వారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లు తిరుమాడ వీధుల్లో దివ్య విమాన రథంపై ఊరేగారు. సాయంత్రం ఆలయంలో నిత్యారాధనలు నిర్వహించిన అర్చకులు.. రథం ముందు రథాంగహోమం, రథబలి వంటి కార్య క్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి సమయంలో ఆగమశాస్త్రానుసారం దివ్య విమాన రథోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణ మూర్తులైన శ్రీలక్ష్మీనృసింహ స్వామి వార్ల ఉత్సవ మూర్తుల అలంకార సేవను రథంపై వేంచేపు చేసి.. బాజాభజంత్రీలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఊరేగించారు. ఇక ఉదయం ఆలయంలో శ్రీస్వామి వారిని శ్రీమహావిష్ణు అలంకారంలో గరుడ వాహనంపై ఊరేగించారు. వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన సదస్సుకు గిన్నిస్ రికార్డు..

ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్, కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ సంయుక్త నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్, కిమ్స్–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్, బ్రహ్మ కుమారీస్ సంయుక్తంగా నిర్వహించిన అతి పెద్ద అవగాహన సదస్సును గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించింది. మహిళా దినోత్సవం సందర్భంగా రాజస్తాన్‌లోని మౌంట్ అబూ సమీపంలోని శాంతివన్‌లోని బ్రహ్మ కుమారీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 5,020 మంది పాల్గొన్నారు. సదస్సును ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు, కిమ్స్–ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ సెంటర్ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ పి.రఘురామ్ నిర్వహించారు. ఈ సదస్సును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రిషినాథ్ సమీక్షించి రికార్డు అందించారు.



గిన్నిస్ రికార్డును అందుకుంటున్న మృత్యుంజయ భాయ్‌జీ, పి.రఘురామ్

యూట్యూబ్‌లో కూడా రికార్డు: ఈ అవగాహన కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీస్ యూట్యూబ్ చానల్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ‘24 గంటల్లో అత్యధిక వీక్షణలు పొందిన బ్రెస్ట్ కేన్సర్ అవగాహన సదస్సు’ అనే మరో గిన్నిస్ రికార్డు సాధించేందుకు ఇది నామినేట్ అయ్యింది. డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ, ‘ఈ గౌరవాన్ని నా తల్లి డాక్టర్ ఉషాలక్ష్మికి అంకితం చేస్తున్నాను. ఆమె బ్రెస్ట్ కేన్సర్‌పై పోరాడారు . భారతదేశంలో 60 శాతం బ్రెస్ట్ కేన్సర్ కేసులు ఆలస్యంగా గుర్తించబడుతున్నాయి. ముందస్తు పరీక్షలు తప్పనిసరి. ప్రతి మహిళ 40 ఏళ్లకు పైబడిన వెంటనే స్క్రీనింగ్ చేయించుకోవాలి’ అని అన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రపంచ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీకే మృత్యుంజయ భాయ్‌జీ మాట్లాడుతూ డాక్టర్ రఘురామ్ బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన పెంచేందుకు చేసిన కృషి మరవలేనిదన్నారు.

వధూవరులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



అనాథ యువతి పెళ్లికి అన్నీ తామై..

దగ్గరుండి పెళ్లి జరిపించిన కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: అనాథ యువతి పెళ్లికి పెద్దగా వ్యవహరించి మంచి మనసు చాటుకున్నారు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి. మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదన్‌కు చెందిన అనాథ యువతి మౌనిక వివాహాన్ని ఆదివారం కళాభారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అధికారులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. తల్లిదండ్రులు లేని మౌనికను 2017లో కరీంనగర్ బాలసదనంలో చేర్పించారు. అక్కడి అధికారులు ఆమెకు చదువు చెప్పించడంతోపాటు ఆలనాపాలన చూసుకున్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో.. మౌనికకు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. విషయాన్ని యువతి అధికారులకు చెప్పడంతో యువకుని కుటుంబసభ్యులతో మాట్లాడారు. వారంతా అంగీకరించడంతో మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారులు మౌనికకు పెళ్లి నిశ్చయించారు. దగ్గరుండీ పెళ్లి జరిపించిన కలెక్టర్ పమేలా సత్పతి.. వధూవరులకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అతిథులకు భోజనాలు ఏర్పాటు చేయించారు. వివాహానికి జిల్లా జడ్జి, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, ఎన్జీవో నాయకులు, వివిధ శాఖల అధికారులందరూ ఆర్థిక సహాయం అందించారు. కాగా మౌనికకు ముగ్గురు చెల్లెళ్లు ఉన్నారు.

డ్రగ్స్ స్మగ్లర్లపై బహిష్కరణ అస్త్రం

- ఎన్‌డీపీఎస్ కేసుల్లో విదేశీయుల డిపోర్టేషన్..
- గతేడాది 7 మంది డ్రగ్ స్మగ్లర్ల బహిష్కరణ
- ఈ ఏడాది ఇప్పటికే నలుగురిపై ఎన్‌డీపీఎస్ ప్రయోగం
- కఠినంగా వ్యవహరిస్తున్న టీజీ ఏఎన్‌బీ



సాక్షి, హైదరాబాద్

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ముఠాల ఆట కట్టించడంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) వ్యూహాత్మకంగా ముందుకు వెళుతోంది. అంతర్‌రాష్ట్ర గంజాయి, డ్రగ్స్ ముఠాలతోపాటు సింథటిక్ డ్రగ్స్‌ను దేశంలోకి తెప్పించి.. చాపకింద నీరులా విస్తరిస్తున్న విదేశీ పెడ్లర్లు, స్మగ్లర్లపైనా పటిష్ట నిఘా పెడుతోంది. విదేశీ డ్రగ్ పెడ్లర్లను కట్టడి చేస్తే మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో పలు రకాల వీసాలు, అనుమతులతో దేశంలోకి వచ్చి మత్తు పదార్థాల రవాణాకు పాల్పడుతున్నవారిని అరెస్టు చేసి, స్వదేశాలకు శాశ్వతంగా తిప్పి పంపుతున్నారు. డ్రగ్స్ సరఫరా కేసులతో సంబంధం ఉన్న 17 మంది విదేశీయులను గతేడాది అరెస్టు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే నేపాల్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదైన విదేశీయుల్లో గతేడాది ఏడుగురు, ఈ ఏడాది నలుగురిని వారి దేశాలకు తిప్పి పంపారు. దీంతో విదేశీ డ్రగ్ పెడ్లర్ల హడావుడి రాష్ట్రంలో తగ్గిందని అధికారులు తెలిపారు.

‘ఎన్‌డీపీఎస్’ కింద 2024లో టీజీఏఎన్‌బీ అరెస్టు చేసిన నిందితులు దేశాల వారీగా..

నైజీరియా	9	యెమెన్	1
టాంజానియా	3	సూడాన్	2
పాలస్తీనా	1	నేపాల్	1

మొత్తం 17

ఎన్‌డీపీఎస్ కేసులలో బహిష్కరణ ఇలా..

నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం ఉల్లంఘన సహా తీవ్రమైన నేరాలకు పాల్పడే విదేశీయులను మనదేశం నుంచి బహిష్కరించవచ్చు. దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించడం.. తీవ్రమైన నేరాలకు పాల్పడటం.. వీసా గడువు ముగిసినా ఎక్కువ కాలం ఇక్కడే ఉండటం వంటి ఘటనల్లో దేశం నుంచి విదేశీయులను బహిష్కరించవచ్చు. ఇప్పుడు ఇదే అస్త్రాన్ని వాడి టీజీ ఏఎన్‌బీ అధికారులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులలో చిక్కినవారిని తిరిగి పంపించేస్తున్నారు.



అత్యధికంగా ఎన్‌డీపీఎస్ కేసులు నమోదైన నైజీరియన్లు

పేరు	కేసులు
డివైన్ ఎబుకా సుజీ	8
పీటర్ న్వాబు వన్నా ఒకఫర్ అలియాస్ పీటర్	4
నికోలస్ ఒలుసోలా రోటిమి	4
మార్క్ ఓవలాబి అలియాస్ మార్క్ వొలాబీ	4
అమోబి చుక్వుడి ముయోనగోలు	4

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ప్రారంభం

తొలిరోజు సీతా రామ లక్ష్మణ ఆంజనేయులు తెప్పపై విహారం

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీత లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు. ముందుగా సాయంత్రం 6 గంటలకు సీత లక్ష్మణ ఆంజనేయ సమేత రామచంద్రుని ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుంది. తొలిరోజు శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయస్వామివారు పుష్కరిణిలో తెప్పపై మూడు సార్లు తిరిగి భక్తులను ఆశీర్వదించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఈఈలు సుబ్రహ్మణ్యం, సుధాకర్, డీఈ చంద్రశేఖర్, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ (ఫైనల్ మిషన్)ను కేంద్ర బలగాలు చేపట్టాయి. ఈక్రమంలోనే బస్తర్ అడవుల్లో నెత్తురు ఏరులై పారింది. ఎదురుకాల్పుల్లో 300 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. అయితే ప్రభుత్వ దళాల దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు మావోయిస్టులు ఎదురుదాడులకు సిద్ధమయ్యారని సమాచారం అందుతోంది.

-సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:

ఎవరికి వారే.. వేసవి వ్యూహాలు

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా దళాలు ● వీరికి చెక్ పెట్టే దిశగా మావోల ప్రతివ్యూహాలు ● ఒకేచోటకు చేరుతున్న మావోయిస్టు కమిటీల సాయుధులు



వేసవి సమీపించడంతో ఆకులు రాలిపోయి అడవులు వెలవెలబోతాయి. దీంతో ప్రతి వేసవిని మావోయిస్టులు గడ్డుకాలంగానే పరిగణిస్తారు. అడవిలో చాటు తగ్గిపోవడంతో పాటు నీటి వనరుల లభ్యత పరిమితంగా ఉంటుంది. దీంతో అడవుల్లోకి పోలీసులు, భద్రతా దళాలు చొచ్చుకురాకుండా 'ట్యాక్టిక్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్'పేరుతో ముందుగానే ఎదురుదాడులకు దిగే వ్యూహాన్ని ఆ పార్టీ అమలు చేస్తోంది. కానీ పెరిగిన నిర్బంధం వల్ల ప్రస్తుతం బస్తర్ అడవుల్లో మావోయిస్టులు, వారి సానుభూతిపరులకు మధ్య సంబంధాలు గతంలో పోలిస్తే తగ్గిపోయాయి. సానుభూతిపరుల నుంచి అవసరమైన మేర సాయం అందే పరిస్థితి లేదు. ఈ లోటును పూడ్చుకునేందుకు తమ సాయుధ బలగాలనే ఏకం చేసి వ్యూహాత్మక దాడులు చేయాలనే ప్లాన్‌లో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం.

వేసవి వ్యూహం..

ఏకమవుతున్న దళాలు..

బస్తర్ అడవులు కేంద్రంగా కేంద్ర కమిటీతో పాటు వివిధ రాష్ట్రాలు, ఏరియా కమిటీలు పని చేస్తున్నాయి. ఈ కమిటీలకు రక్షణగా పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందిన సాయుధులు రక్షణ కల్పిస్తున్నారు. దీనికి తోడు ప్రతి కమిటీకి సాయుధ దళాలు ఉంటాయి. వేసవి ప్రతికూల పరిస్థితుల్లో ప్రభుత్వ భద్రతా బలగాలను ఎదుర్కోవాలంటే దళాలు వేర్వేరుగా కాకుండా కలిసికట్టుగా దాడులు చేయాలనే వ్యూహానికి మావోలు పదును పెడుతున్నట్టు సమాచారం. ఈ మేరకు దండకారణ్యం, అబూజ్‌మడ్ అడవుల్లో తమకు పట్టున్న ప్రాంతానికి వివిధ దళాలు చేరుకున్నట్టు తెలుస్తోంది.

సురక్షితంగా ఎంట్రీ-ఎగ్జిట్..

ఒకప్పుడు రెడ్ కారిడార్ అంటే నేపాల్ నుంచి దక్షిణ భారతదేశం వరకు ఉండేది. ప్రస్తుతం బస్తర్ అడవులు మాత్రమే మిగిలాయి. ఇందులోనూ చాలా ప్రాంతం భద్రతా దళాల అధీనంలోకి వెళ్లింది. అయినప్పటికీ దక్షిణ బస్తర్, ఏవోబీ, ఛత్తీస్‌గఢ్ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు ఇప్పటికీ మావోల గుప్పిట్లోనే ఉన్నాయి. దీంతో తమకు పట్టు ఉన్న ప్రాంతానికి చేరుకుంటున్న దళాలు... ఆయా ప్రాంతాల నుంచి ఎంట్రీ, ఎగ్జిట్, రిట్రీవ్ రూట్‌లు సేఫ్‌గా ఉండేలా ప్లాన్ చేసుకున్నట్టు తెలుస్తోంది. తమ స్థావరాల సమీపంలోకి భద్రతా దళాలు వస్తే భీకరంగా ఎదురుదాడి చేయాలని మావోయిస్టులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

జవాన్ల జోరు తగ్గిందా?

ఈ ఏడాది ఆరంభంలో జనవరి 16 , 21, ఫిబ్రవరి 9న భారీ ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఘటనల్లో 80 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి సైతం ప్రాణాలు కోల్పోయారు. కానీ గడిచిన నెలరోజులుగా భారీ ఎన్‌కౌంటర్లు ఎక్కడా జరగలేదు. నక్సలైట్ల వేసవి వ్యూహాలను పసిగట్టడం వల్లనే గడిచిన నెల రోజులుగా గాలింపు చర్యలను భద్రతా దళాలు ఆచితూచి చేపడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దూకుడుగా అడవుల్లోకి వెళ్లి మావోయిస్టుల వలలో చిక్కితే భారీగా ప్రాణనష్టం జరగడంతో పాటు జవాన్ల ఆత్మస్థైర్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్లే కూంబింగ్‌కు సమాంతరంగా బేస్ క్యాంపులను సుస్థిరం చేయడం, కొత్తగా అధీనంలోకి వచ్చిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై భద్రతా దళాలు ఫోకస్ చేస్తున్నాయి.

కవ్వింపు చర్యలు

తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నప్పటికీ మార్చి 6న దంతేవాడ జిల్లా కేంద్రానికి 40 కి.మీ దూరంలో బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ప్రజాకోర్టు నిర్వహించారు. విప్లవ ద్రోహులుగా పేర్కొంటూ అక్కడ కొన్ని కుటుంబాలను ఊరు వదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. గాలింపు చర్యల్లో భద్రతా దళాల దూకుడు తగ్గడంతో వారిని రెచ్చగొట్టి అడవుల్లోకి రప్పించేందుకే మావోయిస్టులు ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.



మారుతి.. సేదదీరితి

రామన్నపేట: అలసట ఎరుగక తిరిగే వానరాలు సైతం ఎండ వేడిమిని తట్టుకోలేకపోతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం యాదాద్రి భువనగిరి జిల్లాలో పగటి ఉష్ణోగ్రత 39 డిగ్రీలు నమోదైంది. దీంతో వేడిని తట్టుకోలేక వానరాలు చెట్టు నీడన అరుగుపై కునుకు తీశాయి. ఈ దృశ్యం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కనిపించింది.

మావోయిస్టుల ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం



భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల సామగ్రి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోమ్‌గూడ క్యాంపు బలగాలు ఆదివారం మావోయిస్టుల ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. గోమ్‌గూడ క్యాంపు నుంచి డీఆర్జీ, కోబ్రా, 241 బెటాలియన్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో గోమ్‌గూడ క్యాంపు పరిధిలోని జాలేర్‌గూడ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు స్పైక్(పదునైన కడ్డీలు)లను ఏర్పాటు చేశారు. వాటిని తొలగించుకుంటూ గాలిస్తుండగా.. మావోయిస్టులకు చెందిన ప్రింటింగ్ స్థావరం బయటపడింది. అక్కడ మావోయిస్టులు దాచిపెట్టిన ప్రింటర్లు, ఇన్వర్టర్ యంత్రాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

'రామినేని' మృతిపై కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) సంఘం రాష్ట్ర కోశాధికారి, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ రామినేని శ్రీనివాస్ మరణంపై బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగ సంఘం నేతగా శ్రీనివాస్ కృషి చిరస్మరణీయమని కొనియాడారు. రామినేని కుటుంబ సభ్యులకు వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏయే అంశాల్లో ఎంత స్కోరుకు.. మన డిస్కంలు సాధించిన స్కోర్ ఇదీ..

అంశం	మొత్తం స్కోరు	టీజీఎస్పీడీసీఎల్	టీజీఎన్పీడీసీఎల్
మొత్తం ఆర్థిక సుస్థిరత	75	0	3.5
వ్యయం-ఆదాయం మధ్యఅంతరాయం తగ్గింపు	35	0	3.5
డేస్ రిసీవబుల్	3	0	0
జెన్‌కో, విద్యుదుత్పత్తి సంస్థలకు సకాలంలో చెల్లింపులు	10	0	0
అడ్జెస్టెడ్ క్విక్ రేషియో	10	0	0
రుణాల చెల్లింపులో సమర్థత	10	0	0
రుణపరపతి	7	0	0
పనితీరులో సమర్థత	13	5.7	5.7
బిల్లుల జారీలో సమర్థత	5	3.7	3.7
బిల్లుల వసూళ్లలో సమర్థత	5	0	0
డిస్ట్రిబ్యూషన్ నష్టాల నియంత్రణ	2	2	2
కార్పొరేట్ పాలన	1	0	0
ప్రభుత్వ సహకారం	12	7.7	8.5
సబ్సిడీ	4	4	4
నష్టాలను ప్రభుత్వం టేకోవర్ చేసుకోవడం	3	2.7	3
ప్రభుత్వ బకాయిలు	3	0	0.5
ఎప్పటికప్పుడు టారిఫ్ ప్రతిపాదనలు	1	0	0
ఇంధన సర్దుబాటు చార్జీలు	1	1	1
మొత్తం	100	13.4	17.7
నెగెటివ్ స్కోరు	-	-2	-1
తుది స్కోరు	-	11	16.7

సౌర విద్యుత్ కం'చేను'



తాడిచర్లలో పత్తి చేను వద్ద ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కంచె

మల్హర్: ఇన్నాళ్లు పంటలను జంతువుల నుంచి కాపాడుకునేందుకు రైతులు రేయింబవళ్లు ఇబ్బంది పడ్డారు. కానీ వాటికి ప్రాణహాని లేని ఆధునిక విధానాలపై ప్రస్తుతం ఆసక్తి చూపుతున్నారు. అటవీ జంతువుల నుంచి పంటను రక్షించుకోవడానికి కొందరు పొలాలు, చేన్ల వద్ద సౌర విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకుంటున్నారు. సౌర విద్యుత్ కంచెను అడవి పందులు, కోతులు, పశువులు ఇతర జంతువులు తాకినా వాటికి ప్రాణహాని కలగదు. విద్యుదాఘాతంతో భయపడి అవి దూరంగా వెళ్లి పోతాయి.

కాంగ్రెస్ పాలనలో కుదిరిన ఒప్పందాలు ఇలా..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సాధించిన రూ. 1.83 లక్షల కోట్ల పెట్టుబడులపై పరిశ్రమలు, ఐటీ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

- అమెజాన్ వెబ్ సర్వీసెస్ రూ. 60 వేల కోట్లతో రాష్ట్రంలో కొత్త డేటా సెంటర్‌ను స్థాపించడానికి గత జనవరి 23న దావోస్‌లో ఒప్పందం చేసుకుంది.
- సన్ పెట్రో కెమికల్స్ సంస్థ ములుగు, మంచిర్యాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రూ. 45,500 కోట్లతో 3,400 మెగావాట్ల సామర్థ్యంతో మూడు పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు జనవరి 22న తెలంగాణ ప్రభుత్వంతో దావోస్‌లో ఒప్పందం చేసుకుంది. ఈ కంపెనీ ద్వారా 7 వేల కొలవులు లభించనున్నాయి.
- సింగరేణి సంస్థ, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా రూ. 22 వేల కోట్లతో తెలంగాణలో 1,600 మెగావాట్ల థర్మల్, రాజస్తాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయి.
- మేఘా ఇంజనీరింగ్ సంస్థ రూ. 15,000 కోట్లతో వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుకు జనవరి 21న దావోస్‌లో ఒప్పందం చేసుకుంది. రూ.11 వేల కోట్లతో 2,160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు, రూ.3,000 కోట్లతో 1,000 ఎండబ్ల్యూహెచ్ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్, రూ.1,000 కోట్లతో అనంతగిరి వద్ద



లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్‌ను నిర్మించనుంది. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుతో 1,250, బ్యాటరీ ప్రాజెక్టుతో 4,000, రిసార్ట్ ద్వారా 2,000 ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

- టైటాన్ గ్లోబల్ హోల్డింగ్ సంస్థ టెలికామ్ లేదా ఎనర్జీ రంగంలో రూ.15,000 కోట్లతో ప్రాజెక్టుల స్థాపనకు గత జనవరి 23న దావోస్‌లో ఒప్పందం చేసుకుంది.
- కంట్రోల్‌ఎస్ సంస్థ రూ.10వేల కోట్లతో డేటా సెంటర్ల ఏర్పాటుకు గత జనవరిలో దావోస్‌లో ఒప్పందం చేసుకుంది. దీనితో 3600 ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- గోడి ఇండియా సంస్థ గతేడాది జనవరి 17న రూ. 8,000 కోట్లతో లిథియం గిగా ఫ్యాక్టరీ స్థాపన కోసం ఒప్పందం చేసుకుంది. విద్యుత్ నిల్వ, విద్యుత్ వాహన రంగాలకు మద్దతుగా 12.5 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యంతో లిథియం సెల్ తయారీ పరిశ్రమను స్థాపించనుంది. దీని ద్వారా వచ్చే ఐదేళ్లలో 6 వేల ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
- ప్రీమియర్ ఎనర్జీ సంస్థ రూ.4,300 కోట్లతో పునరుత్పాదక విద్యుత్, ఎనర్జీ స్టోరేజీ రంగ పరికరాల తయారీ పరిశ్రమ స్థాపనకు గతేడాది డిసెంబర్ 24న ఒప్పందం చేసుకోగా, 5200 ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఆజాద్ ఇంజనీరింగ్ సంస్థ ఏయిరోస్పేస్, డిఫెన్స్ రంగంలో రూ.800 కోట్లతో ఘన్‌పూర్ పారిశ్రామికవాడలో రెండు విడతల్లో సూపర్ అలాయ్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్ ఏర్పాటుకు గత డిసెంబర్ 8న ఒప్పందం చేసుకుంది. 600 కొలవులు లభించనున్నాయి.
- జేఎస్‌డబ్ల్యూ యూఏవీ సంస్థ రూ.800 కోట్లతో అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ తయారీ పరిశ్రమల స్థాపనకు జనవరి 22న దావోస్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో 200 ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- స్కైరూట్ ఎయిరోస్పేస్ సంస్థ రూ.500 కోట్లతో ఎయిరోస్పేస్ ప్రాజెక్టులు, రాకెట్ తయారీ ప్రాజెక్టుల స్థాపనకు గత జనవరిలో దావోస్‌లో ఒప్పందం చేసుకుంది.
- లెన్స్‌కార్ట్ సంస్థ రూ.1,500 కోట్లతో ఫ్యాబ్‌సిటీలో అత్యంత పెద్ద కళ్లద్దాల తయారీ పరిశ్రమ స్థాపనకు గతేడాది డిసెంబర్ 8న ఒప్పందం చేసుకోగా, 2100 ఉద్యోగాలు లభిస్తాయి.



ఆత్రేయ ప్రియశిష్య పురస్కారం జె.కె.భారవి



చిరంజీవి, బ్రహ్మానందంతో ముచ్చటిస్తున్న రాజమౌళి



అశ్వినీదత్‌తో.. ఉదయ్ గుర్రాల సెల్ఫీ

వెండితెరపై 'మానుకోట'

సినీ పరిశ్రమలో మహబూబాబాద్ జిల్లా వాసుల రాణింపు | షార్ట్ ఫిలిమ్స్ నుంచి సినిమాల వరకు.. | వివిధ విభాగాల్లో రాణిస్తున్న కళాకారులు

మహబూబాబాద్ అర్బన్:

మానుకోట జిల్లా అనగానే మొదట గుర్తుకు వచ్చేది క్రీడలు.. అంతేనా.. విద్య, ఉద్యమాలు, పోరాటాల్లో.. పాటల రచయితలు, సంగీత దర్శకులు, ఫొటోగ్రాఫర్లు, కళాకారులుగా.. ఇలా ఎందరో సత్తా చాటుతున్నారు. మిర్చి, పసుపు, పత్తి పంటల్లో రాణిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ, పోలీస్, జవాన్, నేవీ తదితర అనేక రంగాల్లో వెలుగుతున్నారు. మానుకోట ముద్దుబిడ్డలుగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. జిల్లా నుంచి సినీరంగంలోనూ గుర్తింపు తెచ్చుకున్న కళాకారులు కోకొల్లలు. చిన్న చిన్న పాత్రలు పోషిస్తూ.. పాటలు పాడుతూ ఎదుగుతున్నారు. చిన్న సినిమాలకు తొలుత సంగీతం అందించి ప్రస్తుతం పెద్దపెద్ద హీరోల సినిమాలకు పనిచేస్తున్నారు. వీడియో, కెమెరామెన్, సినిమా ఫొటోగ్రఫీ, అసోసియేట్ డైరెక్టర్ వరకు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

దాశరథి నుంచి..

మానుకోట జిల్లా నుంచి మొదట సినిమారంగంలో చిన్నగూడూరుకు చెందిన దాశరథి కృష్ణమాచార్యులు ప్రవేశించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ'అని తెలంగాణ ఉద్యమానికి ప్రేరణ అందించిన కవి ఆయన. తెలుగు సినిమాలకు గేయ రచయితగా రాణించారు. 'కన్నె వయసు'సినిమాలో 'ఏ దివిలో విరిసిన పారిజాతమో..'పాట రాశారు. తోట రాముడు సినిమాలో 'ఓ బంగరు రంగుల చిలకా పలకవే..'అనే పాట కూడా రాశారు.

- మానుకోట జిల్లా కేంద్రం గుమ్ముడూరుకు చెందిన గోడిశాల జయరాజు సినీగేయ రచయిత, కవి. ప్రకృతిపై కథలు, గేయాలు రాశారు. అవి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ సహా అనేక భాషల్లోకి అనువాదమై విస్తృత ప్రాచుర్యం పొందాయి. జయరాజు మొదట 'అడవిలో అన్న' సినిమాలో 'వందనాలమ్మ' పాట రాశారు. 'దండోరా' సినిమాలో 'కొండల్లో కోయిల పాటలు పాడాలి' అనే పాట రాశారు.
- కేసముద్రం మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన జె.కె.భారవి (సుదర్శన భట్టాచార్య) తెలుగు సినీ రచయితగా, దర్శకుడు, పాటల రచయితగా పేరొందారు. కన్నడ సినీరంగంలోనూ పేరు తెచ్చుకున్నారు. అన్నమయ్య, లవ్‌స్టోరీ, శ్రీమంజునాథ, శ్రీరామదాసు, పాండురంగడు, శక్తి, ఓం నమో వేంకటేశాయ, చిటికెల పందిరి, జగద్గురు ఆదిశంకర తదితర సినిమాల్లో నటుడిగా, రచయితగా, దర్శకుడిగా పని చేశారు. ఆత్రేయ ప్రియశిష్య పురస్కారం అందుకున్నారు.
- మానుకోట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన సంగీత దర్శకుడు చక్రధర్ రచయితగా, గాయకుడిగా, నటుడిగా రాణించారు. మొదట 'పండు వెన్నెల'అనే మ్యూజిక్ ఆల్బమ్ చేశారు. చిరునవ్వుతో, ఇడియట్, శివమణి, అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి, సత్యం, దేశముదురు, నేనింతే, చక్రం, ఆంధ్రావాలా, ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం తదితర 85 చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేసి నంది అవార్డు అందుకున్నారు.
- బయ్యారం మండల గౌరారం గ్రామానికి చెందిన బొబ్బిలి సురేశ్ సినీరంగంలో రాణిస్తున్నారు. నీదీ నాదీ ఒకే కథ, జార్జిరెడ్డి, తోలుబొమ్మలాట, తిప్పర మీసం, గువ్వా గోరింక, విరాటపర్వం, చిల్‌బ్రో, టెన్త్‌క్లాస్ డైరీస్, మళ్లీ పెళ్లి తదితర సినిమాలకు సంగీత దర్శకుడిగా పని చేశారు.
- జిల్లా కేంద్రానికి చెందిన కందుకూరి అనిల్‌కుమార్ మొదట ప్రైవేట్ ఆల్బమ్ పాటలకు నృత్య దర్శకునిగా పని చేశారు. తరువాత పీపుల్స్‌వార్, పోలీస్ వెంకటరామయ్య, దండకారణ్యం సినిమాలకు నృత్య దర్శకత్వం వహించారు.
- తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన గిద్దె రాంనర్సయ్య.. తెలంగాణ ఉద్యమంలో పలు గీతాలు ఆలపించారు. ఉద్యమంలో ఎంతో మందిని తన పాటలతో ఉత్తేజ పరిచారు.
- కంబాలపల్లి గ్రామానికి చెందిన గుర్రాల ఉదయ్ జేఎన్‌టీయూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేశారు. మొదట షార్ట్ ఫిలిమ్స్ తీశారు. 'స్వేచ్ఛ'సినిమాతో సినీరంగంలోకి డైరెక్టర్‌గా అడుగుపెట్టారు. ఉత్తమ డైరెక్టర్ అవార్డు అందుకున్నారు.
- జంగిలిగొండ గ్రామానికి చెందిన రాజమౌళి బుల్లితెర షోల్లో నటించారు. భోళాశంకర్, ధమాక, బంగారు బుల్లోడు, అనుభవించు రాజా, చోర్ బజార్, సిల్లీ ఫెలోస్ తదితర సినిమాల్లోనూ నటించారు.

తెలంగాణ యాసపై సినిమాలు చేస్తా



నాకు మొదట సినిమాల్లో అవకాశం కల్పించింది ఆర్.నారాయణమూర్తి. ప్రకృతితో.. నాకూ ఉన్న అనుబంధాన్ని నా పాటల్లో వివరించా. భవిష్యత్‌లో సినిమాల్లో రచనలు చేసే అవకాశం వస్తే వదులుకోను. నా ప్రతిభను మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా గుర్తించి అవార్డు అందజేశారు. తెలంగాణ యాస, భాషపై మరిన్ని సినిమాలు చేస్తాను. – గోడిశాల జయరాజ్, సినీ రచయిత

'స్వేచ్ఛ'షార్ట్ ఫిలింతో ప్రవేశం



మొదట 'స్వేచ్ఛ'షార్ట్ ఫిలింతో సినిమా రంగంలోకి అడుగు పెట్టాను. చిన్న చిన్న సినిమాలకు దర్శకత్వం వహిస్తున్నాను. నేను రూపొందించిన 'మేల్'సినిమా.. బెస్ట్ ఫిలిం స్క్రీన్‌ప్లే న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఫిలిం అవార్డుకు నామినేట్ అయింది.

– గుర్రాల ఉదయ్, డైరెక్టర్, సినిమాటోగ్రాఫర్

ఆస్కార్ అవార్డు లక్ష్యం



సినీరంగంలో మొదటి సినిమాతోనే నాకు మంచి గుర్తింపు వచ్చింది. భవిష్యత్‌లో పెద్ద పెద్ద హీరోలకు మంచి సంగీతం అందించి గుర్తింపు తెచ్చుకుని ఆస్కార్ అవార్డు అందుకోవాలన్నది నా కోరిక. ఇప్పటి వరకు నాకు చేయూతనిచ్చిన దర్శకులు, నిర్మాతలకు రుణపడి ఉంటా.

– సురేష్ బొబ్బిలి, సంగీత దర్శకుడు

కొత్తవారికి అవకాశమిస్తా



టీవీ షోలు, సినీరంగంలో ఎంతో కష్టపడ్డాను. సినీ ప్రేక్షకులు, జిల్లా ప్రజల ఆశీస్సులతో ఇంతటి వాడినయ్యాను. నటనలో నైపుణ్యం ఉన్న వారికి కచ్చితంగా అవకాశం కల్పిస్తాను. పేద ప్రజలకు నా వంతుగా సేవ చేస్తున్నాను.

– రాజమౌళి, జబర్దస్త్ నటుడు

తీరంలో ఆహ్లాదం..



నిప్పులుగక్కుతున్న ఎండలకు ఇళ్లల్లోంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్న విశాఖ నగర ప్రజలు సాయంత్రం అయ్యేసరికి సముద్రతీరంలో సేదతీరుతున్నారు. ఆదివారం సాయంత్రం ఆర్.కె.బీచ్‌లో ఆహ్లాదంగా గడుపుతున్న నగరవాసులు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆహా ఏమిరుచి..



రంజాన్ పండుగ నెల.. నోరూరిస్తున్న హలీం.. చల్లటి ఫలూదా.. విజయవాడ నగరవాసులు ఆ రుచుల్ని ఆస్వాదిస్తున్నారు. వారితో ఆదివారం సాయంత్రం పంజాసెంటర్ కిటకిటలాడింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

చుక్కనీరు దొరికినా చాలు..



ఎండలకు గొంతెండుతున్న జీవాలు చుక్కనీటి కోసం ఎంత తపనపడుతున్నాయో ఈ దృశ్యాలు కళ్లముందు ఆవిష్కరిస్తున్నాయి. తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద ఆదివారం ఒక వానరం దప్పికతో నీటి కోసం తీవ్ర ప్రయత్నాలు చేసింది. చివరికి కొళాయిలోంచి వచ్చిన రెండు నీటి చుక్కలతో గొంతు తడుపుకొని హమ్మయ్య.. అనుకుంటూ వెళ్లింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా లక్ష్మి



రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి

ఒంగోలు టౌన్: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎం.లక్ష్మి ఎన్నికయ్యారు. ఒంగోలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎం.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బి.పద్మ, ఉపాధ్యక్షులుగా రమా సుందరి, ఎస్.విష్ణు, ఆర్.గంగాభవాని, పి.రమణి, జానకి, సహాయ కార్యదర్శులుగా పి.పద్మ, మణి, ఎం.కల్పన, ఎస్.భారతి, కోశాధికారిగా వై.భారతి సహా మొత్తం 26 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల, జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. మద్యాన్ని నిషేధించాలని, ఆదివాసీలపై జరుగుతున్న హింసాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేసింది.

సీనియారిటీ జాబితాలోని లోపాలు సరిచేయాలి

సాక్షి, అమరావతి: టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) డేటాతో సీనియారిటీ జాబితా తయారు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ పూలే టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి వాసిలి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీస్‌లో చేరిన తేదీ, పుట్టిన తేదీల ఆధారంగా సీనియారిటీ జాబితా తయారవడంతో టీచర్లు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గత సీనియారిటీ జాబితాలను, డీఎస్సీ మెరిట్ కం రోస్టర్ (కౌన్సెలింగ్ జాబితా) జాబితా, పదోన్నతి రోస్టర్ జాబితాలను తారుమారు చేయకుండా టీఐఎస్ డేటాతో సీనియారిటీ జాబితాలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2022లో ప్రభుత్వం విడుదల చేసిన తుది మార్గదర్శకాల ఆధారంగానే సీనియారిటీ జాబితాలు తయారు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ లోపాలు సరిచేయకుండా జాబితాలు ప్రకటిస్తే ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

చైల్డ్ కేర్ లీవ్‌లు పెంచాలి: ఏపీటీఎఫ్ అమరావతి

ఉపాధ్యాయుల చైల్డ్ కేర్ లీవ్‌ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రెండేళ్లకు పెంచాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వీటి వినియోగానికి ఉన్న 10 విడతల షరతును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

విరమణ ఉద్యోగానికే.. బోధనకు కాదు..



నాగాయలంక: కృష్ణాజిల్లా నాగాయలంక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పద్యాల వెంకట నాగేశ్వరరావు (పీవీఎస్ఆర్) పదవీ విరమణ చేసినా విరామమెరుగక పాఠాలు బోధిస్తున్నారు. విరమణ ఉద్యోగానికే తప్ప బోధనకు కాదనుకున్నారు. విద్యార్థులే పిల్లలుగా భావిస్తూ లాభాపేక్ష లేకుండా నిత్యం పాఠశాలకు వచ్చి పాఠాలు చెబుతూ చదువులమ్మ ఒడిలో మహర్షిగా మారారు పీవీఎస్ఆర్. ఆయన నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మార్చి 2017 నుంచి హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి 2021 డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ చేశారు. విద్యా సేవానిరతిని కొనసాగించే సంకల్పంతో అదే పాఠశాలలో పదోతరగతి, పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నతికి బోధన సాగిస్తున్నారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సైన్స్, లెక్కలు బోధిస్తున్న ఆయన అవార్డులు, సన్మానాలకు ఆమడదూరంగా ఉంటారు. హెచ్‌ఎంగా ఉండగా రెండు పూటలా స్టడీ అవర్స్ నిర్వహించి పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు.

మెడికల్ అకాడమీకి మంగళం!

ఈడుపుగల్లులోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయ మూసివేతకు రంగం సిద్ధం

- ఈ ఏడాది ఇంటర్ అడ్మిషన్ల జాబితాలో లేని ఈడుపుగల్లు అకాడమీ
- సెకండియర్ విద్యార్థినులను గురుకులాల్లోకి తరలించేలా చర్యలు
- ప్రైవేటు భవనంలో అకాడమీ నడుస్తుండటమే కారణమంటున్న అధికారులు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

కంకిపాడు: విద్యారంగాన్ని రాష్ట్రంలోని కూటమి సర్కారు నిర్లక్ష్యం చేస్తోంది. విద్యార్థుల జీవితాలను నడిరోడ్డుకు లాగుతోంది. ఫలితంగా కోటి ఆశలతో ప్రతిభా పరీక్ష రాసి ఐఐటీ–మెడికల్ అకాడమీలో ప్రవేశం పొందిన విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ ఏడాది ఐఐటీ–మెడికల్ అకాడమీలో ప్రవేశాల జాబితాలో కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ–మెడికల్ అకాడమీ పేరు లేకపోవటం అకాడమీకి మంగళం పాడేందుకు రంగం సిద్ధమైందన్న వాదనకు బలం చేకూరుస్తోంది. దీంతో ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్య పూర్తిచేస్తున్న విద్యార్థులు రెండో సంవత్సరం తమ విద్యాభ్యాసం ఎక్కడ? ఎలా? సాగుతుందోనన్న ఆందోళనతోనే వార్షిక పరీక్షలు రాస్తున్న దుస్థితి నెలకొంది.

మూడింటిలో ఒకటి

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ–మెడికల్ అకాడమీలు మూడు మాత్రమే ఉన్నాయి. కృష్ణా జిల్లా ఈడుపుగల్లు, కర్నూలు జిల్లా చిన్నటేకూరు, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడు ప్రాంతాల్లో ఇవి నడుస్తున్నాయి. చిన్నటేకూరు, అడవి తక్కెళ్లపాడు రెండు అకాడమీలు బాలురకు, ఈడుపుగల్లు అకాడమీ ప్రత్యేకించి బాలికలకు ఏర్పాటు చేశారు. 2017లో ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 500 మందికి పైగా విద్యనభ్యసిస్తున్నారు.

గురుకులం మూసివేతకు రెడీ

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పూర్తిచేసిన ప్రతిభావంతులైన విద్యార్థులకు రెండు దశల్లో పరీక్ష రాసి అర్హత పొందిన వారికే ఈ అకాడమీలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ, నీట్‌తో పాటు ఐక్యరాజ్యసమితి సందర్శనకు వెళ్లిన విద్యార్థులు కూడా ఈ అకాడమీలో విద్యనభ్యసించారు. పటిష్టమైన భద్రత ఉన్న అకాడమీని మూసివేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు ఈ ఏడాది ఏపీ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ద్వారా నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ నోటిఫికేషన్‌లో ఈడుపుగల్లు ఐఐటీ–మెడికల్ అకాడమీ ప్రస్తావన లేకపోవటం నిదర్శనం.



ఈడుపుగల్లు కేంద్రంగా నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఐఐటీ–మెడికల్ అకాడమీ

విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం

నోటిఫికేషన్ నిలిపివేతతో ఐఐటీ–మెడికల్ అకాడమీ ఎత్తివేతకు రంగం సిద్ధమైంది. దీంతో ఈ ఏడాది మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువులు ఎలా, ఎక్కడన్న ఆందోళనలో మునిగిపోయారు. చదువుల దిగులుతోనే మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలను విద్యార్థులు రాస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో కూటమి సర్కారు, సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈడుపుగల్లు అకాడమీ నిర్వహిస్తున్న భవనం ప్రైవేటు వ్యక్తులది కావటంతో అక్కడి నుంచి అకాడమీ తీసివేయాలనే ఆలోచనతో అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయలేదని చెబుతున్నారు. మొదటి సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులను ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల గురుకులం, అలాగే విద్యార్థుల సొంత జిల్లాల్లో గురుకులాలకు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యతో ఐఐటీ–మెడికల్ అకాడమీతో మెరుగైన విద్య అందుతుందని ఆశించి ప్రతిభా పరీక్షల్లో సత్తా చాటి అకాడమీలో ప్రవేశం పొందిన విద్యార్థులు సాధారణ ఇంటర్ విద్యను అభ్యసించటం ద్వారా తమ భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. దీనికితోడు విద్యార్థుల సామర్థ్యాలు కూడా తక్కువగా ఉన్నాయని, విద్యాప్రమాణాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతుండటం గమనార్హం.

న్యాయ పోరాటానికి సిద్ధం

ఈ పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అకాడమీని కొనసాగిస్తేనే విద్యార్థులకు మెరుగైన విద్య, భవిష్యత్ భద్రంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారులు తమ ఆవేదన అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. అకాడమీని కొనసాగించేలా విద్యార్థుల తల్లిదండ్రులు న్యాయపోరాటానికి సన్నద్ధంఅవుతున్నారు.

విద్యార్థులకు నష్టం జరగనివ్వం

విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగనివ్వం. ప్రస్తుతం అకాడమీ ఉన్న భవనం ప్రైవేటుది. 500 మార్కులు పైన వచ్చిన విద్యార్థులను అకాడమీలో చేర్చుకున్నాం. ఇక్కడ ఉన్న పిల్లలను కుంటముక్కలకు తరలిస్తాం. వచ్చే ఏడాది 10 వరకూ ఐఐటీ–మెడికల్ అకాడమీలు రాబోతున్నాయి. ఆందోళన చెందాల్సిన పనిలేదు. మెరుగైన విద్య అందుతుంది.
– ఎ.మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్, ఉమ్మడి కృష్ణాజిల్లా

ఆధ్యాత్మిక సమాచారం

గంగమ్మ ఆలయం కిటకిట



అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లిలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ అనంతపురం గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు ఎత్తికుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర ముగిసిన తరువాత మొదటి ఆదివారం కావడంతో గ్రామంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. - లక్కిరెడ్డిపల్లి

వైభవం.. తిరుచ్చి ఉత్సవం



అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం తరిగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవర్లకు శుద్ధితో మాల సేవ చేశారు. ఆలయంలో స్వామికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకారభూషితుడైన స్వామిని తిరుచ్చిలో ఊరేగించారు. అనంతరం స్వామి పెద్దశేషవాహనంపై భక్తుల్ని కటాక్షించారు.
– గుర్రంకొండ

శ్రీఅక్కదేవతల తిరునాల శోభ



అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె సమీపంలో కొలువైన శ్రీఅక్కదేవతల తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. అక్కదేవతలతోపాటు ఆలయంలో శివలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి చాందినీ బండ్ల మెరవణితోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
– సంబేపల్లె

హోరాహోరీగా క్రీడాపోటీలు

కృష్ణాజిల్లా గన్నవరం రూరల్ మండలంలోని చిన అవుటపల్లిలోగల డాక్టర్ పిన్నమనేని మెడికల్ కళాశాలలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 26వ ఇంటర్ వర్సిటీ పురుషుల క్రీడాపోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు.
– గన్నవరం రూరల్



కబడ్డీ ఆడుతున్న వైద్యవిద్యార్థులు

గట్టెక్కుతామా.. నష్టపోతామా..



నేటి నుంచి పొగాకు వేలం ప్రారంభం

మరికొద్దిరోజుల్లో పొగాకు వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. రెండేళ్లుగా ధరలు ఆశాజనకంగా ఉండి రైతులకు లాభాలొచ్చాయి. ఈ ఏడాది మార్కెట్ ఎలా ఉంటుందోనని ఎదురుచూస్తున్నారు. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో వేలంలో దక్కే ధరలపై ఆశలు పెట్టుకున్నారు. గతేడాది కంటే ధరలు పెంచితేనే లాభాలు వస్తాయని లేకుంటే నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అటు బోర్డు అధికారులతో పాటు, ఇటు రైతులు అభిప్రాయపడుతున్నారు.

- ధరలపై ఆశలు పెట్టుకున్న రైతులు
- గతేడాదితో పోల్చుకుంటే భారీగా పెరిగిన సాగు ఖర్చులు
- సరాసరిన కిలోకు రూ.300 ఇవ్వాలని రైతుల డిమాండ్
- 162 మిలియన్ కేజీల వరకు ఉత్పత్తులు రావొచ్చని అంచనా

కందుకూరు: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 11 వేలం కేంద్రాలున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచి కందుకూరు – 1వ కేంద్రంతోపాటు ఒంగోలు –1, కొండపి, పొదిలి కేంద్రాల్లో వేలం ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మిగిలిన కందుకూరు – 2, కలిగిరి, డీసీపల్లితో పాటు ఒంగోలు – 2, టంగుటూరు, వెల్లంపల్లి, కనిగిరి వేలం కేంద్రాల్లో 19వ తేదీ నుంచి మొదలవుతుంది. 2025 – 26 సీజన్‌కు సంబంధించి 11 కేంద్రాల పరిధిలో 105.27 మిలియన్ కేజీల పొగాకును అధికారికంగా అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఉంది. అయితే ప్రస్తుతం సాగు విస్తీర్ణం, వస్తున్న ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని 162 మిలియన్ కేజీల వరకు ఈ సీజన్‌లో అమ్మకాలు ఉండొచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

ధరలు పెంచాలంటూ..

రెండు సంవత్సరాలుగా పొగాకు మార్కెట్ రైతులకు లాభాల పంట పండించింది. దీంతో ఈ ఏడాది అనేకమంది సాగుపై అధికంగా మొగ్గు చూపారు. బోర్డు పరిమితికి మించి భారీగా పంట వేశారు. రైతులు సాగులో పోటీ పడటంతో పొలాలు, బ్యారెన్ల కౌలు ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతేడాది రూ.లక్ష ఉన్న బ్యారెన్ కౌలు ఈసారి రూ.2.50 లక్షల వరకు పెరిగింది. పొలం కౌలు, కూలీల రేట్లన్నీ రెట్టింపయ్యాయి. ఈ పరిస్థితుల్లో గతేడాది కంటే బ్యారెన్‌కు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు అదనంగా ఖర్చయ్యిందని స్వయంగా బోర్డు అధికారులే లెక్కలు వేస్తున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా వేలంలో ధరలు కూడా పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేజీ పొగాకుకు సరాసరి ధరను రూ.300కు తగ్గకుండా ఇవ్వాలని కోరుతున్నారు. అయితే గతేడాది వేలం ముగిసే సమయానికి కేజీ సరాసరి ధర రూ.254 మాత్రమే ఉంది. కానీ రైతులు ఆశించిన స్థాయిలో ఈ సంవత్సరం మార్కెట్ ఉంటుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

కర్ణాటక మార్కెట్‌లో ఇలా..

ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న పొగాకు వేలం అక్కడి రైతులకు కొంత ఆశాజనకంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. బ్రైట్ గ్రేడ్ కేజీ పొగాకు ధర రూ.337 వరకు పలుకుతోంది. మొత్తంగా కేజీ సరాసరి ధర చూస్తే రూ.268.25 వరకు ఉంది. అయితే ఆంధ్రాలో పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

50 శాతం పైనే..

ఈ ఏడాది పొగాకు నాణ్యత ఆశాజనకంగా ఉండటం రైతులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. మొత్తం ఉత్పత్తుల్లో 50 శాతానికి పైగా మొదటి రకం అంటే బ్రైట్ గ్రేడ్ వచ్చాయని బోర్డు అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రేడ్‌లు కూడా ఆశించిన స్థాయిలో నాణ్యతగా ఉన్నాయంటున్నారు. ఇది వేలంలో రైతులకు సానుకూలాంశంగా మారనుంది. అయితే గ్రేడింగ్ విధానంలో వారు సరైన జాగ్రత్తలు పాటించి బేళ్లు కట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉత్పత్తి బాగా పెరిగింది

ఈనెల 10వ తేదీ నుంచి ఈ సీజన్‌కు సంబంధించి అధికారికంగా పొగాకు వేలం ప్రక్రియను ప్రారంభించనున్నాం. మొదటి దశలో నాలుగుచోట్ల, 19వ తేదీన మిగిలిన కేంద్రాల్లో మొదలుపెడతాం. ఈ ఏడాది ఉత్పత్తి బాగా పెరిగింది. రైతులు ఖర్చులకు అనుగుణంగా ధరలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వేలం ప్రారంభమైన తర్వాత ధరలపై ఒక అంచనాకు రాగలం.
– లక్ష్మణరావు, ఆర్ఎం



కందుకూరు ప్రాంతంలో సాగులో ఉన్న పొగాకు పంట

బీహార్‌కు ఆ పేరు ఎలా వచ్చింది?
చారిత్రక- పౌరాణిక సాహిత్యంలో ఈ ప్రదేశం ఉంది.
కానీ...అప్పట్లో ఈ ప్రదేశం పేరు బిహార మాత్రం కాదు.
చాణుక్యుడు పుట్టాడు... కానీ అతడి పేరు రాలేదు.
ఆర్యభట్ట పుట్టాడు... అతడి పేరూ రాలేదు.
అశోకుడు పాలించాడు... ఆ చక్రవర్తి పేరూ రాలేదు.
బుద్ధుడు విహరించిన ఈ ప్రదేశం బుద్ధవిహారగా పేరు తెచ్చుకుంది..
బౌద్ధ విహారాలు... చైత్యాల నిలయం బౌద్ధవిహారగా స్థిరపడింది.
స్థానిక భాషల్లో విహార... బిహారగా వాడుకలోకి వచ్చింది.
నాడు బుద్ధుడు విహరించిన బుద్ధవిహారయే నేటి మన బిహార్.
గంగా తీరాన నడక... నదిలో డాల్ఫిన్ వీక్షణం ఈ టూర్‌లో బోనస్.



• బిహార్

బౌద్ధవిహారం







నలంద విద్యాలయం

నలంద విశ్వవిద్యాలయం మనదేశంలోనే కాదు ప్రపంచంలోని ప్రాచీన విశ్వవిద్యాలయాల్లో ఒకటి, తొలి రెసిడెన్సియల్ యూనివర్సిటీ ఇదే. ఈ బౌద్ధ మహావిహారకు విద్యాభ్యాసం కోసం క్రీ.శ ఐదవ శతాబ్దం నుంచి పన్నెండవ శతాబ్దం వరకు దేశవిదేశాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. వారు నివసించడానికి ఒక్కొక్కరికి ఒక్కో గది, ఆ గదిలో గోడలకు ఒక వైపు పుస్తకాల అర, మరొక గోడకు దుస్తులు పెట్టుకునే వెసులుబాటు ఉండేవి. ప్రతి గది బయట నీరు వెలుపలకు వెళ్లడానికి నిర్మాణంలోనే పైపుల ఏర్పాటు ఉండేది. పౌర్ణమి రోజు చంద్రుడి వెలుతురు పడి ప్రకాశించే చంద్ర శిలలను చూడవచ్చు. క్లాసు రూముల ఏర్పాటు చాలా సమగ్రంగా ఉంటుంది. అందరూ నేల మీదనే కూర్చోవాలి. అయితే ఆచార్యులు కూర్చునే పీఠం వంటి స్థానం, విద్యార్థులు ఒకరికొకరు మూడడుగుల దూరంలో కూర్చునే విధంగా ఉంది నిర్మాణం. భక్తియార్ ఖిల్జీ హయాంలో ఇక్కడ తాళపత్ర గ్రంథాలను రాశిపోసి తగుల పెట్టిన చోట ఇటుకలు కూడా నల్లగా మాడిపోయి ఉన్న గోడలను చూపిస్తారు గైడ్‌లు. ఇక్కడ దుకాణాల్లో పెన్నులు నలంద, రాజ్‌గిర్ వంటి బౌద్ధ క్షేత్రాల పేర్లతో ఉంటాయి. టూర్‌కి గుర్తుగా తెచ్చుకోవచ్చు, స్నేహితులుగా బహుమతులుగా ఇవ్వవచ్చు. ఇది పట్నాకు 70 కిలోమీటర్ల దూరాన ఉంది. పట్నా నుంచి బయలుదేరిన తర్వాత నలంద పర్యటన పూర్తి చేసుకుని రాజ్‌గిర్‌కు వెళ్లాలి. నలంద మహావిహారను చూసిన తర్వాత సూర్యమందిర్, చైనా యాత్రికుడు హ్యూయాన్ త్సాంగ్ మందిరాన్ని కూడా చూడాలి. ఈ ఆలయం ఒక చరిత్ర పుస్తకానికి దృశ్య రూపం. వీటి తర్వాత చూడాల్సిన ప్రదేశం ఆర్కియలాజికల్ మ్యూజియం.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మహాబోధిగయ






బోధ్‌గయకు ఆ పేరు రావడానికి కారణం మహాబోధి వృక్షమే. సిద్ధార్థ గౌతముడు ఈ బోధి చెట్టు కింద ధ్యానం చేశాడు. అతడికి జ్ఞానోదయమై బుద్ధుడిగా మారిన ప్రదేశం ఇది. యునెస్కో ఈ ప్రదేశాన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. ఈ బోధి వృక్షాన్ని చూస్తే ఆశ్చర్యంతోపాటు క్రీస్తు పూర్వం ఐదు వందల ఏళ్ల నాటి వృక్షమా అనే సందేహం కలుగుతుంది. ఆ సందేహంలో అర్థం ఉంది. బుద్ధుని కాలం నాటి మహాబోధి వృక్షం మతహింసలో భాగంగా అగ్నికి ఆహుతైపోయింది. ఆ స్థానంలో శ్రీలంక నుంచి తెచ్చి నాటిన మొక్క ఇప్పుడు మహావృక్షమైంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయమేమిటంటే... శ్రీలంకలోని అనూరాధపురను పాలిస్తున్న రాజు దేవానాం ప్రియ తిస్స బౌద్ధం పట్ల ఆకర్షితుడయ్యాడు. బౌద్ధ పట్ల అవగాహన కోసం అశోక చక్రవర్తిని కోరాడు. అశోకుడు బౌద్ధ ప్రచారంలో భాగంగా తన కూతురు సంఘమిత్ర, కొడుకు మహేంద్రను శ్రీలంకకు పంపించాడు. శ్రీలంకకు వెళ్లేటప్పుడు సంఘమిత్ర ఈ మహాబోధి నుంచి సేకరించిన మొక్కను తీసుకెళ్లి దేవానాం ప్రియ తిస్సకు బహూకరించింది. ఆ మొక్కను అనూరాధ పురలో నాటారు. బోధగయలోని మూలవృక్షం స్థానంలో శ్రీలంక బోధి వృక్షం నుంచి మొక్కను తెచ్చి నాటారు. అదే ఇప్పుడు మనం చూస్తున్న బోధి వృక్షం. ఈ వృక్షం పక్కనే మహాబోధి ఆలయం ఉంది. బౌద్ధం పరిఢవిల్లుతున్న భూటాన్, థాయ్‌లాండ్ వంటి అనేక దేశాల మోనాస్ట్రీలు కూడా బోధ్‌గయలో ఉన్నాయి. వీటిలో వ్యక్తమయ్యే సంపన్నతను చూసినప్పుడు బుద్ధుడు చెప్పిన నిరాడంబరత కోసం బౌద్ధంలో ఆశించకూడదనిపిస్తుంది. ఈ ప్రదేశం బిహార్ రాజధాని నగరం పట్నా నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. గయకు 15 కిలోమీటర్ల దూరం. ఈ టూర్‌లో చూడాల్సిన మరో ప్రదేశం నిరంజన నది. బుద్ధుడు ధ్యానంలో ఉన్న కాలంలో తరచూ ఈ నదికి వెళ్లేవాడు. స్థానికులు ఫాల్గు నదిగా పిలుస్తారు.



విక్రమశిల మహావిహార

ఇది కూడా భక్తియార్ ఖిల్జీ చేతిలో ధ్వంసమైన ప్రాచీన విశ్వవిద్యాలయం. మనదేశంలో ఉన్న ప్రధానమైన బౌద్ధ మహావిహారల్లో మూడు బీహార్‌లోనే ఉన్నాయి. విక్రమశిల... వందకు పైగా గురువులు, వెయ్యికి పైగా విద్యార్థులతో విలసిల్లిన విద్యాలయం. తత్వం, వ్యాకరణం, ఆధిభౌతికం, తర్కశాస్త్రాలను బోధించేవారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఆసియా ఖండంలో బౌద్ధాన్ని విస్తరించారు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ యూనివర్సిటీ శిథిలాలను భద్రపరిచి పునరుద్ధరించే పనిలో ఉంది. చారిత్రక జ్ఞాపకాల గౌరవార్థం ప్రభుత్వం నలంద, విక్రమశిల పేర్లతో కొత్త యూనివర్సిటీలను ఏర్పాటు చేసింది. లోకల్ ఆటో రిక్షా, కార్ ట్యాక్సీల వాళ్లతో మాట్లాడేటప్పుడు స్పష్టంగా చెప్పాలి.







వైశాలి గత వైభవం

బుద్ధుడు తన జీవితకాలంలో ఎక్కువ కాలం (మూడు దఫాలు) వైశాలిలో జీవించాడు. తన చివరి బోధనను వెలువరించాడు. బుద్ధుడి అవశిష్టంతో ఇక్కడ ఒక స్థూపాన్ని నిర్మించారు. ఈ ప్రదేశంలో అశోకుడు ఏకసింహం స్థూపాన్ని నిర్మించాడు. మ్యూజియం కూడా ఉంది. ఈ ప్రదేశం ఒకప్పుడు లిచ్ఛవుల రాజధాని. ఆసియా ఖండంలో తొలి రిపబ్లిక్ స్టేట్ కూడా ఇదే. వైశాలి గత వైభవం విశాలమైనదే కానీ ఇప్పుడిక్క బౌద్ధ విశిష్టతలు మినహా మరే ప్రత్యేకతలూ కనిపించవు. జైన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు పుట్టిన ప్రదేశం కూడా ఇదే. చిన్న జైన మందిరం కూడా ఉంది.









ఓదంతపురి చదువుల క్షేత్రం

మనదేశంలో ప్రసిద్ధమైన బౌద్ధ మహావిహారలు మూడు. నలంద, విక్రమశిల, ఓదంతపురి విహారలు. నలంద తర్వాత రెండవ విశ్వవిద్యాలయం ఓదంతపురి. ఇది బీహార్ షారిఫ్‌లో ఉంది. పట్నా-రాజ్‌గిర్ రైల్వేలైన్‌లో వస్తుంది. ఈ మహావిహార కూడా టర్కీ నుంచి వచ్చి భారత్ మీద దాడి చేసిన ఖిల్జీ చేతిలో ధ్వంసమైనదే. ఇక్కడ బౌద్ధ క్షేత్రానికి సంబంధించిన ప్రాధాన్యత తప్ప మరే ప్రత్యేకతలూ లేకపోవడంతో పర్యాటకపరంగా సౌకర్యాలు తక్కువ.



https://www.irctcbuddhisttrain.com/pilgrimagetourdestinations/lumbinitourism





సారనాథ్ రాజముద్ర


బుద్ధుడు తొలి ప్రవచనాన్ని వెలువరించిన ప్రదేశం సారనాథ్. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహణలో ఉంది. ఇక్కడి స్థూపం పరిరక్షణ పనులు పూర్తి చేసి పర్యాటకులకు ప్రవేశం కల్పించారు. మనం అధికారిక ముద్రగా స్వీకరించిన నాలుగు సింహాల పిల్లర్ ఇక్కడిదే. అయితే అసలు పిల్లర్‌ని మ్యూజియానికి తరలించారు. నమూనాలు ఈ ప్రాంగణంలో ఉన్నాయి. ఈ టూర్‌కి ఐఆర్‌సీటీసీ ప్యాకేజ్ సౌకర్యంగా ఉంటుంది. ఈ ప్యాకేజ్‌లో సారనాథ్(ఉత్తరప్రదేశ్), బుద్ధుడు పుట్టిన లుంబిని (నేపాల్), మహాపరినిర్వాణం పొందిన కుశినగర (ఉత్తరప్రదేశ్) కూడా కవర్ అవుతాయి.

రాజ్‌గిర్ విశ్వశాంతి కిరణం

ఇది మహాభారత కాలం నుంచి ప్రాముఖ్యత సంతరించుకున్న ప్రదేశం. జరాసంధుని రాజ్యం గిరివ్రజ. పాండవ మధ్యముడు భీముడితో జరాసంధుడు యుద్ధం చేసిన ప్రదేశంగా చెబుతారు. జైనులకు కూడా ఇది ప్రముఖ ప్రదేశమే. 24వ తీర్థంకరుడు మహావీరుడు (ముని సువ్రత) పద్నాలుగేళ్లు నలంద, రాజ్‌గిర్‌లలో జీవించాడు. మగధ రాజ్యానికి తొలినాళ్లలో రాజధాని ఇదే. రాజగృహ అని పిలిచేవాళ్లు. ఇక్కడ అనేక రాజ్యాల రాజుల సమావేశంలో బుద్ధుడు బౌద్ధాన్ని బోధించాడు. రాజ్‌గిర్ విశ్వ శాంతి స్తూపం నుంచి కనిపించే గ్రద్ధకూట పర్వతం మీద బుద్ధుడు కొంతకాలం ధ్యానం చేసుకున్నాడు. సప్తపర్ణి గుహలో బౌద్ధ సమావేశాలు జరిగేవి.



సమీపంలోని వేణుబన్ (వెదురు వనం)లో సాంత్వన పొందేవాడు. శిష్యులు, సామాన్యులతోపాటు మగధ రాజు బింబిసారుడికి కూడా ఇక్కడే బోధనలు చేశాడు. విశ్వశాంతిని కోరుతూ బుద్ధుడు చేసిన బోధనలకు ప్రతీకగా ఆ ప్రదేశంలో తెల్లటి అందమైన శాంతిస్తూపాన్ని నిర్మించారు. ఈ కొండ మీదకు వెళ్లడానికి రోప్‌వే ఉంటుంది. ఈ రోప్‌వే బకెట్ ఒక్కరు మాత్రమే కూర్చునేటట్లు ఉంటుంది. కొండ మీదకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి.



డబ్బు మాత్రమే సంపాదించే వ్యాపారం
విలువలేని వ్యాపారం.
- హెన్రీ ఫోర్డ్, ఫోర్డ్ కార్ల కంపెనీ వ్యవస్థాపకుడు

బిజినెస్ రీల్

గ్రాన్యూల్స్ ఇండియాకు ఎఫ్‌డీఏ అక్షింతలు



ముంబై: ఫార్ములేషన్స్ ప్లాంటులో నిర్వహణ లోపాలకు గాను గ్రాన్యూల్స్ ఇండియాను అమెరికా ఆహార, ఔషధ రంగ నియంత్రణ సంస్థ యూఎస్‌ఎఫ్‌డీఏ తీవ్రంగా ఆక్షేపించింది. ఔషధాలను నిల్వ చేయడంలో, యంత్ర పరికరాల పరిశుభ్రత, నిర్వహణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిరూపించడంలో విఫలమైనట్లు వ్యాఖ్యానించింది. తెలంగాణలోని మేడ్చల్–మల్కాజిగిరి తయారీ ప్లాంటులో గతేడాది ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించిన తనిఖీలకు గాను కంపెనీ సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటికి ఎఫ్‌డీఏ ఈ మేరకు హెచ్చరిక లేఖ పంపింది. ఔషధాలు కలుషితం కాకుండా నివారించే ఫిల్టర్లు ఉన్నప్పటికీ, వాటిని సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల అవి నిరుపయోగంగా మారాయని తనిఖీల్లో తేలినట్లు పేర్కొంది. తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వకు ఉపయోగించే బిల్డింగ్‌ల నిర్వహణ సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. ఎయిర్ ప్యూరిఫికేషన్ యూనిట్లు, డక్టులు, ఫ్లోర్‌ల్లాంటి నిర్దిష్ట ప్రదేశాల్లో పక్షుల రెట్టలు, ఈకలు కనిపించినట్లు పేర్కొంది. దిద్దుబాటు చర్యలపై సంతృప్తి కలిగేంత వరకు కంపెనీ సమర్పించే కొత్త ఔషధాల దరఖాస్తులకు అనుమతులను నిలిపివేయొచ్చని పేర్కొంది.

ఈ ఏడాది మరో 500 నగరాల్లో సర్వీసులు

ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి



న్యూఢిల్లీ: ఈ ఏడాది మరో 500 నగరాల్లో సర్వీసులను విస్తరించే ప్రణాళికల్లో ఉన్నట్లు రైడ్ సేవల సంస్థ ర్యాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో 50 పైచిలుకు నగరాల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. తదుపరి తమిళనాడు, కర్ణాటకలో, ఆ తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లోను విస్తరించనున్నట్లు పవన్ చెప్పారు. ప్రస్తుతం రోజుకు 33 లక్షల రైడ్‌లు నమోదవుతున్నాయన్నారు. ఇందులో 15 లక్షలు టూ–వీలర్ల విభాగంలో, 13 లక్షలు త్రీ–వీలర్ సెగ్మెంట్లో, 5 లక్షల రైడ్స్ కార్ల విభాగంలో ఉంటున్నాయని పవన్ చెప్పారు. గతేడాదే తాము ఫోర్ వీలర్ల విభాగంలోకి ప్రవేశించినా, గణనీయంగా వృద్ధి నమోదు చేశామని తెలిపారు. తాము కమీషన్ ప్రాతిపదికన కాకుండా ప్లాట్‌ఫాం యాక్సెస్ ఫీజు విధానాన్ని అమలు చేయడం వల్ల కెప్టెన్లకు (డ్రైవర్లు) ఆదాయ అవకాశాలు మరింతగా ఉంటాయని పవన్ చెప్పారు. కంపెనీ వద్ద గణనీయంగా నిధులు ఉన్నాయి కాబట్టి ప్రస్తుతం పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనేదీ లేదన్నారు. ప్రస్తానికి కార్యకలాపాల విస్తరణపైనే ఫోకస్ చేస్తున్నట్లు చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-3-2025

విశాఖ	415-00
చిత్తూరు	443-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

గ్లోబల్ ట్రెండ్, గణాంకాలపై దృష్టి

శుక్రవారం హోలీ సెలవు
- యూఎస్ టారిఫ్‌ల ప్రభావం
- ఆటుపోట్లు తప్పకపోవచ్చు
- మార్కెట్లపై నిపుణుల అంచనా

ముంబై: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు ప్రపంచ పరిస్థితులు, స్థూల ఆర్థిక గణాంకాలపై దృష్టి పెట్టనున్నాయి. వీటికితోడు యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్‌ల విధింపు చర్యలకూ ప్రాధాన్యత ఉన్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. టారిఫ్‌ల కారణంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ నీరసించవచ్చన్న అంచనాలు తెరమీదకు వస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో గత వారం యూఎస్ టెక్నాలజీ దిగ్గజాలు డీలాపడటంతో నాస్‌డాక్ ఇండెక్స్ పతనమైన సంగతి తెలిసిందే. దీంతో గ్లోబల్ ట్రెండ్ సైతం దేశీయంగా సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. కాగా.. ఈ వారం మార్కెట్లు నాలుగు రోజులే పనిచేయనున్నాయి. వారాంతాన(14న) హోలీ పండుగ సందర్భంగా మార్కెట్లకు సెలవు.

ఐఐపీ, సీపీఐ

జనవరి నెలకు పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) గణాంకాలు బుధవారం(12న) విడుదలకానున్నాయి. 3.7 శాతం వృద్ధి నమోదుకాగలదని అంచనా. 2024 జనవరిలో 4.2 శాతం పురోగమించగా.. డిసెంబర్‌లో 3.2 శాతం వృద్ధి చూపింది. ఇక ఫిబ్రవరి నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణ(సీపీఐ) గణాంకాలు సైతం విడుదలకానున్నాయి. 2025 జనవరిలో సీపీఐ 3.2 శాతంగా నమోదైంది. 2024 డిసెంబర్‌లో నమోదైన 3 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది.

ఈ వారం ట్రేడింగ్ 4 రోజులే



ఇతర అంశాలూ కీలకమే

దేశీయంగా విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల నిరంతరంగా అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో ఎఫ్‌పీఐల తీరు మార్కెట్లలో కీలకంగా నిలుస్తున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. కాగా.. మరోవైపు యూఎస్ డాలరుతోపాటు ట్రెజరీ ఈల్డ్స్ బలపడటం అటు మార్కెట్లను, ఇటు రూపాయినీ దెబ్బతీస్తున్నాయి. వీటితోపాటు రాజకీయ భౌగోళిక అనిశ్చితులు, ముడిచమురు ధరలు సైతం ఇన్వెస్టర్లను ఆందోళనకు లోను చేస్తున్నట్లు నిపుణులు తెలియజేశారు.


గత వారమిలా

గత వారం(3–7) దేశీ స్టాక్ మార్కెట్లు భారీ అమ్మకాల నుంచి బయటపడ్డాయి. ఇండెక్సులు బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. సెన్సెక్స్ నికరంగా 1,134 పాయింట్లు(1.6 శాతం) ఎగసి 74,333 వద్ద నిలిచింది. నిఫ్టీ మరింత అధికంగా 428 పాయింట్లు(2 శాతం) జంప్‌చేసి 22,553 వద్ద స్థిరపడింది. యూఎస్ టారిఫ్‌ల విధింపు ఆలస్యంకానున్న అంచనాలు, వీటిపై చర్చలకు ఆస్కారమున్నట్లు వెలువడిన అంచనాలు మార్కెట్లు బలపడేందుకు దోహదం చేసినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు.

అమ్మకాలువీడని ఎఫ్‌పీఐలు

మార్చి తొలివారంలో రూ. 24,753 కోట్లు

దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఈ నెలలో ఇప్పటి(7)వరకూ రూ. 24,753 కోట్ల(2.8 బిలియన్ డాలర్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. జనవరిలోనూ రూ. 78,027 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. వెరసి ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటిరకూ రూ. 1.37 లక్షల విలువైన స్టాక్స్ విక్రయించారు. ప్రపంచ వాణిజ్య ఆందోళనలు, దేశీ కార్పొరేట్ ఫలితాల నిరాశ వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయి. 2024 డిసెంబర్ 13 నుంచి చూస్తే ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్ మార్కెట్ల నుంచి నికరంగా 17.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించారు.



మహిళలకూ కావాలి సమగ్ర బీమా

అమితాబ్ జైన్



చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్

సంరక్షకులుగా, కుమార్తెలుగా, మాతృమూర్తులుగా తమ కుటుంబాల సంక్షేమం కోసం మహిళలు సమాజంలో ఎంతో కీలకమైన, వైవిధ్యమైన పాత్రలు పోషిస్తుంటారు. అయితే, ఈ బాధ్యతలను నిర్వర్తించడంలో వారు సాధారణంగానే తమ సొంత ఆర్థిక మరియు వైద్య భద్రత విషయాలను అంతగా పట్టించుకోరు. అందుకే చాలా మంది మహిళలకు తగినంత బీమా భద్రత లేకపోవడమో లేదా పూర్తిగా తమ జీవిత భాగస్వామి లేదా బంధువు బీమాపైనో ఆధారపడాల్సిన పరిస్థితి ఉంటోంది. జీవిత కాలం ఎక్కువగా ఉండటం, కెరియర్‌లో అంతరాయాలు, భారీ ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్లాంటి ప్రత్యేక ఆరోగ్య, ఆర్థిక సవాళ్లెన్నో మహిళలకు ఉంటాయి. అందుకే వారి స్వాతంత్ర్యానికి, స్థిరత్వానికి తగినంత బీమా రక్షణ ఉండటం ఎంతో అవసరం.

కీలకంగా బీమా ..

సాధారణంగా పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ కాలం జీవించినప్పటికీ, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక పరిమితుల కారణంగా సుదీర్ఘ కాలం పాటు మెరుగైన జీవితాన్ని గడిపే అవకాశం ఉండకపోవచ్చు. సమగ్రమైన బీమా కవరేజీ ఉంటే సముచితమైన ఆరోగ్య సంరక్షణ పొందడానికి అవకాశాలు గణనీయంగా మెరుగుపడగలవు. 2023, 2024 మధ్య కాలంలో చూస్తే 15 నుంచి 49 ఏళ్ల వరకు వయస్సున్న మహిళల్లో 30 శాతం మందికి ఎటువంటి ఆరోగ్య బీమా గానీ ఆర్థిక రక్షణ కవచం గానీ లేదని వెల్లడైంది. ఇలా చాలా మంది మహిళలు తమ సొంత అవసరాలను పక్కన పెట్టి కుటుంబ అవసరాలకే ప్రాధాన్యమిస్తుంటారు. ఆర్థిక పరిమితుల వల్ల నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను పొందలేకపోతుంటారు.

మెటర్నిటీ, కుటుంబ భద్రత

ప్రసవానికి పూర్వ పరీక్షలు, ప్రసవ వ్యయాలు, ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశువుల వైద్య అవసరాలకు అవసరమైన కీలక ఆర్థిక సహాయాన్ని మెటర్నిటీ ఇన్సూరెన్స్ అందిస్తుంది. పిల్లల కోసం సన్నద్ధమవుతున్న యువ జంటలకు ఇలాంటి పాలసీలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. శిశుజననం, సంబంధిత ఖర్చుల విషయంలో ఆర్థికంగా సన్నద్ధంగా ఉండేందుకు ఇవి సహాయకరంగా ఉంటాయి. చాలా మంది మహిళలు సాధారణంగా ఉద్యోగాలు చేసే సంస్థ ఇచ్చే బీమాపైనో లేదా జీవిత భాగస్వామి బీమాపైనో ఆధారపడుతుంటారు. కానీ సొంతంగా పాలసీ ఉంటే మరింత ఆర్థిక భద్రత ఉంటుంది. కెరియర్ మార్పుల వల్ల లేదా జీవితంలో మార్పుల వల్ల కవరేజీపై ప్రభావం పడే పరిస్థితుల్లో ఇదెంతో అండగా ఉంటుంది.



రిటైర్మెంట్, దీర్ఘకాలిక సంరక్షణ ప్రణాళిక

మహిళలు, సాధారణంగా పెద్ద వయస్సులోని బంధువుల బాగోగులను చూసుకునే సంరక్షకుల పాత్రను కూడా పోషిస్తూ ఉంటారు. ఇది భావోద్వేగాలపరంగా, ఆర్థికంగా భారంగా ఉండొచ్చు. దీర్ఘకాలిక సంరక్షణ బీమా అనేది వైద్య వ్యయాలను, ఆర్థిక ఒత్తిళ్లను అధిగమించేందుకు ఉపయోగపడుతుంది. సంరక్షకులు అలాగే వారిపై ఆధారపడిన వారికి కూడా మెరుగైన సహాయం లభించేలా తోడ్పడుతుంది. అంతేగాకుండా, జీవిత కాలం ఎక్కువగా ఉంటుంది కాబట్టి రిటైర్మెంట్ తర్వాత కూడా స్థిరమైన, మెరుగైన జీవితాన్ని సాగించేలా మహిళలు పెన్షన్ ప్లాన్లు లేదా యాన్యుటీ ఆధారిత బీమా పాలసీలను తప్పక పరిశీలించాలి.

వైకల్యం, ఆదాయ భద్రత

పిల్లల సంరక్షణ కోసం కావచ్చు లేదా వయస్సు పైబడుతున్న తల్లిదండ్రుల సంరక్షణ కోసం కావచ్చు చాలా మంది మహిళలకు కెరియర్‌లో అంతరాయాలు ఏర్పడుతుంటాయి. దీనితో వారు పని చేసే కంపెనీల నుంచి బీమా ప్రయోజనాలు పరిమితంగానే ఉండొచ్చు. అలాగే దీర్ఘకాలిక పొదుపు కూడా తగ్గుతుంది. అనారోగ్యం లేదా ప్రమాదం బారిన పడి పని చేసే పరిస్థితి లేనప్పుడు కూడా స్థిరమైన ఆదాయం లభించేలా డిజేబిలిటీ ఇన్సూరెన్స్ అనేది ఆర్థిక భద్రతను అందిస్తుంది. జీవితపు అనిశ్చితుల్లోనూ ఆర్థిక భద్రత ఉండేందుకు ఈ రక్షణ ఉపయోగపడుతుంది.

స్వతంత్రంగా నిర్ణయాలు

తొలినాళ్లలోనే బీమా పాలసీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మహిళలు ఆర్థిక ప్రణాళికల విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించాలి. చిన్న వయస్సులోనే బీమా తీసుకోవడం వల్ల ప్రీమియంల భారం తక్కువగా ఉంటుంది. అలాగే ప్రీ–ఎగ్జిస్టింగ్ కండీషన్స్‌కి సంబంధించిన ఎక్స్‌క్లూజన్స్ కూడా తగ్గుతాయి. యుక్తవయస్సులోని చాలా యువతులకు తమ తల్లిదండ్రుల హెల్త్ ఇన్సూరెన్స్‌తో కవరేజీ లభిస్తుంది. అయితే, స్వతంత్ర పాలసీకి మారడం వల్ల, డిపెండెంట్ కవరేజీ వయో పరిమితిని దాటిన తర్వాత కూడా నిరంతరాయ కవరేజీ, అదనపు ప్రయోజనాలను పొందవచ్చు.

స్మార్ట్ ఆర్థిక ప్రణాళిక

ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ, 80డీ కింద జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలకు పన్ను ప్రయోజనాలు ఉంటాయి. ఆ రకంగా చూస్తే ఇవి ఆర్థికంగా స్మార్ట్ పెట్టుబడి సాధనాలుగా కూడా ఉంటాయి. వీలైనంత ముందుగా ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టిన మహిళలకు తక్కువ ప్రీమియంలతో ఎక్కువ కవరేజీ, తద్వారా దీర్ఘకాలం పాటు ఆర్థిక భద్రత ప్రయోజనాలు లభిస్తాయి. మెటర్నిటీ కేర్, డెలివరీ, ఫెర్టిలిటీ చికిత్సలు సహా మహిళలకు సంబంధించిన ప్రత్యేకమైన ఆరోగ్యసంరక్షణ అవసరాలను తీర్చే విధంగా బీమా పాలసీలు ఉంటాయి. మూడేళ్ల పాటు లైఫ్ కవరేజీ సహా సరోగేట్ తల్లులకు పూర్తి కవరేజీ ఉండాలని బీమా రంగ నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిర్దేశిస్తోంది.

స్థిరమైన భవిష్యత్తుకు రక్షణ కవచం

మహిళలు తమ ఆర్థిక స్వతంత్రత, ఆరోగ్య సంరక్షణ భద్రతకు తప్పక ప్రాధాన్యమివ్వాలి. వీలైనంత ముందుగా సమగ్ర బీమా పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల, అనూహ్య ఆర్థిక కష్టాల నుంచి రక్షణను, దీర్ఘకాలికంగా స్థిరత్వాన్ని పొందేందుకు వీలవుతుంది. క్రియాశీలకమైన చర్యలు తీసుకోవడం ద్వారా అనుకోని సవాళ్ల నుంచి మహిళలు తమను, తమ కుటుంబాలను రక్షించుకోవచ్చు.

దేశీ ఎయిర్‌లైన్స్‌లో అవకాశాలపై ఐబీఎస్ ఫోకస్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ట్రావెల్ పరిశ్రమకు సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) సేవలు అందించే ఐబీఎస్ సాఫ్ట్‌వేర్ .. భారత ఎయిర్‌లైన్స్ రంగంలో, లాయల్టీ ప్రోగ్రామ్స్ విభాగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి పెడుతోంది. తాము ప్రస్తుతం భారత్‌లో ఎయిర్ కార్గో నిర్వహణ విభాగంలో, అలాగే ఎయిరిండియాకి స్టాఫ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ వీకే మాథ్యూస్ తెలిపారు. మిగతా పోటీ సంస్థలతో పోలిస్తే తమ ఉత్పత్తులు కాస్త ఖరీదైనవిగానే ఉంటాయి కాబట్టి తగిన భాగస్వామిని ఎంచుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ధరకు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చే భారత మార్కెట్లో ఐటీని విలువను చేకూర్చేదిగా కాకుండా ఖర్చుగానే పరిగణిస్తారని, కానీ ప్రస్తుతం ఆ ధోరణి క్రమంగా మారుతోందని మాథ్యూస్ చెప్పారు. ఇప్పుడు ధరే ప్రాతిపదికగా ఉంటున్నప్పటికీ ఎకానమీ పురోగమించే కొద్దీ విలువకు ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. మిగతా మార్కెట్లలోలాగా భారత్, చైనా మార్కెట్లలో తాము అంత విజయం సాధించలేకపోయామని అంగీకరించిన మాథ్యూస్ భారత మార్కెట్‌కి గణనీయంగా వృద్ధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వచ్చే 20 ఏళ్ల పాటు వృద్ధి బాటలో కొనసాగుతుందన్నారు. కస్టమర్లతో మెరుగైన సంబంధాలు, అత్యుత్తమ టెక్నాలజీ సిస్టంలు, ట్రావెల్ కామర్స్ మొదలైనవి పరిశ్రమలో కీలక ట్రెండ్స్‌గా ఉంటున్నాయన్నారు.

ఇంద్రుడిలా.. ఇన్‌కం ట్యాక్స్ వాళ్లు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఇంద్రుడికి వేయి కళ్లున్నాయి అనేది నాటి కథ. పురాణ కథ. ఇప్పుడు చెప్పుకోబోయేది నేటి కథ. జరగబోయే కథ. ఇన్‌కం ట్యాక్స్ వాళ్లు ఇప్పటికే తమకున్న విస్తృత అధికారాలను వాడుతూ, ఎన్నో రాళ్లు రువ్వుతున్నారు రతనాల కోసం. ప్రతి రాయీ రత్నం అవుతోంది. ఆదాయాన్ని తెస్తోంది. వారి దగ్గర ఉన్నది ''డేటా'' కాదు .. మీ బ్యాంకు బ్యాలెన్సు. ఆదాయాన్ని అసెస్ చేసి, వారి వాటా ఉంచుకుని మిగతాది మీకు ఇస్తారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ మైమరచిపోయే రోజులు పోయాయి. అరకొర సిబ్బంది ఏమీ చేయలేరని అనుకోకండి. అర కొర సిబ్బందికి కొత్త కోరలు వచ్చాయి. ఇక జాగ్రత్త.

''సంసారం గుట్టు .. రోగం రట్టు'' అనేది ఒక సామెత. ''సంపాదన గుట్టు, రోగం గుట్టు'' అనే వాళ్లూ ఉన్నారు. మగవాడి జీతం అడగకూడదనే నానుడి ఉంది. డిజిటల్ ప్రపంచంలో అన్నీ అందరికీ తెలిసిపోతున్నాయి. సీక్రెసీ లేదు. ప్రైవసీ లేదు. ఇనుపపెట్టెలో రొక్కం, బీరువాలో నగలు, లాకర్లో బంగారం, స్విస్ బ్యాంకులో జమలు.. ఇవన్నీ తెలుసుకుంటున్నారు.

మనం మన వంటికి 'కవచకుండలం'లాగా భావించే సెల్‌ఫోన్ నిజానికి కవచ కుండలం కాదు. డేటాను వెదజల్లే కుండ. మన సంభాషణలు, వాట్సప్‌లో సందేశాలు, ఈమెయిళ్లు, గూగుల్ చెల్లింపులు, పేటీఎం చెల్లింపులు, అమెజాన్ ఆర్డర్లు, ఫ్లిప్‌కార్ట్ కొనుగోళ్లు, స్విగ్గీ ఆర్డర్లు, జొమాటో ఆర్డర్లు, విదేశీ ప్రయాణాలు, పండగ ఆఫర్లు, బంగారం కొనుగోళ్లు ప్రతీదీ తెలిసిపోతుంది. అలాగే బిల్డర్లతో, బ్రోకర్స్‌తో, బ్యాంకర్లతో, ఇన్వెస్ట్‌మెంట్ ప్లానర్స్‌తో, వ్యాపారవేత్తలతో స్నేహితులతో, పిల్లలతో, భాగస్వాములతో జరిపే ఈమెయిల్స్ సంభాషణలు, మన ఇన్‌స్టాగామ్, వాట్సాప్, యూట్యూబ్, సోషల్ మీడియా, లింక్డిన్ ఖాతాలు మొదలైన వివరాలన్నీ తెలిసిపోతాయి.

2026 ఏప్రిల్ 1 నుంచి అంటే 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు ఇంద్రుడిలాగా విస్తృత అధికారాలు ఇచ్చారు. మీ సోషల్ మీడియా అకౌంటు, బ్యాంకు అకౌంట్లు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ అకౌంటు, ట్రేడింగ్ అకౌంటు ... ఇలా అన్నీ చెక్ చేయొచ్చు. బ్యాంకు లాకర్లు పగలకొట్టడం విన్నాం. ఇప్పుడు మీ కంప్యూటర్ సిస్టంను బ్రేక్ చేస్తారు. వర్చువల్ డిజిటల్ స్పేస్‌లో ప్రవేశిస్తారు. ఇప్పటికే అనుభవజ్ఞులైన ఎథికల్ హ్యాకర్స్‌ని ఇన్వాల్వ్ చేసి మన సమాచారం తప్పని, తక్కువని, పూర్తిగా జరిపిన వ్యవహారాలన్నీ చూపించి మన జాతక విశ్వరూప ప్రదర్శనం చేసి వారి ''విశ్వరూపాన్ని'' చూపిస్తున్నారు. మేఘాల్లో (క్లౌడ్) నుంచి కూడా సమాచారాన్ని సంగ్రహించి, అసెస్‌మెంట్ చేస్తున్నారు. వెబ్‌సైట్లు, క్లౌడ్ సర్వర్లు, డిజిటల్ ప్లాట్‌ఫాంలు దేన్నీ వదలడం లేదు. ''ఇందుగలడందు లేడ''ని చెప్పినట్లు, ఎక్కడికైనా వెళ్తారు. ఆగమేఘాల మీద రావడం అంటే ఇదేనేమో.

అధికార్లు ఎందుకు వస్తారు... నా ప్రైవసీలోకి రావచ్చా.. ఇది రాజ్యాంగబద్ధమా.. ఇది హక్కులు నేలరాయటం కాదా లాంటి ప్రశ్నలు వెయ్యకండి. కొత్త బిల్లులో నిర్వచనం చాలా పకడ్బందీగా రాశారు. ఉద్యోగి సిస్టం ద్వారా యజమాని వివరాలు తెలుసుకుంటారు. అంతే కాకుండా కొన్ని సంవత్సరం నుంచి ఎనిమిదేళ్ల వెనక్కు వెళ్తారు. అందుకని జాగ్రత్త వహించండి. మనం ఎవరికీ తెలియకుండా వ్యాపారం/వ్యవహారం చేస్తున్నాం అనుకుంటాం. ఇరుగు పొరుగుకి, అన్నదమ్ములకు తప్ప అందరికీ తెలుస్తుంది. 'కాగల కార్యం గంధర్వులే' తీర్చినట్లుగా తెలియకూడని వాళ్లకే సర్వం తెలిసిపోతోంది. 'సర్వం జగన్నాథం'.

అయితే, ఈ అధికారాలు దుర్వినియోగం కాకూడదు. అందరికీ సమానంగా, అంటే పన్ను ఎగవేసే ప్రతి బడాబాబుకీ వర్తించేలా, బంధుప్రీతి లేకుండా, కక్ష సాధింపులా కాకుండా, రాజకీయాలకు అతీతంగా జరిగితే ఎంతో మంచిది. అదే విశ్వ కల్యాణం.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

అన్ని కాలాలకూ అనువైనది!

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్

ఈక్విటీ మార్కెట్లు ఎప్పుడూ లాభాల బాటలోనే ప్రయాణించవు. మధ్యలో బేర్ సైకిల్స్ కూడా ఉంటుంటాయి. ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా తీవ్ర అస్థిరతలకు లోనవుతుంటాయి. కనుక ఈక్విటీతోపాటు డెట్ విభాగంలోనూ పెట్టుబడులు పెట్టుకోవాలి. ఈ రెండింటిలోనూ ఒకే పథకం ద్వారా పెట్టుబడికి వీలు కల్పించేవి హైబ్రిడ్ ఫండ్స్. అధిక రిస్క్‌కు వెనుకాడేవారు, కొత్తగా పెట్టుబడులు మొదలు పెట్టిన వారు, ఈక్విటీ–డెట్‌లో పెట్టుబడులు పెట్టుకోవాలని భావించే వారికి అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలం. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఫండ్ మెరుగైన ఎంపిక అవుతుంది.

పెట్టుబడుల విధానం

ఇది అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్. ఈక్విటీలకు 65 శాతం నుంచి గరిష్టంగా 80 శాతం వరకు కేటాయింపులు చేస్తుంటుంది. మిగిలిన మేర డెట్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీంతో అచ్చమైన ఈక్విటీ ఫండ్‌తో పోల్చి చూస్తే రాబడి కొంత తక్కువగా ఉంటుంది. అదే సమయంలో రిస్క్ కూడా ఆ మేరకు తగ్గుతుంది. కరెక్షన్‌లలో పెట్టుబడుల విలువ క్షీణత అచ్చమైన ఈక్విటీ పథకం కంటే తక్కువగా ఉంటుంది. ఈక్విటీ బుల్ ర్యాలీలో అద్భుతమైన రాబడి, మార్కెట్ దిద్దుబాటు సమయంలో డెట్ పెట్టుబడులు రక్షణగానూ పని చేస్తాయి.



రాబడి

ఈ పథకం 1999 నవంబర్‌లో ప్రారంభమైంది. 25 ఏళ్ల పనితీరు చరిత్ర ఉంది. ఈ పథకం ఆరంభం నుంచి చూస్తే ఏటా 15 శాతం కాంపౌండెడ్ వార్షిక రాబడిని (సీఏజీఆర్) ఇచ్చింది. అగ్రెస్సివ్ హైబ్రిడ్ విభాగంలో దీన్ని బలమైన పనితీరుగా చెప్పుకోవాలి. ఈ పథకం పెట్టుబడుల నాణ్యతకు ఇది అద్దం పడుతుంది. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ టాప్ క్వార్టయిల్‌లో ఉంది. బెంచ్‌మార్క్‌ను మించి మెరుగైన పనితీరు చూపించింది. ఇటీవలి ఈక్విటీ మార్కెట్ 20 శాతం పతనం తర్వాత కూడా ఈ పథకంలో ఏడాది కాల రాబడి 5.38 శాతంగా ఉండడం గమనార్హం. మూడేళ్లలో ఏటా 17.92 శాతం చొప్పున పెట్టుబడిని వృద్ధి చేసింది. ఐదేళ్లలో వార్షిక రాబడి 22 శాతంగా, ఏడేళ్లలో 16 శాతం చొప్పున ఉంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా అస్థిరతల రిస్క్‌ను మరింత తగ్గించుకోవచ్చు. అంతేకాదు సిప్‌ను ఏటా 8–10 శాతం చొప్పున పెంచుకుంటూ (టాపప్) పోతే 15–20 ఏళ్ల కాలానికి పెట్టుబడిని బలంగా వృద్ధి చేసుకునే అవకాశాలుంటాయి. ఈ పథకంలో ఆరంభం నుంచి ప్రతి నెలా 10వేల చొప్పున సిప్ చేస్తూ వస్తే 25 ఏళ్లలో మొత్తం రూ.30 లక్షల పెట్టుబడి, రాబడి సహా రూ.3 కోట్లుగా మారి ఉండేది. అంటే పెట్టుబడి 10 రెట్లు వృద్ధి చెందినట్టు.



పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.39,886 కోట్ల పెట్టుబడులున్నాయి. ఇందులో ఈక్విటీల్లో 74.6 శాతం ఇన్వెస్ట్ చేయగా, డెట్ పెట్టుబడులు 21.33 శాతంగా ఉన్నాయి. 2.5 శాతాన్ని రియల్ ఎస్టేట్ సాధనాలకు కేటాయించింది. 1.5 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఈ పథకం ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో ప్రస్తుతం 93 స్టాక్స్ ఉన్నాయి. అందులో టాప్–10 స్టాక్‌లో పెట్టుబడి 43 శాతంగా ఉంది. ఇందులో అధిక శాతం నిఫ్టీ 50 స్టాక్స్. డెట్ పోర్ట్‌ఫోలియోలో ఎక్కువగా సావరీన్ బాండ్లను కలిగి ఉంది. ఇవి ప్రభుత్వ బాండ్లు కావడంతో రిస్క్ లేనట్టే. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)ల్లో పెట్టుబడికి సైతం రిస్క్ దాదాపు తక్కువ.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	6.38
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.28
ఎన్‌టీపీసీ	5.67
మారుతి సుజుకీ	5.21
భారతీ ఎయిర్‌టెల్	4.45
సన్‌ఫార్మా	4.21
ఓఎన్‌జీసీ	3.42
అవెన్యూ సూపర్‌మార్ట్స్	2.93
రిలయన్స్ ఇండస్ట్రీస్	2.70
టీవీఎస్ మోటార్	2.62

అజేయంగా... ఆసియా చాంపియన్‌గా!

ఐదోసారి ఆసియా కబడ్డీ టైటిల్ నెగ్గిన భారత మహిళల జట్టు

టెహ్రాన్: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత మహిళల కబడ్డీ జట్టు తమకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. ఇరాన్‌లో జరిగిన మహిళల ఆసియా కబడ్డీ ఆరో చాంపియన్‌షిప్‌లో టీమిండియా టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఎనిమిదేళ్ల విరామం తర్వాత జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో భారత జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో, ఆ తర్వాత ఫైనల్లోనూ జైత్రయాత్ర కొనసాగించి ఐదోసారి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. టైటిల్ పోరులో భారత జట్టు 32–25 పాయింట్లతో తేడాతో ఆతిథ్య ఇరాన్ జట్టును ఓడించింది. అంతకుముందు సెమీఫైనల్లో భారత్ 56–18 పాయింట్ల తేడాతో నేపాల్ జట్టుపై ఘనవిజయం అందుకుంది. లీగ్ దశలో తొలి మ్యాచ్‌లో టీమిండియా 64–23 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై, రెండో మ్యాచ్‌లో 76–21 పాయింట్లతో థాయ్‌లాండ్ జట్టుపై, మూడో మ్యాచ్‌లో 73–19 పాయింట్లతో మలేసియా జట్టుపై గెలుపొందాయి. మొత్తం ఏడు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్ జట్లు... గ్రూప్ 'బి'లో ఇరాన్, ఇరాక్, నేపాల్ జట్లు ఉన్నాయి. గ్రూప్ 'బి'లోని నాలుగో జట్టు చైనీస్ తైపీ జట్టు చివరి నిమిషంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో రాణించిన భారత జట్టు ఈ ఏడాది చివర్లో భారత్‌లోనే జరిగే వరల్డ్‌కప్ టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది.

ఆసియా చాంపియన్‌షిప్ నెగ్గిన భారత జట్టుకు సోనాలి విష్ణు షింగేట్ కెప్టెన్‌గా, పుష్ప రాణా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. జాతీయ చాంపియన్‌షిప్‌లో ఇండియన్ రైల్వేస్ తరఫున ఆడిన సోనాలి గోల్డెన్ రెయిడ్‌తో తన జట్టును విజేతగా నిలిపింది. పూజా కజిలా, నిధి శర్మ, పూజా నర్వాల్, ఆమ్రపాలి గలాండె, నేహా దక్ష్, సంజూ దేవి, జ్యోతి ఠాకూర్, సాక్షి శర్మ, భావన దేవి, రీతూ మిగతా సభ్యులుగా ఉన్నారు. 2005లో హైదరాబాద్‌లో తొలిసారి ఆసియా చాంపియన్‌షిప్‌ను నిర్వహించగా... భారత జట్టు విజేతగా అవతరించింది. అనంతరం 2007లో టెహ్రాన్ (ఇరాన్)లో జరిగిన రెండో ఆసియా చాంపియన్‌షిప్‌లో, 2008లో మదురై (భారత్)లో జరిగిన మూడో ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత జట్టు టైటిల్ నిలబెట్టుకుంది. 2008 తర్వాత ఎనిమిదేళ్లకు మళ్లీ ఆసియా చాంపియన్‌షిప్ జరిగింది. 2016లో బుసాన్ (దక్షిణ కొరియా)లో జరిగిన నాలుగో ఆసియా చాంపియన్‌షిప్‌లో దక్షిణ కొరియా జట్టు తొలిసారి విజేతగా అవతరించింది. 2017లో గొర్గాన్ (ఇరాన్)లో జరిగిన ఐదో ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత జట్టు దక్షిణ కొరియాను ఓడించి నాలుగోసారి చాంపియన్‌గా నిలిచింది. 2017 తర్వాత మళ్లీ ఎనిమిదేళ్లకు నిర్వహించిన ఈ మెగా ఈవెంట్‌లో మరోసారి భారత్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది.





నేరుగా ఫైనల్ చేరడమే లక్ష్యం

- నేడు ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ 'ఢీ'
- రాత్రి గం. 7:30 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్', జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం

డబ్ల్యూపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ క్యాపిటల్స్	8	5	3	10	0.396
గుజరాత్ జెయింట్స్	7	4	3	8	0.334
ముంబై ఇండియన్స్	6	4	2	8	0.267
యూపీ వారియర్స్	8	3	5	6	-0.624
బెంగళూరు	7	2	5	4	-0.305

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ప్లే ఆఫ్స్ బెర్త్‌లు శనివారం ఖరారయ్యాయి. ఇక మిగిలిందల్లా అగ్రస్థానం కోసం పోటీ! పాయింట్ల పట్టికలో 'టాప్'లో నిలిచిన ఏకైక జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇప్పుడు ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్‌ల పోరాటం కూడా దీని కోసమే! 8 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్‌కు ఇది ఆఖరి లీగ్ మ్యాచ్ కాగా... మంచి రన్‌రేట్‌తో గెలిస్తే అగ్రస్థానంతో తుదిపోరుకు చేరే అవకాశముంది. 8 పాయింట్లతో రన్‌రేట్‌లో వెనుకబడినప్పటికీ... ముంబై జట్టుకు ఇంకా రెండు మ్యాచ్‌లు ఉండటం, సొంత ప్రేక్షకుల మధ్య జరగనుండటం అదనపు అనుకూలతగా మారింది. మాజీ చాంపియన్ ముంబై నేడు జెయింట్స్‌పై, రేపు రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గెలిస్తే చాలు ఎలాంటి రన్‌రేట్ సమీకరణాలతో పనిలేకుండా 12 పాయింట్లతో ఫైనల్ బరిలో నిలవొచ్చు. ఇప్పటికైతే ఢిల్లీ క్యాపిటల్స్ 10 పాయింట్లతో 'టాప్'లో ఉంది.

అనామకం కాదు కీలకం

ముంబై, గుజరాత్ జట్లు ప్లేఆఫ్స్ చేరిన నేపథ్యంలో ఇది అనామక మ్యాచ్ అనుకుంటే పొరపాటే అవుతుంది. ఫైనల్ రేసు కోసం ఇరు జట్ల మధ్య ముమ్మాటికి కీలకపోరే జరుగనుంది! ముంబై జట్టు విదేశీ బ్యాటర్ల బలగంతో పటిష్టంగా ఉంది. నాట్ సివర్ బ్రంట్, హేలీ మాథ్యూస్‌లు ఈ టోర్నీలో నిలకడగా ఫామ్ చాటుకున్నారు. వీళ్లిద్దరితో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్, అమెలియా కెర్‌లు కూడా మెరుగ్గానే ఆడుతుండటంతో బ్యాటింగ్ లైనప్‌కు ఏ ఢోకా లేదు. బౌలింగ్‌లోనూ విదేశీ ఆల్‌రౌండర్లే జట్టు విజయాల్లో భాగమవుతున్నారు. యూపీ వారియర్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో అమెలియా కెర్ ఐదు వికెట్లతో సత్తా చాటుకుంది. నాట్ సివర్, హేలీ మాథ్యూస్‌లు కూడా అడపాదడపా వికెట్లను పడగొడుతున్నారు. మరోవైపు గుజరాత్ జెయింట్స్ కూడా గత మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జోరుకు చెక్ పెట్టింది. 177 పరుగుల భారీ లక్ష్యాన్ని జెయింట్స్ సులువుగా ఛేదించింది. హర్లీన్ డియోల్, బెత్ మూనీ, కెప్టెన్ ఆష్లీ గార్డ్‌నర్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో ఆల్‌రౌండర్ డియాండ్రా డాటిన్, కాశ్వీ, తనూజ, మేఘన సింగ్‌లు ప్రభావం చూపగలరు.

తుది జట్లు (అంచనా)

ముంబై ఇండియన్స్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), హేలీ మాథ్యూస్, అమెలియా కెర్, నాట్ సివర్, అమన్‌జ్యోత్ కౌర్, యస్తిక, సజన, కమలిని, సంస్కృతి, షబ్నిమ్, పారుణిక సిసోడియా.

గుజరాత్ జెయింట్స్: ఆష్లీ గార్డ్‌నర్ (కెప్టెన్), బెత్ మూనీ, హేమలత, హర్లీన్ డియోల్, డియాండ్రా, లిచ్‌ఫీల్డ్, కాశ్వీ గౌతమ్, భారతి, తనూజ, మేఘన సింగ్, ప్రియా మిశ్రా.



గుజరాత్ టైటాన్స్ అసిస్టెంట్ కోచ్‌గా మాథ్యూ వేడ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా జట్టు మాజీ వికెట్ కీపర్ మాథ్యూ వేడ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. 2022 ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచిన గుజరాత్ టైటాన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్న మాథ్యూ వేడ్ ఇప్పుడు అసిస్టెంట్ కోచ్ రూపంలో మరోసారి గుజరాత్ టైటాన్స్ జట్టుతో చేరనున్నాడు. ఈనెల 22 నుంచి మొదలయ్యే ఐపీఎల్ 18వ సీజన్‌లో పాల్గొనే గుజరాత్ టైటాన్స్ జట్టుకు మాథ్యూ వేడ్ అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఓవరాల్‌గా మూడు సార్లు వేడ్ ఐపీఎల్‌లో ప్లేయర్‌గా పాల్గొన్నాడు. 2011లో తొలిసారి ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్) తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వేడ్ 2022, 2024 సీజన్‌లలో గుజరాత్ టైటాన్స్ తరఫున పోటీపడ్డాడు. ఓవరాల్‌గా 15 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన వేడ్ 103.39 స్ట్రయిక్‌రేట్‌తో 183 పరుగులు చేశాడు. తాజా సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు ఆశిష్ నెహ్రా హెడ్ కోచ్‌గా, పార్థివ్ పటేల్ బ్యాటింగ్ కోచ్‌గా... ఆశిష్ కపూర్, నరేందర్ నేగి, మాథ్యూ వేడ్ అసిస్టెంట్ కోచ్‌లుగా ఉన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన 37 ఏళ్ల వేడ్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 36 టెస్టులు (1613 పరుగులు; 4 సెంచరీలు, 5 అర్ధ సెంచరీలు), 97 వన్డేలు (1867 పరుగులు; 1 సెంచరీ, 11 అర్ధ సెంచరీలు), 92 టి20లు (1202 పరుగులు; 3 అర్ధ సెంచరీలు) ఆడాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి వేడ్ 228 క్యాచ్‌లు పట్టి, 26 స్టంపింగ్‌లు చేశాడు.



జొకోవిచ్‌కు చుక్కెదురు

రెండో రౌండ్‌లో 'లక్కీ లూజర్' జాండ్‌షుల్ప్ చేతిలో పరాజయం



కాలిఫోర్నియా: సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు ఇండియన్ వెల్స్ ఏటీపీ–1000 మాస్టర్స్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. 24 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ప్రపంచ మాజీ నంబర్ వన్ జొకోవిచ్... ఈ టోర్నీలో రెండో రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 2–6, 6–3, 1–6తో 'లక్కీ లూజర్' బొటిక్ వాన్ డి జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు. వాస్తవానికి జాండ్‌షుల్ప్ క్వాలిఫయింగ్ దశలోనే ఓడిపోయాడు. అయితే మెయిన్ 'డ్రా'లో ఒక ప్లేయర్ వైదొలడగంతో క్వాలిఫయింగ్‌లో ఓడిపోయిన మెరుగైన ర్యాంకర్ జాండ్‌షుల్ప్‌కు 'లక్కీ లూజర్' హోదాలో మెయిన్ 'డ్రా'లో ఆడే అవకాశం కల్పించారు. తొలి రౌండ్‌లో 'బై' దక్కించుకున్న జొకోవిచ్... బరిలోకి దిగిన తొలి పోరులోనే నిష్క్రమించాడు. గతంలో ఐదుసార్లు ఈ టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన జొకోవిచ్... ఈసారి అదే జోరు కనబర్చలేకపోయాడు. 37 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. తొలి సెట్‌లోనే జొకో 14 అనవసర తప్పిదాలకు పాల్పడడంతో తిరిగి కోలుకోలేకపోయాడు. జాండ్‌షుల్ప్ బేస్ లైన్‌తో పాటు నెట్ గేమ్‌తో అదరగొడితే... జొకో మ్యాచ్ ఆద్యాంతం తడబడ్డాడు. ఓవరాల్‌గా జాండ్‌షుల్ప్ 4 ఏస్‌లు సంధించగా... జొకో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయాడు. నెదర్లాండ్స్ ప్లేయర్ 4 డబుల్ ఫాల్ట్స్ చేయగా... జొకోవిచ్ 3 డబుల్ ఫాల్ట్‌లకు పాల్పడ్డాడు. 'గత కొంతకాలంగా పరిస్థితులు భిన్నంగా సాగుతున్నాయి. ఆశించిన స్థాయిలో ఆడేందుకు ఇబ్బంది పడుతున్నా. ఈ పోరాటం సవాలుతో కూడుకున్నది. మధ్యమధ్యలో ఒకటీ రెండు టోర్నీల్లో మంచి ప్రదర్శన కనబర్చగలుగుతున్నా... దాన్ని కొనసాగించడం ముఖ్యం. పేలవ ప్రదర్శనకు సాకులు వెతకాలనుకోవడం లేదు. ఇది నా రోజు కాదు. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తా' అని జొకోవిచ్ అన్నాడు. ఈ ఏడాది 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఖాతాలో వేసుకునేలా కనిపించిన జొకోవిచ్... కండరాల నొప్పితో ఆస్ట్రేలియా ఓపెన్ సెమీఫైనల్ నుంచి వైదొలిగాడు. గాయం నుంచి కోలుకొని బరిలోకి దిగిన దోహా టోర్నీ తొలి రౌండ్‌లోనే జొకో పరాజయం పాలయ్యాడు. మరోవైపు అగ్రశ్రేణి ఆటగాళ్లపై ఆరంభ దశలోనే విజయాలు సాధించడాన్ని అలవాటుగా మార్చుకున్న జాండ్‌షుల్ప్ గతంలో... డేవిస్ కప్‌లో రాఫెల్ నాదల్ (స్పెయిన్)పై, యూఎస్ ఓపెన్‌లో అల్‌కరాజ్ (స్పెయిన్)పై కూడా విజయాలు సాధించాడు. ఇప్పుడు మరో సంచలన నమోదు చేస్తూ జొకోవిచ్‌పై గెలుపొందాడు. ఓవరాల్‌గా టాప్–10 ప్రత్యర్థులపై జాండ్‌షుల్ప్‌కు ఇది 8వ విజయం కావడం విశేషం. కాగా, ఈ టోర్నీలో టాప్‌సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) కూడా రెండో రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు.



రన్నరప్ రుజులా

న్యూఢిల్లీ: జర్మన్ ఓపెన్ అండర్–19 జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణి రుజులా రాము రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం బెర్లిన్‌లో జరిగిన జూనియర్ మహిళల సింగిల్స్ ఫైనల్లో కర్ణాటకకు చెందిన రుజులా 14–21, 20–22తో యురికా నగపుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన రుజులా రెండో రౌండ్‌లో 21–10, 14–21, 21–13తో తన్వీ రెడ్డి (భారత్)పై, మూడో రౌండ్‌లో 21–6, 21–8తో క్రిస్టాబెల్ కలిస్టా పూర్వంతో (ఇండోనేసియా)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 21–8, 21–23, 21–10తో గ్లోరియా పొలుఎక్టోవ్ (జర్మనీ)పై, క్వార్టర్ ఫైనల్లో 21–15, 9–21, 21–12తో ఏడో సీడ్ షాన్ జి ఓ (మలేసియా)పై, సెమీఫైనల్లో 21–11, 21–16తో టింగ్ టి జు (చైనా)పై విజయం సాధించింది.



సెమీస్‌లో జార్ఖండ్, మహారాష్ట్ర



పంచ్‌కులా: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో జార్ఖండ్, మహారాష్ట్ర, మిజోరం, హరియాణా జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జార్ఖండ్ 3-1తో మధ్యప్రదేశ్ జట్టుపై, మహారాష్ట్ర 5–0తో కర్ణాటక జట్టుపై, మిజోరం 1–0తో బెంగాల్ జట్టు, హరియాణా 1–0 గోల్ తేడాతో పంజాబ్‌పై గెలుపొందాయి. జార్ఖండ్ తరఫున కెప్టెన్ అల్బెలా రాణి టొప్పో (4వ నిమిషంలో), రజని కెర్కెట్టా (41వ నిమిషంలో), ప్రమోదిని లాక్రా (59వ నిమిషంలో)... మధ్యప్రదేశ్ తరఫున కరిష్మా యాదవ్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మహారాష్ట్ర తరఫున ఆకాంక్ష సింగ్ (41వ, 54వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా... ప్రియాంక వాంఖడె (30వ నిమిషంలో), కాజల్ సదాశివ్ అట్పాడ్కర్ (44వ నిమిషంలో), యోగితా బోరా (59వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. బెంగాల్‌తో జరిగిన పోరులో 50వ నిమిషంలో దీపిక చేసిన ఏకైక గోల్‌తో మిజోరం జట్టు విజయం అందుకుంది.

వైట్ జాకెట్స్... ఈ 'చాంపియన్స్'కే ఎందుకు!



దుబాయ్: వన్డే ప్రపంచకప్, టి20 ప్రపంచకప్, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)... అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్ల చాంపియన్లు అవతరిస్తారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మాత్రం 'చాంపియన్స్ ట్రోఫీ' విజేతలకు మాత్రమే ప్రత్యేకమైన తెలుపురంగు జాకెట్లను అందజేస్తుంది. జెంటిల్‌మెన్ క్రికెట్‌లో దర్పానికి, గొప్ప గౌరవానికి ప్రతీకగా ట్రోఫీతో పాటు జాకెట్లను ఇస్తారు. విన్నింగ్ టీమ్ సభ్యులందరూ ఈ వైట్ జాకెట్లు ధరించే బహుమతి ప్రదానోత్సవ వేడుకలో తెగ హంగామా చేస్తారు. 1998లో బంగ్లాదేశ్‌లో ఈ టోర్నీకి శ్రీకారం చుట్టారు. అప్పట్లో నాకౌట్ టోర్నీగా మొదలైన ఈ ఈవెంట్‌ను మినీ ప్రపంచకప్‌గా అభివర్ణించేవారు. ఇక వైట్ జాకెట్ల హంగు, వేదికపై ఆర్భాటం మాత్రం 2009లో మొదలైంది. ముంబైకి చెందిన ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ బబితా ఈ వైట్ జాకెట్ల రూపకర్త. మనకిది సాధారణ వైట్ సూట్‌లాగే కనిపిస్తుంది. కానీ ఇది ఎంతో ప్రత్యేకమైన ఇటాలియన్ వూల్‌తో తయారైంది. వినూత్న టెక్చర్, స్ట్రిప్‌లు, బంగారు వర్ణ ఎంబ్రాయిడింగ్ వర్క్ చాంపియన్స్ ట్రోఫీ లోగోతో ఆ జాకెట్లకు మరిన్ని వన్నెలద్దారు డిజైనర్లు. పాక్ ఆతిథ్యమిచ్చిన తాజా టోర్నీకి సంబంధించిన ఈ ప్రత్యేకమైన జాకెట్లను ఆ దేశ దిగ్గజం, మాజీ కెప్టెన్ వసీమ్ అక్రమ్ విడుదల చేశాడు. ఈ సందర్భంగా అక్రమ్ మాట్లాడుతూ 'ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ అత్యుత్తమ టోర్నీకి నిదర్శనం. క్రికెట్ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసింది. ఆరంభం నుంచి విశేషాదరణ చూరగొంది' అని అన్నాడు.

ఐస్‌క్రీమ్‌లో పాము పిల్ల!

థాయిలాండ్‌లో తాజా ఘటన



ఐస్‌క్రీమ్ అంటే కొందరికి చాలా ఇష్టం. బడలిక తర్వాత నచ్చిన ఐస్‌క్రీమ్ తింటే ప్రాణం లేచొచ్చినట్లు అనిపిస్తుంది. కానీ పొరపాటున ఈ ఐస్‌క్రీమ్ గనుక తింటే ప్రాణాలు పోవడం ఖాయం. ఇది స్నేక్ ఐస్‌క్రీం మరి! థాయిలాండ్‌లో మియాంగ్ రాచ్‌బురీ రాష్ట్రంలోని పార్క్ థో జిల్లాలో రేబాన్ నక్లెంగ్‌బూన్ అనే వ్యక్తి స్థానికంగా తన ఫేవరెట్ 'బ్లాక్‌బీన్' పాప్‌సికిల్ ఐస్‌క్రీం కొన్నాడు. ఆత్రంగా రేపర్ తీయగానే చచ్చిన పాము పిల్ల కనిపించడంతో తారెత్తిపోయాడు. దాన్ని ఫొటో తీసి 'ఫేస్‌బుక్'లో పెట్టాడు. నలుపు, పలుసు రంగుల్లో ఉన్న పాము పిల్ల ఐస్‌క్రీమ్‌లో గడ్డకట్టుకుపోని కనిపిస్తోంది. ''దాని కళ్లు తెరిచే ఉన్నాయి! ఇంకా బతికే ఉందా?'' అంటూ పోస్టు పెట్టాడు. దాంతో ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అది ఓ మాదిరి విషముండే గోల్డెన్ ట్రీ రకం పాము పిల్ల అని కొందరు నిర్ధారించారు. ఆ ఐస్‌క్రీంను ఏ అర్ధరాత్రో చిమ్మచీకట్లో రోడ్‌సైడ్ బండిపై కొని చప్పరిస్తే ఈపాటికి టపా కట్టేవాడంటూ కొందరు జోకులు పేల్చారు. ''ఏ కోటిలో ఏ ఒక్కరినో ఇలాంటి అదృష్టం వరిస్తుంది. ఓసారి టేస్ట్ చేసి చూడు'' అని ఇంకొందరు పోస్టులు పెట్టారు.

\- బ్యాంకాక్

గాజా అమ్మకానికి లేదు

- ట్రంప్‌పై పాలస్తీనియన్ల ఆగ్రహం
- స్కాట్లాండ్ గోల్ఫ్ రిసార్ట్ ధ్వంసం

ఎడిన్‌బర్గ్: గాజా స్ట్రిప్‌ను ఖాళీ చేయించి అందమైన పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతానన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పాలస్తీనియన్లు ప్రతీకార చర్యలకు దిగారు. స్కాట్లాండ్‌లో ట్రంప్‌కు చెందిన టర్న్‌బెర్రీ గోల్ఫ్ రిసార్ట్‌ను ధ్వంసం చేశారు. శనివారం తెల్లవారుజామున నిరసనకారులు రిసార్ట్‌లోకి చొరబడ్డారు. గోల్ఫ్ హోల్స్‌ను నాశనం చేశారు. ఓపెన్ చాంపియన్‌షిప్స్‌లో ఉపయోగించే వస్తువులు, ప్రదేశాలను పాడు చేశారు. అక్కడి పచ్చికబయళ్లపై 'గాజా అమ్మకానికి లేదు' అని తెల్లని పెయింట్‌తో రాశారు. రిసార్ట్ క్లబ్‌హౌస్ భవన గోడలపై ఎరుపు రంగు చల్లారు. ఇది తమ పనేనని 'పాలస్తీనా యాక్షన్' అనే సంస్థ ప్రకటించుకుంది. ''గాజాపై ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతీకారంగానే ఈ పని చేశాం. గాజాను తన సొంత ఆస్తిలా పరిగణిస్తామంటే ఒప్పుకోం. ఇది తెలియజేప్పేందుకు, ట్రంప్ ఆస్తికి భద్రత లేదని నిరూపించేందుకు రిసార్ట్‌పై దాడి చేశాం. గాజా స్ట్రిప్‌ను ఇజ్రాయెల్‌కు, అమెరికాకు వలసరాజ్యంగా మార్చే యత్నాలను అడ్డుకుంటాం'' అని ప్రకటించింది. దాడిని పిల్లచేష్టగా రిసార్ట్ వర్గాలు కొట్టిపారేశాయి. ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక గోల్ఫ్‌కోర్సుల్లో టర్న్‌బెర్రీ ఒకటి. ఇక్కడ నాలుగుసార్లు ఓపెన్ ఛాంపియన్‌షిప్ జరిగింది. 2014లో ట్రంప్ కొనుగోలు చేసినప్పటి నుంచీ ఇక్కడ ఓపెన్ రొటేషన్‌ను అమలు చేయడం లేదు.





ఇస్లాం పండితుడు ముఫ్తీ షా మిర్ కాల్చివేత

పెషావర్: పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ ఇస్లాం పండితుడు ముఫ్తీ మిర్ షా హత్యకు గురయ్యారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని టుర్బాట్ పట్టణంలో శుక్రవారం ఈ దారుణం చోటుచేసుకుంది. రాత్రి ప్రార్థనల అనంతరం మసీదు నుంచి బయటకు వస్తున్న ఆయనపై బైక్‌లపై వచ్చిన గుర్తు తెలియని సాయుధులు కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రంగా గాయాలైన ఆయన్ను వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే ఆయన చనిపోయారు. జమియత్ ఉలేమా–ఇ– ఇస్లామ్–ఎఫ్(జేయూఐ–ఎఫ్) సంస్థతో ముఫ్తీ మిర్ షాకు అనుబంధం ఉంది. గతంలో ఈయనపై రెండు హత్యాయత్నాలు జరిగాయి. ప్రావిన్స్‌లోని ఖుజ్దర్ నగరంలో జేయూఐ–ఎఫ్‌కు చెందిన ఇద్దరు నేతలు హత్యకు గురైన కొద్ది రోజుల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

58వ టైగర్ రిజర్వ్‌గా మాధవ్ నేషనల్ పార్క్

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని మాధవ్ నేషనల్ పార్కును కేంద్రం పులుల అభయారణ్యంగా ప్రకటించింది. దీంతో దేశంలో 58వ టైగర్ రిజర్వు అవతరించినట్లయింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ శనివారం ఒక ప్రకటన చేశారు. ఈ పరిణామాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. వన్యప్రాణి ప్రేమికులకు ఇది గొప్ప శుభవార్త అంటూ ఆదివారం 'ఎక్స్'లో అభివర్ణించారు. జంతువులను కాపాడటంలో, స్థిరమైన అభివృద్ధికి దోహదపడటంలో భారత్ ఎప్పుడూ ముందంజలోనే ఉంటుందని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో 9వ టైగర్ రిజర్వు ఇదని ఆ రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పులుల అభయారణ్యాలు మధ్యప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉండటం విశేషం.

గర్భిణులు పారాసిటమాల్ వాడితే...

పిల్లల్లో ఏడీహెచ్‌డీ!



కొందరు పిల్లలు చదువుతో పాటు ఆటపాటలు, అల్లరిలోనూ చురుగ్గా ఉంటారు. మరికొందరు మరీ అతి చురుకుదనం చూపిస్తారు. ఏదైనా ఇట్టే చేయగలమనే ధీమా వాళ్లలో తొణికిసలాడుతుంది. అలా శక్తికి మించిన పనులు చేసి సమస్యలు కొని తెచ్చుకుంటుంటారు. అలాంటి ఈ పిల్లలు దేనిపైనా ఎక్కువ సేపు దృష్టి పెట్టలేరు. ఆలోచన కంటే ఆవేశంతోనే పనులు చేస్తుంటారు. పర్యావసానాలను కూడా పట్టించుకోరు. ఇలాంటి వాళ్లు అటెన్షన్ డిఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ)తో బాధపడుతున్నట్టు! పారాసిటమాల్‌గా పిలిచే అసిటమినోఫిన్‌ను గర్భిణులు అతిగా వాడితే పిల్లల్లో ఏడీహెచ్‌డీ ముప్పు మూడింతలు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. తలనొప్పికి, జ్వరానికి పారాసిటమాల్ వాడటం మన దగ్గర పరిపాటి. ఇది జ్వరంతో పాటు ఓ మాదిరి ఒంటి నొప్పులను కూడా తగ్గిస్తుంది. కానీ నొప్పి గర్భంతో ఉన్నప్పుడు ఈ మాత్రను అతిగా వాడితే పుట్టబోయే పిల్లల మెదడు ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్టు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడైంది. గర్భంతో ఉన్న 307 మంది నల్లజాతి మహిళల్లో పారాసిటమాల్ వాడినప్పుడు ఒంట్లో రక్తప్రవాహ రేట్లు, రక్తంలో ఈ ఔషధపాళ్లను గమనించారు. వాటిని అతిగా వాడిన వారికి పుట్టిన చిన్నారుల్లో మిగతా పిల్లలతో పోలిస్తే ఏడీహెచ్‌డీ ముప్పు మూడు రెట్లు అధికమని తేలింది. అమ్మాయిలైతే పదేళ్ల లోపు ఏడీహెచ్‌డీ బారిన పడే ముప్పు ఏకంగా ఆరు రెట్లు ఎక్కువని అధ్యయనకారులు తెలిపారు. కనుక తప్పని పరిస్థితుల్లో మాత్రమే పారాసిటమాల్ వాడాలని సూచించారు. అధ్యయన వివరాలు 'నేచర్ మెంటల్ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

దశాబ్దాలుగా వాడకం

''అసిటమినోఫిన్‌ను దశాబ్దాలుగా వాడుతున్నారు. గర్భిణుల్లో పిండం తాలూకు మెదడు, నాడీవ్యవస్థ ఎదుగుదలపై అసిటమినోఫిన్ ప్రభావంపై ఇంతవరకు ఎలాంటి పరిశోధనలూ జరగలేదు. తాజా పరిశోధన నేపథ్యంలో గర్భిణుల పారాసిటమాల్ వాడకంపై అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) విభాగం పునఃసమీక్ష జరపాల్సిన అవసరం ఏర్పడింది. దీనిపై అమెరికా ప్రభుత్వం ఆలోచించాలి'' అని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో పిల్లల వైద్య నిపుణురాలు షీలా సత్యనారాయణ చెప్పారు. అయితే, ''ప్రస్తుత పరిశోధన ఫలితాలతో బెంబేలెత్తాల్సిన పని కూడా లేదు. దీనిపై మరింత విస్తృత అధ్యయనం జరగాల్సి ఉంది'' అని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం గర్భిణులకు పారాసిటమల్‌ను తప్పనిసరైతేనే, అదీ తక్కువ డోసులోనే వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. తాజా అధ్యయనం నేపథ్యంలో ఎఫ్‌డీఏతో పాటు యూరోపియన్ మెడికల్ ఏజెన్సీ, అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఒబ్‌స్ట్రిటీషియన్స్, గైనకాలజిస్ట్స్, ది సొసైటీ ఆఫ్ ఒబ్‌స్ట్రిటీషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ ఆఫ్ కెనడా, ది సొసైటీ ఆఫ్ మెటర్నల్ –ఫీటల్ తదితరాలు పునరాలోచనలో పడే వీలుంది. అయితే గర్భిణులు అసిటమినోఫిన్ వాడితే పిల్లలకు ఏడీహెచ్‌డీ వస్తుందని నిరూపణ కాలేదని ఎఫ్‌డీఏ అధికారులు 2015లో తేల్చడం గమనార్హం.

\- వాషింగ్టన్

న్యాయం కోసం మోదీని కలుస్తా

'ఆర్‌జీ కర్' హత్యాచార బాధితురాలి తల్లి

కోల్‌కతా: తమ కుమార్తెకు న్యాయం కోసం ప్రధాని మోదీని కలుస్తానని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రి హత్యాచార బాధితురాలి తల్లి వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యురాలికే భద్రత లేకుండా పోయిందన్నారు. 'మా కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని భర్తతో కలిసి మోదీకి వివరిస్తా. ఆమెకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తాం'అని ఆమె అన్నారు. ఆమె మమ్మల్ని వీడి ఏడు నెలలవుతోంది. ఇప్పటికీ న్యాయం జరగలేదు. మాకు కనీసం డెత్ సర్టిఫికెట్ కూడా అధికారులు అందజేయలేదు'అని చెప్పారు. ట్రెయినీ వైద్యురాలి తల్లిదండ్రులకు ప్రధాని మోదీని కలుసుకునే అవకాశం దక్కేలా ప్రయత్నాలు చేస్తామని బీజేపీ ఎంపీ అగ్నిమిత్ర పాల్ చెప్పారు. కేసును విచారించిన కోల్‌కతాలోని సెషన్స్ కోర్టు జనవరి 20న నిందితుడు సంజయ్ రాయ్‌కి యావజ్జీవ కారాగారం విధించడం తెలిసిందే.

మురళీధరన్ కంపెనీకి కశ్మీర్‌లో భూ కేటాయింపు

శ్రీనగర్: శ్రీలంక మాజీ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌కు చెందిన కంపెనీకి కథువా జిల్లాలో ఉచితంగా భూ కేటాయింపులు జరిగాయన్న వార్తలపై జమ్మూకశ్మీర్ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. మురళీధరన్ కంపెనీ సిలోన్ బేవరేజెస్ కథువాలో రూ.1,600 కోట్లతో తలపెట్టిన బాటిల్ ఫిల్లింగ్, అల్యూమినియం క్యాన్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం 25.75 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించింది. శనివారం అసెంబ్లీలో కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన పలువురు సభ్యులు ఈ విషయంపై ఆందోళన తెలిపారు. సీపీఎం ఎమ్మెల్యే తారిగామీ మాట్లాడుతూ.. ఉచితంగా భూమి ఇవ్వడంపై ప్రభుత్వం వెంటనే సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. పైసా ఖర్చు పెట్టకుండా విదేశీయుడికి భూమి ఇవ్వడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని కాంగ్రెస్‌కు చెందిన జీఏ మిర్ చెప్పారు.





ప్రయాణికురాల్ని కాపాడిన పోలీస్

ముంబై: రైలు దిగే క్రమంలో పట్టుతప్పి పడిపోయిన ఓ ప్రయాణికురాలిని రైల్వే పోలీసు ఒకరు సకాలంలో స్పందించి కాపాడారు. మహారాష్ట్రలోని బొరివలీ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రైల్వే శాఖ 'ఎక్స్'లో షేర్ చేసింది. ఓ ప్రయాణికురాలు రైలు నుంచి దిగే క్రమంలో జారిపడ్డారు. ప్లాట్‌ఫాం మీదుగా ఆమెను రైలు లాక్కుంటూ వెళ్లింది. అక్కడే ఉండి గమనించిన రైల్వే పోలీసు వెంటనే స్పందించి ఆమెను పట్టుకుని, రైలు కింద పడకుండా కాపాడారు. పోలీసు సకాలంలో స్పందించకుంటే ఆమె ప్రాణాపాయంలో చిక్కుకుని ఉండేవారు. ఈ ఘటనను ప్రస్తావిస్తూ రైల్వే శాఖ.. రైలు నడుస్తుండగా ఎక్కడ, దిగడం చేయడం ప్రమాదకరమని ప్రయాణికులను హెచ్చరించింది. ప్రయాణికుల భద్రత కోసం ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయాలని నెటిజన్లు కోరారు. భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖకు సూచించారు. రైల్వే పోలీసు సమయస్ఫూర్తిని కొందరు మెచ్చుకోగా, ఆయనకు బహుమతి ఇవ్వాల్సిందేనని మరికొందరు వాదించారు.

మూఢ నమ్మకాలను వదిలి.. కాస్తంత బుర్రను వాడండి!

గంగలో మునకపై రాజ్ ఠాక్రే వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: గంగా నదీజలాల స్వచ్ఛతపై మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే అనుమానం వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలను వదిలిపెట్టి, మెదడుతో ఆలోచించాలంటూ ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గంగా జలాలు శుభ్రంగా లేవని భావించే ఇటీవలి మహాకుంభ మేళాకు తాను వెళ్లలేదని చెప్పారు. శనివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఠాక్రే 'మా పార్టీ నేత బాలా నంద్‌గావ్‌కర్ ప్రయాగ్‌రాజ్ నుంచి నా కోసం బాటిల్‌లో తెచ్చిన గంగా జలాలను వద్దని చెప్పేశా. అంత కలుషితమైన నీటిని ఎవరు తాగుతారు? కోవిడ్ మహమ్మారి వెళ్లిపోయి రెండేళ్లు దాటినా జనం ఇప్పటికీ మాస్కులతో కనిపిస్తున్నారు. ఇప్పుడేమో కలుషిత గంగానది నీటిలో స్నానాలకు వెళ్తున్నారు' అంటూ వ్యాఖ్యానించారు. గోదావరితోపాటు దేశంలోని అన్ని నదుల జలాలు కలుషితమయ్యాయని అన్నారు.

గ్యాస్ పైప్‌లైన్‌లో నడిచొచ్చి..

వెనక నుంచి దాడి

రష్యా సేనల రణతంత్రం

దీటైన బదులిచ్చిన ఉక్రెయిన్

కీవ్: యుద్ధంలో ఉక్రెయిన్ సేనలపై ఊహించని రీతిలో దాడిచేసేందుకు రష్యా బలగాలు ఒక గ్యాస్ పైప్‌లైన్ లోపలి నుంచి నడుచుకుంటూ వెళ్లిందని కథనాలు వెలువడ్డాయి. రష్యాలోని కర్స్క్ రీజియన్‌లో ఈ యుద్ధ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. గత ఏడాది ఆగస్టులో ఉక్రెయిన్ సేనలు తొలిసారిగా రష్యా భూభాగాన్ని ఆక్రమించుకున్నాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత రష్యా భూభాగంపై జరిగిన అతిపెద్ద దాడి ఘటన ఇదే. వ్యూహాత్మక సరిహద్దు పట్టణమైన సుడ్జా సహా 1,000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఉక్రెయిన్ బలగాలు కైవసం చేసుకున్నాయి. వందలాది మంది రష్యా సైనికులను యుద్ధ ఖైదీలుగా బంధించాయి. దీంతో అమేయ సైనికశక్తిగా ఉన్న రష్యా దీనిని అవమానంగా భావించి ఏకంగా 50,000 మంది సైనికులతో భారీ ఎదురుదాడికి దిగింది. దీంతో వేలాది మంది ఉక్రెయిన్ సైనికులు వెనుతిరగాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎలాగోలా సుడ్జా సిటీలో పోరాడుతున్న ఉక్రెయిన్ సైనికులను అన్నివైపులా నుంచి చుట్టుముట్టేందుకు ఆవలివైపుదాకా ఉన్న గ్యాస్‌పైప్‌లైన్ గుండా రష్యా సైనికులు వెళ్లారని యూరీ పోడోల్యాకా వెల్లడించారు. ఈయన ఉక్రెయిన్‌లో పుట్టి రష్యాకు అనుకూలంగా మాట్లాడే బ్లాగర్. సుడ్జా నగరంలో ఉక్రెయిన్ సేనలను వెనక వైపు నుంచి దాడిచేసేందుకు, అదును చూసి దెబ్బకొట్టేందుకు పైప్‌లైన్ లోపలే రష్యా సైనికులు రోజుల తరబడి గడిపారని ఈయన పేర్కొన్నారు. ఈ పైప్‌లైన్ పొడవు దాదాపు 15 కిలోమీటర్లు. యూరప్‌తో సత్సంబంధాలు తెగిపోకముందువరకు ఈ పైప్‌లైన్ గుండా గ్యాస్‌ను రష్యా సరఫరా చేసేది. ఇప్పుడు గ్యాస్ లేకపోవడంతో సైనికుల రాకపోకలు సాధ్యమయ్యాయని యూరీ చెప్పారు. మాస్కులు ధరించిన సైనికులు పైప్‌లైన్ ద్వారా సుడ్జా నగరంలోకి ప్రవేశించారని 'టూ మేజర్స్' అనే మరో యుద్ధ బ్లాగర్ చెప్పారు. రష్యా స్పెషల్ ఫోర్సెస్ బలగాలు పైప్‌లో నడిచివెళ్తున్న ఫొటోలను రష్యా టెలిగ్రామ్ ఛానెల్స్ అందరితో పంచుకున్నాయి. ''శత్రుసేనల రాకను మేం కనిపెట్టాం. రాకెట్లు, శతఘ్నులతో దీటైన బదులిచ్చాం. రష్యాకు భారీ నష్టం జరిగింది'' అని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ తెలిపింది. అయితే ప్రాణనష్టం, ఎంత మంది రష్యా సైనికులు చనిపోయారనే విషయం వెల్లడికాలేదు.

బడ్జెట్‌ను రాసేశారు

స్వదస్తూరీతో తుదిరూపు • ఛత్తీస్‌గఢ్ ఆర్థిక మంత్రి ఘనత



రాయ్‌పూర్: చేసే పనిపట్ల శ్రద్ధ, నిబద్ధత ఉంటే ఎంతటి కష్టమైన కార్యమైనా ఇష్టంగా పూర్తిచేయొచ్చని ఛత్తీస్‌గఢ్ ఆర్థిక మంత్రి ఓం ప్రకాష్ చౌదరి నిరూపించారు. ఆధునిక యుగంలో చాట్‌జీపీటీ వంటి చాట్‌బాట్ సాంకేతికతలు అందుబాటులోకి వచ్చేశాయి. అడిగితే ఏకంగా ఒక వెబ్‌సైట్ లేదంటే ఒక ప్రోగ్రామ్ సంబంధించిన కోడింగ్ మొత్తాన్నీ చాట్‌బాట్‌లు రాసిస్తాయి. అంతటి అధునాతన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాసరే రాష్ట్ర బడ్జెట్‌ను చౌదరి స్వయంగా చేతితో రాసి తుదిరూపునివ్వడం విశేషం. 100 పేజీల బడ్జెట్ ప్రతులను ఆయన హిందీ భాషలో స్వదస్తూరీతో పూర్తిచేసి తన అంకితభావాన్ని చాటారు. ఐఏఎస్ అధికారి అయిన చౌదరి తాను పనిచేసే ప్రాంతానికి మాత్రమేకాకుండా విస్తృతస్థాయిలో ప్రజాసేవను చేసే లక్ష్యంతో 2018లో రాయ్‌పూర్ కలెక్టర్ ఉద్యోగాన్ని వదిలేసి రాజకీయాల్లో చేరారు. రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన చౌదరి ప్రస్తుతం రాష్ట్ర ఆర్థికమంత్రిగా సేవలందిస్తున్నారు.''నా ప్రసంగాన్ని నేను చేత్తో రాసుకుంటాం. మనం రాసిన దానిని చదువుతుంటేనే మన దార్శనికత, అంకితభావం, ఆ ప్రసంగంలోని అంశాలతో మన అనుబంధం స్ఫురణకు వస్తాయి. అందుకే మొత్తం బడ్జెట్‌ను నేను స్వయంగా రాయాలని నిర్ణయించుకున్నా. బడ్జెట్ పేజీలు మొత్తం రాయడానికి నాకు దాదాపు వారం పది రోజులు పట్టింది. మార్చి నాలుగోతేదీన బడ్జెట్ ప్రవేశపెట్టడానికి నాలుగు రోజుల ముందు నేను నిద్రపోలేదనే చెప్పాలి. ఎందుకంటే ఆ నాలుగు రోజులు కేవలం గంట, గంటన్నర మాత్రమే నిద్రపోయా''అని ఆయన నవ్వుతూ చెప్పారు.

నీవల్లే కరోనా!

24 బిలియన్ డాలర్లు కట్టు • చైనాకు అమెరికా కోర్టు జరిమానా

వాషింగ్టన్: కోవిడ్ మహమ్మారిని కప్పిపుచ్చడంతోపాటు, పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్(పీపీఈ)పై గుత్తాధిపత్యం చెలాయించిందనే ఆరోపణలపై అమెరికా కోర్టు చైనాకు 24 బిలియన్ డాలర్ల జరిమానా విధించింది. కోవిడ్ వ్యాప్తికి చైనా ప్రభుత్వమే కారణమంటూ 2020లో మిస్సోరిలో కేసు నమోదైంది. మహమ్మారికి కేంద్రంగా భావిస్తున్న వూహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, తదితర సంస్థలను బాధ్యులుగా ఇందులో పేర్కొన్నారు. అమెరికాకు సరఫరా కావాల్సిన పీపీఈ కిట్ల ఉత్పత్తి, కొనుగోలు, ఎగుమతి, దిగుమతులను చైనా ప్రభుత్వం అడ్డుకుందని అందులో ఆరోపించారు. విచారణ ముగించిన జడ్జి స్టీఫెన్ కోవిడ్ మహమ్మారికి కారణమై నష్టం కలిగించినందుకు చైనా ప్రభుత్వానికి 24 మిలియన్ డాలర్లు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. చైనా చర్యల ఫలితంగా మిస్సోరికి పన్నుల రూపంలో 8 బిలియన్ డాలర్ల నష్టం కలిగిందని, పీపీఈ కిట్ల సరఫరా నిలిచినందుకు గాను మరో 122 మిలియన్ డాలర్ల మేర అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆయన తీర్పులో పేర్కొన్నారు. కోవిడ్‌కు చైనాను బాధ్యునిగా చేయడంలో ఇది చారిత్రక తీర్పు అని మిస్సోరి అటార్నీ జనరల్ ఆండ్రూ బెయిలీ పేర్కొన్నారు. మిసోరిలోని చైనా ఆస్తులను స్వాధీనం చేసుకుని, నష్టాన్ని భర్తీ చేస్తామన్నారు. మిసోరి కోర్టు తీర్పుపై వాషింగ్టన్‌లో చైనా ఎంబసీ ప్రతినిధి తీవ్రంగా స్పందించారు. 'ఈ తీర్పును మేం పట్టించుకోం. ఎలాంటి ప్రాతిపదిక లేని కేసు. అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా ఉన్న తీర్పు'అని పేర్కొన్నారు.



చైనా రాజధాని బీజింగ్‌లోని పబ్లిక్ పార్క్ వద్ద ఆదివారం పూల చెట్ల వద్ద సెల్ఫీలతో ముచ్చట తీర్చుకుంటున్న యువతులు



ఉత్తరాఖండ్‌లోని ఉద్ధమ్ నగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన రోడ్ షోలో సరదాగా కత్తి దూస్తున్న సీఎం పుష్కర్ సింగ్ ధామి



ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీలో జడలబర్రెలపై విహరిస్తున్న పర్యాటకులు

‘ఉపనయనం’ గురించి ఎందులో పేర్కొన్నారు?

భారతదేశంలో ఒక ప్రత్యేక రకమైన సామాజిక స్తరీకరణ (Social Stratification) కనిపిస్తుంది. దీన్ని ‘కుల వ్యవస్థ’గా పేర్కొంటారు. ప్రపంచం మొత్తం మీద పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో కులం లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ భారత్‌లోని కులవ్యవస్థ విశిష్టమైంది. హిందూ సామాజిక వ్యవస్థ కుల విధానంపై ఆధారపడి ఉంది. కులం అనేది ఏ మాత్రం సరళత లేని అంశంగా పరిణమించింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

కులం - కులతత్వం

కులం అనే పదం 'Caste' అనే పోర్చుగీస్ పదం నుంచి ఉద్భవించింది. కాస్ట్ అంటే..

1) వారసత్వం
2) వంశ పారంపర్యంగా కలిగేది

అనే అర్థాలున్నాయి.

కుల వ్యవస్థ భారతీయ సామాజిక వ్యవస్థకు ఒక ‘మూలస్తంభం’గా ఉంది. హిందూ సమాజం మినహాయించి మరే ఇతర సమాజంలోనూ కులాలు కనిపించవు. వివిధ పరిశోధకులు కులానికి సంబంధించి భిన్న రకాల నిర్వచనాలు ఇచ్చారు.

‘కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో ఉండి వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో గుర్తింపు పొందడాన్ని కులం అంటారు’ - **హెర్బర్ట్ రిస్లీ**

‘కులం అంటే ఒక పరధీకృతమైన సమూహం (Closed Group)’

- **టి.ఎన్. మదన్, డి.ఎన్. మజుందార్**

‘ఒక వర్గం (Single Group) కచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దాన్ని కులంగా పేర్కొనవచ్చు’ - **సి.హెచ్. కూలే**

ఎమ్.ఎన్. శ్రీనివాసన్, హట్టన్ కులం ఆవిర్భావం గురించి పేర్కొన్నారు.

కులం ఆవిర్భావం

భారతదేశంలో సాహిత్య రచన ఆర్యుల కాలంలో (క్రీ.పూ. 1500 నుంచి క్రీ.పూ. 500 మధ్య) జరిగింది. ఈ సాహిత్యాన్ని ప్రధానంగా 8 రకాలుగా గుర్తించవచ్చు. అవి:

- 1) వేదాలు
- 2) బ్రాహ్మణాలు
- 3) అరణ్యకాలు
- 4) ఉపనిషత్తులు

- వేదాంగాలు
- పురాణాలు
- ఉపవేదాలు
- ఇతిహాసాలు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను ‘శృతి సాహిత్యం’ అంటారు. అంటే ‘అతి పవిత్రమైనవి’ అని అర్థం. వీటినే ‘ఆపోషీయాలు’గా పేర్కొంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారు అని అర్థం.

వేదం అంటే ‘నాలెడ్జ్’ అని అర్థం. వేదాలు నాలుగు. అవి:

1) రుగ్వేదం
2) యజుర్వేదం
3) సామవేదం
4) అథర్వణ వేదం

రుగ్వేదంలో పదో అధ్యాయంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోనే ‘పురుష సూక్తం’ గురించి ఉంది. సమాజాన్ని వర్ణం ఆధారంగా బ్రహ్మ నాలుగు రకాలుగా సృష్టించాడని ‘పురుష సూక్తం’లో పేర్కొన్నారు.

వర్ణం అంటే రంగు అని అర్థం. వర్ణం ఆధారంగా బ్రహ్మ కింద పేర్కొన్న సామాజిక వర్గాలను సృష్టించాడని రుగ్వేదంలో తెలిపారు.

1) బ్రాహ్మణులు (తెలుపు)
2) క్షత్రియులు (ఎరుపు)
3) వైశ్యులు (పసుపు)
4) శూద్రులు (నలుపు)

ఈ వర్గీకరణలో మొదటి 3 వర్ణాలకు చెందినవారిని ‘ద్విజులు’ అంటారు. అంటే రెండు సార్లు (తల్లి గర్భం నుంచి, ఉపనయనం నుంచి) జన్మించినవారని అర్థం. శూద్రులకు ఉపనయనం లేదు. వీరికి కర్మకాండలు చేసే అర్హత కూడా లేదు.

ఆర్యుల సాహిత్యంలోని వేదాంగాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1) శిక్ష,
2) నిరుక్త,
3) వ్యాకరణం,
4) జ్యోతిషం,
5) ఛందస్సు,
6) కల్ప

‘కల్ప’ అనేది యజ్ఞయాగాదుల గురించి తెలుపుతుంది. ఇందులో మూడు రకాల సూత్రాలు ఉన్నాయి. వీటిలో గృహ సూత్రం ప్రధానమైంది.

గృహ సూత్రం: రాజు మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 పౌరుశ కర్మల గురించి పేర్కొంటుంది. వీటిలో 11వ కర్మ ‘ఉపనయనం’ గురించి వివరిస్తుంది. ఈ కర్మ నిర్వహిస్తే మోక్షం పొందొచ్చని భావిస్తారు.

- శూద్రులతో పాటు స్త్రీలకు కూడా ఉపనయనం లేదు.

వర్ణ వ్యవస్థ నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యం సాధించడానికే ఏర్పాటైంది. కానీ చాతుర్వర్ణ వ్యవస్థలో పైవర్ణంవారు కింది వర్ణం అయిన శూద్రులను ‘దాసులు’గా చూడటం ప్రారంభించారు. ఆ తర్వాత క్రమంగా వివిధ వృత్తులు ఏర్పడ్డాయి.

కాలక్రమేణా బౌద్ధ, జైన మతాల ఆవిర్భావంతో సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. అంతర్వర్ణ వివాహాలను అంగీకరించారు. అనులోమ, ప్రతిలోమ వివాహాలు కూడా జరిగాయి.

ఉన్నత వర్ణాలకు చెందిన పురుషుడు తక్కువ వర్ణాలకు చెందిన యువతిని వివాహం చేసుకోవడం ‘అనులోమ వివాహం’. తక్కువ వర్ణంలోని పురుషుడు ఉన్నత వర్ణానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడం ‘ప్రతిలోమ (విలోమ) వివాహం’. ఈ విధంగా జరిగిన వివిధ రకాల వివాహాల కారణంగా ‘వర్ణ సంకరం’ ఏర్పడింది.

వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది విస్తృతమవడం వల్ల జాతులు ఆవిర్భవించాయి. కాలక్రమేణా ఇవి కులాలుగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడ్డ కులం తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విభజితమైంది. ఈ విధంగా ‘వర్ణ వ్యవస్థ’ నుంచి ‘కుల వ్యవస్థ’ ఏర్పడింది.

కులం ఆవిర్భావ సిద్ధాంతాలు

హిందూ సమాజంలో కుల వ్యవస్థ ఒక ప్రత్యేక లక్షణం. ఇది ఎప్పుడు, ఏవిధంగా ప్రారంభమైందో స్పష్టంగా చెప్పలేనప్పటికీ కొంత మంది సామాజిక



శాస్త్రవేత్తలు దీని పుట్టుక గురించి కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

దైవాంశ సంభూత సిద్ధాంతం: దీని ప్రకారం కులవ్యవస్థ దైవాంశమైంది. హిందువులకు ప్రమాణం ‘వేదం’. రుగ్వేదంలోని పురుష సూక్తంలో బ్రహ్మదేవుడు నాలుగు వర్ణాలను సృష్టించాడని పేర్కొన్నారు. భగవద్గీత కూడా అత్యంత ప్రాచీన గ్రంథం. హిందువులకు ప్రామాణికం. ఇందులో కృష్ణుడు తన వల్లే నాలుగు వర్ణాలు ఉద్భవించాయని చెప్పినట్లు పేర్కొన్నారు. విష్ణు పురాణం, వేదాల్లోనూ ఈ సిద్ధాంతం ప్రస్తావన ఉంది. దీన్ని శాస్త్రీయంగా అంగీకరించడానికి ఆధారాలు లేవు.

జాతి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని హెర్బర్ట్ రిస్లీ అభివృద్ధి చేశాడు. ఇతడి ప్రకారం.. ఆర్యులు, ద్రావిడులు, మంగోలియన్ లాంటి వివిధ తెగల మధ్య సంఘర్షణలు తలెత్తినప్పుడు ప్రతి తెగ ప్రత్యేక లక్షణాలను కాపాడుకునే ఉద్దేశంతో ఒక సమూహంగా ఏర్పడి తర్వాత ఆ సమూహం ‘కులం’గా మారింది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి సమూహంలోని సభ్యులందరూ కట్టుబడి ఉండాల్సిన కొన్ని నియమాలను ఏర్పరచుకున్నారు. ఈ విధంగా అనేక కులాలు ఆవిర్భవించాయి.

వృత్తి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని నెస్‌ఫీల్డ్ తెలిపాడు. ఇతడు కులం ఆవిర్భావానికి కారణం వృత్తి అని పేర్కొన్నాడు. వ్యవసాయం, పరిశ్రమల వల్ల జీవన క్రమంలో వచ్చిన మార్పుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. వ్యక్తులు నిర్వహించే వృత్తి ఆధారంగా ఒక స్థితి, ఒక ప్రత్యేకత ఏర్పడ్డాయి. లోహాల వినియోగం కంటే ముందు ఉన్న కులాలకు తక్కువ స్థాయి; లోహాలు, పరిశ్రమల ఆవిర్భావం తర్వాత ఉన్న వృత్తులకు ‘ఉన్నత స్థాయి’ ఉందని ఇతడు పేర్కొన్నాడు.

సంస్కార సిద్ధాంతం: దీన్ని ఎ.ఎం. హోకర్ట్ ప్రతిపాదించాడు. ‘భారతదేశంలో మత సంస్కారాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా మంత్రాలు చదవడం, ప్రదేశాన్ని శుభ్రం చేయడం, అలంకరించడం, మేళతాళాలు వాయించడం మొదలైన వాటి వల్ల కులాలు ఏర్పడ్డాయి’ అని ఇతడు వివరించాడు.

భౌగోళిక సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని గిల్బర్ట్ ప్రతిపాదించాడు. దీని ప్రకారం.. భారతదేశం సువిశాలమైంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులు, వనరులను, సముద్ర తీర ప్రాంతాలు, నదీ మైదానాలు, మెట్ట ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు లాంటివి ఉన్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు ఆయా ప్రదేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తమ జీవన విధానాన్ని సర్దుబాటు చేసుకొని జీవిస్తారు. వ్యవసాయం, పశుపోషణ, చేపలు పట్టడం ఈ విధంగానే ఏర్పడ్డాయి. ఇలాంటి జన సమూహాలే ‘కులాలు’గా ఆవిర్భవించాయి.

సాంస్కృతిక సిద్ధాంతం: దీన్ని ఎస్.పి. రాయ్, అతడి అనుచరులు ప్రతిపాదించారు. దీని ప్రకారం సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఒక సమూహంలోని ప్రజలు ఆ సమూహాన్ని ‘కులం’గా రూపొందించుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. ‘కులం’ అనేది ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
   ఎ) ఫ్రెంచ్ బి) లాటిన్
   సి) పోర్చుగీస్ డి) అరబిక్
2. ‘కులవ్యవస్థ’ దేని నుంచి ఉద్భవించింది?
   ఎ) వర్ణ వ్యవస్థ బి) వర్గ వ్యవస్థ
   సి) వృత్తి వ్యవస్థ డి) ఏదీకాదు
3. జతపరచండి.
   1. జాతి సిద్ధాంతం ఎ) హెర్బర్ట్ రిస్లీ
   2. వృత్తి సిద్ధాంతం బి) నెస్ ఫీల్డ్
   3. సంస్కార సిద్ధాంతం సి) ఎ.ఎం. హోకర్ట్
   4. భౌగోళిక సిద్ధాంతం డి) గిల్బర్ట్
   ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   బి) 4-ఎ, 3-బి, 2-సి, 1-డి
   సి) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
   డి) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
4. వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఏ ‘వేదం’లో కనిపిస్తుంది?
   ఎ) రుగ్వేదం బి) యజుర్వేదం
   సి) సామవేదం డి) అధర్వణ వేదం
5. ‘ఉపనయనం’ ఏ వర్ణం వారికి వర్తించదు?
   ఎ) తెలుపు బి) నలుపు
   సి) ఎరుపు డి) పసుపు
6. ‘చతుర్వర్ణ వ్యవస్థ’ ఎక్కడ పేర్కొన్నారు?
   ఎ) వేదాలు బి) అరణ్యకాలు
   సి) బ్రాహ్మణాలు డి) ఉపనిషత్తులు
7. కింద పేర్కొన్నవారిలో ‘ద్విజులు’ కానివారు?
   ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
   సి) వైశ్యులు డి) శూద్రులు
8. ‘చాతుర్వర్ణ వ్యవస్థ’లో పై స్థాయి వారు?
   ఎ) శూద్రులు బి) క్షత్రియులు
   సి) బ్రాహ్మణులు
   డి) వైశ్యులు
9. ‘ఉపనయనం’ గురించి ఎందులో పేర్కొన్నారు?
   ఎ) గృహ సూక్తం బి) శ్రేత సూక్తం
   సి) సుకువ సూక్తం
   డి) ఏదీకాదు
10. ‘కులవ్యవస్థ’ ఎప్పుడు ఆవిర్భవించింది?
    ఎ) 400 బి.సి. బి) 200 ఎ.డి.
    సి) 1000 ఎ.డి.
    డి) కచ్చితంగా చెప్పలేం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) ఎ; 7) డి; 8) సి; 9) ఎ; 10) డి.

జీవవైవిధ్యానికి నిలయాలు.. ప్రవాళ భిత్తికలు

ఆయనరేఖా ప్రాంతంలోని సముద్ర భూతలాలపై కనిపించే విశేష భూస్వరూపాలే ప్రవాళ భిత్తికలు. సాధారణంగా సముద్రాల్లో తక్కువ లోతు ప్రదేశాల్లో కొన్ని ప్రవాళ జీవులు నివసిస్తుంటాయి. వీటి శరీరాలు కాల్షియం కార్బొనేట్ పదార్థంతో నిర్మితమై ఉంటాయి. ప్రత్యేక తరగతికి చెందిన ఈ జీవులను ‘పాలిప్స్’గా వ్యవహరిస్తారు. స్టొమాటో పొరాయిడ్స్, మెలస్కస్ తదితర జాతుల జీవులు పాలిప్స్‌కు చెందుతాయి. వీటి శరీర భాగాలే కాకుండా కవచాలు, స్రావాలు కూడా కాల్షియం కార్బొనేటుతో కూడి ఉంటాయి.

ఈ ప్రవాళ జీవులు అనువైన ప్రాంతాల్లో సహనివేశాలుగా ఏర్పడతాయి. ఈ ప్రాంతాల్లో ప్రవాళ జీవుల శరీర భాగాలు, స్రావాలు, కవచాలు పెద్ద దిబ్బల మాదిరిగా ఉండి ప్రవాళ భిత్తికలుగా ఏర్పడతాయి. ఈ ప్రవాళ భిత్తికలు లంబదిశలో విస్తరించి, సముద్ర మట్టంపైకి తేలినప్పుడు ప్రవాళ జీవులుగా ఏర్పడతాయి. ప్రవాళ భిత్తికలు.. జ్యూప్లాంక్టన్, ఫైటో ప్లాంకన్లకు ఆలవాలంగా ఉంటాయి.

ప్రవాళ జీవులకు అనువైన పరిస్థితులు

- 21°C సగటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత
- తక్కువ లోతు ఉన్న సముద్ర భాగాలు
- పారదర్శకంగా ఉండే సముద్ర భాగాలు
- శిథిల శిలా పదార్థం లేని సముద్ర భాగాలు
- సముద్ర అంతర్గత వేదికలు

ఈ అనువైన పరిస్థితులు 30 ఉత్తర-దక్షిణ అక్షాంశ ప్రాంతాల్లోని తక్కువ లోతు ఉన్న సముద్ర భాగాల్లో ఉంటాయి. అందువల్ల ప్రవాళ భిత్తికలు ప్రధానంగా ఆయనరేఖా, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లోని హిందూ మహాసముద్రం, కరేబియన్ సముద్రం, నైరుతి పసిఫిక్ సముద్ర ప్రాంతాలు, నైరుతి అట్లాంటిక్ సముద్ర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. లక్షదీవులు, ఫిజీ, టాంగా, కరేబియన్ దీవులు, తూర్పు ఆస్ట్రేలియా తీరాల్లో ప్రవాళ దీవులు విస్తరించి ఉన్నాయి. నదీ ముఖద్వారాల వద్ద సముద్ర జలాలు శిలాపదార్థ నిక్షేపణం వల్ల పారదర్శకంగా ఉండవు. కాబట్టి అక్కడ భిత్తికలు ఏర్పడవు.

ప్రవాళ భిత్తికలు ప్రధానంగా మూడు రకాలు. అవి.. 1) తీరాంచల భిత్తికలు, 2)అవరోధ భిత్తికలు, 3) అటాల్స్.

ఈ మూడు రకాల భిత్తికలు మూడు అభివృద్ధి దశలను సూచిస్తాయని నిపుణుల అభిప్రాయం. ఈ మూడు రకాలు వరుసగా వాటి పరిణామక్రమంలో ఏర్పడతాయని ‘డార్విన్-దానా’లు సూత్రీకరించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రవాళ భిత్తికలు ప్రాథమిక దశలో అగ్నిపర్వత దీవుల తీరాల్లో తీరాంచల భిత్తికల రూపంలో ఏర్పడతాయి. దీవి క్రమంగా కుంగిపోవడంతో తీరానికి, ప్రవాళ భిత్తికకు మధ్య ‘కయ్య’ ఏర్పడుతుంది. ఈ రకంగా తీరాంచల భిత్తిక, అవరోధ భిత్తికగా మారుతుంది. అగ్నిపర్వత దీవి పూర్తిగా కుంగిపోవటంతో మధ్య



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

భాగంలో విశాలమైన కయ్య రూపొందుతుంది. ఈ రకంగా కయ్యను పరివేష్టించి ఉన్న వృత్తాకార ప్రవాళ భిత్తికను ‘అటాల్’గా పిలుస్తారు. అయితే అగ్నిపర్వత దీవుల ప్రాంతాల్లో ‘భూ అభినతి’ సంభవించడానికి కారణాలను డార్విన్ సిద్ధాంతం వివరించలేకపోయింది.

ప్లీస్టోసిన్ హిమనీ నదాలు కరగటం వల్ల క్రమంగా తీరాంచల భిత్తికలు అటాల్స్‌గా మారాయని రీన్-ముర్రే సూత్రీకరించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్లీస్టోసిన్ హిమనీ నదాలతో మూసుకుపోయిన ఖండాల తీరాల్లో మొదటగా తీరాంచల భిత్తికలు ఏర్పడ్డాయి. కవోష్ణ యుగంలో హిమానీ నదాలు క్రమంగా కరగడంతో భిత్తికలకు, తీరానికి మధ్య కయ్య ఏర్పడుతుంది. దీంతో తీరాంచల భిత్తికలు అవరోధ భిత్తికలుగా, క్రమంగా అటాల్‌గా రూపొందుతాయి. తీరాంచల భిత్తికల్లోని కాల్షియం కార్బొనేటు ద్రావణీకరణం చెందడంతో క్రమక్షయం చెంది, ఆ ప్రాంతంలో కయ్య ఏర్పడుతుంది. తద్వార అవరోధ భిత్తికలు ఏర్పడతాయని ద్రవణీకరణ సిద్ధాంతం తెలుపుతోంది.

అటాల్స్.. అంతటా ఒకే రీతి

అటాల్స్‌లోని కయ్యల లోతు ప్రపంచవ్యాప్తంగా ఒకే రీతిలో ఉండటాన్ని హిమనీనద నియంత్రణ సిద్ధాంతం వివరిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా హిమనీనదాల కరిగే రేటు ఒకేరకంగా ఉంటుంది. దీంతో వాటివల్ల ఏర్పడిన కయ్యల లోతు ఒకేరీతిగా ఉంటుంది.

ప్రవాళ క్షీణత

1870ల నుంచి ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రవాళ భిత్తికా మండలాల్లో ప్రవాళ క్షీణత జరిగినట్లు ఆధారాలున్నాయి. అయితే 1970 నుంచి ప్రవాళ క్షీణత తీవ్రత అధికంగా ఉన్నట్లు నివేదికలు తెలుపుతున్నాయి. మొత్తం 105కి పైగా సామూహిక ప్రవాళ క్షీణత సంఘటనలు జరిగినట్లు సమాచారం. అందులో 60 సంఘటనలు 1979-1990 మధ్యలోనే సంభవించాయి. 1980లకు పూర్వం ప్రవాళ క్షీణత ప్రధానంగా చక్రవాతాలు, వేలా తరంగాల వల్ల సంభవించింది. కానీ 1980ల తర్వాత సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరగటం వల్ల ప్రవాళ క్షీణత జరిగినట్లు శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 2 C నుంచి 3 C అధికంగాపెరిగితే ప్రవాళ క్షీణత ప్రారంభమవుతుంది.

ప్రవాళం క్షీణించినప్పటికీ క్షీణత చాలావరకు తాత్కాలికంగా ఉంటుంది. కానీ 1998, 2002లలో సంభవించిన ప్రవాళ క్షీణత శాశ్వతమని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. 1998, 2002లలో ఆస్ట్రేలియా తూర్పు తీరంలోని గ్రేట్ బారియర్ రీఫ్‌లో 40 శాతం క్షీణత సంభవించింది. లక్షదీవులు, మాల్దీవులు, శ్రీలంక, కెన్యా, టాంజానియా, సెబెల్స్ ప్రాంతాల్లోని ప్రవాళ భిత్తికలలో కూడా భారీ స్థాయిలో క్షీణత జరిగింది. మధ్యధరా సముద్రంలో ‘విబ్రియో షిలోయి’ అనే సూక్ష్మజీవి ‘ఓక్యులినా పటగోనికా’ తరగతికి చెందిన ప్రవాళ భిత్తికలను క్షీణింపజేస్తున్నట్లు నిపుణులు తెలిపారు. భారతదేశం, శ్రీలంకల మధ్య ఉన్న మన్నార్ సింధుశాఖ, పాక్ అఖాతం ప్రాంతాల్లో రామేశ్వరం దీవి నుంచి వేధాలయి వరకు 25 కిలోమీటర్ల ప్రాంతంలో 66 జాతులకు చెందిన ప్రవాళ జీవులు నివసిస్తున్నాయి. పోరైట్స్ జాతికి చెందిన ప్రవాళాల్లో క్షీణత కనిష్టంగా 29 శాతం ఉంది. గ్రేట్ బారియర్ రీఫ్ మెరైన్ పార్క్ అథారిటీ ప్రవాళ క్షీణతను అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను నిరంతరం గమనించడం.. క్షీణతను ముందుగానే పసిగట్టడం.. క్షీణతా తీవ్రతను అంచనా వేయడం.. క్షీణత వల్ల సంభవించే ఆవరణ సమస్యలను మదింపు చేయడం. స్థానికులను ప్రవాళ పరిరక్షణలో భాగస్వాములను చేయడం మొదలైనవి ప్రణాళిక ముఖ్యాంశాలు.

ప్రపంచ వర్షపాతం.. విస్తరణ!

బాష్పీభవన ప్రక్రియ ద్వారా భూ ఉపరితల జలరాశుల నుంచి వాతావరణంలోకి చేరిన నీటి ఆవిరి సంతృప్తం చెందినప్పుడు చల్లారి, ద్రవీభవించి.. వర్షపాతం రూపంలో తిరిగి భూ ఉపరితలంపైకి చేరుతుంది.

ప్రపంచ వర్షపాత విస్తరణల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. ఆవిర్భావ ప్రక్రియను అనుసరించి.. మూడు రకాల వర్షపాతాన్ని గుర్తించొచ్చు..

1) పర్వతీయ వర్షపాతం,
2) సంవహన వర్షపాతం,
3) చక్రవాత వర్షపాతం.

పర్వతీయ వర్షపాతం: పెద్ద మొత్తాల్లో నీటిఆవిరితో కూడిన ఆర్ద్ర పవనాలు.. సముద్రాల నుంచి ఖండ భాగాల పైకి వీచినపుడు ఎత్తయిన పర్వత శ్రేణులు వాటిని అడ్డగించడం వల్ల పర్వతాల పవనాభిముఖ దిశలో సంభవించే వర్షపాతాన్ని ‘పర్వతీయ వర్షపాతం’ అంటారు. ఆర్ద్రతతో కూడిన పవనాలు పర్వతాలను దాటే ప్రయత్నంలో పైకి లేస్తాయి. ఈ ప్రక్రియలో అవి వ్యాకోచం చెందడంతో వాటిలోని నీటిఆవిరి చల్లారి, ద్రవీభవించి వర్షిస్తాయి. ఈ పవనాలు పర్వతాలను దాటాకా పవన పరాన్ముఖ దిశలో వర్షాన్నివ్వవు. అందువల్ల పవన పరాన్ముఖదిశలో వర్షచ్ఛాయ ప్రాంతాలు ఏర్పడతాయి. ఉదాహరణకు రుతుపవనాలు భారతదేశ పశ్చిమ తీరాన్ని తాకినప్పుడు సహ్యాద్రి కొండలు వాటిని అడ్డగిస్తాయి.

వర్షచ్ఛాయ ప్రాంతాలు: అరేబియా సముద్రం నుంచి వీచే ఆర్ద్ర నైరుతి రుతుపవనాలు సహ్యాద్రి కొండలను దాటే ప్రయత్నంలో వ్యాకోచించి, చల్లారి, ద్రవీభవించి పశ్చిమ తీరమైదానంలో విస్తారంగా వర్షాన్నిస్తాయి. సహ్యాద్రి కొండల పవన పరాన్ముఖ దిశలోని దక్కన్ పీఠభూమికి చెందిన ఉత్తర కర్ణాటక, రాయలసీమ, పశ్చిమ తెలంగాణ, మరాఠ్వాడా, విదర్భ ప్రాంతాలు వర్షచ్ఛాయ ప్రాంతాలుగా మారాయి. ఈ ప్రాంతాలు కేవలం 40-60 సెం.మీ.ల వార్షిక సగటు వర్షపాతంతో పాక్షిక శుష్క మండలాలుగా మారాయి.

సంవహన వర్షపాతం: భూమధ్యరేఖా ప్రాంతంలో సంభవించే వర్షపాతం ‘సంవహన వర్షపాతం’ తరగతికి చెందుతుంది. భూమధ్యరేఖకు ఇరువైపులా ఉన్న 5 దక్షిణ - 10 ఉత్తర అక్షాంశాల మధ్య ప్రాంతంలో ఏడాది పొడవునా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. దీనివల్ల ఈ ప్రాంతంలో భూ ఉపరితలాన్ని ఆనుకొని ఉన్న వాయువులు వేడెక్కి సంవహన ప్రక్రియ వల్ల ఉత్థానం చెందుతాయి. ఎత్తుకు చేరిన తర్వాత ఈ సంవహన వాయువులు వ్యాకోచించి, చల్లారి ద్రవీభవించి వర్షాన్నిస్తాయి.

బ్రెజిల్‌లోని అమెజాన్, ఆఫ్రికాలోని కాంగో (జైర్) బేసిన్‌లలో సంవహన వర్షపాతం ఉంటుంది. దీని వల్ల ఏడాది పొడవునా ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో వర్షం కురుస్తుంది. దేశంలో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి ముందు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గాలిదుమ్ములతోపాటుగా కురిసే జల్లులు కూడా సంవహన వర్షపాత రకానికే చెందుతాయి. ఆయనరేఖా, మధ్య అక్షాంశ ప్రాంతాల్లోని చక్రవాత మండలాల్లో కురిసే వర్షపాతం.. చక్రవాత వర్షపాత రకానికి చెందుతుంది. ఆయనరేఖా సముద్రాల్లో ఏర్పడే అల్పపీడనా ద్రోణులు బలపడి, క్రమంగా వాయుగుండాలుగా, తుపాన్లుగా మారి ఖండాల తీరాన్ని తాకినప్పుడు విస్తారంగా వర్షం కురుస్తుంది. మధ్య అక్షాంశాల్లోని సమశీతోష్ణ మండల ప్రాంతాల్లో కవోష్ణ పశ్చిమ పవనాలు, ధ్రువప్రాంత తూర్పు పవనాలు అభిసరణం చెందినప్పుడు ఏర్పడే వాతాగ్ర మండలంలో చక్రవాతాలేర్పడి, విస్తారంగా వర్షం కురుస్తుంది. చక్రవాత వర్షపాతం, బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడి ఉంటుంది.

వర్షపాత విస్తరణ: ప్రపంచ వర్షపాత విస్తరణలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తాయి. భారతదేశంలోని మాసిన్‌రాం, చిరపుంజీ లాంటి ప్రాంతాల్లో అత్యధికంగా సుమారు 1000 సెంటీమీటర్ల వార్షిక సగటు వర్షపాతం నమోదవుతోంది. అటకామా ఎడారిలోని సాలెరస్ ప్రాంతంలో కొన్ని సందర్భాల్లో వరుసగా అయిదేళ్లపాటు కనీసం ఒక చుక్క వర్షం కూడా కురవలేదు.

వార్షిక సగటు వర్షపాతం ప్రాతిపదికన ప్రపంచాన్ని 3 అవపాత మండలాలుగా విభజించొచ్చు.

1. అధిక వర్షపాత మండలం (100 సెం.మీ.ల కంటే అధిక వార్షిక సగటు వర్షపాతం)
2. మధ్యస్థ వర్షపాత మండలం (30 నుంచి 100 సెం.మీ. వార్షిక సగటు వర్షపాతం)
3. అల్ప వర్షపాత మండలం (30 సెం.మీ.ల కంటే తక్కువ వార్షిక సగటు వర్షపాతం).

భూమధ్యరేఖా ప్రాంతంలో: భూమధ్యరేఖా ప్రాంతంలో ఏడాది పొడవునా అధిక ఉష్ణోగ్రతలు ఉండటం వల్ల సంవత్సరమంతా సంవహన వర్షపాతం ఉంటుంది. దక్షిణ అమెరికాలోని బ్రెజిల్‌కు చెందిన అమెజాన్, ఆఫ్రికాలోని కాంగో(జైర్) బేసిన్లు ఈ మండలానికి చెందుతాయి. ఈ మండలంలో వార్షిక సగటు వర్షపాతం 250 సెం.మీ.కు పైగా ఉంటుంది. ప్రతి నెలా కనీసం 6 సెం.మీ. సగటు వర్షపాతం నమోదవుతుంది. ఈ మండలంలో ఆయనరేఖా సతతహరిత అరణ్యాలు పెరుగుతాయి. ఆయనరేఖ, ఉప ఆయనరేఖా ప్రాంతాల్లో ఈశాన్య, ఆగ్నేయ వ్యాపార పవనాలు సముద్రాల నుంచి వీస్తూ, మొదటగా ఖండాల తూర్పుభాగాల్లో ప్రవేశిస్తాయి. వీటి ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తూర్పు బ్రెజిల్, కరేబియన్ దీవులు, మధ్య అమెరికా, ఆగ్నేయ అమెరికా, మడగాస్కర్ తూర్పు తీరం, తూర్పు ఆఫ్రికా తీరం ఈ మండలానికి చెందుతాయి. దక్షిణ, ఆగ్నేయాసియాల్లో రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షం కురుస్తుంది.

భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, థాయిలాండ్, మయన్మార్, వియత్నాం, కంబోడియా తదితర దేశాలు రుతుపవన మండలం కిందకు వస్తాయి. అధిక వర్షపాతం కారణంగా ఈ మండలంలో దట్టమైన రుతుపవన అరణ్యాలు పెరుగుతున్నాయి. 40 -60 అక్షాంశ ప్రాంతాల్లో ఖండాల పశ్చిమ భాగాల్లో పశ్చిమ పవనాల ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయి. పశ్చిమ పవనాలు ఈ ప్రాంతాల్లోకి వాతాగ్ర(కవోష్ణ) చక్రవాతాలను చోదితం చేయడం కూడా అధిక వర్షపాతానికి కారణం. వాయవ్య అమెరికా, వాయవ్య ఐరోపాలు ఈ మండలం కిందకు వస్తాయి. ఆయనరేఖ, ఉప ఆయనరేఖా అక్షాంశాల్లోని ఖండాల పశ్చిమ భాగాల్లో ఉష్ణమండల ఎడారులు ఏర్పడ్డాయి. ఉదాహరణకు సహారా, అరేబియా, మొజావే, పశ్చిమ ఆస్ట్రేలియా, థార్, అటకామా ఎడారులు. అదేవిధంగా మధ్య అక్షాంశాల్లోని ఖండాంతర్భాగాల్లో కూడా శీతల ఎడారులు ఏర్పడ్డాయి. ఉదాహరణకు గోబీ, పెటగోనియా ఎడారులు. శీతల, ఉష్ణమండల ఎడారులతోపాటు ధ్రువ, ఉప ధ్రువ ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం సంభవిస్తుంది. ఖండాంతర్భాగాలు సముద్రాలకు దూరంగా ఉండటం వల్ల ఇక్కడ వీచే పవనాలు శుష్కంగా ఉంటాయి. అందువల్ల వర్షపాతం అత్యల్పంగా ఉంటుంది. ఆయనరేఖా ప్రాంతాల్లోని ఖండాల పశ్చిమ భాగాల్లో... ఉష్ణమండల ఎడారులు ఏర్పడటానికి వాటి తీరాల్లో ప్రవహించే శీతల సముద్ర ప్రవాహాలు కూడా కొంతవరకు కారణం.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టిందెవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

> సిపాయిల తిరుగుబాటు సమయంలో నిజాం తీసుకున్న నిర్ణయం వల్ల ఉత్తర భారతదేశ విప్లవ జ్వాలలు దక్షిణానికి వ్యాపించకుండా నిలిచిపోయాయి. నిజాం కలసి వస్తే ప్రజలు పెద్ద సంఖ్యలో తిరుగుబాటులో పాల్గొనేవారు. ఉత్తర భారతదేశంలో నానాసాహెబ్ పీష్వా లాంటి ప్రముఖుల నాయకత్వంలో తిరుగుబాటు కొనసాగింది. ఢిల్లీలో ఉద్యమం చెలరేగిన వార్త హైదరాబాద్ చేరగానే నగర ప్రజల్లో భావోద్వేగాలు ఎక్కువయ్యాయి. మసీదు గోడలపై, ప్రముఖ కూడళ్ల వద్ద ప్రకటనలు వెలిశాయి. ఢిల్లీ పాదుషా లేదా ఇస్లాం మతం పేరు మీద తిరుగుబాటు లేవదీయాలని ప్రజలు నిజాంను కోరారు. వారు 'అల్లా, ప్రవక్త ఆశీస్సులు అఫ్జలుద్దౌలాకు ఉన్నాయి. భయపడొద్దు' అని నినదించారు.

అసఫ్‌జాహీలు

మొగల్ సామ్రాజ్యానికి జాగీర్దార్‌గా హైదరాబాద్‌లో అసఫ్ జాహీ వంశం ప్రారంభమైంది. మొదటి అసఫ్ జా మరణానంతరం ఈ రాజ్యం స్వతంత్రత కోల్పోతూ వచ్చింది. మహారాష్ట్రుల నుంచి రక్షణ కోసం ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకోవడానికి నిజాం అలీ ప్రయత్నించాడు. కానీ 1763లో మూడో కర్ణాటక యుద్ధ వ్యవహారాల్లో తలమునకలై ఉన్న బ్రిటిషర్లు నిజాం అలీ ప్రతిపాదనలను అంగీకరించలేదు.

- ఉత్తర సర్కారులన్నింటినీ బ్రిటిషర్లకు ఇచ్చేలా మొగల్ చక్రవర్తి 'షా ఆలం' నుంచి 1765లో రాబర్ట్ క్లైవ్ ఒక ఫర్మానా పొందాడు.
- భారతదేశం నుంచి ఫ్రెంచి వారిని తరిమివేసే ఉద్దేశంతో లార్డ్ వెల్లస్లీ దేశంలో సైన్య సహకార ఒప్పందం ప్రవేశపెట్టాడు. దీనిపై హైదరాబాద్ నిజాం అలీ మొదట సంతకం చేశాడు. దీని ప్రకారం నిజాం అలీ రాజ్యంలో బ్రిటిష్ సైన్యం శాశ్వతంగా ఉండే విధంగా ఒప్పందం చేసుకున్నారు. ఈ సైన్యానికి జీతాలు ఇవ్వడానికి దత్త మండలాలు ఇచ్చారు. బ్రిటిష్ ప్రతినిధి నిజాం అలీ ఆస్థానంలో నివాసం ఉన్నాడు.
- సికిందర్ జాతో 1800లో సైన్య సహకార ఒప్పందంపై మరోసారి సంతకం చేయించారు. దీంతో నిజాం అధికారాలు ఈస్టిండియా కంపెనీ పరిధిలోకి వెళ్లిపోయాయి. కంపెనీ చేతుల్లో నిజాం కీలుబొమ్మగా మారాడు.
- కంపెనీకి తెలియకుండా ఇతర పాలకులతో ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడానికి నిజాంకు వీల్లేకుండా పోయింది. అంతరంగిక వ్యవహారాల్లోనూ నిజాం అధికారాలకు పరిమితులు విధించారు.
- తన సొంత ప్రధాని లేదా దివాన్‌ను నియమించడానికి కూడా కంపెనీ అనుమతిని పొందాల్సిన పరిస్థితి నిజాంకు ఏర్పడింది.
- రెండో ఆంగ్లో - మహారాష్ట్ర యుద్ధంలో కంపెనీకి నిజాం పూర్తి సహకారం అందించలేదు. దీన్ని తీవ్రంగా భావించిన గవర్నర్ జనరల్ వెల్లస్లీ 1803లో నిజాంతో బలవంతంగా మరో ఒప్పందం కదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం యుద్ధ సమయాల్లో నిజాం సైన్యాన్నంతా కంపెనీ ఆధీనంలో ఉంచాలి.

హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధి 'మీర్ ఆలం'ను దివాన్‌గా నియమించాల్సిందిగా నిజాంకు వెల్లస్లీ సిఫార్సు చేశాడు. దీంతో కంపెనీకి నమ్మకస్థుడైన మీర్ ఆలంను నిజాం అయిష్టంగానే దివాన్‌గా నియమించాడు. మీర్ ఆలం పెత్తనాన్ని అదుపు చేయడానికి సికిందర్ జా తన స్నేహితుడైన మహిపతి రామ్‌ను పేష్కారు (డిప్యూటీ దివాన్)గా నియమించడానికి ప్రయత్నించాడు. బ్రిటిష్ ప్రతినిధి కెప్టెన్ సైడన్ హాం 'మహిపతి రామ్'ను కాకుండా రాజా చందులాల్‌ను పేష్కారుగా నియమించాడు. 1810లో సైడన్ హాం పదవీ విరమణ చేసిన తర్వాత చందూలాల్‌ను దెబ్బతీయాలని నిజాం ప్రయత్నించాడు. పదవి స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వ లెక్కలను చూపమని 1806లో నిజాం చందూలాల్‌ను అడిగాడు. ఈస్టిండియా కంపెనీ చందూలాల్‌ను ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. బ్రిటిష్ నూతన ప్రతినిధి హెన్రీ రస్సెల్ 1811లో నిజాంను కలిసి చందూలాల్ పట్ల నిరాదరణకు తన నిరసన తెలిపాడు. తన పరిస్థితిని గుర్తించిన నిజాం సికిందర్ జా ప్రభుత్వ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనడం మానేశాడు. దీంతో 1811 నుంచి బ్రిటిష్ ప్రతినిధి నిజమైన పాలకుడయ్యాడు.

నిజాం రాజ్యంలో అరాచక పరిస్థితులను చక్కదిద్దడానికి బ్రిటిష్ ప్రభుత్వ అనుమతితో హెన్రీ రస్సెల్ హైదరాబాద్‌లో నూతన సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. దీన్నే రస్సెల్ బ్రిగేడ్ లేదా రస్సెల్ సైన్యం అంటారు. ఇదే తర్వాతి కాలంలో హైదరాబాద్ 'కాంటిజెంట్' సైన్యంగా మారింది. స్థానిక పిండారీలు, బిల్లులు, జమీందార్ల ఆగడాలను అణచివేసి రాజ్యంలో శాంతి భద్రతలు కాపాడారు. 1860, 1867లో మొదటి సాలార్జంగ్‌ను పదవి నుంచి తొలగించడానికి నిజాం యత్నించాడు. కానీ హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధులు అతడి పదవిని రక్షించారు. 1860లో హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్ జోక్యం చేసుకోవడంతో నిజాం మొదటి సాలార్జంగ్‌ను పదవి నుంచి తొలగించలేకపోయాడు. 1867లో బ్రిటిష్ ప్రతినిధి యూల్ సహాయంతో సాలార్జంగ్ తన పదవిని నిలుపుకున్నాడు.

సిపాయిల తిరుగుబాటు

1857లో చెలరేగిన సిపాయిల తిరుగుబాటు ఆంగ్ల ప్రభుత్వ పునాదులను కదిలించింది. ఉత్తర భారతదేశంలో.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ఈ తిరుగుబాటు తీవ్ర స్థాయిలో జరిగింది. సిపాయిల తిరుగుబాటు ప్రభావం దక్షిణ భారతంలోని ఆంధ్ర ప్రాంతం కంటే హైదరాబాద్ సంస్థానం, ఇక్కడి ప్రజలపై ఎక్కువగా ఉంది. హైదరాబాద్ సంస్థానంలో ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. సహజంగానే వీరు ఉత్తర భారతదేశంలోని ముస్లిం తిరుగుబాటుదారుల వైపు మొగ్గు చూపారు.

హైదరాబాద్ నిజాం, అతడి ప్రధానమంత్రి సాలార్జంగ్ బ్రిటిషర్లకు విధేయులుగా ఉండేవారు. అయినప్పటికీ ముస్లింలలోని కొన్ని వర్గాలు ఉత్తర భారతదేశంలోని తిరుగుబాటుదారులకు మద్దతు పలికాయి. వాస్తవానికి హైదరాబాద్ రాజ్యంలో బ్రిటిషర్లపై వ్యతిరేకత అంతకు ముందు నుంచే ఉంది. ఈస్టిండియా కంపెనీ 1789లో నిజాంతో సైన్య సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పటి నుంచే బ్రిటిషర్లపై వ్యతిరేకత మొదలైంది.

- 1839 నాటికి ఈ వ్యతిరేకత వహాబీ ఉద్యమంగా రూపొందింది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు.
- 1839లో ఉత్తర భారతదేశం నుంచి వహాబీలు హైదరాబాద్‌కు వచ్చి బ్రిటిషర్లపై 'జిహాద్' ప్రకటించాలని బోధించారు. ఈ ఉద్యమకారులకు హైదరాబాద్ నిజాం నసీరుద్దౌలా సోదరుడైన ముబారిజుద్దౌలా ప్రోత్సాహం, మద్దతు లభించాయి.
- 'ముబారిజుద్దౌలాకు దేశ బహిష్కారం విధించకుంటే ఇరవై వేల మంది వహాబీ ఉద్యమకారులను ఎదుర్కోవడం కష్టమవుతుంది' అని బ్రిటిష్ రెసిడెంట్ పేర్కొన్నాడు. దీని ఆధారంగా ఈ ఉద్యమ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



- ముబారిజుద్దౌలాను బహిష్కరించకుండా అరెస్ట్ చేసి కోటలో బంధించారు. ఇతడిని తెలంగాణలో తొలి స్వాతంత్ర్య సమరయోధుడిగా పేర్కొనవచ్చు.
- వహాబీలతో రహస్య మంతనాలు జరుపుతున్నాడనే కారణంతో కర్నూలు జాగీర్దారు గులాం రసూల్ ఖాన్‌ను తిరుచునాపల్లి జైలుకు పంపారు. కర్నూలు జాగీర్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపారు.
- వహాబీ ఉద్యమం 1857 సిపాయిల తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చింది.
- హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఉన్న బ్రిటిష్ సైన్యం కోసం బీరారు, రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను నిజాం బలవంతంగా కంపెనీకి స్వాధీనం చేయడంతో బ్రిటిషర్లపై వ్యతిరేకత మరింత పెరిగింది.
- 1855లో బొల్లారం కంటోన్మెంట్‌లో క్రైస్తవ మతంలోకి మారిన ముస్లింలు, ఇస్లాం మతాన్ని విమర్శించడం కూడా హైదరాబాద్‌లో సిపాయిల తిరుగుబాటుకు కారణమైంది.
- 1857 మే 10న మీరట్ వద్ద సిపాయిలు తిరుగుబాటు చేసినప్పుడు బ్రిటిషర్లపై ఉన్న వ్యతిరేకత బహిర్గతమైంది.
- హైదరాబాద్ నిజాం కూడా బ్రిటిషర్లపై సాగే తిరుగుబాటులో పాల్గొనాలని ప్రజలు ఆశించారు. కానీ అది నెరవేరలేదు.
- 1857 తిరుగుబాటు ప్రారంభమైన వారంలోనే 1857 మే 16న నసీరుద్దౌలా మరణించడంతో అతడి కుమారుడు అఫ్జలుద్దౌలా నిజాం పదవిని చేపట్టాడు.
- నవాబ్ అఫ్జలుద్దౌలా, అతడి ప్రధాని మొదటి సాలార్జంగ్ బ్రిటిషర్లకు అనుకూలంగా ఉన్నారు.
- ఉద్యమాల వల్ల నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం ప్రాముఖ్యం, నిజాం స్నేహానికి ఉన్న విలువను బ్రిటిషర్లు కూడా గుర్తించారు.
- బొంబాయి రాష్ట్ర గవర్నర్ 'ఈ తిరుగుబాటుకు నిజాం సహకరిస్తే, మనం సర్వస్వం కోల్పోయినట్లే' అని గవర్నర్ జనరల్‌కు లేఖ రాశాడు.
- బ్రిటిషర్లపై తిరుగుబాటుకు ప్రజలను ప్రోత్సహించడంలో మౌల్వీ ఇబ్రహీం ప్రముఖ పాత్ర పోషించాడు. ఈ తిరుగుబాటులో సికింద్రాబాద్, బొల్లారంలోని సైన్యం కూడా పాల్గొంటుందని ప్రజలకు తెలియజేశాడు.
- అల్లావుద్దీన్ లాంటి ముస్లిం మౌల్వీలు హైదరాబాద్ మక్కా మసీదు వద్ద ఇచ్చిన ఉపన్యాసాల్లో, బ్రిటిషర్లను ఇస్లాం మత శత్రువులుగా చిత్రించారు. వారిని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

సంస్థాన దళాల తిరుగుబాటు

ఔరంగాబాద్ వద్ద ఉన్న హైదరాబాద్ సంస్థానానికి చెందిన ఒకటో, రెండో అశ్విక దళాలు 'మా మతం వారిపై మేం యుద్ధం చేయబోము' అని ప్రకటించాయి. సంస్థానం సరిహద్దు వెలుపలికి వెళ్లేందుకు నిరాకరించాయి. ఔరంగాబాద్‌లో ఈ అశ్విక దళాల తిరుగుబాటుకు జమేదార్ అమీర్ ఖాన్, దఫేదార్ మీర్ ఫిదా అలీ నాయకత్వం వహించారు.

- మీర్ ఫిదా అలీని అధికారులు నిర్బంధించి, సైనిక న్యాయస్థానంలో విచారించి ఉరితీశారు. అతడికి సహాయం చేసిన చాలా మందిని అరెస్టు చేశారు.
- ఒకటో అశ్విక దళం సైనికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఔరంగాబాద్‌లో తిరుగుబాటును సులభంగా అణచివేశారు.
- బుల్దానా వద్ద ఉన్న హైదరాబాద్ కాంటిజెంట్ దళాలు కూడా ఈ తిరుగుబాటు ప్రభావానికి లోనయ్యాయి. ఈ సైన్యంలోని చాలామందిని నిర్బంధించారు.
- బుల్దానా వద్ద ఉన్న దళాల నుంచి తప్పించుకొని పారిపోయిన కొంతమంది జమేదార్ ఛీదా ఖాన్ నాయకత్వంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఛీదాఖాన్‌ను పట్టుకొని అప్పగించిన వారికి హైదరాబాద్ ప్రభుత్వం రూ. 3 వేల బహుమతి ప్రకటించింది.
- ఛీదాఖాన్ సిపాయిలతో హైదరాబాద్‌లో అడుగు పెట్టగానే అరెస్ట్ చేశారు. ఇది మరింత ఉద్రిక్తతకు కారణమైంది.

తుర్రేబాజ్‌ఖాన్ పాత్ర

1857 జూలై 17న మక్కా మసీదు వద్ద ప్రజలు సమావేశమై ఛీదాఖాన్, అతడి అనుచరులను విడుదల చేయాల్సిందిగా నిజాంను అర్థించడానికి నలుగురు మౌల్వీలను పంపాలని తీర్మానించారు. ఈ సమావేశం గురించి తెలిసిన సాలార్జంగ్ అరబ్బీ అంగరక్షక దళాన్ని మక్కా మసీదు వద్దకు పంపాడు. అక్కడ ఉన్న వారిని ఈ దళాలు చెదరగొట్టాయి. తుర్రేబాజ్‌ఖాన్, మౌల్వీ అల్లా ఉద్దీన్ నాయకత్వంలో 500 మంది రోహిల్లాలు సుల్తాన్ బజార్‌లోని బ్రిటిష్ రెసిడెంట్ భవనంపై అదే రోజు సాయంత్రం దాడి చేశారు. రెసిడెన్సీ రక్షణ బాధ్యతను మేజర్ హెచ్‌సీ బ్రిగ్స్‌కు అప్పగించారు. ఈ దాడిలో రోహిల్లాలు వీరోచితంగా తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. రెసిడెన్సీపై జరిగిన దాడికి నాయకత్వం వహించిన తుర్రేబాజ్‌ఖాన్ తప్పించుకునే ప్రయత్నంలో ఉండగా మొగల్‌గూడ వద్ద అరెస్ట్ చేశారు. రెసిడెన్సీపై దాడికి తానే పూర్తి బాధ్యుడినని అతడు ఒప్పుకున్నాడు. బ్రిటిషర్లను భారతదేశం నుంచి తరిమివేయడానికి మత విశ్వాసంతో తిరుగుబాటు చేశానని ప్రకటించాడు. తుర్రేబాజ్‌ఖాన్‌పై విచారణ జరిపి అతడికి యావజ్జీవ దేశాంతరవాస శిక్ష విధించారు. తుర్రేబాజ్‌ఖాన్ 1859 జనవరి 18న జైలు నుంచి తప్పించుకున్నాడు. అతడిని పట్టుకోవడానికి సాయపడినవారికి రూ. 5 వేల బహుమతిని ప్రకటించారు. కుర్బాన్ అలీ అనే వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా తూప్రాన్ గ్రామం వద్ద తుర్రేబాజ్‌ఖాన్‌ను ప్రభుత్వం అరెస్ట్ చేయడానికి ప్రయత్నించింది. తప్పించుకునే క్రమంలో బ్రిటిష్ సైనికులు జరిపిన కాల్పుల్లో తుర్రేబాజ్‌ఖాన్ మరణించాడు. అతడి శవాన్ని సుల్తాన్ బజార్‌లో వేలాడదీశారు.

- మౌల్వీ అల్లావుద్దీన్ హైదరాబాద్ నుంచి బెంగళూరుకు పారిపోయాడు. తర్వాత అతణ్ని మంగళపల్లి వద్ద అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి విచారించి అండమాన్ ద్వీపానికి పంపించారు. 1884లో అతడు అండమాన్ జైల్లోనే మరణించాడు.
- కౌలస జాగీర్దారు రాజా దీప్‌సింగ్ కొంతమంది జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీలను కూడగట్టి కౌలస్ కోటను గెరిల్లా శిక్షణ కేంద్రంగా మార్చి బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు చేశాడు. దీంతో బ్రిటిషర్లు అతడిని అరెస్ట్ చేసి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. ఆయన జాగీర్‌ను రద్దు చేశారు. చివరికి కౌలస పట్వారీ రంగారావును అండమాన్‌కు పంపడంతో 1859 నాటికి కౌలసలో అల్లర్లు సద్దుమణిగాయి.
- 1859 మార్చి 25న గవర్నర్ జనరల్ తరఫున కల్నల్ డేవిడ్‌సన్ నిజాంకు కానుకలు ఇవ్వడానికి వెళ్లాడు. సాలార్జంగ్‌తో తిరిగి వస్తుండగా రోహిల్‌ఖండ్ పఠాన్ జహంగీర్ ఖాన్ వీరిపై దాడి చేశాడు. దాడి నుంచి వారు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. కానీ జహంగీర్ ఖాన్ ప్రాణాలు కోల్పోయాడు. బ్రిటిషర్లను ఎదిరించిన అజ్మత్‌సింగ్, మీర్జా చంద్, బాజీఖాన్, మౌల్వీ ఇబ్రహీంలను కూడా జైలుకు పంపారు.
- ఆదిలాబాద్‌లోని నిర్మల్‌లో 1860లో రాంజీ గోండ్ నాయత్వంలో 300 మంది గోండులు, 200 మంది రోహిల్లాలు ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ సైన్యం వీరందరినీ కాల్చి చంపింది.

If you say you're sorry we would forgive you..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Special programs of study (1)/ are tailored (2)/ to the needed (3)/ of specific groups. (4) No error (5)

2. Most travel agents (1)/ are prepared to (2)/ customize travel arrangements (3)/ to meet individual requirement. (4) No error (5)

3. The rise in inflation (1)/ was just one symptoms (2)/ of the poor state (3)/ of the economy. (4) No error (5)

4. Her arm was beginning (1)/ to swell up (2)/ where the bee (3)/ has stung her. (4) No error (5)

5. The next morning (1)/ the team surveyed (2)/ the damage (3)/ caused in the fire. (4) No error (5)

Directions (Q. 06-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Elections are essential for the ____ of parliamentary decisions.
1) Continuous 2) monitoring
3) vital 4) approval
5) surveillance

7. Barons had to swear an oath of ____ to the king.
1) Allegiance 2) administration
3) silence 4) request
5) promiscuous

8. Always chew food well before ____ it.
1) Thrusting 2) putting
3) eating 4) swallowing
5) digesting

9. The ____ was released to await trial but had to ________ her passport.
1) Defendant, surrender
2) plaintiff, give in
3) dependant, submit
4) accused, give of
5) convict, abide

10. When you first meet her, she gives a ________ impression of warmth and friendship.
1) Supper 2) superfluous
3) superficial 4) superlative
5) superiority

11. His career was cut short when he _______ to cancer.
1) Affect 2) effect
3) diagnosed 4) succumbed
5) suffered

12. The party suffered a _______ defeat in the general election.
1) Vast 2) majority
3) devastate 4) possible
5) humiliating

13. Keep your answers as ________ as possible.
1) Success 2) verbatim
3) succinct 4) modulate
5) length

14. I agreed _______ what she said in substance, though not _____ every detail.
1) In, with 2) to, in
3) with, with 4) for, at
5) from, for

15. Climate change is still ____ much a subject ____ debate.
1) Mostly, to 2) many, from
3) much, form 4) very, for
5) pretty, from

Directions (Q. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. Millions <u>faces</u> starvation next year as a result of the drought.
1) Are facing 2) had faced
3) will face 4) will have faced
5) No correction required

17. Leaving him out of the team may sound the <u>alarm</u> for our chances.
1) Winning 2) ringing bell
3) death knell 4) blowing off
5) No correction required

18. The meeting ended on a <u>turn around</u> with several people walking out.
1) Happy mood
2) mixed reaction
3) sordid 4) sour note
5) No correction required

19. If you say you're sorry <u>we would</u> forgive you.
1) We might 2) we will
3) we had 4) we have
5) No correction required

20. They <u>carry up</u> research into the roles of men and women in today's society.
1) Carried away 2) carried out
3) carry forward 4) carry upon
5) No correction required

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Finance minister Arun Jaitley on Saturday ______ (21) a Budget that put boosting growth before painful reforms, slowing the pace of fiscal deficit cuts and seeking to put ______ (22) and foreign capital to work. In his first full-year Budget since Prime Minister Narendra Modi's landslide election victory ______ (23) May, Jaitley said India's economy was about to take off. Modi tweeted that the Budget would "further reignite our growth engine".Billed as a test of the nationalist premier's willingness to ____ (24) a $2 trillion economy with a bloated public sector and weak private investment, the Budget was short on structural reforms and contained revenue targets some called unrealistic. It drew a__ (25) reception from economists, with some calling it a path to an investor-friendly India, but ______ (26) seeing a missed opportunity to tackle deep-seated structural problems. Jaitley promised higher investment in India's decrepit roads and railways, offered the ______ (27) of tax cuts to global companies and the stick of tighter______(28) to get Indian tycoons to invest at home rather than stash wealth abroad. Tax evaders face ______ (29) sentences of up to 10 years, he warned.The tax changes and tougher enforcement would raise $2.5 billion next year, he said. Tax receipts overall would rise 15 percent and government asset sales would raise $11 billion - goals that past experience ______ (30) may be hard to meet.

21. 1) announced 2) proclaimed
3) decree 4) stated
5) publicize

22. 1) family 2) domestic
3) familial 4) household
5) domicile

23. 1) most recent 2) very last 3) last 4) end 5) final

24. 1) improvement
2) restructuring 3) reorganization4) reform
5) development

25. 1) uniform 2) assertive
3) minor 4) magical
5) mixed

26. 1) others 2) extra 3) further
4) supplementary 5) spare

27. 1) bribe 2) carrot 3) lure
4) candy 5) bite

28. 1) system 2) convention
3) rules 4) laws
5) policy

29. 1) penitent 2) dungeon
3) confined 4) jail
5) detaining

30. 1) showing 2) showed
3) shown 4) show 5) shows

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) We only remember learning history on war, not of other types of historical subjects.
B) History, to some degree is important, but it is typically taught in a memorization manner.
C) But the reality is that history is so universal because nearly every country is interconnected whether it is through economics, culture, business, finances, goods and services, and ecological perspectives.
D) This is where we go wrong with learning history. There is no process of looking at it from a productive perspective.
E) Furthermore, we typically only learn history of our own country.
F) Never in any educational background was a student challenged to reflect or re-evaluate how history works, but rather how much one could retain.

31. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 36-38): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) garbage 2) delegeta 3) monitor
4) commission 5) ensconce

37. 1) courageous2) contagios
3) commandeer 4) convulsion 5) complement

38. 1) referre 2) explicit
3) sabotage 4) supplement
5) surreptitious

Directions (Q. 39-40): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

39. **Apollo 11 is** (1) the first **manned** (2) mission **to land** (3) on **the moon.** (4)

40. The **cashere** (1) **gave** (2) me **two hundred** (3) and twenty **rupees.** (4)

Key:

1) 3	2) 4	3) 2	4) 4	5) 2
6) 5	7) 1	8) 4	9) 1	10) 2
11) 4	12) 5	13) 3	14) 3	15) 4
16) 3	17) 3	18) 4	19) 2	20) 2
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 3	32) 1	33) 4	34) 1	35) 5
36) 2	37) 2	38) 1	39) 1	40) 1